సాహిత్య సోపానములు

డా॥ దివాకర్ల వేంకటావధాని, ఎం.ఏ. (ఆనర్సు) పి.హెచ్.డి.

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాద్ - 500 001

ఫోన్ నెం. 24753724

BVP - 2068

8/5/18

60/69

సాహిత్య సోపానములు

(కావ్య విషయ సంగ్రహము)

డా॥ దివాకర్ల వేంకటావధాని, ఎం.ఏ. (ఆనర్సు) పి. హెచ్.డి.

ఆంధ్రశాఖాధ్యక్షులు (రిటైర్డు)

ఉస్మానియా విశ్వవిద్యాలయము

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాద్ - 500 001.

ఫోన్ నెం. 24753724

ప్రథమ ముద్రణము 1966 2000 ప్రతులు
పదవ ముద్రణము 2008 1000 ప్రతులు

వెల రూ. 80-00

ప్రతులకు :
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, హైదరాబాద్ - 500 001
ఫోన్ నెం. 24753724

ముద్రణ :
చార్మినార్ ఆర్ట్ ప్రింటర్స్,
సికింద్రాబాద్.
ఫోన్ : 27710678

విషయసూచిక

* గుర్తులు గలవి మాత్రమే విశారద పరీక్షకుఁ బఠనీయములు

అవతారిక

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్
డా.సి. నారాయణరెడ్డి
అధ్యక్షులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు

నిజాం పాలనలో తెలుగు భాషాదీపం కొడిగట్టిన కాలంలో దాని పునరుద్దీపనానికి ఉద్యమించిన మాతృసంస్థ ఆంధ్ర సారస్వత పరిషత్తు. శ్రీ మాడపాటి హనుమంతరావు, శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, శ్రీ లోకనంది శంకరనారాయణరావు వంటి పలువురు సాహితీమూర్తుల ప్రేరణతో పరిషత్తు 1943లో రూపుదిద్దుకొని, ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లో అగ్రేసర సాహితీ సంస్థగా విశిష్ట స్థానం వహించింది. మాన్యమిత్రులు డా. దేవులపల్లి రామానుజరావు గారు యావజ్జీవితం పరిషత్తు అభివృద్ధికి శ్రమించారు. ఉత్తమాదర్శాలతో, ఆశయాలతో ఆవిర్భవించిన పరిషత్తు కాలానుగుణంగా బహుముఖీన కార్యక్రమాలు చేపట్టి సమర్థంగా నిర్వహిస్తూ అందరి మన్ననలందు కుంటున్నది. వీటిలో భాషా బోధన, గ్రంథ ప్రచురణ ముఖ్యభూమికలు వహిస్తున్నాయి. ఆంధ్ర సారస్వత పరిషత్తు, ప్రాథమిక, ప్రవేశ, విశారద పరీక్షలు జరపడంతోపాటు, తెలుగు పండిత శిక్షణ కళాశాల, స్నాతకోత్తరస్థాయి ప్రాచ్య కళాశాల నిర్వహిస్తున్నది. పరిషత్తు రూపొందించి నిర్వహించే సాహితీ సభలు, సమావేశాలు, ప్రసంగాలు, సదస్సులు, ఉత్సవాలు, చర్చాగోష్ఠులు, ప్రసంగాత్మక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైనవి వైలక్షణ్యాన్ని సంతరించుకున్నాయి.

పరిషత్తు ప్రచురించే గ్రంథాలను సాహితీ లోకం హార్దికంగా స్వాగతిస్తున్నది. ఇంతవరకు 200 పైగా గ్రంథాలు వెలువరించింది.

పరిషత్తు నిర్వహిస్తున్న విశారద పరీక్ష పాఠ్య ప్రణాళికను దృష్టిలో ఉంచుకుని ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారు రచించిన **'సాహిత్య సోపానములు'** గ్రంథం పట్ల పరీక్షార్థులతో పాటు విద్యార్థిలోకం, సాహిత్యాభిమానులు కూడా విశేష ఆదరాభిమానాలు చూపుతున్నారు. నా గురువర్యులు ఆచార్య దివాకర్ల వారు సంస్కృతాంధ్ర భాషలో ప్రావీణ్యమున్న వైదుష్య మండితులు. సాహిత్య విమర్శకు సంబంధించిన మౌలిక సూత్రాల పట్ల అవగాహన, సమగ్ర విశ్లేషణ గరిమ వున్న విజ్ఞులు.

10వ ముద్రణగా వెలువడుతున్న ఈ గ్రంథం ఎప్పటిలాగే అందరి మన్ననలందు కుంటుందని విశ్వసిస్తున్నాను.

హైదరాబాదు, **డా. సి. నారాయణరెడ్డి**
06-11-2008

ప్రవేశిక

ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాలలో గ్రంథ ప్రచురణ ఒకటి. పరిషత్తు నిర్వహించిన సదస్సులలో పాల్గొన్న ప్రసంగ కర్తల అభిప్రాయాలు వాయులీనం కాకుండా గ్రంథస్థం చేస్తున్నాం. సంస్మరణోపన్యాసాలు, పరిణతవాణి ప్రసంగాలు గ్రంథాలుగా ముద్రించడం జరిగింది. వాటితో పాటు ప్రామాణికమైన గ్రంథాలను సాహిత్యాభిమానుల కోసం పునర్ ముద్రిస్తున్నాం. ఆ కోవ లోనివే ఆంధ్ర వాఙ్మయ చరిత్ర, సాహిత్య సోపానములు. ఇందులో సాహిత్య సోపానాలు పరిషత్తు అనుమతితో సంస్కృతంలోకి అనువదించబడింది కూడా.

ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు మహావక్తలు. సంస్కృతాంధ్ర విద్వాంసులు. పరమ సౌజన్యమూర్తులు, ఆంధ్ర సారస్వత పరిషత్తుతో అవిరళ సంబంధం కలిగినవారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మూడు దశాబ్దులకు పైగా స్నాతకోత్తర స్థాయిలో తెలుగు సాహిత్యాన్ని బోధించిన ప్రముఖ సాహితీ మూర్తి. వారు డా. దేవులపల్లి రామానుజ రావుగారికి, ప్రస్తుత అధ్యక్షులు డా. సి. నారాయణ రెడ్డిగారికి చాలా సన్నిహితులు. వారు రచించిన రెండు ప్రసిద్ధ గ్రంథాలను ప్రచురణార్థం పరిషత్తుకు అందించారు. **ఆంధ్ర వాఙ్మయ చరిత్ర, సాహిత్య సోపానములు** ఈ రెండు ప్రసిద్ధ గ్రంథాలు. తెలుగు సాహిత్యాన్ని అధ్యయనం చేసే ప్రతి విద్యార్థికి, సాహిత్యాభిమానికి ఈ రెండు గ్రంథాలు కరదీపికలు. దివాకర్లవారు అధ్యయనం చేయుటమేగాక బోధనానుభావంతో రచించిన ఈ రెండు గ్రంథాలు నేటికీ పరామర్శ గ్రంథాలుగా ప్రశస్తి చెందినవే. ఇంతకు ముందు ఎన్నో ముద్రణలు పొందిన ఈ గ్రంథాలు ఇప్పటికీ సాహితీలోకానికి ఉపకరిస్తున్నాయి. అందువల్ల పరిషత్తు ప్రస్తుతం సాహిత్య సోపానములు పునర్ముద్రిస్తున్నది.

హైదరాబాదు, **ఆచార్య ఎల్లూరి శివారెడ్డి**

06-11-2008 ప్రధాన కార్యదర్శి

తొలిపలుకు

ఆంధ్రమున కావ్య లక్షణాదులను వివరించు గ్రంథముల సంఖ్య చాల తక్కువ. ఉన్నవైనను సంస్కృత లక్షణ గ్రంథములకు ప్రతిబింబములే కాని స్వతంత్రములైనవి కావు. సుమారు రెండు శతాబ్దముల క్రిందటి వరకు తెలుఁగు వారు సర్వ సాహిత్య మార్గములందును సంస్కృతమునే అనుసరించుచుండిరి. ఆంగ్ల భాషాభ్యాస మారంభమైన తరువాత భారతదేశము నందలి యితర వాఙ్మయములందు వలెనే ఆంధ్ర వాఙ్మయము నందుగూఁడ నాంగ్ల సాహిత్య ప్రక్రియల ప్రభావము గోచరించుచున్నది. అందుచే సంస్కృతాంగ్ల లక్షణములను రెండింటిని దృష్టియం దుంచుకొని సాహిత్య శాస్త్రమును నిర్మింపవలసిన అక్కఱ యేర్పడుచున్నది. అట్టి సమన్వయ దృష్టితో వ్రాయబడిన గ్రంథమిది.

ఇందు కావ్య రస ధ్వన్యాది సోపానములై దున్నవి. వీనియందు రస ధ్వన్యాదులకు సంబంధించిన లక్షణములన్నియు వివరింపఁబడినవి. అందుచేతనే దీనిని లక్షణ విభాగమని పేర్కొంటిని. ముందు వ్రాయఁబోవు ప్రక్రియా విభాగమను రెండవ భాగమున ప్రస్తుత మాంధ్ర వాఙ్మయమునఁ గనవచ్చు ప్రక్రియల స్వరూప స్వభావము లన్నియు వివరింతును.

ఈ గ్రంథము వ్రాయుటలో నాకు పూజ్యులు శ్రీ సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రులవారు రచించిన కావ్యాలంకార సంగ్రహ వివరణ మెన్నో విధములఁ దోడ్పడి యున్నది. సంస్కృత లక్షణములకు సంబంధించినంత వఱకు విషయము నంతను దానినుండియే గ్రహించి యుంటిని. తదుపరి హడ్సను రచించిన Introduction to English Literature అను గ్రంథమును తెలుగుభాషా సమితి వారి ఆంధ్ర విజ్ఞాన కోశము నందలి ఆఱవ సంపుటమును, ప్రతాపరుద్రీయము, సాహిత్య దర్పణము, ధ్వన్యాలోకము మున్నగు ప్రసిద్ధ లక్షణ గ్రంథములను బరిశీలించితిని. ఆ గ్రంథకర్తల కందఱికిని నా హృదయపూర్వక కృతజ్ఞతా నమస్కారము లర్పించుచున్నాను.

ఆంధ్ర సారస్వత పరిష దధికారులైన శ్రీ దేవులపల్లి రామానుజరావు గారును, శ్రీ గడియారం రామకృష్ణ శర్మగారును విశారద పరీక్షలకు కావ్య విషయములను దెల్పు అలంకార శాస్త్రమును గూడ కొంతవఱకు పాఠ్యముగా నిర్ణయింప వలెనను సందర్భమున నన్నీ గ్రంథమును రచించుటకుఁ బ్రేరేచియుండిరి. ఒక్క విశారద విద్యార్థులకే కాక కళాశాల విద్యార్థులకుఁ గూడ నుపయుక్త మగునట్లుగా నీ గ్రంథమును రచించితిని. దీనిని దయతోఁ బ్రకటింప నంగీకరించిన ఆంధ్ర సారస్వత పరిషత్తువారికి నా కృతజ్ఞతలు.

విషయ వివరణమునఁగాని, పారిభాషిక పద నిర్వచనమునఁగాని యిందేవైన లోపములు చొచ్చియుండవచ్చును. విద్వాంసులు దయతో వానిని దెల్పినచో ముందు ముద్రణములందు సవరించుకొందును. జిజ్ఞాసువులు దీనియెడఁ దగిన యాదరాభిమానములు చూపి ప్రక్రియా విభాగమునుఁ గూడ త్వరలో వెల్వరింపఁ బ్రోత్సహింతు రని ప్రార్థించు చున్నాను.

ఇట్లు

గ్రంథకర్త

విజ్ఞప్తి

తెలుగులో కావ్య లక్షణములను చక్కగా వివరించు స్వతంత్ర గ్రంథములు చాల తక్కువగా ఉన్నవి. సుమారు ఏబది ఏండ్లక్రిందట స్వర్గీయ కొమాండూరి అనంతాచార్యులగారు కావ్య విషయ సంగ్రహమును మిగుల సంగ్రహముగా వ్రాసి ప్రకటించియుండిరి. మరి కొందఱును సంగ్రహరూపమున కావ్య విషయములను వ్రాసినారు. అవన్నియు సంస్కృతలక్షణ గ్రంథములననుసరించి వ్రాయఁబడినవి.

ప్రస్తుత కాలమున ఆంధ్ర వాఙ్మయముపై సంస్కృత సాహిత్య ప్రభావమే కాక ఆంగ్లసాహిత్య ప్రభావముగూడా కలదు. కావున నేటి విద్యార్థులకు సంస్కృతాంగ్ల కావ్య మర్యాదలు బాగుగా తెలియవలసియున్నది. ఆ దృష్టితో ఉభయ మర్యాదలను సమన్వయించి ఈ "సాహిత్యసోపానములు" అను "కావ్య విషయసంగ్రహము" స్వతంత్రముగా వ్రాయఁబడినది.

పాఠశాలలో తెలుఁగు పండితులుగా విశారద విద్యార్థులకు తక్కిన విషయములతో పాటు కావ్య లక్షణములు గూడ తెలిసి యుండవలెనను ఉద్దేశముతో దీనిని ప్రకటించుచున్నాము. కేవలము విద్యార్థులకే కాక సాహిత్య జిజ్ఞాసువు లందరికిని ఇది మహోపయోగకరముగా నుండఁగలదు. ఇందు లక్షణవిభాగము మాత్రమే కలదు. ప్రక్రియావిభాగముతో రెండవ సంపుటము వెలువడవలసియున్నది. ఆంధ్ర లోకము ఈ ప్రథమ భాగమును సముచితముగ నాదరించి ప్రోత్సహించినచో త్వరలోనే ద్వితీయభాగము కూడా వెలువడఁగలదని విన్నవించుకొనుచున్నాము.

కోరిన వెంటనే ఈ గ్రంథమును వ్రాసి యిచ్చిన ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆంధ్రశాఖాధ్యక్షులు డా॥ దివాకర్ల వెంకటావధానిగారికి ఆంధ్రసారస్వత పరిషత్తు పక్షమున కృతజ్ఞతావందనములు సమర్పించుచున్నాను.

గడియారం రామకృష్ణ శర్మ

పరాభవ కార్తీకము — కార్యదర్శి

నవంబరు 1966 — ఆంధ్రసారస్వత పరిషత్తు, హైదరాబాదు.

సాహిత్య సోపానములు

అను

కావ్య విషయ సంగ్రహము

ప్రథమ సోపానము

1. విమర్శ యనఁగా నేమి?

విమర్శ లేక విమర్శనము అను శబ్దము 'వి' అను నుపసర్గతోఁ గూడిన 'మృశ్' ధాతువు నుండి ఏర్పడినది. ఆ ధాతువునకు పరామర్శించుట, ఆలోచించుట, పరిశీలించుట, పరీక్షించుట, చర్చించుట మున్నగు నర్థములున్నవి. వీని నన్నిటిని గలపి చూచినచో విమర్శన మనఁగా నేదైన గ్రంథమునుగాని కళారూపమునుగాని లెస్సగాఁ బరిశీలించి, దానిని గూర్చి మననము చేసి, చర్చాపురస్సరముగా నందలి బాగోగులను బ్రదర్శించుట యని గ్రహింప వచ్చును. ఇంతేకాక, ఏదైనఁ గావ్యమును గూర్చి విశ్లేషణ పూర్వకముగాఁగాని, వివరణ పూర్వకముగాఁగాని, వ్యాఖ్యానపూర్వకముగాఁగాని, తారతమ్య నిర్ధారణపూర్వకముగా గాని వ్రాయు వ్రాఁత యంతయు విమర్శగానే పరిగణింపఁ బడుచున్నది. కావ్యనాటక కథావ్యాఖ్యానరూపమైన సాహిత్యము మానవ జీవితమును వర్ణించుచు వ్యాఖ్యానము చేయుచుండును. విమర్శన మా సాహిత్యము పైనేకాక యది చేయు మానవ జీవిత వ్యాఖ్యానము పైఁగూడ వ్యాఖ్యానము చేయుచుండును. ఈ విధముగా ప్రత్యక్షముగాఁ గాకున్నఁ బరోక్షముగానైన దానికిని మానవ జీవితమునకును గొంత సంబంధమున్నదని చెప్పవచ్చును.

విమర్శన మనఁగా ఖండనము లేక దోషైక ప్రదర్శనము అనునభిప్రాయము లోకమున వ్యాప్తిచెందియున్నది. సాధారణముగాఁ బలువురు దాని నా యర్థముననే వాడుచుందురు. పెక్కు విమర్శలు విమర్శనీయ వస్తువులందలి దోషములను మాత్రము ప్రదర్శించి గుణముల విషయమునఁ దూష్ణీంభావము వహించుటయు, విమర్శకులయందుఁ బ్రకటముగాఁగానవచ్చు పురోభాగిత్వ పరాయణతయు నందుకుఁ గారణములు. కాని యది సరికాదు. విమర్శకుఁడు వస్తువునందలి దోషములను బ్రకటించుటలోఁ దప్పులేదు. అతఁడు దానిని బాగుగాఁ బరిశీలించి, దాని సంపూర్ణతత్త్వము నవగాహనము చేసికొని యందలి దోషములతో పాటు గుణములను

గూడఁ బ్రదర్శింప వలయును. అప్పుడు కాని యతని విమర్శ సమగ్రము కాఁజాలదు. కొందఱు వస్తువునందలి గుణములను మాత్రమే పేర్కొని దోషములను జెప్ప నొప్పరికించుటయో వానిని మఱుగు పుచ్చుటయో చేయుచుందురు. ఇట్టివారి విమర్శకూడా నసమగ్రమైనట్టిదే. కొందరు వైయక్తికమైన రాగద్వేషములకు గురియై గుణములను దోషములుగను దోషములను గుణములుగను బ్రదర్శించుచు విమర్శలు వెలయింతురు. ఇవియు నుత్తమ విమర్శలు కాకపోవుటయే కాక కొన్ని యెడలఁ గువిమర్శలు కూడ నగును. నిజమైన విమర్శ యనఁగా వస్తు స్వరూపము నవగాహనము చేసికొని యందలి గుణదోషములను యథాస్థితముగా వెల్లడి చేయుటయే.

విమర్శకుడు కావ్యమునందలి గుణదోషములను నిర్ణయించి చెప్పుట కేదోయొక ప్రమాణ ముండవలయును. ఈ నిర్ణయమున నతనికి స్వీయాభిరుచులు కొంతవరకు సహాయములగుట నిజమే కాని, కేవలము వాటిని బట్టియే యాతఁడు నిర్ణయము కావించుచో నతని విమర్శ ప్రామాణికము కాఁజాలదు. అందుచే సునిశ్చితములైన కొన్ని సూత్రముల ననుసరించి యాతఁడు విమర్శ సాగింపవలయును. ఈ సూత్రములు రెండు తెఱగులు - పూర్వలాక్షణికు లేర్పఱిచినవి; కావ్యకర్త స్వయముగా నేర్పఱచుకొనినవి. పూర్వలాక్షణికులు తమకు ముందున్న కావ్యజాలమును బరిశీలించి కావ్యలక్షణాదులను నిశ్చయించి యుండిరి. వానిని బట్టి విమర్శకుడు తాను విమర్శించు కావ్యము నందలి మంచి చెడ్డలను జెప్పవచ్చును లేదా యీ కావ్యమును జదివి తత్కర్త యే సూత్రములపై దానిని రచింప సంకల్పించెనో తెలిసికొని యందతడు పొందిన కృతకృత్యతను బట్టి కావ్యగుణదోషములను నిర్ణయింపవచ్చును. ఇందు మొదటిది కవి స్వాతంత్ర్యము నించుకైన సహింపనిదియు, రెండవది లాక్షణికుల ప్రామాణికత్వమునకు భంగము చేకూర్చునదియు నగుటచే నీ రెండు తెఱంగులును లోపభూయిష్ఠములుగనే కనిపించును. అందుచే విమర్శకుడు లాక్షణికులు చెప్పిన నియమములను బాగుగాఁ దెలిసికొని,దేశ కాలములను బట్టి వానియందెట్టి మార్పుచేర్పులు చేయవలెనో నిర్ణయించుకొని, కవి కావించుకొన్న స్వీయసూత్రములను గూడ మనసునందుంచుకొని కావ్య పరిశీలనము కావింపవలయును - పూర్వులు చెప్పిన లక్షణములను బూర్తిగానుపేక్షించుట యుక్తముకాదు. ఏలయన వానిలో సర్వజనీనములును సర్వ కాలీనములు నైనవి కొన్ని యుండును. అవి రామాయణ మహాభారతాదు లందు సుప్రతిష్ఠితములై తరువాతి కవుల

కందఱికి శిరోధార్యములై నట్టివి. వానిని గూర్చి యెవ్వరికి నెట్టి యాక్షేపము నుండదు. విమర్శకుఁడట్టి వాని నాదర్శములుగా గ్రహించుటలో దోషము లేదు. అవి లోపించినచో నితర లక్షణము లెన్ని యున్నను కావ్యము ప్రశంసా పాత్రము కాకపోవును. వానితోఁ బ్రతిభావంతులైన యనంతర కవీంద్రుల రచనలలోఁ గాలము పరీక్షకు నిల్వఁజాలిన నూత్న గుణములను జతచేసి యారెండింటిని బ్రమాణములుగా గ్రహించి విమర్శకుఁడు తన కర్తవ్యమును గొనసాగింపవచ్చును. అప్పుడతని విమర్శ యా ప్రత్యేక కావ్యము యొక్క గుణదోషములను జక్కగాఁ బ్రదర్శించునదే కాక తరువాతి కవులకు మార్గ దర్శకముగా గూడ నుండఁజాలును.

విమర్శ కావించుటకు ముందు విమర్శకులు మూల గ్రంథములను సమగ్రముగాఁ బఠించి వాని తత్త్వమును లెస్సగా నవగాహనము చేసికొనవలయును. మూల గ్రంథములను సరిగాఁ జదువక యెవ్వరో వ్రాసిన వాని సారాంశములనో సంగ్రహరూపములనో మాత్రము పఠించి విమర్శకుఁగడంగుట మంచి పద్ధతికాదు. కాలాభావము చేతనో సౌలభ్యకాంక్ష చేతనో కొందఱట్లు చేయుచుండుట కలదు. కాని యది మూలగ్రంథమున కన్యాయము చేయుటయే యగును. ఏలయన, నవి మూలగ్రంథ తత్త్వమును సంపూర్ణముగా నందీయఁజాలవు. అదిగాక విమర్శకులు మూలగ్రంథములను స్వయముగాఁ జదువునప్పుడా సారాంశ సంగ్రహకర్తలకుఁ దోఁచియుండని కొన్ని నూతనాంశములు వారికి స్ఫురించుట కవకాశ మున్నది. మూలగ్రంథములను జదివి వానినిస్వాయత్తము చేసికొన్న పిమ్మట వానిని గూర్చి మఱింత నిశితముగా నెఱుంగుటకై యా సారాంశ సంగ్రహాదులను గూడఁ జదివినఁ జదువ వచ్చును. అంతేకాని వానిని మాత్రమే చదివి తృప్తి నొందుట స్వచ్ఛ జల ప్రవాహయగు నది చెంతనుండ నందు స్నానము చేయక కడవతోఁ దెచ్చుకొన్న నీట స్నానము చేయుట వంటిది.

కొందఱేదైన కావ్యమును విమర్శించుటకా కావ్యమును గూర్చి యితరులు కావించు పూర్వవిమర్శలపై నాధారపడుచుందురు. అట్టివారిపై నాపూర్వ విమర్శల ప్రభావ మధికముగాఁ గనిపించును. ఆ పూర్వ విమర్శకులు లబ్ధప్రతిష్ఠులైనచో నా ప్రభావము మఱింత హానికరముగాఁ బరిణమించును. ఏలయననప్పుడు విమర్శకులు తమకును పూర్వవిమర్శకులకును విద్వత్తలోఁ గల తారతమ్య మెఱింగిన వారు కావున వారు చెప్పిన భావములనే నిశ్శంకముగా ననువదింతురు. అట్టి యెడ వారికిఁ దోచిన భావములే వీరికిని దోచుటయు, వారుపేక్షించిన

వానిని వీరును ఉపేక్షించుటయు సంభవించును. అనగా వారు మూల గ్రంథమును స్వీయ బుద్ధితోఁగాక పరుల బుద్ధితోఁ బరిశీలించి నట్లగును. ఈ విధముగా పూర్వ విమర్శలు సహాయములుఁగాక యంతరాయములుగా నేర్పడుచుండును. అప్పుడు మూల గ్రంథములతోఁ బ్రత్యక్ష పరిచయముండదు. కావున విమర్శకుల స్వతంత్రాలోచన కెట్టి యవకాశము నుండదు. ఒక విద్యార్థి మనుచరిత్రపై వ్యాసము వ్రాయఁదలంచి యందుకే గ్రంథము చదువుట మంచిదని యాచార్యు నడిగెనట. అప్పుడా యాచార్యుడు మనుచరిత్రమునే చదువుట మంచిదని సమాధానము చెప్పెనఁట. దీనిని బట్టి విమర్శకులు మూల గ్రంథములను నిశితముగాఁ బరిశీలించుట యెంత యవసరమో తెలియుచున్నది.

అయినచో విమర్శల వలనఁ బ్రయోజన యేమియను ప్రశ్న యుదయించును. మెలఁకువతోఁ జదివినచో వానివలనఁగలుగు లాభ మపారముగా నుండును. వానిని సారస్వత ప్రియులు పూర్తిగా నిరసించుట తమకంటే ధీమంతు లెవ్వరు నుండరనియు, నితరుల విశిష్ట విజ్ఞానానుభవముల వలనఁ దమ కెట్టి లాభము కలుగదనియుఁ దలంచినట్లగును. ఉత్తమమైన విమర్శ పఠితలకు విజ్ఞాన వికాసములు చేకూర్చుటయేకాక వారియందు నూత్న చైతన్యమును రేకెత్తించును. మహాకవులు తమ కావ్యములద్వారా మానవ జీవిత పరమార్థమును జూఁపి లొసంగ విమర్శకులు తమ విమర్శలద్వారా సారస్వత పరమార్థమును జూఁపి యిచ్చుచుందురు. ఉత్తమ విమర్శకులు పఠితల యవగాహన శక్తికిఁ గలిగించు దోహదము పలు విధములుగా నుండును. వారు వారికిఁ గ్రొత్తభావము లందింతురు; వారిలో నస్పష్టములు సంశయాస్పదములునైన యభిప్రాయములను సందేహములను తొలగించి దృఢపఱుతురు; వారొకవేళ పెడదారిని బట్టుచో సన్మార్గమును జూపుదురు; వారికి మూల గ్రంథమును నూత్న దృక్పథముతోఁ బఠించి యానందించు నవకాశ మొసంగుదురు; మధువిక్రేత సరఘాసంకులమైన క్షౌద్ర పటలము నుండి యచ్చ మధురమైన తేనె నోడ్చి యందిచ్చునట్లు వారు దురవగాహార్థ భావ సంపన్నములైన కావ్యములనుండి మధురోజ్జ్వల రస భావములను సేకరించి యాస్వాద యోగ్యములు కావింతురు. విమర్శకుల యభిప్రాయములతోఁ బఠిత లేకీభవించి తీరవలె నను నిర్బంధములేదు. వారు విమర్శలు విచక్షణతోఁ జదివి యోగ్య భావములను గ్రహింపవచ్చును. అయోగ్యములైన వానిని ద్యజింప వచ్చును. విమర్శల విషయమున నంధానుకరణము హానికరము కాని, యాలోచన సహితమైన పఠన మెప్పుడును అనర్థము కాఁజాలఁదు.

విమర్శక లక్షణములు :- కావ్య విమర్శ చేయఁగడంగు వారందుకుఁదగిన యధికారమును సంపాందింప వలసిన యావశ్యక మెంతైననున్నది. వారు సాహిత్య శాస్త్ర నిష్ణాతులైన విద్వాంసులై పూర్వకవి రచిత మహా కావ్యములతో బరిచయము కలిగి యుండవలయును. వారు విమర్శనీయ కావ్యమును సానుభూతితోఁ బరిశీలించు సహృదయులై యుండవలయును. వారు విమర్శనీయాంశము కావ్య ప్రవృత్తియే కాని కవి ప్రవృత్తి కాదని గుర్తుంచుకొన వలయును. అనఁగా వారు గ్రంథస్థ విషయమునే కాని గ్రంథకర్త రూపశీల వర్తనాది విషయములను విమర్శింపఁగూడదు. వారు కావ్య విమర్శ చేయునప్పుడు తమ్ము తమ భావములను విస్మరించి "అహంకార" పరిత్యాగము చేయవలయును. ఒక కవి సంపెంగ పూవును జక్కగా వర్ణించును. విమర్శకునకు సంపెంగపూవు రూపము కాని వాసన కాని గిట్టకపోవచ్చును. అట్టియెడ విమర్శకుడు కవి నా కిష్టము లేని సంపెంగ నింత రమ్యముగా వర్ణించినాఁడేమని యాతని దూయఁబట్టరాదు. కవి సంపెంగ రూపవాసనాదుల నెంతఁగా బరిశీలించి యనుభవించి యెంత స్పష్టముగా వర్ణించినాఁడనునదియే యాతఁడు పరిశీలింప వలసిన విషయము. ఇట్టి రసజ్ఞత "కహంకార పరిత్యాగ" మెంతైన నవసరము. అది లేనిచో నతఁడు కవిత్వమును దా నాస్వాదింప లేక పోవుటయే కాక దాని విషయమునఁదన విమర్శతో పఠించువారి భావములను గూడఁ గలుషీకరించును. విమర్శకులు రాగద్వేషములకు లోనుగాక సమదర్శనులై యుండవలయును. అనఁగా గ్రంథకర్త మీఁద వ్యక్తిగతముగాఁ దమకుఁగల ఆదరము చేతనో అనాదరము చేతనో వారి గ్రంథముల నాకాశమున కెత్తుటయో యధఃపాతాళమున కణఁచుటయో చేయరాదు. జీవితములోఁగల స్నేహవైరములను మొగమోటములను విమర్శన సందర్భమున వారు లేశమైనను బరిగణింపరాదు. విమర్శ నిర్మాణాత్మకముగా నుండవలయునే కాని విధ్వంసనాత్మకముగా నుండరాదు. అప్పుడది యువక రచయితల కాదర్శప్రాయమై సారస్వతాభివృద్ధికి దోహదము చేకూర్చును. ఇట్టి గుణములు గల విమర్శకులు సారస్వత రసాస్వాదనమున కెన్నియో విధములఁ దోడ్పడి పఠితృగౌరవాదర పాత్రులగుదురనుటకు సందేహింప నక్కఱలేదు.

ప్రాక్ప్రతీచీ విమర్శన విధానములు:- ఉత్తమ విమర్శన మేకాలమందైన నేదేశమందైన నొక్క విధముగనే యుండు ననుట నిజమే కాని యాయా దేశములందలి విమర్శకులు విమర్శన సందర్భమున నాయాయంశముల కిచ్చు ప్రాధాన్యమునుబట్టి వారి విమర్శల విధానములలోఁ

గొంత తారతమ్యము గోచరించును. పాశ్చాత్యులతోఁ బోల్చి చూచినచో విమర్శన సందర్భమున భారతీయులకుఁ జారిత్రికదృష్టి తక్కువగాఁగనిపించును. పాశ్చాత్యులేదైన గ్రంథమును విమర్శించుటకు ముందా గ్రంథమును రచించిన కర్త యే దేశమందే కాలమందు నివసించెనో యప్పటి మత రాజకీయ సాంఘిక పరిస్థితు లెట్లుండెనో కర్త రచనపై వానికిఁగల ప్రభావమెట్టిదో పరిశీలన చేయుదురు. అందుచేఁ బాశ్చాత్య దేశములందలి విమర్శలలోఁగావ్యముల చరిత్రతోపాటు కవుల చరిత్రకూడఁదెలిసి కొనుట కవకాశముండును. భారతీయులు కావ్య పరిశీలనమున కిచ్చినంత ప్రాధాన్యము కవి చరిత్ర పరశీలన కిచ్చియుండలేదు. అందుచేతనే పలువురు భారతీయ మహాకవుల నామములుతప్ప వారినిగూర్చి మనకింకేమియుఁ దెలియదు. పాశ్చాత్యులు కావ్యములకుఁ జరిత్రకుఁ దత్సమకాల జీవితమునకుఁ గల సంబంధమును విశేషముగాఁ జర్చింతురు. భారతీయులలో నా పరిశీలనమల్పముగా నుండును.

కావ్యములకు శబ్దచ్ఛందములు బాహ్యరూపములనియు రసభావాదులాంతర రూపములనియుఁ జెప్పవచ్చును. భారతీయులు విమర్శ సందర్భమున నీ బహిరంత స్స్వరూపములు రెండింటికి సమప్రాధాన్యము నొసఁగుదురు. అనగా గవులు శబ్దము లెట్లుపయోగించినారు అవి వ్యాకరణమున కనుగుణముగా నున్నవా లేవాయని వారు నిశితముగాఁ బరిశీలించి శబ్దదోషము లున్నచోఁగావ్యము దుష్టమని నిరసింతురు. అంతుచేతనే సగుణములు అదోషములునైన శబ్దార్థములే కావ్యమని యొకలాక్షణికుఁడు నిర్వచించినాడు. పాశ్చాత్యు లాంతర స్వరూప విమర్శనమున కిచ్చునంత ప్రాధాన్యము బహిస్స్వరూప విమర్శనమున కొసంగరు.

రసము, ధ్వని, అలంకారములు, గుణములు, దోషములు, ఔచిత్యమున్నగు వానిని గూర్చి భారతీయ లాక్షణికులు కావించిన పరిశీలన మపారమైనది. వారు రచించిన లక్షణ గ్రంథముల నవలోడించిన వారగుటచే భారతీయ విమర్శకులు కూడా వాని విషయమున నత్యంత శ్రద్ధవహింతురు. పాశ్చాత్యులు మొన్న మొన్నటివరకు రసధ్వన్యాదులను గూర్చి యంతగాఁబరిశ్రమ చేసియుండలేదు. వారి విమర్శలు మనోభావ పరిశీలనము, ఔచిత్యము, సౌందర్యము మున్నగువానికి సంబంధించి యుండును.

భారతీయ విమర్శకులలో లక్షణానుసరణ మెక్కువగాఁ గనిపించును. చిర ప్రతిష్ఠితములైన లక్షణములు కావ్యములలో మృగ్యములైనచో వారు వాని నల్పములుగాఁ

బరిగణింతురు. రసపాత్ర వర్ణనాదుల సందర్భమునఁ గవుల స్వాతంత్ర్యమును వారంతగా నంగీకరింపరు. అనఁగా వారికి సమయ సంప్రదాయాభిమాన మెక్కువ. పాశ్చాత్య విమర్శకులలోఁగూడ గొందఱు సంప్రదాయాభిమానులున్నను గొందఱు నూతన ప్రయోగము లను, ఉత్కర్షావహమైన స్వాతంత్ర్యమును నిరసింపక పోవుటయేకాక యధికముగాఁ బ్రశంసింతురు.

కావ్యమున కానందోపదేశములు రెండును ప్రయోజనములే. భారతీయులు కావ్యపఠన సందర్భమున సద్యఃపరనిర్వృతితోపాటు సదుపదేశమును గూడ వాంఛింతురు. పాశ్చాత్యులుపదేశ ప్రధానముకంటే నానంద సంధాన దక్షత్వమున కెక్కువ ప్రాధాన్య మొసంగుదురు.

భారతీయుల విమర్శ లొకొక్కప్పుడు కావ్యవస్తువునుండి కావ్యకర్తృ జీవితము వరకు వ్యాపించుచుండును. అనగా నందుఁగావ్య విమర్శతోపాటు వ్యక్తిగతమైన కావ్యకర్త విమర్శకూడఁ బ్రవేశించుచుండును. ఇది ప్రశస్త విమర్శన పద్ధతికాదు. విమర్శకుల విమర్శకుఁ బాత్రము కావ్యవస్తువే కాని కావ్యకర్తృ జీవితముకాదు. పాశ్చాత్యులలో వ్యక్తిగత దూషణాదు లత్యల్పముగా గోచరించును. వారు కవి జీవితమునకుసు కావ్యవస్తువునకుగల సంబంధమును బరిశీలింతురు గాని, కవి వ్యక్తిగత గుణదోషముల జోలికిఁబోరు.

ఆంగ్ల భాషాభ్యాస మధికమైన పిమ్మట భారతీయులు ప్రాక్ప్రతీచీ విమర్శన విధానములను మేళవించి సద్విమర్శలు వెలయించుచున్నారు. ఈ విధానము సారస్వతాభివృద్ధి కెంతయు శుభసూచకము. గుణములు వైదేశికములైనను ఆదరణీయములే; దోషములు స్వదేశీయములైనను విసర్జింపదగినవే.

2. లలిత కళలు – కవిత్వము

అనాది కాలము నుండియు మానవుఁడు తన జీవితమును సౌఖ్యానందమయ మొనరించుటకై యనేక కృత్యము లాచరించుచునే యున్నాడు. వీనిలోఁగొన్ని యుపయోగ దృష్టితోడను గొన్ని సౌందర్య దృష్టితోడను జేయఁబడుచున్నట్లు కానవచ్చును. ప్రతిభా నైపుణ్యములకుఁ దావలములైనవీనికన్నింటికి గళలను సామాన్య నామ మేర్పడినది. వీనిని వర్గీకరించి మన పూర్వులివి యఱువది నాలుగు తెఱంగులని వివరించినారు. ఇందుఁగొన్ని

మానవ జీవితమున కపరిహార్యములైనవి. కొన్ని యపరిహార్యములు కాకపోయినను ఆనంద ప్రదములగుటచే నాకర్షములైనట్టివి. వీనిలో మొదటి తెగకుఁ జెందినవి మానవ శరీర సౌఖ్యమునకును, రెండవ తెగకుఁ జెందినవి మానవ హృదయానందమునకుఁ దోడ్పడును. మొదటి తెగవానిని సామాన్య కళలనియు రెండవ తెగవానిని లలితకళలనియుఁ జెప్పుచుందురు. ఈ యిరు తెగల కళలను గూర్చియు రచింపఁబడిన గ్రంథములు సంస్కృతములో ననేకములున్నవి, కాని వానిలోఁబెక్కు ముద్రితములు గాక కాలగర్భముననే యడఁగి యుండుట మన దురదృష్టము.

లలితకళలను మాట యాంగ్లభాష యందలి **'Fine Arts'** అను పదమునకు బర్యాయముగా వాడఁబడుచున్నది. చిత్రలేఖనము, శిల్పము, సంగీతము, నృత్యము, కవిత్వము అను నైదును ఈ తెగకుఁజెందినట్టివి. ఇవియన్నియు నానంద సంధాయకములేయైనను సూక్ష్మముగాఁ బరిశీలించినచో వీనియందించుక తారతమ్యము గోచరించును. ఇవి యొసంగు నానంద పరిణామమును బట్టియు, వీని స్వరూప స్వభావములను బట్టియు, వీని యందలి హెచ్చు తగ్గులను నిర్ణయింపవచ్చును, ఆకార లక్షణములందు వీనికి సారూప్యము లేకపోయినను నిర్వహించు ప్రయోజనమునందు మాత్రము వీనికి సాధర్మ్యమున్నది. అది తమ్మా శ్రయించువారికి బ్రహ్మానంద సబ్రహ్మచారియైన యానందము నొసంగు సామర్థ్యము నందుఁ గాననగును.

లలితకళ లింద్రియముల ద్వారా మానవ మానసముల కానందము చేకూర్చి తమ్ము పాసించువారికిఁ గించిత్కాలమైన నక్షయము విగళిత వేద్యాంతరమునైన బ్రహ్మానందము యొక్క పరమార్థము నెఱింగించును. బుద్ధి మంతులైన వారా విషయము గ్రహించి తాత్కాలికమైన కళానందము నుండి శాశ్వతమైన బ్రహ్మానందమునకు దారిచూపు ప్రయత్నము లాచరింప వలయును. అట్లు చేసిననాఁడే వారి కళోపాసన సంపూర్ణ సాఫల్యము నందినదని చెప్పవచ్చును. లేనిచోఁ, గళోపాసనా సమయమున నానందలోకమున విహరించి యది ముగిసినంతనేవారు మరల సుఖదుఃఖరాగద్వేషాది ద్వంద్వములతోఁ గూడిన దృశ్యమానలోకమున కరుదెంచు చుందురు. యోగీశ్వరులకును గళోపాసకులకును నిదియే భేదము. వారు నిరంతరము బ్రహ్మానంద సాగరమున నోలలాడుచుండ వీరెడనెడ దానిని జవిచూచి విశ్రుతిని బొరయుచుందురు.

చిత్రలేఖనము చక్షురింద్రియము ద్వారా మానసమున కానందము చేకూర్చును. కన్నులు భావ గంభీరమైన సుందర చిత్రమును జూచినంతనే యావర్జితములై మానసమును బహిర్లోక విస్మారకమైన యానంద రసమున నోలలార్చును. చిత్రలేఖనమున మనము చిత్రిత వస్తువు యొక్క సంపూర్ణమైన యాకారమునుగాక యందలి యేక దేశమును మాత్రమే దర్శింపఁ జాలుదుము. అదియునుగాక చిత్రకారుఁడు దృశ్యమును బాగుగా పరిశీలించి తన మానసమునకు మెచ్చుగొల్పిన యొకానొక సమయమునందలి దాని విన్యాసమును మాత్రమే తన చిత్రమున రూపొందించును. ఆ క్షణము గడిచిపోయినచో నా దృశ్యము యొక్క స్థితియందుఁ గొంత మార్పు సంఘటిల్లును. ఈ మార్పును గూడ సూచింపఁదలఁచినచోఁ జిత్రకారుఁడు మఱియొక చిత్రమును రచింపవలసినదే. అట్లే వస్తువుల దశలును క్షణక్షణ చాంచల్య మానములగుచుండును. గావునఁ జిత్రకారుఁడా దశలన్నిటిని దన చిత్రమునఁ జూపఁజాలఁడు. అతని చిత్రము వస్తువు యొక్క ఏకైక దశా విన్యాసమును మనకుఁ బ్రదర్శింపఁజాలు నంతే.

శిల్పము కూడఁ గొంచెమించుమించుగాఁ జిత్రలేఖనము వంటిదే. ఇదియుఁ జక్షురింద్రియము ద్వారా మానసమును రంజించునట్టిదే. ఇందును వస్తువుయొక్క కించిత్కాల స్థేయమైన యేకైక విన్యాసమే ప్రదర్శింపబడును. కాని, శిల్పియందు వస్తువును సంపూర్ణాకృతిగాఁ బ్రదర్శింపజాలును. శిల్పి చెక్కిన సమగ్ర విగ్రహములందు మనము ముందు వెనుకలను బార్శ్వములను గూడ దర్శింపఁజాలుదుము. చిత్రలేఖనమునకు దీనికిని గల మఱియొక విశేష మేమనఁ జిత్రలేఖనమునవలెఁగాక యిది త్వగింద్రియమునకుఁ గూడ గోచరించుట కవకాశము కలదు. చిత్రలేఖనమును మనము స్పృశించి చూచినచో నందలి విశేషమేమియును గ్రహింపఁ జాలము. శిల్పమునసట్లుగాక స్పర్శచే నందలి నిమ్నోన్నత భాగముల గుర్తించి పరిశీలింపఁ గలము. అంధునకు జిత్రలేఖనమును దదాలంబనమైన పట పత్రాదికమును నిర్విశేషమే. శిల్పమునైనచో నాతఁడు చేతితోఁ దడవి చూచి స్పర్శ ప్రభావముచే దాని రామణీయకము నంతను గాక పోయినను గొంచెమైన గ్రహించి యానందించుట కవకాశమున్నది.

సంగీతము శ్రవణేంద్రియముద్వారా మానసమునకానందము నుత్పాదించును. ఇది కేవల స్వరమయమై యున్నది. వివిధ స్వరముల విన్యాసముచేఁ గలుగు నొకనొక యనిర్వచనీయమైన సామరస్యముచే నిది విను వారిడెందముల నాకర్షించి వారికం దేకాగ్రత

కలిగించును. ఇది భావాశ్రయము కాని రసాశ్రయముకాని కాదు. కేవలము స్వరాశ్రయమైనట్టిది. ఇది యొక విధముగాఁజూచినచోఁ దాళలయాశ్రయమైన నృత్తము వంటిదని చెప్పవచ్చును. అయ్యునిది చిత్తాకర్షకత్వమున నితర కళలకుఁ దీసిపోదు. ఇది మానవులనే కాక ప్రాణవంతమైన జంతుజాలము నంతను దనదిస కాకర్షించుకొనఁగలదు. అందుచేతనే "శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తిగానరసంఫణిః" అను నానుడి యేర్పడినది. పంచేంద్రియములలో నితరములైనవాని కన్న శ్రవణేంద్రియమునకెక్కువ బలసామర్థ్యములున్నట్లు గోచరించును. రంజకమైన రాగాలాపము నాలించినంతనే యది విషయాంతర మగ్నమైయున్న దానినైన మనమును బలవంతముగా నాకర్షించి తదేకపరాణయము కావించును. పాశ్చాత్యులు లలితకళ లన్నిటికిని సమానమైన ప్రాధాన్యమునే యొసంగుదురు. భారతీయులట్లుకాక చిత్రలేఖన శిల్పములకంటే సంగీతమునకును, సంగీతమునకంటే నృత్యకవిత్వములకును నధికమైన ప్రాధాన్య మొసంగుదురు. దీనికి శ్రవణేంద్రియ సమ్మోదము ద్వారా మానసమునకుఁ గలుగు నానందమున వారికిఁ గల యభిమానమే కారణమై యుండును.

నృత్యము భావాశ్రయమైనది. ఇది పదార్థాభినయాత్మకమై మార్గమని ప్రసిద్ధి నందియున్నది. జనులు సాధారణముగా నృత్యనాట్యములందలి భేదము నారయఁ జాలక రెంటిని సమానార్థకములుగా వాడుచుందురు. కాని దశరూపకకారుఁడు "అన్యద్భావాశ్రయం నృత్య" మ్మనియు, ధనికుఁడు "రసాశ్రయాన్నాట్యాద్భావాశ్రయం నృత్య మన్యదేవ" యనియు నా రెంటికిని భేదము నిరూపించియున్నారు. నాట్యము రసాశ్రయమైనది. ఇంగు కావ్యార్థాభినయము గోచరించును. నృత్యమున నాంగికాభినయము ప్రాధాన్యము వహింప నాట్యము సాత్త్వికాభినయ బహుళమై యొప్పారుచుండును. "అత్రనృత్యేదర్శనీయ మేవసర్వం భవతి. నతుశ్రవణీయమ్ నృత్యేకావ్య సంబంధాభావా దిత్యర్థః" అని దశరూపకవాఖ్యలలో నొకటగు ప్రభలో వివరింపబడియున్నది. దీనిని బట్టి నృత్యముకూడ నృత్తమువలెనే శ్రవణేంద్రియమునకంటెఁ జక్షురింద్రియమునకే యెక్కువ ప్రీతి కలిగించునని తెలియుచున్నది. నృత్త నృత్యములకు గాత్రవిక్షేపక సామ్య మున్నప్పటికిని నృత్తమున లేని యనుకరణము నృత్యమున నుండుటచే నిది సర్వవిధముల దానికంటే నతిశయించుచున్నది. నృత్యమాంగికాభినయ బాహుళ్యమగుటచేఁ జిత్రలేఖన శిల్పములవలెనే చక్షువులకుఁ బ్రీతి సంధించును. కాని యవి వస్తువుయొక్క యేకక్షణ వ్యక్తమగు స్థిరవిన్యాసమునే సూచింపఁ

గల్గియుండ నృత్యము క్షణక్షణచాంచల్యమాన దశావిపర్యయమునుగూడ సూచింపఁ జాలియుండును.

కావ్యము రసాత్మకమయినది. ఇది శ్రవణేంద్రియమున కపార ప్రీతి కలిగించి మనస్సు నధికముగా నాకర్షించును. ఇతర లలితకళలందెచ్చటను లేని వాక్సాహాయ్యము దీనికిఁగలదు. ఈ సాహాయ్యముచే గవిదృశ్యములమ సమగ్రముగా వర్ణించి వానిని బఠితల మనఃఫలకముల సాక్షాత్కరింపఁజేయును. ఈ విధముగా నిందు సంగీతమును జిత్రలేఖనమును మిశ్రితములై యుండి మానసమున కమేయానందము నందించుచున్నవి. కవి వాక్కుల సాయమున బమ్మెరపోతనవలె దివ్యసంగీతమును వినిపించగలఁడు. తిక్కనా మాత్యునివలె క్షణక్షణముమార్పు చెందుచుండు దృశ్యములదశావిన్యాసములను జక్కగాఁ జిత్రింపఁగలఁడు. వాక్ప్రభావ మింతింతని చెప్పనలవికాదు. ఈ వాక్కే లలితకళలలోఁ గావ్యమున కగ్రస్థాన మొసంగుచున్నది.

సప్తసంతానములందేకాక లలిత కళలలోఁగూడఁ బ్రశస్తిగాంచి ఖిలము గాకుండ శాశ్వతముగా నుండునది కవిత్వమే. సంగీత నాట్యములు రెండును దత్కర్తలు పాడుచుఁ బ్రదర్శించుచు నుండునంతకాలమే మనకానంద మొసంగఁజాలును. చిత్రలేఖనము కాలక్రమమున మాసిపోవుట కవకాశమున్నది. శిల్పము శిలామయమగుటచేఁ గొంతదీర్ఘకాల ముండ జాలినను శాశ్వతము మాత్రము కాదు. కవిత్వము శబ్దమయమగుటచేఁ బ్రపంచమున శబ్దముండునంతకాల మక్షరమైయుండఁజాలును. ఈ విధముగా శాశ్వతత్వమును బట్టిచూచినను లలితకళలలోఁ గవిత్వమునకే యగ్రస్థానము.

నాటకము కూడ నొక కావ్యభేదమే. కాని యిది దృశ్యకావ్యము. శ్రవ్యకావ్యములలో శ్రవణేంద్రియమునకుఁ బ్రీతి సంధించు శక్తియే హెచ్చు. దృశ్య కావ్యమగు నాటకము చక్షుః శ్రవణేంద్రియములు రెండింటికిని సంపూర్ణమైన యానందము చేకూర్చును. ఇది లలిత కళలైదును ఏకత్రమూర్తీభవించియుండు సమాహారకళ. శ్రవ్యకావ్యములలో మనోనయన మాత్రగోచరములగు దృశ్యములు దృశ్యకావ్యములందుఁ జర్మ చక్షువులకుఁ గూడ గోచరించి యింతింతనరాని సంతోషము సంతరించును. అందుచేతనే లలితకళలలోఁ గావ్యమునకువలెఁ గావ్యములలో నాటకమున కగ్రతాంబూలము లభించుచున్నది.

2. కావ్యసోపానము

1. కావ్యస్వరూప నిర్వచనములు :

కవి శబ్దము మొదట వేదములందుఁ బరమాత్మ పరముగా వాడబడినది. తరువాత నది పరమాత్మ సాక్షాత్కారమునందిన ఋషులకు వాడఁబడినది. వేదమంత్రములను దర్శించిన మహర్షులు కవులు. వారి కావ్యము లుపనిషదాదులు. లౌకిక కావ్యములైన రామాయణ మహాభారతములను రచించిన వాల్మీకియు వ్యాసుఁడును గూడ ఋషులే. వారు దివ్యదృష్టిచే బ్రపంచ రహస్యము లారసి, లోకజ్ఞులై లోకోత్తర వర్ణనాత్మకములైన మహాకావ్యములు రచించిరి. ఆరంభమున వేదముల దర్శించినవారు ఋషులగుటచేతను, ఋషి కానివాడు కావ్యము రచింపఁ జాలఁ (నా౽ నృషిః కురుతేకావ్యమ్) డనియుఁ, గవిక్రాంతదర్శియనియు నానుడు లేర్పడినవి. క్రాంతదర్శియనగాఁ జర్మ చక్షువుల కతీతములైన విషయములను గూడఁజూడఁజాలిన వాఁడని యర్థము.

దర్శనమాత్రముచే నెవ్వరును గవులు కాఁజాలరు. ముందు దర్శించి తరువాత దర్శించిన దానిని వర్ణింపవలయును. దర్శన వర్ణములవలన లోకమునఁగవి యను ప్రసిద్ధికలుగుననియు (దర్శనా ద్వర్ణనాచ్చాథ రూఢాలోకే కవిశ్రుతిః) ద్రష్టయైన వాల్మీకి వర్ణనానంతరమే (రామాయణ రచనానంతరమే) కవియను యశస్సు నార్జించెననియు, భట్టతౌతుఁడు చెప్పియున్నాడు. ప్రతిభాశాలియై నిపుణముగా వర్ణించువాఁడే కవియని భామహుని యభిప్రాయము. ప్రతిభావంతుఁడుకాని వస్తువులను లెస్సగా దర్శింపఁ జాలఁడు. వస్తువులను. దర్శించినవానికిఁగాని వానిని జక్కఁగా వర్ణించు శక్తి సమకూరదు కావున వస్తువులను దర్శించుట, దర్శించిన వస్తువులను వర్ణించుట కవి యొక్క ముఖ్య లక్షణములు.

కవనీయము (వర్ణనీయము) కావ్యము. లోకోత్తర వర్ణనా నిపుణుఁడైన కవి కర్మ కావ్యమని మమ్మటుఁడు. లోకోత్తర వర్ణనా నైపుణ్యము ప్రతిభైక సాధ్యము. ప్రతిభ దేవతాను

గ్రహ సంపాద్యము. దేవతానుగ్రహము తపస్సంపాద్యము. తపస్సు ఋషి వ్యాపారము. అందుచేతనే ఋషికానివాఁడు కావ్యము నిర్మింపజాలఁడనుమాట కలిగినది. కావ్యాంగముగాని శబ్దముగాని,న్యాయముగాని, విద్యగాని, కళగానిలేదు. అందుచేఁ గవిపై మహత్తరభారమున్నది. [1]కవి కాకపోవుటలో నధర్మమేమియులేదు. అందువలన మృతిగాని శిక్షగానికలుగ నేరదు. కాని కుకవిత్వము మాత్రము సాక్షాన్మరణమే.[2] కుకవిత్వము చెప్పుటకంటే నసలు చెప్పకుండుటే మేలని దీని అభిప్రాయము.

కవికర్మ కావ్యమని తేలినది. ఇంక దాని స్వరూపము నారయుదము. కావ్యము నొకవ్యక్తితోఁ బోల్చి పూర్వలాక్షణికులు దాని స్వరూపము నిర్ణయించుటకు యత్నించిరి. వ్యక్తి వలెనే కావ్యమునకుఁ గూడ దేహాత్మలు గుణాలంకారములు మున్నగునవి యుండును. ప్రాచ్యలాక్షణికుల కాద్యుఁడైన భరతుఁడు కావ్యమున కితివృత్తము శరీరమనియు రసము తత్సౌందర్య హేతువనియు నుడివెను. క్రీ.శ.౭వ శతాబ్దికి చెందిన భామహుఁడు శ్రవ్య కావ్యచర్చగావించి "సహితములైన శబ్దార్థములు కావ్య" మని చెప్పెను. ఇతని యభిప్రాయము ననుసరించి శబ్దార్థయుగళమే కావ్యశరీరము. అలంకారములు దీనికి సౌందర్యము కలిగించును.

క్రీ.శ. 6వ శతాబ్దియందలి దండి "ఇష్టార్థ వ్యవచ్ఛిన్నమైన పద సమూహమే" కావ్యమని చెప్పెను. రమణీయమైన యర్థముతోఁగూడిన పదముల సమూహము కావ్యమని దీని యర్థము. ఇష్టార్థవ్యవచ్ఛిన్నమగు విశేషణము వాడినను ఇతఁడు పదసమూహమునకే ఎక్కువ ప్రాధాన్య మొసంగెను. ఇతని మతమునఁ బదసమూహమే కావ్యశరీరము. గుణములు తత్సౌందర్య హేతువులు.

క్రీ.శ. 6వ శతాబ్దివాఁడగు వామనుఁడు గుణములచే నేర్పడు రీతి కావ్యాత్మయనియు నలంకారములు తత్సౌందర్యపోషకములనియు నుడివెను. ఇతఁడు భామహు ననుసరించి శబ్దార్థముల సమాహారమే కావ్యశరీరమని యభిప్రాయపడెను.

---

1. న స శబ్దో న స న్యాయోన సావిద్యా న సా కళా
జాయతే యన్న కావ్యాంగ మతో భారో మహా కవేః

2. నాకవిత్వ మధర్మాయ మృతయే దండనాయ చ
కుకవిత్వం పునః సాక్షాత్ మృతి రాహు ర్మనీషిణః

ధ్వన్యాలోక కర్తయైన యానందవర్ధనుఁడు కావ్యశరీరమును గూర్చి యిదమిత్థమని చెప్పియుండలేదు. కాని తరువాతి వ్యాఖ్యాతలు కొందఱు శబ్దార్థయుగళమును గొందఱు చారుత్వాతిశయముతోఁ గూడిన విశిష్టార్థమును బ్రకాశింపఁజేయు శబ్దమును అతఁడు కావ్యశరీరముగాఁ జెప్పినట్లూహించిరి. ఇందలి రెండవ యభిప్రాయమునకును దండి యభిప్రాయమునకును భేదమే లేదు. లోచనకర్తయైన అభినవగుప్తుఁడు కూడ శబ్దమే కావ్య శరీరమని భావించెను.

తరువాతి లాక్షణికులలోఁ బ్రధానులైన మహిమభట్టు, కుంతకుఁడు మున్నగువారు శబ్దార్థయుగళమే కావ్యశరీరమని సూచించిరి. రసగంగాధర కర్తయైన జగన్నాథుఁడు దండివలె శబ్దమునకే ప్రాధాన్య మొసంగెను.

శబ్దార్థములు రెండును అవినాభావసంబంధమును కలిగియుండుననుమాట నిజమే. అందుచేతనే కాళిదాసు పార్వతీపరమేశ్వరులను "వాగర్థా వివసంపృక్తౌ" అని వర్ణించెను. కాని శబ్దము కావ్య బహిస్స్వరూపమును మాత్రమే సూచించును. అర్థము దాని యాంతర ప్రవృత్తిని సూచించును. లాక్షణికులు కావ్యాత్మయని చెప్పిన రసాలంకారగుణరీతి ధ్వన్యనుమానౌచిత్యాదులన్నియు నర్థము నాశ్రయించినవే. అందుచేఁగావ్య బహిస్స్వరూపము శబ్దమే యనియు వ్యక్తిసామ్యమును బట్టి చూచిననో నదే కావ్యశరీరమగు ననియు నూహింప వచ్చును.

మన లాక్షణికులు పలువురు కావ్యమును బలువిధముల నిర్వచించియుండిరి. అందుఁ గొన్ని ముఖ్యములైనవి క్రింద నొసంగబడుచున్నవి.

సహితములైన శబ్దార్థములు కావ్యము (భామహుడు). ఇష్టార్థ వ్యవచ్ఛిన్నమైన పదావళి కావ్యము (దండి). గుణాలంకార యుక్తములైన శబ్దార్థములు కావ్యము (వామనుఁడు). అదోషములు, సగుణములు, సాలంకారములు అయిన శబ్దార్థములు కావ్యము. అవి యొక్కొక్కప్పు డనలంకారములుగూడఁ గావచ్చును (మమ్మటుడు). రసాత్మకమైన వాక్యము కావ్యము (విశ్వనాథుఁడు). నిర్దోషము గుణాలంకార రసవంతము నగు వాక్యము కావ్యము (భోజరాజు). గుణాలంకారరీతి రసోపేతమైన సాధు శబ్దార్థ సందర్భము కావ్యము(పీయూష వర్షుడు). రమణీయార్థ ప్రతిపాదకమైన శబ్దము కావ్యము(జగన్నాథుఁడు). రసాలంకారయుక్తము సుఖవిశేష సాధనము నైనది కావ్యము (కేశవమిశ్రుఁడు).

పై నిర్వచనములలో దేహాత్మలతోఁ గూడిన కావ్య సమగ్రస్వరూపము చెప్పబడినది. ఈ నిర్వచనములను గావించునప్పు డాయా లాక్షణికులు తమకుఁ బూర్వమందుండిన లాక్షణికులు చెప్పిన వానియందలి దోషములను జూపి యంతకంటే నుత్తమమైన నిర్వచనమును జెప్పుటకు యత్నించిరి. ఆ యభిప్రాయములు దిగ్మాత్రముగా నిట సూచింపఁబడుచున్నవి.

దండి మనోహరార్థ సమలంకృతమైన పద సమూహము కావ్యమని చెప్పి యందల్పమైన దోషమును గూడ నుపేక్షింపరాదని భావించెను. మమ్మటుఁడు శబ్దార్థ యుగళము కావ్యమని చెప్పి యా శబ్దార్థములు సగుణములు నిర్దోషములు సాలంకారములునై యుండవలెనని సూచించెను. "అనలంకృతే పునఃక్వాపి" యనుటవలన నొకానొకచో నలంకారములు స్ఫుటముగా లేకున్నను గావ్యత్వమునకు హానిరాదని వ్యాఖ్యాత సూచించెను. దండి మమ్మటులిరువురును గావ్యము నిర్దోషమై యుండవలెనని నొక్కి చెప్పిరి. మమ్మటుఁడది యదోషమై యుండుటేకాక సగుణము సాలంకారమునై కూడ నుండవలెనని భావించెను.

లోకమున దోషరహితమైన కావ్యమేదియు నుండదనియు, నదోషత్వమే కావ్యమునకుఁ బ్రధానలక్షణమైనచో ధ్వని ప్రాధాన్యమును బట్టియుత్తమ కావ్యములు గావలసిన పెక్కసలు కావ్యములే కాకపోవలసి వచ్చుననియుఁ దెల్పి, పైవారి యభిప్రాయములను విశ్వనాధుఁడాక్షేపించెను. మఱియు నతఁడు రసముకావ్యమున కాత్మభూతమని యంగీకరించి నప్పుడు గుణములు లేనిచో రసముండదు కావున గావ్యము సగుణమై యుండవలెనని వేఱే చెప్ప నక్కఱలేదని భావించెను. అలంకారములవలె రసధర్మములు కాకపోవుటచే నలంకారములు లేకున్నను గావ్యము రసవంతము కావచ్చుననియు, నందుచేఁగావ్యము సాలంకారమై యుండవలె ననుటయు ననవసరమే యనియు నతఁడు తెలిపి రసాత్మకమైన వాక్యము కావ్యమను నిర్వచనము కావించెను. జగన్నాథుఁడు మమ్మట విశ్వనాథుల నిర్వచనముల రెంటిని ఖండించెను. లోకమున 'ఈ కావ్యము దుష్ట' మను వ్యవహారముండుటచే దుష్టత్వము కావ్యమునకు హాని చేకూర్చదనియు గుణాలంకారసహితములు కాకున్నను వ్యంగ్యార్థ భూయిష్ఠములై యుత్తమ కావ్యములనిపించుకొనునవి పెక్కుండుటచేఁ గావ్యము సాలంకారము సగుణమునై యుండవలె ననుట వ్యర్థమనియు నాతఁడు మమ్మటుని నిర్వచనము నధిక్షేపించెను. రసాత్మకమైన వాక్యమే కావ్య మన్నచో రసస్పర్శలేని వస్త్వలంకార ధ్వనియుక్తములైన కావ్యములు కావ్యములు కాకపోవలసి వచ్చుననియుఁ బ్రాచీనులు కపిబాల విలాస జల పాతాదులను

గూర్చి వర్ణించిన వస్త్వలంకారధ్వని ప్రధానములైన కావ్యములు పెక్కుగలవనియుఁదెల్పియతఁడు విశ్వనాథుని నిర్వచనమును గూడ ఖండించెను. రమణీయార్థ ప్రాతిపాదకమైన శబ్దము కావ్యమని జగన్నాథుని నిర్వచనము. దీనికిని దండి నిర్వచనమునకును భేదమేమియులేదు.

మన లాక్షణికులవలెనే పాశ్చాత్య విమర్శకులుకూడాఁ గవిత్వమును నిర్వచింప యత్నించియుండిరి. వారు రసధ్వన్యలంకారాదులను గూర్చి ప్రాచ్యలాక్షణికుల యట్లంత నిశితముగాఁ బరిశీలనము చేయనప్పటికిని వారు కావించిన నిర్వచనములలోఁ గొన్ని యలంకార మతమునకును, గొన్ని రసమతమునకును జెందినట్లు కన్పించును. గోల్డుస్మిత్తు, లేహన్టు మొదలగు వారలంకార మతమునకును, వర్డ్సువర్తు, జాన్ కేబల్ మొదలైనవారు రసమతమునకు సంబంధించిన వారని చెప్పవచ్చును. మొదటి తెగవారు కావ్య బహిస్స్వరూపమును మాత్రమే చెప్పియుండ రెండవ మతమువారు దాని యాంతర స్వరూపమునుగూడ భావించినట్లు గోచరించును.

భావనావ్యక్తీకరణమే కవిత్వము (The Expression of imagination). భావన కొక విధమైన భ్రాంతిని గలిగించునట్లు పదముల నుపయోగించు కళయే కవిత్వము(The art of employing the words insuch a manner to produce illusion on the imagination) సౌందర్యమును గణబద్ధముగా సృజించుటయే కవిత్వము (The rhythmic creation of beauty) అనునవి మొదటి తెగవా రొనరించిన నిర్వచనములు. ఆవేశ మప్రయత్నముగా మూర్తీభవించియుండు పదములును భావములునుగాక కవిత్వమనఁ గానింకేమియని జాన్‌స్టూవర్ట్ మిల్ సూచించి యుండెను [1]శక్తివంతములగు భావములు సహజముగా నుప్పొంగుటయే కవిత్వమని వర్డ్సువర్తు[2]ను, ఉప్పొంగిపోవు భావప్రవాహమునకఁ బరీవాహమే కవిత్వమని[3] జాన్‌కేబల్ అనునతఁడును గవిత్వమును నిర్వచించియుండిరి. ఈ నిర్వచనములు క్రౌంచద్వంద్వ వియోగోత్థమైన యాదికవి శోకమే శ్లోకత్వమందెనను

---

1. What is poetry but the thoughts and words in which emotion spontaneously embodies it self.

2. Poetry is the spontaneous over-flow of powerful feelings.

3. Poetry is vent for over - charged feelings.

నానందవర్ధనుని భావమునకుఁ బ్రతిబింబముగా నున్నవి. ఇందు రససిద్ధాంతము పూర్తిగా వ్యక్తము చేయఁబడకున్నను దాని ఛాయలు మాత్రము గోచరించుచున్న వనుటలో సందేహములేదు.

ఈ విధముగా ప్రాచ్యలాక్షణికులును బాశ్చాత్య విమర్శకులును గావించిన నిర్వచనములలోఁ గావ్యముయొక్క దేహాత్మలు రెండును స్పృశింపఁబడినవి. కొందఱు శబ్దార్థములు రెండునుగలసి కావ్యమనిరి. మరికొందఱు విశిష్ట లక్షణములు గల శబ్దమే కావ్యమనిరి. మొదటివారు కావ్యము యొక్క బహిరంతః స్వరూపములు రెండింటిని జత చేసిరి. రెండవవారు బహిస్స్వరూపమును మాత్రమే వ్యక్తము చేసిరి. సూక్ష్మముగాఁ బరిశీలించినఁ బైయిరు తెగల వారి యభిప్రాయములును యథార్థములే.

2. కావ్య హేతువులు :

భగవంతుని సృష్టిలో మానవునికి గల విశిష్టత కితర జీవులకు లేని జ్ఞాన మాతనికిఁ గల్గుటయే కారణము. ఇట్టి జ్ఞానము పుష్కలముగా నున్నను మానవు లెల్లరును కవులు కాఁ జాలరు. కవితా కౌశల మబ్బుటకుఁ గొన్ని హేతువు లుండవలయును. వీనినే సంస్కృత లాక్షణికులు కావ్య హేతువులని పేర్కొనియుండిరి.

శక్తిర్నిపుణతా లోక శాస్త్ర కావ్యాద్యవేక్షణాత్
కావ్యజ్ఞ శిక్షయాభ్యాస ఇతిహేతు స్తదుద్భవే.

అని కావ్య ప్రకాశమున కావ్య హేతు వుగ్గడింపఁబడినది. శక్తిలోకమును శాస్త్రములను గావ్యాదులను జూచుటవలనగలుగు నైపుణ్యము, కావ్య తత్వము నెరంగు పెద్దల శిక్షను బొంది తదనుగుణముగా నభ్యాస మొనర్చుట అను మూఁడును కలసి కావ్యహేతువని దీని భావము. "ఇతి హేతు స్తదుద్భవే" అని యేకవచనము వాడుటచే నీ మూఁడును భిన్న భిన్న హేతువులు కావనియు నీ మూఁడింటి కలయిక వలన నేర్పడిన గుణ విశేషమే కావ్యోత్పత్తికి హేతువనియు వ్యక్తమగుచున్నది. ఇందలి శక్తి నభినవగుప్తుఁడు ప్రతిభ యని పేర్కొని, యది అపూర్వ వస్తు నిర్మాణక్షమమైన ప్రజ్ఞయని నిర్వచించి యుండెను. భామహుఁడు నవనవోన్మేష శాలినియైన ప్రజ్ఞయే ప్రతిభయని వక్కాణించెను. ఈ ప్రజ్ఞ గల మానవుఁడు లోకోత్తర చమత్కార కారియైన కావ్యమును సృష్టించఁజాలును. ఇది లేనిచో నితర గుణములెన్ని యున్నను ఉత్తమ

కావ్య రచనాదక్షత కలుగ నేరదు. అందుచేతనే "కావ్యంతు జాయతే జాతు కస్యచి త్ప్రతిభావతః" అని భామహుఁడు చెప్పియుండెను. ఈ ప్రతిభ కావ్య హేతువులో నేకదేశము.

కావ్యహేతువులోని రెండవ భాగము నిపుణత, తాము నివసించు లోకములోని వ్యక్తులను వస్తువులను దత్ప్రవృత్తులను సూక్ష్మముగాఁ బరిశీలించుట వలనను, శాస్త్రములను శ్రద్ధగాఁ బఠించుట వలనను మానవులకుఁ గొంత నిపుణత లేదా జ్ఞానము కలుగును. దీనికి వ్యుత్పత్తి లేక పాండిత్యమని పేరు. ఇది సహజమైన ప్రతిభాశక్తి కనేక విధముల వన్నె చేకూర్చును. ఇది కలవారే విద్వత్కవులు. "విద్వత్కవయఃకవయః కేవల కవయస్తు కేవలం కపయః" అను వాక్యమును బట్టికావ్యహేతువున వ్యుత్పత్తి కెంత ప్రాముఖ్యమున్నదో తెలియవచ్చుచున్నది. మానవుఁడెంత ధన సంపన్నుఁ డైనను విద్యాభ్యాసము లేకున్నచోఁ బండితుఁడు కాఁజాలనట్లెంత ప్రజ్ఞావంతుఁడైనఁ బాండిత్యము లేనిచో నుత్తమ కావ్య నిర్మాణదక్షుఁడు గాఁజాలడు.

కావ్య హేతువు నందలి మూఁడవభాగము కావ్యజ్ఞులైన పెద్దల శిక్షను బొంది తదనుసారముగా నభ్యాసము కావించుట. కావ్యజ్ఞులైన పెద్దల శిక్షను బొందుట యొక విధముగా వ్యుత్పత్తిలోని భాగమే. ప్రతిభా పాండిత్యము లెంత యధికముగా నున్నను అభ్యాసము లేనిచో మానవుఁడు కావ్యము రచించలేఁడు. ఒకవేళ రచించినను అభ్యాసహీనతచేత నతనికి సరళ సుందరమైన శైలి యలవడదు. అనఁగననఁగ రాగ మతిశయిల్లునట్లును, వ్రాయఁగా వ్రాయఁగా ధారాళమైన కవిత్వ మలవడును. అందుచేఁ గావ్యహేతువున నభ్యాసమునకు గూడ సముచితమైన స్థానము కలదు.

ప్రతిభా వ్యుత్పత్త్యభ్యాసముల కలయికయే కావ్య హేతువని తేలినది. రూపసంపల్లావణ్యములవలెఁ ప్రతిభా వ్యుత్పత్తు లన్యోన్య సంబంధము కలిగి యుండునని రాజశేఖరుఁడు కావ్య మీమాంసలో జెప్పియున్నాడు. పై మూఁడు గుణములను సమాన భాగములుగాఁ గలవారే మహాకవులు కాఁజాలుదురు. అట్లు లేనిచోఁ గావ్యరచనా దక్షత యబ్బినను అట్టివారు మహాకవి శబ్దమున కర్హులు కాఁజాలరు. కాళిదాసాది సంస్కృత కవుల యందును, నన్నయ తిక్కనాది పూర్వాంధ్రకవుల యందును త్రిగుణాత్మకమైన యీ కావ్యహేతువు సమగ్రముగా గానఁబడును. అందుచేతనే వారు మహాకవులు కాఁజాలిరి. అట్టివారిని గూర్చియే ఆనందవర్ధనుఁడు "అపారే కావ్య సంసారే కవి రేవ ప్రజాపతిః" అని నుడివి యుండెను.

కావ్య ప్రకాశమున ప్రతిభకుఁ గారణము నిరూపింపబడి యుండలేదు. పండితరాయలు దానికి రెండు కారణములను నిరూపించెను. వ్యుత్పత్త్య భ్యాసములు దేవతానుగ్రహము. ఒకానొకఁడు తొల్త ప్రతిభాహీనుఁడైనను బాండిత్యము సంపాదించిన పిమ్మటఁ బ్రతిభాశాలియై కావ్యరచన కావింపఁజాలుచున్నాఁడు. ఇచ్చట నతని ప్రతిభకు వ్యుత్పత్త్యభ్యాసములే కారణములని చెప్పవచ్చును. ఒకానొకఁడు వ్యుత్పన్నుఁడు కాలేకపోయినను దేవతాప్రసాదమువలన నపూర్వ మైన ప్రతిభకుఁదావలమై మహాకావ్య రచనాధ్యక్షుఁడగు చున్నాఁడు. కాళిదాసు, తెనాలి రామకృష్ణుఁడు మున్నగువారిని గూర్చి లోకమునఁ బ్రచారమున నున్న కథ లిందుకుఁ దార్కాణములు. ఇచ్చటఁ బ్రతిభ దేవతా ప్రసాద లబ్ధమైనది. కారణమైన ప్రతిభ యందలి ద్వైవిధ్యమును బట్టి కార్యమైన కవిత్వమందును ద్వైవిధ్య మేర్పడును.

రాజశేఖరుఁడు కావ్యమీమాంసలో ప్రతిభావ్యుత్పత్తులలో ప్రతిభ శ్రేష్ఠమని యానందవర్ధనుఁడభిప్రాయ పడినట్లు సూచించెను. దేవతా ప్రసాద లబ్ధమైన ప్రతిభ వ్యుత్పత్తి కృతమైన దోషమును మఱుగు పుచ్చఁజాలును.

అవ్యుత్పత్తి కృతో దోషః శక్తా సంవ్రియతే కవేః
యస్త్వశక్తికృత స్తస్య ఝుడిత్యే వావభాసతే.

వ్యుత్పత్తి లోపముచేఁగలుగు దోషము ప్రతిభచేఁ గప్పి వేయబడును. ప్రతిభాలోపముచేఁ గలుగునది వెంటనే బయలుపడునని దీని యర్థము. దీని వలన వ్యుత్పత్తి కంటెఁ బ్రతిభయు వ్యుత్పత్త్య భ్యాసజనితమైన ప్రతిభకంటె దేవతావర ప్రసాద లబ్ధమైన ప్రతిభయు నెక్కువ శ్రేష్ఠములని వ్యక్తమగు చున్నది. ఈ ప్రతిభా గుణ సంపద చేతనే పరిచిత పూర్వములైన వస్తువులైనను గావ్యమున నిత్య నూతనములుగా గోచరించుచున్నవి. కవియై పుట్టిన వాని యందే యీ గుణ విశేషము పుష్కలముగాఁ గావించు చుండును.

3. కావ్యాత్మ :

సాధారణముగాఁ గావ్యమును గాంతతోఁ బోల్చుచుందురు. కాంతకు దేహగుణభూష ణాదులన్నియు సౌందర్యావహములే యైనను అందు ఆత్మ లేదా ప్రాణము ప్రధానమైనది. అది లోపించినచో నితరాంగము లెన్ని యున్నను సౌందర్యము సిద్ధింపదు. కావ్యాంగములైన రసాలంకార గుణాదులలో నాత్మ స్థానీయ మేదను విషయమునఁబూర్వ కాలమునుండియు

లాక్షణికులలో భిన్నాభిప్రాయములు గోచరించుచున్నవి. తేనె యెల్లరకును మధురముగానే యుండునట్లు కావ్యాస్వాదము కూడ నెల్లరకు నానందదాయకముగానే యుండును. కాని యా యానందానుభూతిని మాటలతో వ్యక్తము చేయవలసి వచ్చినప్పుడు మతభేదము లుప్పతిల్లినవి.

ప్రాచ్య లాక్షణికు లందఱికిని భరతముని గురుప్రాయుఁడు. ఇతని నాట్యశాస్త్రము భారతీయ లక్షణ గ్రంథములలో మొట్టమొదటిది. దీనిలోని సూత్రముల నాధారము చేసికొనియే తరువాతఁ బెక్కు లక్షణ గ్రంథములు వెలసియున్నవి. భరతుని దృష్టిలోఁ గావ్య మనఁగా రూపకమే. నాటక ప్రయోగ సమయమున సహృదయుఁడగు సామాజికుఁ డనుభవించు సాత్త్వికానందమే రసమనియు, రూపక సౌందర్యమునకు మూల మదే యగుటచే నదియే రూపకములందు ప్రధాన మనియు నతఁడు వివరించెను. ఈ విషయమున నతఁడు తనకుఁ బూర్వుఁడైన నందికేశ్వరుని మతము ననుసరించెనని చెప్పుదురు. అతని మతమునఁ గావ్యమున కితివృత్తము శరీరము, రసము తత్సౌందర్య కారణము.

భరతునికిని ఆనంద వర్ధనాచార్యునికి నడిమి కాలమునఁ గావ్య స్వరూప నిరూపణము చేయుటకై పెక్కురు పెక్కు విధములఁ బ్రయత్నించిరి. కాని వారందఱును గావ్య బహిస్స్వరూప నిర్ణయమునకే కాని యంతర్జీవ పరిశీలన కంతగాఁ బాటుబడి యుండలేదు. రస సిద్ధాంతము నందలి సామంజస్యమును గుర్తించినప్పటికిని వారు తమ తమ నూత్న సిద్ధాంతములకు దోహదము కల్పింపవలెనను నుత్సాహములో దానికిఁ దగినంత ప్రాధాన్య మొసంగుట కంగీకరింపరైరి. భరతుఁడు రసమును గేవల రూపక సంబంధిగా జెప్పుటయు, ఏ రస పోషణమునకు నవకాశములేని స్వల్ప రచనలలో రసానందము పొందుట దుర్లభమగుటయు వారు భిన్న సిద్ధాంతములను నెలకొల్పుటకు హేతువులైనవి.

అట్టి వానిలో నలంకార ప్రాధాన్య సిద్ధాంత మొకటి. దీనిని స్థాపించినవాఁడు 5వ శతాబ్దికి జెందిన భామహుఁడు. ఇతని గ్రంథము భామహాలంకారము శబ్దార్థములు కావ్య శరీరమనియు, మానవుల శరీరమున కలంకారములు (భూషణములు) వన్నె చేకూర్చు విధమున వక్రోక్తి మూలకములైన యలంకారములే కావ్య శరీరమునకు వన్నె చేకూర్చుననియు నందుచే నవియే కావ్యములందుఁ బ్రధానములనియు నితని యభిప్రాయము. కావ్య సౌందర్యమునకు మూలకారణమైన వక్రోక్తిలేనిచో రీతియేదైన నుపాదేయము కాఁజాలదనియు నందు

వైదర్భీగౌడిభేదము లనవసరములనియుఁ దెల్పి యితఁడు రసమును గూడ రసవదలంకారమను పేరు నొకయలంకార భేదముగాఁ బరిగణించెను.

క్రీ.శ. 6వ శతాబ్దియందుండిన దండి భామహుఁడుగ్గడించిన యలంకారములు కావ్యమునకు బహిస్సౌందర్యము మాత్రము కలిగించుననియు, నంత స్సౌందర్యమునకు గుణములే కారణము లగుటచే నవియే కావ్యము నందుఁ బ్రధానములనియు నభిప్రాయ పడెను. ఇతఁడు గుణ ప్రాధాన్యవాది. ఇతని లక్షణ గ్రంథము కావ్యాదర్శము. భామహునివలె నితఁడును రసమును రసవదలంకారముగానే పరిగణించెను.

భామహుఁడును దండియుఁ గావ్య బహిరంత స్సౌందర్య హేతువు లేవని పరిశీలించిరి. కాని యాత్మ స్వరూపమును బరిశీలించి యుండలేదు. "రీతిరాత్మాకావ్యస్య" యని యాత్మ విషయమును మొట్టమొదట నుగ్గడించిన వాఁడు క్రీ.శ. 9వ శతాబ్ది యందలి వామనుఁడు. మానవ శరీరమునకు వలెనే కావ్య శరీరమునకును ఆత్మ యున్నది. కాని యలంకారములు శోభా హేతువులు కాఁజాలవనియుఁ గావ్యమునకట్టి యాత్మ విశిష్టపద రచనాత్మకమైన రీతియనియు, నితఁడు వివరించెను. రీతి గుణములచే నేర్పడుననియు నలంకారములు కావ్య సౌందర్యమున కతిశయము చేకూర్చుననియుఁ దెల్పి యతఁడు దండి భామహుల గుణాలంకార వాదములను దన రీతి సిద్ధాంతముతో సమన్వయించెను. ఇతఁడు రసమునకు వారి కంటెఁ గొంచె మధిక ప్రాధాన్య మిచ్చినట్లు కనిపించును. ఇతఁడు దానిని గావ్య ప్రధానాంశములలో నొకటిగా బేర్కొనుటయే గాక రూపములలోఁ దత్పరిపోషణమున కెక్కువ యవకాశముండునని తెల్పి దానియెడ గౌరవము ప్రదర్శించినాడు. ఇతఁడు రీతి ప్రాధాన్యవాది. ఇతని లక్షణ గ్రంథము కావ్యాలంకార సూత్రవృత్తి.

వామనుని తరువాతఁబేర్కొనఁదగిన యాలంకారికులు ఉద్భటరుద్రటులు. ఇందుద్భటుఁడు భామహాలంకారమునకు వివరణము రచించెను. ఇతఁడు అలంకార మతానుగామియై రసము నలంకార భేదముగానే పేర్కొన్నను రసమును గూర్చియుఁ దదనుభవసాధనములను గూర్చియు సమగ్ర విచారము గావించి యున్నాడు. రుద్రటుడు కూడ నలంకార మతానుసారియే యైనను రసహీనమైన రచన నిష్ప్రయోజనమనియుఁ, దత్తద్రస పోషణమున కనువగు నట్లు వివిధ రీతుల నుపయోగింప వలెననియుఁ దెల్పి రసము నెడనే యించుక మ్రొగ్గు చూపి యున్నాడు. అగ్ని పురాణమున నంతకుఁ బూర్వమున్న

మతములన్నియుఁ గ్రోడీకరింపఁబడి యున్నవి. దాని వలనఁదత్కర్తకు గల ప్రత్యేకాభిప్రాయ మేమో తేల్చి చెప్పుట కవకాశము లేదు.

గావ్యాత్మ విషయమును నిశితముగాఁ బరిశీలించి, తనకుఁబూర్వము వెలసిన మతములన్నిటిని సమన్వయించి, సర్వ సమ్మతమైన ధ్వని సిద్ధాంతమును నెలకొల్పినవాఁ డానందవర్ధనుఁడు. ఇతని లక్షణ గ్రంథము ధ్వన్యాలోకము. కావ్య శరీరమున కాత్మధ్వని యనియు, నది రసాలంకార ధ్వన్యాత్మకమై మూఁడు విధములుగా నుండుననియు నితఁడు ధ్వన్యాలోకమున నిరూపించెను. ఇతని మతమున గుణాలంకార రీత్యాదు లంగి యగు ధ్వని కంగభూతములు. ప్రాణమున్నప్పుడే శరీరమున కలంకారాదులు సౌందర్య హేతువులగు నట్లు కావ్యము నందుఁగూడ బ్రాణ భూతమైన ధ్వని యున్నప్పుడే యలంకారాదులు దానికి సౌందర్య మాపాదించునని యతని యభిప్రాయము. రూపకమునందువలె శ్రవ్యములందును రసమే ప్రధానమని యతఁడు సూచించి రస మలంకార మాత్రము కాదనియు, నది కావ్య జీవితమనియు నది వాచ్యముగాఁగాక వ్యంగ్యముగా నుండవలెననియు, రసదోషములను వర్జింపవలెననియు రస వ్యంగ్యమువలె వస్త్వలంకార వ్యంగ్యములు కూడా గ్రాహ్యములే యనియు వివరించెను. ఇతని మతము రస సిద్ధాంతమునకు వ్యాఖ్యానము వంటిదేకాని తద్వ్యతిరేకి కాదు.

ధ్వన్యాలోకమునకు లోచన మను వ్యాఖ్య రచించిన వాఁడభినవ గుప్త పాదుఁడు. ఇతఁడును ఆనందవర్ధనునివలె ధ్వని ప్రాధాన్య వాదియేకాని యతఁడు వస్త్వలంకారధ్వనుల కంటె రసధ్వని కెక్కువ ప్రాధాన్య మొసంగెను. "రసము చేతనే సర్వ కావ్యములు జీవించును, రసములేని కావ్యముండదు. రసమే ఆత్మ. వస్త్వలంకార ధ్వనులు కూడా రస పర్యవసాయులే" అని యాతని వాక్యములు. విశ్వనాథుఁడు కూడ నితనివలెనే రసస్పర్శలేని వస్త్వలంకార ధ్వను లుండవని భావించెను.

అభినవగుప్తుని యనంతరము ధ్వని సిద్ధాంతమును ఖండించుచు మహిమభట్టు వ్యక్తి వివేకమును రచించెను. ఇతఁడానందవర్ధనుఁడు చెప్పిన వ్యంజనా వృత్తి యనవసరమనియు, నతని ధ్వనులన్నియు ననుమానములోనే యంతర్భవించుననియు, నీయనుమానము ధూమాగ్న్యనుమానము కంటె భిన్నమైన కావ్యానుమితియనియు వివరించెను. ఇతఁడు

ధ్వనివాదమును ఖండించినను గావ్యమున కాత్మ రసాదిరూప మనుటలో విప్రతిపత్తి లేదని యంగీకరించెను. ఇతని మతమున రస మనుమితమే కాని యభివ్యక్తముకాదు.

ప్రతీహారేందురా జుద్భటుని కావ్యాలంకారమునకు వ్యాఖ్యానము రచించినవాఁడు. ఇతఁ డుద్భటుని యలంకార మతమును బలపఱిచెను. ఇతని మతమున ధ్వని కూడా నొక యలంకారమే. భట్టనాయకుఁడు ధ్వని సిద్ధాంతము నకుఁ బ్రతిపక్షియైనను రస సిద్ధాంతమున కనుయాయియే. ఇతఁడు ధ్వని రసానుభూతికి ధ్వని కారుఁడు చెప్పిన వ్యంగ్యము కాక భావనభోగీకృతులను మఱి రెండు ప్రక్రియలు కారణములని యభిప్రాయపడెను. దశరూపక కర్తమైన ధనంజయుఁడును దద్వ్యాఖ్యాతయైన ధనికుఁడు రసమతమునకుఁ జెందినవారే. వారు కావ్యమునకు దజ్జీవితమైన రసమునకు వ్యంగ్య వ్యంజక భావముగాక భావ్య భావక సంబంధమని భావించిరి.

అభినవ గుప్తునికి సమకాలికుఁడైన కుంతకుఁడు వక్రోక్తి ప్రాధాన్యవాది. ఇతని గ్రంథము వక్రోక్తి జీవితము. భామహుని వక్రోక్తి నితఁడు కవి వ్యాపార వక్రతయని పేర్కొని యది వర్ణ విన్యాస, పద పూర్వార్థ, ప్రత్యయ, వాక్య, ప్రకరణ, ప్రబంధ గతమై యాఱు విధములుగా నుండునని తెల్పెను. అనుమితీమతము వలెనే యిదియు నెక్కువగాఁ బ్రచారము పొంది యుండలేదు.

కుంతకుని యనంతరము క్షేమేంద్రుఁడు "అనౌచిత్యాదృతే నాన్యద్రస భంగస్య కారణ" మ్మను ధ్వన్యాలోక కారికను బీజముగా గ్రహించి రససిద్ధమైన కావ్యమున కౌచిత్యమే జీవితమని ప్రతిపాదించెను. ఇతని గ్రంథమౌచిత్య విచారచర్చ. ఔచిత్య సహితములై యుండు నప్పుడే గుణాలంకారాదులు సార్థక్యము వహించునని యితని భావము. ఇతఁడు ధ్వని మతమును బ్రత్యక్షముగా బలపఱుపకపోయినను దానికి విరోధి మాత్రము కాఁడు.

ఆనందవర్ధనుని ధ్వని సిద్ధాంతము తరువాత వెల్వరింపఁబడిన నూత్న మతము లన్నియు దత్కర్తతోడనే సమసిపోయినవి. పిమ్మట విశ్వనాథ విద్యానాథ జగన్నాథాదులు ధ్వని సిద్ధాంతమునే యంగీకరించి పోషించిరి. కావ్యమున కాత్మ ధ్వని, యను నా సిద్ధాంతమే యిప్పటికిని సర్వ పండిత సమ్మతమై నిల్చి యున్నది. రస ధ్వనులకుఁగల ముఖ్యభేదమేమన - రసము సహృదయాశ్రయము, ధ్వని కావ్యాశ్రయమునై యుండుటయే. ఈ భేదమును

నిరూపించుటలో నానందవర్ధనుఁడు చూపిన నేర్పు నిరుపమానమైనది. సహృదయుని హృదయము నాకర్షించి కవి యుద్దేశించిన యానందము నతనిచే ననుభవింపఁ జేయు కావ్యగుణమునకే ధ్వని యనిపేరు.

4. కావ్య ప్రయోజనము :

ప్రతిభావంతులైన కవులు రచించు కావ్యములను సహృదయులైన జనులు పలుమార్లు చదువుచుందురు. లోకమున బుద్ధిమంతు లెవ్వరైన నేపనిని గాని నిష్ప్రయోజనముగా నాచరింపరు. అందుచేఁ గావ్య పఠనము వలనఁ బఠితలేదో యొక ప్రయోజనము నాశింతురని చెప్పక తప్పదు. ప్రయోజనమేది?

పూర్వ లాక్షణికులు వాఙ్మయమును వేదము, పురాణము, కావ్యము అను మూఁడు తెఱంగులుగా విభజించి తత్స్వరూప స్వభావములను వివరించిరి. వేదము శబ్ద ప్రధానము, ప్రభు సమ్మితము. ప్రభు శాసనమువలె వేద శాసనము కూడ నుల్లంఘించుటకు వీలు లేనిది. హేతువాద పూర్వకముగా దానియందలి మంచి చెడ్డలను గూర్చి విమర్శించుటకు మన కధికారము లేదు. వేద వాఙ్మయము శబ్ద ప్రధానమగుటచే నందలి శబ్దములను బఠిత యిచ్చవచ్చినట్లు మార్చరాదు. ఏలయన, నీషత్స్వరాన్యథా పాఠముల వలనఁ బ్రత్యవాయము కలుగును. పురాణము లర్థ ప్రధానములు, మిత్రసమ్మితములు. అవి వేదము లందుఁ జెప్పఁ బడిన యంశములనే సుబోధముగఁ గథారూపము జెప్పి మిత్రుల వలెఁ గర్తవ్యాకర్త వ్యోపదేశము కావించును. కావ్యములుక్తి ప్రధానములు, కాంతా సమ్మితములు. సాధుశీలయగు కాంత తన రూపగుణ ప్రవర్తనలచే భర్త మనస్సు నావర్జించి సవినయములైన మధు వాక్కులని పెడత్రోవ బట్టువానిని సన్మార్గమునకు ద్రిప్పురీతిఁ గావ్యమును శైలీ గుణాలంకారములచే బఠిత మనస్సు నాకర్షించి వ్యంగ్యరీతి నాతనిఁ గర్తవ్యోపదేశ మొనరించును. అందు శబ్దార్థములకుఁ గాక ఉక్తివైచిత్రికిఁ బ్రాధాన్య మెక్కువ. వేదపురాణ కావ్యములు మూఁడును గావించు కర్తవ్యోపదేశము సమానమే యైనను అవి వానిని జెప్పు రీతిలో భేదమున్నది. వేదములు శాసించును. పురాణములు బోధించును. కావ్యములు రంజించును. మూఁడింట ఉపదేశము సమానమే. కాని రంజనముతోఁగూడిన యుపదేశము కావ్యము నందలి విశేషము.

పై దానిని బట్టి హృదయమును రంజింపఁజేయుట, ఉపదేశించుట కావ్య ధర్మములని

తెల్లమగుచున్నది. ఇవి పఠితల కానందోపదేశములను గలిగించును. భామహుఁడు సత్కావ్యము ధర్మార్థ కామ మోక్షములందును, గళలయందును, నేర్పును, కీర్తిని, ప్రీతిని గలిగించునని చెప్పి యుండెను.[1] చతుర్వర్గ వ్యుత్పత్తియుఁ, గళాపరిజ్ఞానమును గీర్తియు, ఆనందమును, గావ్య ప్రయోజనములని యాతని యభిప్రాయము. కావ్య ప్రకాశ కర్తయైన మమ్మటుఁడు కావ్యము వలన యశస్సును అర్థమును, వ్యవహార జ్ఞానమును, అమంగళ పరిహారమును సద్యః పర నిర్వృతియు, నుపదేశమును గలుగునని చెప్పియున్నాడు.[2] పై యిరువురి యభిప్రాయమును గొంచెమించుగా నొక్కటే. పరనిర్వృతి యనఁగా బరమానందము. దీనినే భామహుఁడు ప్రీతియని పేర్కొనెను. అతఁడు కళాచతుర్వర్గ వ్యుత్పత్తియని చెప్ప మమ్మటుఁడు దానికి బదులు వ్యవహారవేత్తృతా శివేతరక్షత్యుపదేశములను జేర్చియుండెను. కీర్తి రెండింటను సమానమే. ఆంగ్లేయులు కూడ నుపదేశానంద ప్రధానములే కావ్య ప్రయోజనములని నుడివి యుండిరి.

ఈ విధముగా నానందోపదేశములు రెండును గావ్య ప్రయోజనము లని సాధారణముగా నెల్లరు నంగీకరించినను మరల నారెండింటిలో దేనికిఁ బ్రాధాన్యమను విషయమున వైవిధ్యము కానవచ్చుచున్నది. అభినవగుప్తుఁడు "ధర్మార్థకామ మోక్షేషు వైచక్షణ్య" మను నుక్తి ననుసరించి కావ్యము వలన శ్రోతలకు వ్యుత్పత్తి కలుగుచున్నప్పటికిని ప్రీతియే ప్రధానమైనది. అట్లు కానిచో ప్రభు సమ్మితములైన వేదములకంటెను, మిత్రసమ్మితములైన పురాణములకంటెను, కావ్యరూపమైన యీ వ్యుత్పత్తిహేతువు యొక్క జాయా సమ్మితత్వ లక్షణమైన విశేషమేమి? అందుచే ప్రధానముగా ఆనందమే ప్రయోజనమని చెప్పబడినది. చతుర్వర్గ వ్యుత్పత్తికిఁ గూడ నానందమే "పార్యంతికఫలమైన ఫల"మని చెప్పియున్నాడు. కావ్యశ్రవణ మనంతరమే కలుగు రసాస్వాద సముద్భూతము విగళితవేద్యాంతరమునైన యానందమే సకల ప్రయోజన మౌళిభూతమైనదని యాతని యభిప్రాయము. దశరూపకకర్త "ఆనంద నిష్యందులై న రూపకములకు నితిహాసాదులకు వలె వ్యుత్పత్తియే ఫలమని చెప్పు

---

1. ధర్మార్థకామ మోక్షేషు వై చక్షణ్యం కళాసు చ
   కరోతి కీర్తిం ప్రీతిం చ సాధు కావ్య నిషేవణమ్.

2. కావ్యం యశసేఽర్థ కృతే వ్యవహారవిదే శివేతర క్షతయే
   సద్యః పరనిర్వృతయే కాంతా సమ్మితత యోపదేశయుజే.

రస పరాఙ్ముఖుని కొక్క నమస్కార" మని తెల్పి యానందమునకే ప్రాధాన్యము ప్రకటించినాఁడు. తిక్కన సోమయాజి "కావున భారతామృతము కర్ణపుటంబుల నారఁగ్రోలి యాంధ్రావళి మోదముం బొరయునట్లుగ" నని చెప్పుటలోఁ గూడ నానంద ప్రాధాన్యమే స్ఫురించుచున్నది.

ఆనంద వర్ధనుఁడు భరతాది మునులు పామర జన హితార్థమే సదాచారోపదేశ నిబంధనమైన నాటకాది గోష్ఠి నవతరింపఁజేసినారని చెప్పియున్నాఁడు. "నన్నయభట్టు తెనుంగునన్ మహాభారత సంహితా రచన బంధురుఁడయ్యె జగద్ధితంబుగన్", "ఈ బమ్మెర పోతరాజొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్" అను వాక్యములందలి జగద్ధితమను మాట యుపదేశ ప్రాధాన్యమునే యుగ్గడించుచున్నది. ఆంధ్రశబ్ద చింతామణి కర్త "విశ్వశ్రేయః కావ్య"మ్మని చెప్పుటలోఁ గూడ నుపదేశ ప్రాధాన్యము వ్యంజితమగుచున్నది. "కావ్యాలాపాంశ్చ వర్జయేత్" అను స్మృతివాక్య మొకటున్నది. ఇందలి కావ్యము క్షుద్రకావ్య పరము. నీతి ధర్మముల నుపదేశింపని కావ్యములు రసవంతములయ్యును బరిత్యాజ్యములే యని పైస్మృతి వాక్యము నకర్థము. విద్యానాథుఁడు కావ్య ముత్తమ పురుష చరిత నిబంధన పూర్వకమై యుండవలెనని చెప్పుటయు నుపదేశ పక్షపాతముచేతనే. ఏలయన, నుత్తమపురుషుల చరిత్రలు మాత్రమే యుపదేశకరణ దక్షములై యుండఁజాలును. పాశ్చాత్యులలో లావెల్ అను నతఁడు "ఏదో యొక విధమునఁ దత్త్వబోధ చేయని వాక్యమును నేను మన్నింపఁజాల"నని చెప్పియున్నాడు. ఈ విధముగా గావ్యమున నుపదేశమునకుఁగూడ నున్నత స్థానమిచ్చువారు కొందఱున్నారు.

నిజముగాఁ గావ్యము వలన నొక్క యుపదేశమే వాంఛితవ్య మగుచో నది వేదశాస్త్రముల వలననే లభించును గదా! అందుకు వేరే కావ్యమేల? యను ప్రశ్న యుదయించును. దానికి సాహిత్య దర్పణకారుఁడిట్లు సమాధానము చెప్పుచున్నాడు. "వేద శాస్త్రముల వలనఁ జతుర్వర్గ ఫలప్రాప్తి నీరసముగా నతిక్లేశ పూర్వముగాఁ బరిణత బుద్ధులకు మాత్రమే కలుగుచున్నది. పరమానంద సందోహజనకమైన కావ్యము వలన నైనచో నది సుకుమార బుద్ధులకు సైతము సుఖముగాఁ గలుగుచున్న" దని యా సమాధానము. దీనిని బట్టి వేద శాస్త్రముల వలనఁ గేవల ముపదేశ వ్యుత్పత్తులే లభించు చుండఁగా గావ్యము వలన నానందోపదేశములు రెండును లభించుచున్నవని తెలియుచున్నది. ఆనంద ప్రాధాన్యవాదులు కూడా "తదేవకావ్య ముత్కృష్టముపదేశైర్వినా కృత" మ్మని విష్ణుధర్మోత్తర పురాణమువలెఁ

గావ్యమున నుపదేశ ముండరాదని పూర్తిగా నిషేధించుటలేదు. ఆనందము ప్రధానమనియు నుపదేశ మానుషంగికమనియు వారి యభిప్రాయము. కావ్యమానందముతో పాటుపదేశమును గూడ నొసఁగిన వారికెట్టి యాక్షేపమును లేదు. కేవల కావ్యముకంటె శాస్త్రకావ్య ముత్తమమని చెప్పఁబడుట యిందు చేతనే. ఏలయన, నది శాస్త్రమువలె, బురుషార్థ నిరూపణము చేయుచు, గావ్యమువలె రసానంద ప్రధాన దక్షము కూడనై యుండును.

కాల స్వభావమును బట్టి యొక్కొక్కప్పుడు కావ్య ప్రయోజనము నందలి ప్రాధాన్యము తారు మాఱుగుచుండును. జాతి స్వధర్మ భ్రష్టమై పతనోన్ముఖ మగుచున్నప్పుడు కవులు ధర్మమును రమణీయముగా బోధించి జాత్యుద్ధరణ మొనర్ప వలసి యుండును. అట్టియెడఁ గావ్యమునం దుపదేశము ప్రధాన మగుటయు నానంద మానుషంగిక మగుటయు సంభవించును. నన్నయ్యగారి కాలమున వేదమత పునరుద్ధరణమునకుఁ బ్రయత్నములు జరుగుచుండెను. అందుచేతనే యతఁడు తన రచన జగద్ధిత ప్రయోజనమని చెప్పియుండెను. ప్రబంధముల కాలమున జాతి వీర్యవంతమై భోగభాగ్యములతోఁ దులతూగు చుండెను. అందుచే నప్పటి కావ్యములలో నానంద ప్రాధాన్యమే గోచరించును. వానియందుపదేశ మప్రధానము. దక్షిణాంధ్ర యుగమున నప్పటి పరిస్థితులను బట్టి యుపదేశము పూర్తిగా విసర్జింపబడుటయే సంభవించెను. దానికిఁగాల ప్రభావమే కారణము. అట్లే యిటీవలఁ గళ కళ కొఱకే యను సిద్ధాంతము బయలుదేరెను. ఇది కుతర్క మనియుఁ గవిత్వ మభ్యుదయ హేతువు కావలె నన్న విశ్వశ్రేయ స్సాధనమై యుండవలె ననియు కొందరు వాదించిరి.

దేశ కాలములతో సంబంధము లేకుండ గావ్య ప్రయోజనము నిర్ణయింపవలెనన్న నానందము ప్రధాన ప్రయోజన మనియు నుపదేశ మవాంతర ప్రయోజనమనియుఁ జెప్పవలెను. కావ్యము వేదశాస్త్రములకంటె విలక్షణమై యుండుట కందానంద ప్రధాన దక్షత్వ మపరిహార్యము. కావ్యముపదేశము నొసంగినచోఁ గావ్యత్వమున కెట్టి భంగము గలుగదు. కాని యందానంద ప్రధానమే లోపించినచో నది కావ్యమే కాక పోవును. అది యానందముతో పాటుపదేశమును గూడ నొసంగఁజాలిన బంగారమునకుఁ బరిమళ మబ్బినట్లుండును.

సత్కావ్యమును బఠించునప్పుడు సహృదయుఁడు బ్రహ్మానంద సబ్రహ్మచారియైన యానందము ననుభవించును. కావ్యపఠనము ముగియగనే యతఁడు మరల లోక ప్రవృత్తికిఁ గడంగి సుఖదు:ఖములకు లోనగు చుండును. అందుచేఁ గావ్య పఠనావసరమునఁ

తాత్కాలికముగా నైన నానందసౌఖ్యము చవిచూచిన సహృదయుఁడు శాశ్వతమైన యట్టి యానందమును బొందుటకు యత్నింపవలెను. సత్కావ్యములు సహృదయుల నట్టి ప్రయత్నము చేయుటకై పురికొల్పును. నిజమున కదియే కావ్యము యొక్క పరమ ప్రయోజనము.

5. కావ్యము - శాస్త్రము :

ఆంగ్ల మహాకవియైన కోలెరిడ్జి కవిత్వమునకు నిర్వచన మొసంగుచు "శాస్త్రమునకుఁ గేవల విరుద్ధమైనదే కావ్య"మని చెప్పియున్నాడు. "శాస్త్రేషు హీనాఃకవియో భవన్తి" "కావ్యేన హన్యతే శాస్త్ర" మ్మను సంస్కృత మందలి యభియుక్తోక్తులుకూడ శాస్త్రకావ్యములకుఁగల వైరుధ్యమును బ్రకటించు చున్నవి. ఇట్లువి పరస్పర విరుద్ధముగాఁ గన్పట్టుటకు వాని స్వరూప స్వభావములే కారణములు. శాస్త్రకారుఁడు సృష్టిని బరిశీలించి యందలి మూలసూత్రము లను వస్తు స్వరూపములను యథాతథముగాఁ బ్రకటించును. అనఁగా వస్తు తత్త్వమును బరిశీలించి సత్యమును బ్రకటించుటయే యాతని పని. అతడు సుందరమైన వస్తువులను సుందరముగను, వికృతమైన వస్తువులను వికృతముగను మాత్రమే ప్రదర్శించును. కవిఁ గావ్యమున సత్యమునే చెప్పవలయునను నియమము లేదు. వస్తువు నందలి తన రుచిని దెల్పుటయే యతని పని గాని, రూప స్వభావములను యథాతథముగా జెప్పవలసిన యక్కఱ అతనికి లేదు. సృష్టియందలి వికృత వస్తువులను గూడ నతఁడతి సుందరములుగాఁ దీర్చిదిద్దును. అందుచేతనే దృష్టపూర్వములైన పరిచిత వస్తువులు కూడఁ గావ్యమున రసపరిగ్రహముచే వసంత సంపర్కముచే వృక్షములవలె నూతనములుగాఁ గనిపించునని ఆనందవర్ధనుఁడు చెప్పియున్నాడు. శాస్త్రకారుఁడు వ్యుత్పత్త్యను గుణముగాఁ బరిశీలించి ప్రతిపాదన యర్థమునే కవి రుచ్యనుగుణముగా గ్రహించి వర్ణించును. సత్యమును దర్శించు శాస్త్రకారుని యందలి ప్రజ్ఞయే కవియందు సౌందర్యదర్శినియు నవనవోన్మేషశాలియు నగు ప్రతిభ యగుచున్నది.

శాస్త్రకారునికి గుణాలంకారములతోఁ బనిలేదు. అతఁడు తాను గ్రహించిన సత్యమును నగ్నముగాఁ బ్రకటించును. అతనికి వస్తువే ప్రధానము. కవికి వస్తువు కాక యందలి రుచి కనుగుణమైన చిత్తవృత్తియే ప్రధానమగుటచే నతఁడు దాని నలంకార సుందరముగాఁ బ్రకటించును. ఉదాహరణకు శాస్త్ర కర్త చంద్రుఁడెట్టని బింబముతోఁ దూర్పునఁ గనిపించుచున్నాడని చెప్పును. ఆ సత్యమునే కవి రక్తుఁడైన చంద్రు డైంద్రీ

ముఖమును ముద్దు గొనుచున్నాఁడని వర్ణించును. ఇరువురును జెప్పు విషయ మొక్కటే. కాని కవి సమాసోక్తి చాతుర్యముచేఁ జంద్రుని నాయకత్వమును, తూర్పు దిక్కునందు నాయికాత్వమును ఎఱ్ఱఁదనమందను రక్తత్వమును ఆరోపించి రమణీయముగాఁ చెప్పుచున్నాడు. ఈ రామణీయక మంతయుఁ గవి యభూతకల్పనముగా గోచరించును. అందుచేతనే కావ్య మసత్యములకుఁ గన్నతల్లి యని కొందఱభిప్రాయపడి యున్నారు.

క్షేమేంద్రుఁడు శాస్త్ర సత్యములను గూడ రమణీయముగాఁ జెప్పవలెనను నాసక్తి కొందఱు శాస్త్రకర్తలకు లేకపోలేదనియు వారు తిక్తమైన యౌషధము నాస్వాద్యముగాఁ జేయుటకై పంచదారతోఁ గలపునట్లు శాస్త్ర విషయములను గవిత్వముతోఁ గలిపి చెప్పుదు రనియుఁ దెల్పియున్నాఁడు. ఇట్టి వానినే శాస్త్ర కావ్యములో కావ్య శాస్త్రములో యందురు. "కావ్యేనహన్యతే శాస్త్ర"మ్మను మాట యిట్టివాని యెడనే వర్తించును. ఏలయనఁ బఠిత, లిందు శాస్త్ర విషయముచేఁ గాక కావ్య సౌందర్యముచేతనే యెక్కువగా నాకర్షింపఁబడుదురు.

శాస్త్రకారుని దృష్టిలో వస్తువుల స్వరూప స్వభావములు నియతములు. అతనికిఁ జంద్రుఁడెప్పుడును శీత దీధితియైన యొక గ్రహముగనే కనిపించును. కవికతఁడు వివిధ రూపములతో గోచరించును. ఒకప్పుడతఁడు సుధాకరుఁడు; ఇంకొకప్పుడు దోషాకరుఁడు; ఒకప్పుడు తారాపతి; ఒకప్పుడు నిశాపతి; ఒకప్పుడు ప్రియాముఖము; మఱొకప్పుడు గగనసరోవర మందలి సిత పుండరీకము!

శాస్త్రము జ్ఞాన ప్రధానమైన బుద్ధిని రంజింపఁజేయును. శాస్త్రకారుని నూతన పరిశోధనలను, అపూర్వ నిర్మాణములను గాంచి మానవుఁడాశ్చర్యచకితుడై "ఓహో" యని మెచ్చుకొనును. కావ్యము రస ప్రధానమై పఠితల హృదయముల రంజింపఁజేయును. కవుల యపూర్వ సౌందర్య శోభితమైన కావ్య సృష్టిని బరిశీలించి మానవులానంద పరవశులై "ఆహా" యని విగళిత వేద్యాంతర స్థితి పొందుదురు. శాస్త్రమునకు భౌతిక ప్రపంచమే పరమావధి, కావ్య వ్యాప్తి నిరవధికము. రూపమునఁ గూడ శాస్త్రకావ్యములకు భేదమున్నది. వస్తుప్రధానమైన శాస్త్రమునకుఁ గద్యమే యుచితమైన వ్యక్తీకరణ సాధనము. రసప్రధానమైన కావ్యమునకుఁ బద్యమో, పద్య ప్రాయమైన గద్యమో వ్యక్తీకరణ సాధనమై యుండుట లెస్స.

కావ్యమునకు యశస్సు, అర్థలాభము, లోకవ్యవహార కర్తృత్వము అమంగళ పరిహారము, ఆనంద పారవశ్యము ఫలితములుగాఁ జెప్పబడినవి. శాస్త్రము వలన గూడ వీనిలోఁ గొన్ని

సమకూడుచున్నవి. శాస్త్రములు బాగుగాఁ బఠించి నూతనములైన నిర్వచనములుగావించినచోఁ గీర్తియు గలుగును. దానివలన నైహికమైన యుపయోగమును గొంతవఱకు సంభవించును. కావ్యమువలన లోక వ్యవహారములన్నియు నవగతము లగుటయే కాక, కొన్ని క్లిష్ట పరిస్థితులలో నెట్లు మెలఁగవలయునో యది కూడ దెలియును. శాస్త్రము కూడ నీ ప్రయోజనమును గావ్యమంత కాకపోయినను గొంతవఱకు సాధింపఁజాలును. ఇంక మిగిలిన రెండు ఫలితములందును, శాస్త్రము కావ్యముతో సరితూఁగఁ జాలదు. పైఁగా నదిశివేతరక్షతి విషయమునఁ గావ్యమునకుఁ గేవల విరోధి. ఋషితుల్యుడైన కవి విశాలమైన హృదయములో సర్వలోకమంగళము నాకాక్షించుచుఁ గావ్యమును వ్రాయును. తన వలనఁగాని తన కావ్యము వలనఁగాని లోకమున కమంగళము ప్రాప్తించుచో నతఁడట్టి కావ్యమును రచించుటయే మానును. పాశ్చాత్యులు విషాదాంత కావ్యములు వ్రాయుటకు వెనుదీయలేదు. మనవారట్టి కావ్యముల వలనఁ బఠితల హృదయము శివేతరాశంకియై నిరుత్సాహాంకిత మగు నేమోయని యట్టివానిఁ బరిహరించిరి. శాస్త్రము కూడఁ దన్నిష్ణాతులకు సేవించిన కొలది సంతోషము నొసంగును. కాని యా సంతోషమునకును బ్రహ్మానంద సహోదరమైన కావ్యానందమునకును జాల వ్యత్యాసమున్నది. ఒకటి యాశ్చర్యమూలమైన సంతోషము; రెండవ దాత్మ వికాస కారణమైన యానందము. శాస్త్రము కేవల మొక్క యైహిక సౌఖ్యమునే చేకూర్చును; కావ్య మైహిక పార లౌకిక సౌఖ్యములకు రెండిఁటికి దారి చూపును. "స్వస్తి ప్రజాభ్యః" లోకాస్సమస్తాస్సుఖినో భవన్తు" అనునవియే యెల్ల యెడల మనవారియాదర్శములు. ఇంకను శాస్త్రము లోక మంగళమునకై స్వాభివృద్ధిని బరిత్యజించుట కిచ్చగింపదు. ప్రపంచ మంతయుఁ బ్రళయాగతిచే భిన్న భిన్నమై పోయినను స్వోజ్జృంభణము ముందది దానిని లెక్కచేయదు. యుద్ధాది సమయములలో శాస్త్ర సాహాయ్యముచేఁజేయఁబడు ప్రాణ కంటకములగు పరికరములే దీనికిఁ దార్కాణము.

దయామయుఁడైన పరమేశ్వరుఁడు సర్వజీవ సౌఖ్యము నుద్దేశించి ప్రకృతిని సృజించెను. కవి యాకరుణామూర్తి యౌదార్యమును బ్రశంసించుచుఁదన దివ్యమైన దృష్టితో నందలి రహస్యముల నెఱింగి తన కావ్యమున వానిని ద్విగుణీకృత సౌందర్యముతోఁ జూపట్ట జేయును. పఠిత లీతఁడు కావించిన యీ శాంత సుందరమైన ప్రకృతిని జూచి యచ్చెరు వంది తన్నిర్మాత యగు పురుషుని వంకఁదమ దృష్టినిఁ ద్రిప్పుటకుఁ బ్రయత్నింతురు. అది

వారి మనశ్శాంతికిని ధర్మ జీవితమునకును హేతు వగును. పైఁగాఁగవి ప్రకృతి వలనఁదన కావ్యమునకుఁ గలిగిన శోభను దలంచి యానంద మగ్నుఁడై దానిని దేవతలవలే నుపాసించును. ఉపాసించిన కొలఁది ప్రకృతిదేవి యాతనికి సాక్షాత్కరించి యభిమతార్థము లొనగూర్చు చుండును. శాస్త్రమునకును బ్రకృతికిని గల సంబంధ మిట్టిదికాదు. శాస్త్రజ్ఞుడు ప్రకృతి సౌందర్యమును జూచి యానందింపఁడు. దానివలనఁ దనకుఁ గాఁగల యుపయోగమును లాభమును దలంచి యానందించును. తన కది యొసంగుచున్న మేలునకుఁ బ్రతిగా నాతఁ డు కృతజ్ఞత చూపక దానిని వశపరచుకొని యధిపతియై తన మనసు వచ్చినట్లు దానఁ బరివర్తనము కలిగించును. అతఁడు ప్రకృతిని వికృతను గావించుటకు సైతము వెనుదీయఁ డు. ప్రకృతియు నాతని దౌర్జన్యము నూహించి కోప ఘూర్ణితయై వికార ముఖముతోఁ బరికించును. మొత్తము మీఁదఁగవికిని బ్రకృతికిని గల సంబంధము భక్త దేవతా సంబంధము. శాస్త్రికిని బ్రకృతికిని స్వామిక సేవక సంబంధము.

కవిత్వము సర్వమానవ సంతోషదాయి. నిరక్షరాస్యులు కూడఁగవితామతల్లి మాధుర్య ధురీణమగు మాట పొందిక నాలించి మనస్సులో నానందింతురు. శాస్త్రము తత్పారిశ్రామికులకు మాత్రమే లొంగును. పెద్ద పెద్ద పండితులు కూడదాని నవగాహనము చేసికొనఁజాలరు. కాఁగా దాని ప్రయోజనము పరిమితమని చెప్పవచ్చును, కవిత దూరమున నున్న వారిని సైతము నగుమోముతో నాహ్వానించి యాకర్షించును. శాస్త్రము చెంతఁజేరినవారిని సైతము బొమముడిపాటుతోఁ దనలోఁ ప్రవేశింపనీక విసుగు పుట్టించి వెడలఁగొట్టును. కవితా శాస్త్రములు రెండింటను బ్రయోగింపఁబడు శబ్దములు సమానములే. అవలంబన తారతమ్యమును బట్టి యవి సరళములు కఠినములు నగుచుండును. తప్తలోహపతితమగు కంకణము నీరూపమును శుక్తి పతితమగునది ముక్తామణియు నగుట కలదు కదా!

6. కావ్యము–చరిత్ర :

ఏదైన వస్తువును దర్శించి దానిని గూర్చి మననము చేసినపిమ్మట ననుభవమును జోడించి వర్ణించువాఁడు కవి. అట్టి కవి కర్మ, కావ్యము "ఇతిహాఆస" "ఇట్లాయెను" అని చెప్పునది యితిహాసము లేక చరిత్ర దీనిని బట్టి జరిగిన దానిని జరిగినట్లు కాలక్రమము ననుసరించి చెప్పునది చరిత్రయనియుఁగార్యకారణ భావానుగుణముగా దాని నమర్చి సుందరముగాఁజెప్పునది కావ్యమనియుఁ దేలుచున్నది. చరిత్రకుఁ బూర్వాపర సంబంధమే

కాని కార్యకారణ సంబంధ మక్కఱలేదు. అందుచేతనే చారిత్రక వస్తువును గ్రహించి కావ్యమును వ్రాయునప్పుడు దానిని గార్య కారణ సంబంధానుగుణముగాఁ దీర్చి దిద్దవలసిన యావశ్యకము కల్గును. చరిత్రకును గర్తయనుభవములకును ఎట్టి సంబంధము నుండదు. కావ్యమునఁ గవి చిత్తవృత్త్యనుభవముల కపారమైన ప్రాధాన్య ముండును. కావ్యమనగాఁ కవి వ్యాపారమే కదా!

శాస్త్రమువలెనే చరిత్రయు విషయ ప్రధానము. పఠితలు దానిని విషయ పరిజ్ఞానము కొఱకే పఠింతురు. కావ్యమట్లుగాక రస ప్రధానము. సహృదయులానందార్థులై దానిని బఠింతురు. అందుచేతనే భట్టనాయకుఁడు "కావ్యమెల్లరను రంజింపఁ జేయును (ఆనందింపఁ జేయును) ఇతిహాసము వలె బోధింపదు వేదమువలే శాసింపదు" అని చెప్పియున్నాడు. చరిత్ర బోధించు ననగాఁ బూర్వమిట్టి పరిస్థితులలో నిట్లు చేసిన నిట్లు జరిగినది. ఇప్పుడును అట్టి పరిస్థితులలో నట్లు చేసిన నదే పరిణామము కల్గునని వ్యక్తము చేయును.

చరిత్ర అర్థ (విషయ) ప్రధానము. కావ్యముక్తి ప్రధానము. చరిత్ర కారుఁడు జరిగిన విషయమును నిరలంకారముగా, నిర్గుణముగా, వాచ్యముగాఁ జెప్పివేయవచ్చును. కవి యట్లుగాక వక్తవ్యాంశమును గుణాలంకార సహితము గావించి వ్యంగ్యసుందరముగాఁ జెప్పవలయును. చరిత్ర యందు వాడఁదగిన యలంకార మొక్క స్వభావోక్తియే, వక్రోక్త్యతిశయోక్త్యు త్ప్రేక్షల నందుఁ జొప్పించినచో నది చరిత్రయే కాకపోవును. కావ్యము నందట్లుకాక యలంకారములు సౌందర్యోత్కర్షావహములై యింపు నింపును. చరిత్ర రచనకు వచనమే యెక్కువ యనుకూలము; కావ్యమును బద్యముగను, గద్యముగను రెండింట వ్రాయవచ్చును. కాని కావ్య గద్యకును జరిత్ర గద్యకును హస్తిమశకాంతర ముండును. ఒకటి యలంకార పరిపూర్ణము. రెండవది నిరలంకారము.

ఇతిహాసమున వస్తువివరణమే ప్రధానము. తత్కర్తవస్త్వైక్యమునకుఁ గాని యంగాంగిభావ సామరస్యమునకుఁగాని సమ్యక్సంధి సంఘటనమునకుఁగాని ప్రయత్నింప నవసరములేదు. నిజము పరికింపఁ జరిత్ర వివిధకాలములందలి వివిధ వ్యక్తుల వృత్తాంతము లను జెప్పవలసియుండును గావున నందు వస్త్వైక్యమును సమకూర్చుట కవకాశమే లేదు. కవి వస్తువును లెస్సగా సంఘటించి దానినైక్య భాసురముగను సంధిబంధ సుందరముగను వెలయింపవలయును.

చరిత్ర దేశకాల నియంత్రితమైనది. అనఁగా నది యేదేశమున నేకాలమున జరిగిన దాని నాదేశముననే జరిగినట్లు చెప్పవలయును. అందుచేనది యా దేశమునకు నా కాలమునకు మాత్రమే సంబంధించి యుండును. కావ్యము దేశకాల నియమితమైనది కాదు. అది సర్వజనీనము. సర్వకాలీనము.

చరిత్ర వ్యక్తులను దచ్చర్యలను వివరించును. కావ్య మాచర్యలకుఁ బ్రేరకములైన వ్యక్తుల చిత్తవృత్తులను వర్ణించును. కావ్యముకూడా వ్యక్తి చరిత్రను వర్ణింపవచ్చునుగాని యావ్యక్తి యందు సాధారణ వ్యక్తియేకాని ప్రత్యేక వ్యక్తికాదు. అది యొక కల్పిత నామముతో నావ్యక్తి నుపయోగించుకొనును. అచ్చట నా పేరు తీసి మఱియొక పేరు ప్రవేశపెట్టినను నష్టముండదు. ఏలయన నచ్చట నావ్యక్తివ్యాపారమునకే కాని వ్యక్తికి బ్రాధాన్యములేదు. కాళిదాసు మేఘసందేశమున యక్ష యక్షిణి నామములను జెప్పి యుండలేదు. అందుచే నా కావ్యమున కెట్టి కొఱఁతయుఁగలుగలేదు. ఏలయన నందు వర్ణితములైన వ్యాపారములు సర్వ స్త్రీ పురుష సామాన్యములు. అందుచేతనే కావ్యము సర్వజనీనమని చెప్పఁబడుచున్నది. చరిత్ర యే వ్యక్తి పేరు పేర్కొన్న నావ్యక్తికే సంబంధించి యుండును. శివాజీ చరిత్రలో శివాజీ పేరు తీసివేసి రాణా ప్రతాపుని పేరు పెట్టుటకు వీలులేదు. చరిత్ర ప్రత్యేక వ్యక్తి గతమైనట్టిది.

కావ్యమున కవి వ్యక్తిత్వము శిల్పనైపుణ్యము గోచరించును. చరిత్ర యందుఁగర్త వ్యక్తిత్వమునకు జోటులేదు. అతఁడందు శిల్ప కౌశలము చూప వలసిన యవసరములేదు. కావ్యము సరసము; చరిత్రశుష్కము. కార్లైలువలె, గిబ్బనువలె నెవ్వరైనఁ జరిత్రను గూడ సరసముగా రచింపఁ జాలుచోనది పేరునకు జరిత్రయయ్యుఁ, గావ్యమై, కావ్య గౌరవముునే పొందఁజాలును.

7. కావ్యము – తత్త్వశాస్త్రము :

జీవేశ్వరసంబంధమును దెల్పు శాస్త్రము తత్త్వశాస్త్రము–రసోవైసః అను సూక్తి ననుసరించి బ్రహ్మము రసమయమేయైనను దానిని దెల్పుతత్త్వ శాస్త్రము మాత్రము శుష్కమైనది. అందుఁ దత్త్వము వాచ్యముగాఁ జెప్పఁబడును. ఉపదేశ ప్రయోజనమైన కావ్యమునఁ గూడఁ దత్త్వముండవచ్చును. కాళిదాసు కుమార సంభవ ద్వితీయ సర్గమందువలెఁ గొందఱు కవులు కావ్యములోఁ గూడఁదత్త్వమును దెల్పియుండిరి. కాని దాని నందుఁ జెప్పు విధమున

భేదమున్నది. అది యందు వ్యంగ్యముగను అలంకారముగను జెప్పబడును. ఆ చెప్పు వైఖరి యందలి "శుష్కత్వమును" దగ్గించును. మఱియుఁ దత్త్వమందేక దేశగతమై యుండునే కాని సర్వత్రయుండదు. ఉన్నను గర్భితమై యుండునే కాని వాచ్యమై యుండదు. నన్నయ భారతము నధ్యాత్మ విదులు వేదాంత మందురని వచించెను. అట్లుండుట శాస్త్రకావ్యమైన భారత మొక్కదానికే చెల్లినది. అచ్చటనైనను తత్త్వ ప్రాచుర్యము గల చోట్లఁగావ్యత్వము కుంఠితమైన దనియే చెప్పవలయును. రసమయమైన కావ్యమున వాచ్యమైన వేదాంతమున కధికమైన స్థానము లేదనుట సత్యమే కాని యంతమాత్రమునఁ గవిత్వమునకును దత్త్వమునకును బరమ విరోధమని చెప్పరాదు.

భారత దేశమున రామాయణ భారతములను రచించిన కవులిరువురును మహర్షులే. అందుచేతనే మన దేశమున "నానృషిః కురుతే కావ్య"మ్మను నానుడి యేర్పడినది. వారు క్రాంత దర్శులై తమ రచనలందుఁ గవితా తత్త్వములను రెండింటిని జోడింపఁజాలిరి. ప్రాచీనకాలమున నేదో విధముగాఁ దత్త్వము బోధింపని కావ్యము కావ్యమేకాదను నభిప్రాయ ముండెడిది. పాశ్చాత్యులలోఁ గూడఁగొందఱు కావ్యమునఁ దత్త్వముకూడ నుండవలెనని యభిప్రాయ పడినవారున్నారు. "కావ్యమునఁ దత్త్వము ముందు–కవిత్వము తరువాత" (బ్రౌనింగు). "మహాతాత్త్వికుఁడు కానివాఁడెవ్వఁడును మహాకవి యనిపించి కొనజాలడు" (కోలెరెడ్జి), "కవి ప్రజా సామాన్యమునకు దత్త్వదర్శి" (ప్లూటార్కు) అను వాక్యము లిందుకు నిదర్శనము.

కొందఱు తత్త్వస్పర్శ కావ్యశోభను దగ్గించునని వ్యతిరేకాభిప్రాయమును వెల్లడించిన వారును గలరు. బోయలూ అను నతఁడు "డెకార్టీ వేదాంతము కవిత్వ కంఠమును త్తరించిన" దని చెప్పినాడు. లియోనార్డీ బ్రూనీ "కవిత్వ ప్రాశస్త్యమున గల స్రష్ట సిద్ధి సంపదను బట్టియే కాని యతని నీతి బోధన సామర్థ్యమునుబట్టి నిర్ణయింప" రాదని యభిప్రాయ పడి యుండెను. రూసో స్విన్ బర్న్ మున్నగువారు కూడా నిట్టి యాశయమునే గలిగి యుండిరి.

పై రెండు వాదములు నతివాదములే. హడ్సను కావ్య తత్త్వముల కపరి హార్యమైన విరోధము లేదనియు రామణీయకమునకు భంగము రాని విధమున గావ్యమును దత్త్వోపదేశ సాధనముగాఁ జేసికొన్నను దోషము లేదనియు మధ్యే మార్గమును సూచించి యున్నాడు. కావ్యమునకు రసానందమే ప్రధాన ప్రయోజనము; నీతి తత్త్వోపదేశము లందానుషంగికములు.

రసభంగము కాకుండ నేర్పుతో వానినందు వెలయించినచో టాగూరు గీతాంజలి యందువలే భాగవతము నందువలెనవి కావ్యమున కెనలేని యౌదాత్త్య గాంభీర్యములను సమకూర్చును.

8. కావ్యవస్తువు :

భరతుని మతమున నితివృత్తమే కావ్యశరీరము "ఇతివృత్తంతు కావ్యస్య శరీరం పరికీర్తిత"మని యతడు నాట్య శాస్త్రమునఁ జెప్పియున్నాడు. ఇతివృత్త మనఁగా గావ్యమునందలి కథ లేక వస్తువు. కావ్యకర్త యాంతరములైన రసధ్వని భావాదుల విషయమున వలెనే బాహ్యములైన శబ్దచ్ఛందో వస్తువుల విషయమునఁ గూడ నత్యంత శ్రద్ధ వహింపవలయును. అప్పుడు కాని కావ్యము బహిరంత స్సౌందర్య సంశోభితమై సహృదయ సంపూర్ణానంద సంధాయకము కాఁజాలదు.

భరతుని దృష్టిలోఁ గావ్య మనగాఁరూపకమే. అతఁడా రూపకములను మనస్సులో నుంచుకొనియే నాట్య శాస్త్రమున రసము, ఇతివృత్తము మొదలగు విషయములను గూర్చి చెప్పి యుండెను. తరువాత నానంద వర్ధనుఁడు రూపకము లందేకాక శ్రవ్యకావ్యములందు గూడ రసమే ప్రధానమనియుఁ దత్సమ్యక్పరిపోషణ వలననే సర్వకావ్యములు సౌందర్య శోభితము లగుననియుఁదెల్పి రసాదులను శ్రవ్య కావ్యముల విషయమునఁ గూడ సమన్వయించెను. అయినను లాక్షణికులు పలువురు రూపక సంబద్ధముగనే రసమును గూర్చి చర్చించుటయు ప్రసిద్ధములైన రూపకముల నుండియే యుదాహరణము లొసంగుటయు గోచరించును. దానిని బట్టి రస వస్తుపోషణము విషయమున దృశ్య శ్రవ్య కావ్యములకు సామ్యము లేదని భావించరాదు. వాని నా రెండింటను గొంచె మించు మించుగా సమానముగానే పోషింపవలయును.

"పంచభి స్సంధిభి స్తస్య విభాగాః పరికీర్తితః" అని భరతుఁడు దృశ్య కావ్యము లందలి యితివృత్తము పంచసంధులుగా విభజింపఁబడవలెనని చెప్పెను. భామహుఁడు "పంచభిస్సంధిభిర్యుక్త"మ్మని కావ్యవస్తువు పంచసంధి సంయుతమై యుండవలెనని యభిప్రాయపడెను. ఏ కావ్యమందలి వస్తువైనను సంధిపంచక శోభితమై యున్నప్పుడే మనోరంజకముగా నుండును. అట్లు కానిచో నది యైక్యమును గోల్పడి యందదుకులుగా గోచరించును.

రస విషయమున వలెనే వస్తువు విషయమునఁగూడ నానంద వర్ధనుఁడు దృశ్యశ్రవ్య కావ్యములు నిర్విశేషము లనియే భావించెను. అతఁడు కావ్యవస్తువు భావానుభావ సంచారి భావౌచిత్య శోభితమై యుండవలయు ననియు నందుఁ గథావశాగతములైన యననుగుణసన్ని వేశములను దొలఁగించపవలెననియుఁ రసాభివ్యక్తికనుకూలముగా నుండునట్లు సంధి తదంగములను గూర్ప వలెననియు, నాయా ఘట్టములందు రసోద్దీపన ప్రసంగములను నేర్పుతోఁ గావింపవలెననియు నారబ్ధమై యాగిపోయిన రసమును మరల ననుసంధింప వలయుననియు వ్యక్తము చేసియున్నాఁడు. మఱియు శాస్త్రలక్షణముల నేదో విధముగా సరిపుచ్చుటకై కావ్యమున రసోపస్కారములు కాని సంధ్యాదులను గూర్పరాదనియు, శక్తి యున్నది కదాయని యలంకారములననవసరముగా నుపయోగింపక యనురూపముగా మాత్రమే యోజింప వలెననియు నాతఁడు స్పష్టముగాఁ జెప్పియుండెను. దృశ్యకావ్య మందైనను శ్రవ్యకావ్యమందైనను రసోపస్కారము కాని యంశములు పరిత్యాజ్యములే యని యాతని నిశ్చితాభిప్రాయము. అనగాఁ గావ్యవస్తు వెప్పుడును రసాను కూలముగనే సంయోజితము కావలయును.

కాళిదాసాది మహాకవులు రసప్రాధాన్యమును, వస్తువునకుఁగల రసవిఘ్నుతను గ్రహించినవారు కావుననే తమ కావ్యములందు సర్వకథాంగములను రసోపస్కారములుగనే వెలయించి వానిని సహృదయ రంజకములు కావింపఁజాలినారు. మహాకవు లెప్పుడును వస్తువును రసాను కూలముగానే విన్యసింతురుకాని శాస్త్రస్థితి సంపాదన పరాయణతచే రసభం జకములైన యంశముల నందుఁ జొప్పింపరు. ఆంధ్ర వాఙ్మయమున ప్రబంధకవులు కొందఱు లక్షణానుసరణ ప్రీతిచేఁ గతాను గతికముగాఁ గొన్ని యనవసర వర్ణనలు కావించియుండిరి. ఆ వర్ణనలు ప్రత్యేకముగాఁ జూచినచో రమణీయములుగానే యుండినను ఆయాకథా సంఘటనములం దనావశ్యకములుగా గోచరించును.

శ్రవ్య కావ్యము కేవలము వినఁదగినది. దృశ్య కావ్యము రంగమునఁ బ్రదర్శింపఁ దగినది. వినునప్పటికికంటెఁ జూచునప్పుడు కొన్ని దృశ్యము లెక్కువ యేవగింపు కలిగించును. అందుచేతనే లాక్షణికు లనుచితములు, నీరసములు, ఉద్వేగకరములునైన యంశములను రూపకములందుఁ బ్రదర్శింపరాదని నియమము కావించిరి. శ్రవ్య కావ్యము లందుఁగూడ వానిని బరిహరించుట మంచిదే. కాని కథ కవసరములని తోఁచినప్పుడు వానిని గూడ

వర్ణింపవచ్చును. సముద్ర లంఘనము, యుద్ధము, దుర్గావస్కందనము మున్నగునవి ప్రదర్శనాసాధ్యములగుటచే దృశ్యములందుఁ బరిహరణీయములు. శ్రవ్య కావ్యములందు వానిని యథోచితముగా వర్ణించుట కవకాశమున్నది. వస్తు సంధానము చేయునప్పుడు ఆరంభము విషయమునఁ గవి చాలా శ్రద్ధ వహింపవలయును. దృశ్య శ్రవ్య కావ్యములు రెండింటి వస్తూపక్రమ మొక్క మాదిరిగా నుండనవసరములేదు. దృశ్యకావ్య శిల్పము ననుసరించి యందది "అనఁగా అనఁగా ఒక రాజు" అను విధముగాఁ గాక యెక్కడనో కథా మధ్యమున నారబ్ధ మగుచుండును. ఇట్టి స్వల్ప భేదములున్నను వస్తు విన్యాసము కావ్యము లన్నింట రసోద్దీపకముగానే యుండవలయుననుటలో నభిప్రాయభేదము లేదు. మాత్యూ ఆర్నాల్డు రూపక వస్తువు మధురోదాత్త రసభావ నిరంతరమై (Sound subject matter) యుండవలెననుట యందలి యర్థమిదియే.

9. కావ్యము - ఛందస్సు :

ప్రాచ్య లాక్షణికులు పద్య గద్యోభయాత్మక మని కావ్యమును మూఁడు తెఱఁగులుగా విభజించిరి. దీనిని బట్టి కావ్యము గద్యమయముగాఁగాని పద్యమయముగాఁ గాని గద్యపద్యోభయమయముగాఁగాని యుండవచ్చును. ఛందోమయమైన పద్య కావ్యమునకును, ఛందో రహితమైన గద్య కావ్యమునకును ప్రాచ్యలాక్షణికుల మతమునఁ గావ్యత్వము సమానమే. కాని రసాత్మకమైన వాక్యము కావ్యమను నిర్వచనమును బట్టి యది రసాత్మకమై మాత్ర ముండవలయును. రసాత్మకత్వమను అంతర ధర్మ ముండుచో దాని బహిస్స్వరూపము గద్యపద్యములలో నేదైనను గావ్యత్వమునకు భంగము వాటిల్లదని వారి యభిప్రాయము. రసహీనమైనచోఁ బద్యమయమైన రచన కూడఁగావ్య నామార్హము కాజాలదు. రససహిత మైనచో గద్యమయమైన రచన యైనను గావ్య నామమున కర్హమే.

ఆంగ్లమున "పొయెట్రీ" అను పదమునకు కవిత్వము లేక బద్య కావ్యము అని యర్థము. పద్య కావ్యమను మాట కావ్యముయొక్క బహిస్స్వరూపమును అంతర ధర్మమును రెండింటిని గూడ సూచించుచున్నది. అనఁగానది కవితా సహితమును ఛందోమయమును గూడ నైయుండును. కవితా సహితమైన రచన రసాత్మకమై యుండక మానదు. కవితా సహితమయ్యు గద్య రూపమైన రచనను "పొయెట్రీ" అనుటకు వీలులేదు. ఆంగ్ల భాషలో

దానిని (Prose Poetry) అనవలయును. దీనిని బట్టి ఆంగ్లమున "పొయెట్రీ" అనఁబడుటకు రచనయందు కవితా ధర్మముతోపాటు ఛంద స్సాహిత్యము కూడ నుండవలయును.

ఆంగ్ల విమర్శకులలోఁ గావ్యమునకు ఛంద స్సవసరమా కాదా యనువిషయమున భిన్నాభిప్రాయములున్నవి. సర్ ఫిలిప్ సిడ్నీ, కోలెరెడ్జిమున్నగువారు ప్రాచ్యలాక్షణికులవలెఁ గావ్యమునకు బాహ్యమైన ఛందస్సుతో నెట్టిసంబంధమును లేదని భావించిరి. ఛందస్సు కావ్యమున కలంకారప్రాయమైన బహిరాచ్ఛాదనమే కాని కవితా హేతువు కాదనియు, నిందుకు ఛందోరహితమైన గద్యమునఁ కూడ మహాకవిత్వము వెలయించిన కవులును బద్యమయ రచనలు కావించియుఁ గవినామ వాచ్యులు కాకపోయిన కవులును బలువురుండుటయే కారణమనియు సిడ్నీ తెల్పియున్నాఁడు. అట్లే కోలెరెడ్జి యుత్కృష్టమైన కవిత్వము ఛందోరహితముగా నుండవచ్చునని చెప్పి యుదాహరణ లొసంగి యున్నాఁడు. లేహన్టు, కార్లైలు, మాత్యు ఆర్నాల్డు మున్నగువారట్లుకాక కవిత్వమునకు ఛంద స్సపరిహార్యమని భావించి యున్నారు. లేహన్టు కవితా పరిపక్వతకు ఛందస్సు మిక్కిలి యవసరమనియు నదిలేనిచోఁ గవితా సౌందర్య మసమగ్రమగుననియు భావించి యున్నాడు. మాత్యూ ఆర్నాల్డు వచనము కంటెఁ గవిత్వమున లయాధిక్యము గోచరించు ననియు, స్థిరములు శక్తిమంతములునైన ఛందోలయములే కవితా సమగ్రతకుఁ గొంత వఱకుఁగారణము లనియు నుడివి యున్నాఁడు. కార్లైలు కవిత్వము ఛందోమయమై యుండవలెనను ప్రాచీనుల నియమ మర్థవంతముగనే గోచరించుచున్నదని తెల్పియున్నాఁడు.

ఛంద స్సాహిత్య రాహిత్యముల వలనఁ గావ్యమున కుత్కర్షాపకర్షలు కలుగుచుండుట నిజమే యైనను వానినే కావ్యాకావ్య భేదకములుగా గ్రహింపరాదు. ఏలయనఁ గేవలము ఛందస్సును బట్టియే "ఇది కావ్యము. ఇది కావ్యముకాదు" అని నిర్ణయించుటకుఁ గడంగినచో నొక్కక్కప్పుడు కవిత్వము కాని దానిని కవిత్వమనియు, నుత్తమ కవిత్వము నకవిత్వమనియుఁ జెప్పవలసివచ్చును. ఆంధ్రనామ సంగ్రహము పద్యరూపమున రచింపబడినదే యైనను గావ్య శబ్ద వాచ్యము కాఁజాలదు. వేంకటేశ్వర వచనములు గద్యరూపములే యయ్యుఁ గావ్యనామార్హ ములనుటకు సంశయింప నక్కఱలేదు. సంస్కృతమున గద్యరూపమున నున్న కాదంబరీ దశకుమార చరిత్రలను గొంద ఱాంధ్రకవులు పద్యరూపమున ననువదించిరి. వానిని దారతమ్య దృష్టితోఁ బరిశీలించినచో, బద్యరూపములైన యనువాదముల కంటే గద్యరూపములైన మూల

గ్రంథములందే కావ్య గుణములు హెచ్చుగా గోచరించును. అందుచే ఛందస్సు కావ్యమునకు సౌందర్యమును గలిగించు విశేష లక్షణమే కాని అపరిహార్యలక్షణము కాజాలదు. గాని, సాధారణముగాఁ గవిత్వమునకు ఛందస్సునకును అవినాభావము చెప్పుట లోకమున పరిపాటి యైనది. అందుచేఁ గావ్య మనఁగా బద్యమయమైన రచనయనియే స్ఫురించును. సామాన్యులకుఁ గవితామయమైన రచనయయ్యు ఛందోరహితమైనచోఁ గవిత్వముగా భాసింపదు. కావున రసమయమైన కావ్యముతో లయాన్వితమైన ఛందమును కూడా జత చేసినచో బంగారమునకుఁ బరిమళ మబ్బినట్లుండును.

ఛందస్సు వలన ప్రయోజనములు : కావ్యమున ఛందస్సు లయోత్కర్షను గలిగించి తద్వారా రసానంద ప్రాప్తి కధికముగాఁ దోడ్పడును. కొందఱు ఛందస్సు కవితా స్వాతంత్ర్యమునకు భంగకరమని భావించి దానిని బరిహరింప యత్నింతురు గాని, దానితో పాటు ఛందస్సు కలిగించు సహజ సంగీత మాధుర్యమును గూడఁ దొలగించినవా రగుదురు. ఛందస్సు కావ్యమున కుత్కర్ష నాపాదించుననుటలో సందేహము లేదు. అందుచేతనే ఆర్నాల్డు అది కవితా సమగ్రతలో నొక భాగమని చెప్పియుండెను. ఛందస్సు కవితావేశమును బొందుటకును, వ్యక్తీకరించుటకును ఉత్తమ సాధనమై కవిత్వమునకు సమగ్రత కలిగించును. అనాది కాలమునుండియు మానవులు నిశితములైన భావములను లయాన్వితమైన భాషలోనే వ్యక్తీకరించుచుండిరని జాన్ స్టూవర్టు మిల్ నుడివి యున్నాఁడు. భావములు నిశితతరములైన కొలఁది లయ సాంద్రతర మగుట సంభవించును. అందుకుఁ గవితోచిత భావమునకును ఛందో రూపమునకును గల సన్నిహిత సంబంధమే కారణము. ఒక్కొక్కప్పుడు గద్యము కూడ నావేశపరిపూర్ణమై నిశిత భావోపేతమై యుండవచ్చును. అప్పుడందలి ఓజస్సు మానసమగ్రత ఛందోలోపమును బూరించు చుండును.

కవిత్వము నందలి ఛందో రూపము పఠితలను మఱొక ప్రపంచమునకుఁ గొనిపోవునని హెగెల్ అను తాత్త్వికుఁడు చెప్పియున్నాడు. గద్య భాషను లయాన్వితమైన భాషగా మార్చుట నీరసలోకమునుండి రసలోకమునకుఁ బయనించుట వంటిది. గద్యమున సౌష్ఠవోపేతముగాఁ దోఁచిన రచనా విధానమే పద్యకావ్యమునఁ బరివర్తనము నపేక్షించును. కవితా వేశము ఛందో రూపమునువలె ఛందోరూపముకవితావేశమును ప్రేరేచును. ఒకప్పుడొందు రెండు పద్యములను వ్రాయవలెనని మొదలుపెట్టి రచయితలు పలు పద్యములు వ్రాయజాలుట యిందుకు నిదర్శనము.

ఛందస్సు సంగీతము వంటిది,సంగీతమువలె నది సామాన్యుల హృదయములను గూడ నాకర్షించి యానంద పరవశముల నొనరించును. పదము లర్థమైనను గాకపోయినను పోతన వంటి మహాకవుల పద్యములు వినునప్పుడు పామరులను కూడఁ దలలూపించును. ఛందస్సు ధారణాశక్తి కెన్నో విధములఁ దోడ్పడును. పద్యములందు పదముల కూర్పు లయాను గుణముగా నమర్పబడి యుండుట యిందుకుఁ గారణము. పద్యములను వలె వచన భాగములను మనము సులభముగా ధారణ చేయఁజాలక పోవుట కందలి ఛందో రాహిత్యమే కారణము.

కవితావేశపూరితమైన మహాకవుల పద్యభాగములను గద్య భాగములుగా ననువదించి యా రెంటిని బోల్చి చూచినచో ఛందస్సు వలన ప్రయోజనము తేటతెల్లమగును. అట్టియనువాదము “పూలరేకుల మీఁదను దృణపల్లవముల మీఁదను ముత్తెముల వలెఁగనిపించి చేతితో గ్రహింపఁగనే నీరుగా మారిపోవు మంచు బిందువుల సేకరించుట ” వంటిదని జేమ్సు మాంటుగోమరి చెప్పి యున్నాఁడు. వచన భాగములందు పద్యభాగమందలి లాలిత్యము, తళుకు, రూపము మాటిపోయి, కేవల వస్తువు మాత్రమే మిగులుట సంభవించును. ఈ వికృతికి ఛందోరాహిత్యము కూడఁ గొంతవఱకుఁ గారణము.

అందుచే ఛందస్సు కావ్యమునకు అందముతోపాటాకర్షణమును గూడఁ గలిగించును. కొందఱు విశిష్ట ప్రతిభావంతులు గద్యముననే యా లయాకర్షణములను కలిగింప సమర్థులై యుండవచ్చును.కాని యందఱునట్లు చేయఁజాలరు.

10. కావ్యము-సంఘము :

కవులు కొన్ని విశిష్ట గుణములు కలవారైనను నితరులతోపాటు తామును సంఘజీవులే. వారు భావుకులై ఉన్నత లోకములలో విహరించుచునే యేదోయొక వేళ నీ లౌకిక ప్రపంచమున కవతరింపక తప్పదు. ఈ ప్రపంచముతో సంబంధము లేనివారి కవితా వ్యవసాయము నేల విడిచిన సామువంటి దగును. కావుననే సాహిత్యమునకు సంఘమునకు గొంత సంబంధము తప్పక గోచరించుచుండును.

ఏ విషయమైనను ఉన్నది యున్నట్లు వ్రాయవలెనను నియమము కవికి లేదు. అది చరిత్ర కారుల పని, రసము ప్రధానముగా గ్రహించు కవి వాక్యములకును విషయ కథనమే ప్రధానముగా నెంచు చరిత్రకారుని వాక్యములకును జాల భేదముండును. కవులు తాము

చెప్పఁదలఁచిన విషయములను బొడిమాటలతోఁ జెప్పక ఆలంకారిక మార్గములఁజెప్పుదురు. అలంకారము లతిశయోశక్తులని కొందఱి మతము. అంతమాత్రమునఁగవుల రచన లన్నియు నసత్యములని మన మనుకొనరాదు. అందలి యలంకారములను, నతిశయోక్తులను దొలఁగించినచోఁ గవుల రచనల యందు వారి కాలమునకు వారు నివసించు సమాజమునకును సంబంధించిన యథార్థ విషయములు కొన్ని తొంగిచూచుచునే యుండును.

కవి కథా వస్తువును గల్పించునపుడు తాను నివసించు సంఘమును, అందలి సన్నివేశములను, వ్యక్తులను, యాచార వ్యవహారములను దృష్టియందుంచుకొనును. అతఁడు తానుజూడని అనుభవింపని, విషయముల నభిని వేశముతో వర్ణింపజాలఁడు. వివిధ వస్తువులను సన్నివేశములను వర్ణించునపుడు స్వానుభవమునుగూడ నందుఁ బ్రవేశ పెట్టును. వస్తువును బురాణాదుల నుంచి గ్రహించినను సూక్ష్మాంశ వర్ణన సందర్భమున నతఁడు తన నాఁటి సంఘమును బురస్కరించుకొనియే రచన సాగించును. నిజమునకుఁ గావ్య వర్ణనములకు వస్తువును సమకూర్చునది సంఘమే యని చెప్పవచ్చును. దానికిఁ గవి భావనా శక్తియుఁ దోడ్పడుచుండును. ప్రతి వ్యక్తియు నిత్యము నేవో కొన్ని విషయములను దృశ్యములను గనుచుండును. సామాన్య మానవులు తాము కన్న విశేషములను మరుక్షణమున విస్మరింతురు. కవి యట్లుగాక తానుగన్న వానినిమనస్సున మననము చేసికొని యాయా విషయములను మనోమంజూషలో భద్రపరిచి తరువాత కావ్యములను రచించునపుడవసరమగు సందర్భములలో నా భావముల నుపయోగించుకొనును. దానిని బట్టి కవికి రచనా సందర్భమున సంఘ మెట్లు తోడ్పడుచున్నదో తెలియుచున్నది. దర్శనము వర్ణనము ననునని కవి ధర్మములు. ఆలంకారికులు వర్ణన నిపుణత్వమునకుఁ బ్రాధాన్య మొసంగి యున్నారు. ఈ వర్ణనా నైపుణ్యము లోక సమ్యక్పరిశీలనము వలనఁ గలుగును.

కవి నొక విధముగా నాతఁడు నివసించు కాలమునకు బ్రతినిధియని చెప్పవచ్చును. అతఁడు తన కావ్యములోఁజెప్పుఁ భావము లాతని నొక్కనికి మాత్రమే కాక యా కాలమునకు నప్పటి సమాజమునకు సంబంధించి యుండును. ఆ కారణము చేతనే మనము కావ్యములను జదువునప్పుడప్పటి ప్రజల భావములను సంఘ పరిస్థితులను గూడఁ గొంచెముగానైనను గ్రహింప వచ్చును. షేక్స్పియరు నాటకములు స్కాటు, డికెన్సు మున్నగువారి రచనలు చదివినచో నా యా కాలముల యందలి యాంగ్ల సంఘ పరిస్థితుల నవగాహనము చేసికొనవచ్చును.

ఆంధ్ర వాఙ్మయమునఁ బాల్కురికి సోమనాధుని గ్రంథములును, హంసవింశతి, సింహాసనద్వాత్రింశిక, షోడశకుమార చరిత్రము మున్నగు కథా కావ్యములును, ప్రబంధములును, దత్తత్కాలపరిస్థితులను వ్యక్తము చేయుట యెల్ల రెఱింగినదే. ఇట్లే సంస్కృతము మున్నగు నితర వాఙ్మయములఁ బరిశీలించినచో నా యా యుగము లందలి భారతీయ సంఘ సాంస్కృతిక పరిస్థితులు తెలియవచ్చును. సాహిత్యముననుఁదత్కాల పరిస్థితులను దనలోఁ బ్రతిబింబింపఁజేయు గుణవిశేష ముండుట చేతనే చరిత్రకారులు కూడఁ జరిత్రను నిర్మంచునెడ నా కాలపు సాహిత్యమును సైతము మూలముగా గ్రహించి పరిశీలించుట యవసర మగుచున్నది.

"విశ్వ శ్రేయః కావ్య"మ్మని చింతామణి నుడువుచున్నది. ఉత్తమ కావ్యము లెప్పుడును విశ్వ శ్రేయమునకు సాధనములై జగత్కల్యాణమునకు సహాయములుగా నుండును. ఉపదేశము కూడ కావ్యము యొక్క ప్రయోజనములలో నొకటి. అట్టిచో దురుపదేశకరములు, దుర్నీతి బోధకములు నగుకావ్యములను విసర్జింపవలసి యున్నది. దీనిని బట్టి కవులుత్తమ ధర్మబోధకములగు కావ్యములను రచించి పరోక్షముగా నైనను సంఘ శ్రేయమునకై పాటు పడవలసియున్నది. సత్కవులు తమ కావ్యములందు నీతి ధర్మములను సరసముగా నుపదేశించి సంఘమును సన్మార్గానుసరణ ప్రవణముగాఁజేయు చుందురు. అందుచేతనే కవులెన్నఁ కొనఁబడని శాసన కర్తలనియొక యాంగ్ల వాక్యము చెప్పుచున్నది.

ఒక్కొక్కప్పుడు సంఘమున దురాచారములు ప్రబలుటచే సంస్కరణ మవసరమగు చుండును. అట్టి తఱిఁగవులును రచయితలును దమ కావ్యముల ద్వారా సంస్కరణాభిప్రాయములను ప్రచారము చేసి సంఘము నుద్ధరించుటకు యత్నించుచుందురు. ఆంగ్లమున ఆడిసన్, స్టీలు మున్నగు వారును, దెనుఁగున సోమనాధుడు, వేమన, వీరేశలింగము, పానుగంటి ప్రభృతులును అందుకుఁ బ్రయత్నించి చాలవఱకుఁ గృతార్థులయిరి. భారతదేశ స్వాతంత్ర్య సంపాదన విషయముననను, ఆంధ్రరాష్ట్ర స్థాపన విషయముననను గవులు నిర్వహించిన పాత్ర సర్వజన విదితమైనట్టిదే.

ఈ విధముగా సాహిత్యమునకును సంఘమునకును సన్నిహిత సంబంధ ముండునని తెలియుచున్నది. సంఘము సాహిత్యమునకు వస్తువును సమకూర్చి దానికి వైశాల్య వైవిధ్యములు గలిగించును. సాహిత్యము సంఘ పరిస్థితుల కాదర్శమువంటిదై, యవసరమైనప్పుడు దానిని

సంస్కరించి సన్మార్గమునకుఁ ద్రిప్పుటకు యత్నించును, కవులెంత ప్రతిభావంతులైనను సంఘమునం దంగములైన వ్యక్తులే. వారు దాని నాశ్రయించియే తమ కవితా వ్యాపారము సాగింతురు. అట్లు చేయనిచో వారి సృష్టి భాషాభివృద్ధి సాధనమైనను విశ్వశ్రేయమునకు సహాయము కాఁజాలదు.

11. కావ్యము - నాయికా నాయకులు :

కావ్యముపదేశాత్మకమై యుండవలయునన్న నందలి నాయకుఁడుత్తమ చరిత్ర సంపన్నుడై యుండవలయును. కావ్యము నందలి యితివృత్తమును నడుపుచు ఫలమును బొందువాఁడగుటచే నాయకుని కాపేరు కలిగినది. కులీనత (ఉన్నతకులసంభవము), మహీభాగ్యము (భూమండలాధిపత్యము), ఔజ్జ్వల్యము (రూపసంపన్నమైన దేహము కలిగియుండుట), ఔదార్యము (దానశీలము), తేజస్విత (జగత్ప్రకాశత్వము), ధార్మికత్వము (ధర్మపరాయణత), వైదగ్ధ్యము (కృత్యవస్తుకౌశలము) అను నేడును నాయక గుణములని చెప్పి విద్యానాథుడు వానికి మహా మహిమత్వము (దేవతా స్వరూపము కలిగియుండుట), పాండిత్యము (సర్వవిద్యాధికత్వము) అను వానిని గూడఁ గలిపియుండెను. సాహిత్యదర్పణమున త్యాగి, కృతి, కులీనుఁడు, రూప యౌవనోత్సాహ సంపన్నుఁడు, దక్షుఁడు, అనురక్తలోకుఁ డు, తేజోవైదగ్ధ్య శీలవంతుఁడు నైనవాఁడు నాయకుఁడని చెప్పఁబడినది. ధనంజయుఁడు దశ రూపకమున నాయకుఁడు వినీతుఁడు, మధురుఁడు, త్యాగి, దక్షుఁడు, ప్రియంవదుఁ డు, రక్తలోకుఁడు, శుచి, వాగ్మి, రూపవంతుఁడు, స్థిరుఁడు, యువకుఁడు, తేజస్వి, శాస్త్రచక్షువు, ధార్మికుఁడై యుండవలెనని తెల్పియున్నాడు. ఈ ముప్వురు చెప్పిన నాయక లక్షణములను గొంచె మించు మించుగా సమానములుగానే యున్నవి.

ప్రతాపరుద్రీయమున నాయక గుణములు చెప్పఁబడిన పిమ్మట యశః ప్రతాప సుభగత్వము, ధర్మ కార్యార్థ తత్పరత్వము, దురంధరత్వము, గుణాఢ్యత నాయక స్వరూపలక్షణములని తెల్పఁబడినది. భట్టుమూర్తి వీని కార్తావనత్వము, భూభారవహన క్షమ బాహుత్వము అను వానిని గూడఁజేర్చినాఁడు. ఇందలి లక్షణములు కొన్ని పైని పేర్కొనఁ బడిన గుణములందే యంతర్భవించును. మరల వీనిని చెప్పుట నాయకుని యందీ లక్షణములు తప్పక యుండవలెనని సూచించుటకే. ఈ గుణ స్వరూప లక్షణము లన్నియు నుండువాఁ

దుత్తమ నాయకుఁడగును. అందుఁగొన్ని మాత్రమే కలవాఁడు మధ్యముఁడు, బహుగుణహీనుఁడధముఁడు.

నాయక భేదములు : ధీరోదాత్తుఁడు, ధీరోద్ధతుఁడు. ధీరశాంతుఁడు, ధీరలలితుఁడు అని నాయకులు నలుతెఱఁగులుగా నుందురు. అవికత్థనుఁడు (ఆత్మస్తుతి లేనివాఁడు), క్షమావంతుఁడు (ఓర్పుగలవాఁడు), అతిగంభీరుఁడు, మహాసత్త్వుఁడు, స్థిరుఁడు, గూఢమానుఁడు (గూఢమైన కోపము గలవాఁడు), దృఢ వ్రతుఁడునగువాఁడు ధీరోదాత్తుఁడు. ఇతఁడు శృంగార వీర రసములందు నాయకుఁడుగా నుండును. మాయాపరుఁడు, ప్రచండుఁడు, చపలుఁడు,అహంకార దర్ప భూయిష్ఠుఁడు, ఆత్మస్తుతి పరాయణుఁడు నగువాఁడు దీరోద్ధతుఁడు. ఇతఁడు వీర రౌద్రరసములందు నాయకుఁడుగా నుండును. ధీరుఁడు, శాంతుఁడుఁ బ్రసన్నాత్ముఁడునైన ద్విజాధికుఁడు ధీరశాంతుఁడని (ధీరప్రశాంతుఁడనియు, గొందఱందురు) ప్రతాపరుద్రీయము. కులీనత్వాది నాయక సామాన్య గుణములు కలద్విజుఁడు ధీరశాంతుఁడని సాహిత్య దర్పణము. ద్విజుఁడనఁగా బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులలో నొకఁడు. ద్విజాదికః అనుదానికిదశరూపకము విప్రవణి క్సచివులని వ్యాఖ్యానము చేసి యున్నది. భరతుఁడు నాట్య శాస్త్రములోఁ బ్రకరణమున అమాత్య విప్ర వణిజులలో నొక్కని నాయకునిగాఁ జేయవలెనని చెప్పినాఁడు. దశరూపక నాట్యశాస్త్రములు, రెండును క్షత్రియ శబ్దమునకు బదులమాత్య సచివ పదములను వాడి యుండుటచే రాజైన క్షత్రియుఁడు కాక మంత్రియైన క్షత్రియుడే ప్రకరణ నాయకుఁడై యుండవలెనని వారి యుద్దేశమైనట్లు తోఁచుచున్నది. మాలతీ మాధవమున మంత్రి పుత్రుఁడు నాయకుఁడుగా నున్నాఁడు. నిశ్చింతుఁడు, మృదు స్వభావుఁడు, నిత్యకళా నిరతుఁడునగువాఁడు ధీరలలితుఁడు. కళానిరతుడనఁగా నృత్యగాన చిత్రలేఖన కవితాదులగు లలిత కళలం దాసక్తుఁడు. నాటికలందు ధీరలలితుఁడు నాయకుఁడుగా నుండును. కావ్యములం దంగిభూతులైన నాయకులలో నాద్యంతము ధీరోదాత్తాదులలో నెవ్వరో యొకరి లక్షణములే వర్ణింపఁబడవలయును. అవస్థా భేదములు వర్ణితములైనచోఁ బ్రధాన రసమునకు భంగము వాటిల్లును.

శృంగార నాయకులు : దక్షిణుఁడు, అనుకూలుఁడు, ధృష్టుఁడు, శఠుఁడు అని శృంగార నాయకులు నాలుగు విధములుగా నుందురు. అనేక నాయికలందు సమానానురాగము కలవాఁడు దక్షిణుఁడు (శ్రీ కృష్ణుడు). ఒకే నాయికయందు విశేషానురక్తుఁడై యుండువాఁ

దనుకూలుఁడు(శ్రీరాముఁడు). అపరాధ మొనరించియు శంక లేనివాఁడు ధృష్టుఁడు. నాయికకు మాత్రమే తెలియునట్లు ప్రియ మాచరించువాఁడు శఠుఁడు. ఇతడాచరించు నప్రియము ప్రియురాలికే కాని యితరులకుఁ దెలియదు.

పైని పేర్కొనఁబడిన ధీరోదాత్తాదులు నల్వు రొక్కొక్కరు దక్షిణాది భేదములచే నలుగురై మొత్తము పదునార్గురగుదురు. ఈ పదునాఱుగురు నుత్తమ మధ్యమాధమ భేదముల నంది నలువది యెనమండ్రుగు రగుదురు.

జాతి భేదమునుబట్టి నాయకులు దత్తుఁడు, భద్రుఁడు, కూచిమారుఁడు, పాంచాలుఁడు అని నాలుగు తెఱఁగులని కామశాస్త్రము చెప్పుచున్నది. అందు దత్తుఁడు పద్మినీ వల్లభుఁడు. భద్రుఁడు చిత్రిణీ ప్రియుఁడు. పాంచాలుఁడు హస్తినీ ప్రియుఁడు. కూచిమారుఁడు శంఖినీ ప్రియుఁడు. జాతిని బట్టి నాయకులు మరల దివ్యులు, అదివ్యులు, దివ్యాదివ్యులు అని మూఁడు తెఱఁగులుగా విభజింపఁబడినారు. కేవల దివ్యులగు శంకరాదులు దివ్యులు. కేవల మర్త్యులగు దుష్యంతాదులదివ్యులు. దేవమానవాంశలు రెండునుగల కృష్ణాదులు దివ్యాదివ్యులు.

నాయక సహాయులు : పైన పేర్కొనఁబడిన నాయకులకు నాయికా సహగమ సంఘటనమున సాయ మొనర్చు సహాయులు నలువురున్నారు. వారు విట పీఠమర్ద చేట విదూషకులు. అందు సంభోగహీన సంపత్కుఁడు (నపుంసకుఁడని వ్యాఖ్య) ధూర్తుఁడు, కళలలో నేకదేశము నెఱింగినవాఁడు, వేశ్యానాగరిక సమాగమ సంఘటన కుశలుఁడు, వాగ్మి, మధురుఁడు, గోష్ఠి బహుమానితుఁడు నగు వాఁడు విటుఁడు. ప్రధానవృత్తమునందు వచ్చు ప్రాసంగి కేతివృత్తమునకు నాయకుఁడును, బ్రధాన నాయకునికంటెఁ గొంచెము తక్కువ గుణములు గలవాఁడును నగువాఁడు పీఠమర్దుఁడు. ఇతఁడు ప్రాసంగి కేతివృత్తమున నైనను నాయకుఁడై ప్రత్యేక ప్రయోజనమును బొందును గావున నితనిని గేవల శృంగార సహాయులలోఁ జేర్పరాదని కొందఱి మతము. నాయికా నాయకులకు సంధానము కూర్చుట యందు నిపుణుడు చేటుఁడు. హాస్యకలహప్రియుఁడు విదూషకుఁడు, సంస్కృత నాటకములలో సాధారణముగా విట పీఠమర్దులకు సంస్కృత భాషయు, చేట విదూషకులకుఁ బ్రాకృతభాషయు నుపయోగింపఁ బడుచుండును. దీనిని బట్టి విట పీఠమర్దులుత్తమ పాత్రలనియు బ్రాహ్మణుఁడును, రాజావలంబనము కలవాఁడు నగుటచే విదూషకుఁడు మధ్యమ పాత్ర యనియు, చేటుఁ

డథమ పాత్రయనియు నూహింపవచ్చును. కొందఱువిదూషకునింగూడ నీచపాత్రగానే పరిగణింతురు. ఇతఁడు సాధారణముగా వేషభాషలచే హాస్యము పుట్టించు వాఁడును, భోజన ప్రియుఁడును, బ్రాహ్మణుఁడునై యుండును.

వీరు కాక శకారుఁడు, తాంబూలికుఁడు, గాంధికుఁడు, మాలాకారుఁడు, రజకుఁడు, వామన షండ కిరాత మ్లేచ్ఛ కుబ్జాదులు కూడ నటనట శృంగార సహాయులుగా నుండుట కలదు. మృచ్ఛకటికమున శకార పాత్ర అద్భుతముగాఁ బోషింపఁబడినది. ఇతఁడు రాజుగారి యుంపుడుకత్తెకు తమ్ముఁడును, మూర్ఖుఁడును, మత్తుఁడునుగా వర్ణింపఁబడును.

నాయికా భేదములు : స్వీయ, అన్య, సామాన్య అని నాయికలు మూఁడు తెఱఁగులుగా నుందురు. లజ్జ, ఆర్జవము, పాతివ్రత్యము, కోమలత్వము, సౌందర్యము కలిగి అగ్ని సాక్షిగాఁ బెండ్లి చేసికొన్న యుత్తమురాలు స్వీయ. అన్య-కన్య, అన్యోఢ అని యిరు తెఱఁగులు కన్య యనఁగా అవివాహిత. అన్యోఢయనగాఁ బరుని భార్య.ఏదో మిషతో నటునిటు తిరుగుచుండునదియు, కులటయు, సిగ్గువిడిచినదియు అన్యోఢయని సాహిత్య దర్పణము చెప్పుచున్నది. సామాన్య యనఁగా వేశ్య. ఈమె సర్వసాధారణ స్త్రీ. సాహిత్య దర్పణమున ధీరురాలు, కళాకుశల యగు వేశ్య సామాన్య యని చెప్పఁబడినది. ప్రహసనమున తప్ప మిగిలిన ప్రకరణాదులలో నీమె యనురాగవతిగానే యుండును. మృచ్ఛ కటిక మందలి వసంత సేనయిందుకు నిదర్శనము.

స్వీయ-ముగ్ధ మధ్య ప్రౌఢయని మూఁడు తెఱఁగులు. ఇవి యౌవన సంబంధమును బట్టి యేర్పడిన భేదములు. అప్పుడే యంకురించిన యౌవనమును మన్మథ వికారమును గలదియు, రతియందుఁ బ్రతికూలయు, మృదువైన ప్రణయ కోపము కలదియు,నధిక లజ్జాసమన్వితయు నగునది ముగ్ధ. ప్రరూఢమైన యౌవనము మదన వికారమును గలదియు నించుక ప్రగల్భమగు వాక్కులు గలదియు, సామాన్యమైన (అంతయెక్కువ తక్కువకాని) లజ్జగలదియునగు నాయిక మధ్య. సంపూర్ణయౌవన, సమస్తరతికోవిద, ఉన్నత శృంగారభావ, అల్పలజ్జ, ఆక్రాంత నాయక యగునది ప్రౌఢ. అనంతా మాత్యుఁడు ప్రౌఢ-ప్రగల్భ, ప్రౌఢ యన రెండు తెఱఁగులుగా నుండునని తెల్పెను. పూర్ణ యౌవనము గలది ప్రగల్భ-పురుషాయిత కౌశల ప్రౌఢ. అతఁడు లోలయను మఱియొక నాయికా భేదమును గూడఁ జూపెను. వార్ధక్యారంభమున నున్నదియు, నాయకుఁడించుక పలికినను, జూచినను, జేసన్న కావించినను

రత్యానందము నొందునది లోల.

ముగ్ధా, మధ్యా, ప్రౌఢ నాయికలలో మధ్యయుఁ బ్రౌఢయు ధీర – అధీర–ధీరాధీర అని మూడేసి భేదములు వహింతురు. ధీర యనఁగా బ్రణయ కోప విషయమున ధీరత్వము కలది. అధీర యనఁగా ధీరత్వము లేనిది. ధీరాధీర యనగా నంత యెక్కువయుఁ దక్కువయుఁ గాని ధీరత్వము కలది. ప్రియుఁడపరాధ మొనరించినపుడతని నెత్తిపొడుపుతోఁగూడిన వక్రోక్తులతోఁ గేరడము లాడునది (1) మధ్యాధీర. పరుషోక్తులతోఁ గోపము వ్యక్తము చేయునది (2) మధ్యా అధీర. రుదిత ప్రధానోక్తులతోఁగోపము ప్రకటించునది (3) మధ్యాధీరాధీర. కోపమును మఱుగుపుచ్చి పై కాదరమును జూపుచు సురతమున నౌదాసీన్యము వహించునది (4) ప్రౌఢాధీర. ప్రియుని గోపమున దాడించునది (5) ప్రౌఢా అధీర. అత్యంత వక్రోక్తులతో ఖేదపఱుచునది (6) ప్రౌఢా ధీరాధీర. ముగ్ధయందు భేదములు లేవు. ఆఱువిధములైన మధ్యా ప్రౌఢలు జ్యేష్ఠా కనిష్ఠా భేదములచేఁ బంఢ్రెండు తెఱంగులగుదురు. ముగ్ధకూడఁజేరిన పదముగ్గురు. స్వీయయందలి పదమూఁడు భేదములును, పరకీయ యందలి (అన్యోఢ కన్య) రెండు భేదములును, ఏకవిధయైన సామాన్యయుఁ గలసి నాయికలు మొత్తము పదునార్గు రగుదురు.

అష్ట విధ శృంగార నాయికలు : అవస్థా భేదమును బట్టి నాయిక లెనిమిది తెఱంగులుగా నుందురు. అందుఁ బరస్త్రీలను గాంక్షింపక తనయందే యనురాగము గల్గి తన కధీనుఁడై యుండు భర్త గలది స్వాధీన భర్తృక. ప్రియుఁడు వచ్చు వేళకుఁదన్ను గృహమును అలంకరించుకొని సిద్ధముగా నుండునది వాసక సజ్జ లేక వాసక సజ్జిక. ప్రియుఁడు చెప్పిన వేళకు రాక యాలస్యము చేయ నుత్కంఠ దాల్చునది విరహోత్క లేక విరహోత్కంఠిత. సంకేత స్థలమున కరిగి యట బ్రియునిఁగానక యార్తి జెందునది విప్రలబ్ధ. ప్రియుఁడు రాత్రి యంతయు నన్య కాంతతో గ్రీడించి, వేకువ నింటికి రాఁగా సంభోగ చిహ్నముల గాంచి కుందునది ఖండిత. కోపమునఁ బ్రియుని నిందించి వెడలగొట్టి యనంతరము పశ్చాత్తాపము నొందునది కలహాంతరిత. ప్రియుడు పరదేశగతుఁడు కాఁగా విరహమునఁగృశించునది ప్రోషితభర్తృక. మదనార్తయై ప్రియుని యొద్దకు పోవునది, రప్పించుకొనునదియు నభిసారికయే. ఈ యభిసారిక జ్యోత్స్నాభిసారిక, తమోఽభిసారిక, దివసాభిసారిక యని ముత్తెఱఁగులు. తెల్లనివలువలు, తెల్లపువ్వులు, తెల్లని గంధహారాదులు ధరించి వెన్నెలలో బ్రియు నభిసరించునది జ్యోత్స్నాభిసారిక.

నల్లని వస్త్రములు, నల్లని పుష్పాదులు ధరించి చీకటిలో బ్రియు నభిసరించునది తమోఽభిసారిక. పగలింటిలోని వారందఱు కార్యాంతర తత్పరులై యెందైన నరుగ నేదో నెపము వెట్టి తానింటనేయుండి ప్రియునింటికి రప్పించుకొనునది దివసాభిసారిక. సామాన్య (వేశ్య) విచిత్రోజ్జ్వలవేషము ధరించి నూపురమును మేఖలయు మెరయుచుండ సంతోష స్మేరవదనయై, యభిసరించును. ఈ సామాన్యాభిసారికను ఉజ్జ్వలాభిసారిక యనియు నందురు. రసమంజరిలో ప్రవత్స్యత్పతికయను తొమ్మిదవ నాయిక కూడఁ జెప్పఁబడినది. అగ్రిమక్షణమున దేశాంతరమునకుఁ బోనున్న భర్త గలది ప్రవత్స్యత్పతిక, కాకువచన, కాతర ప్రేక్షణ, నిర్వేద, సంతాప, నిశ్వాస బాష్ప, గమన విఘ్నకరణాదు లీమె లక్షణములు. ఈమెయు ప్రోషిత భర్తృకయందే యంతర్భవించును. కావున నీ నవమ భేదము చెప్పనవసరము లేదని కొందఱి మతము. పైని పేర్కొనఁబడిన పదునార్గురు నాయికలం దొక్కొక్కతెయు నీ యష్టవిధ భేదముల నందినచో మొత్తము నాయికల సంఖ్యనూటయిరువదెనిమిది యగును.

నాయికా సహాయలు (దూతికలు) : సఖి, నటి, దాసి, ధాత్రేయి, పొరుగున నున్న స్త్రీ (ప్రతివేశిని), బాలిక, యోగిని, శిల్పిని, తాంబూలిక, గాంధిక, రజని, పాచన స్త్రీ, గాయక స్త్రీ మున్నగువారు నాయికలకు ప్రియ సమాగమ సంఘటనమున దూతికలై సహాయులుగా వర్తింతురు. ఒక్కొక్కపుడు నాయిక తానే స్వయముగా దూతీ కృత్య మొనర్చుటయుఁగలదు.

12. కావ్య భేదములు :

స్వభావ స్వరూప వస్త్వర్థాదులను బట్టి కావ్యము పలువిధములుగా విభజింపఁబడినది. అందు స్వభావమును బట్టి యది శ్రవ్యము, దృశ్యము అని రెండు విధములు. వినుటకు మాత్రమే యోగ్యమైనది శ్రవ్యము. వినుటకు మాత్రమేకాక రంగమునఁ బ్రదర్శింపఁ బడుచుండగాఁ జూచుటకుఁ గూడ యోగ్యమైనది దృశ్యము. ఈ దృశ్యమునకే రూపకమని మఱొకపేరు. ఇందు రామ రావణాది పాత్రల వేషభాషాదులు నటులం దారోపింప బడును గావున దీనికీ పేరు కల్గినది.

స్వరూపమును బట్టి కావ్యములు పద్య కావ్యములు, గద్య కావ్యములు, ఉభయ కావ్యములు అని మూఁడు విధములు. కేవల పద్య మయములైన కావ్యములు పద్య కావ్యములు, కేవల గద్య మయములైనవి గద్య కావ్యములు. పద్య గద్యోభయ మయములైనవి యుభయ

కావ్యములు. వీనికే చంపువులని యింకొక పేరు. సంస్కృతమున రూపకములు గద్య పద్య మయములుగానే యుండును. ఇప్పుడన్ని భాషలలో దృశ్య కావ్యములను గూడ మూఁడు విధములుగాను రచించుచున్నారు.

వస్తువునుబట్టి కావ్యము ప్రఖ్యాతము, ఉత్పాద్యము, మిశ్రము అని మూఁడు విధములు. భారత భాగవత రామాయణాదులందుఁ బ్రసిద్ధమైన వస్తువు గలది ప్రఖ్యాతము. కేవల కవికల్పితమైన వస్తువు గలది ఉత్పాద్యము. కొంత ప్రఖ్యాతమును గొంత ఉత్పాద్యమునునైన వస్తువు కలది మిశ్రము. భట్టుమూర్తి వసుచరిత్రమున కేవల కల్పనా కథలు కృత్రిమరత్నములనియు, నాద్య సత్కథలు పుట్టు రత్నము లనియు, కవికల్పనతోఁ గూడిన పూర్వ వృత్తములు సానలఁదీఱిన జాతిరత్నము లనియుఁదెల్పి మిశ్రమే రమణీయ మైనదని సూచించినాఁడు.

అర్థమును బట్టి కావ్యము ధ్వని కావ్యము, గుణీభూత వ్యంగ్యకావ్యము, చిత్ర కావ్యము అని మూఁడు విధములు. రసాలంకార వస్తుధ్వనులలో నేదో యొకటి ప్రధానముగా (అనఁగా వాచ్యార్థముకంటె సుందరతరముగా) నున్నచోనది ధ్వనికావ్యము. దీనినే యుత్తమ కావ్యమందురు. వ్యంగ్యార్థమ ప్రధానముగా నుండుచో (అనఁగా వ్యంగ్యార్థముకన్న వాచ్యార్థమే సుందరతరముగా నుండుచో) నది గుణీభూత వ్యంగ్య కావ్యము, దీనిని మధ్యమ కావ్యమందురు. వ్యంగ్యార్థ మస్ఫుటముగాఁగాని గూఢముగాఁ గాని యున్నచోనది చిత్రకావ్యము. దీనినే అథమ కావ్యమందురు. జగన్నాథుఁడు కావ్యమును ఉత్తమోత్తమము, ఉత్తమము, మధ్యమము, అథమము అని నాలుగు విధములుగా విభజించెను, పూర్వులు పేర్కొన్న యుత్తమమునే యతఁ డుత్తమోత్తమ మనెను. ఇది వ్యంగ్య ప్రధానముగా నుండును. వ్యంగ్యార్థమ ప్రధానమైనను చమత్కార కారణమై విలసిల్లుచో నది యతని మతమున నుత్తమము. పూర్వుల గుణీభూత వ్యంగ్యకావ్యమునే యతఁడు ఉత్తమము మధ్యమము అని రెండు తెఱఁగులుగా విభజించెనని చెప్పవచ్చును. పూర్వుల చిత్ర కావ్యమునకు అతని అథమ కావ్యమునకు భేదమే లేదు. కాని దాని నతఁడు అర్థచిత్ర ప్రధానము, శబ్దచిత్ర ప్రధానము అని రెండు విధములుగా విభజించెను.

భోజుఁడు సరస్వతీ కంఠాభరణమున కావ్యము లాఱువిధములనితెల్పెను. కావ్యము, శాస్త్రము, ఇతిహాసము, కావ్యశాస్త్రము, కావ్యేతిహాసము, శాస్త్రేతిహాసము అనున వాతఁడు చెప్పిన యాఱుభేదములు. కావ్య శాస్త్రమనఁగావ్యశాస్త్ర లక్షణములు రెండును గలిగినట్టిది.

కావ్యేతిహాసము,శాస్త్రేతిహాసము అనువానిని గూడ నిట్లే సమన్వయించు కొనవలయును. క్షేమేంద్రుఁడు శాస్త్ర కావ్యము, కావ్య శాస్త్రము అను భేదమును తెల్పి వానికిఁ గ్రమముగా భట్టి కావ్యమును, దనచతుర్వర్గ సారసంగ్రహమును ఉదాహరణములుగాఁ జూపెను. కావ్య రూపమున వ్రాయఁబడిన శాస్త్రము శాస్త్ర కావ్యము. చతుర్వర్గ నిరూపణమును రసనిరూపణమును రెండును గల కావ్యము కావ్యశాస్త్రము. మొత్తము మీద నీ రెండింటఁ గావ్యశాస్త్ర లక్షణములు రెండును గోచరించును.

వామనుఁడు కావ్యాలంకార సూత్రవృత్తిలో గద్య పద్యాత్మకమైన కావ్యము నిబద్ధము అనిబద్ధము అని రెండు తెఱంగులుగా నుండునని చెప్పినాఁడు. సిగదండవలె నిబిడము సుందరమునైన కూర్పుగలది నిబద్ధము. మాలాకారుఁడు మొదట పుష్పమునొక దండగా గ్రుచ్చుట నభ్యసించి పిమ్మట సుందరమైన యుత్తంసము (సిగదండ) కూర్చుటయందు సమర్థుఁ డగునట్లుగాఁ గవియు మొదట విడిగాఁ బద్య గద్యములు రచించుట నేర్చుకొని తరువాత గ్రంథ రచనకు సమర్థుఁడగును. ఇట్టి గ్రంథములు నిబద్ధములు(ఉదా॥ప్రబంధాదులు). కొందఱు విడి పద్యములను గద్యములను రచించుటతోనే తృప్తి నొందుదురు. ఇవి అనిబద్ధములు. తేజః పరమాణు వొకటివలె గ్రంథరూపముఁ గూర్పబడని అనిబద్ధ కావ్యము ప్రకాశింపదని వామనుని యభిప్రాయము.

నన్నెచోడుఁడు కుమార సంభవమున మార్గదేశీ కవిత్వములను బేర్కొనెను. ఈ సంప్రదాయము సంగీత శాస్త్రమునందును కన్నడమునందును గలదు. సంస్కృత భాషా కవిత్వము మార్గమనియు దేశ భాషాకవిత్వము దేశియనియు, గొందఱు తలంతురు. కొంద ఱట్లు కాక దేశభాషలందుఁగూడ నీరెండు తెఱఁగులైన కావ్యము లుండునని యభిప్రాయ పడుచున్నారు. వీరి యభిప్రాయము ప్రకారము సంస్కృత లక్షణ సంప్రదాయముల ననుసరించి సంస్కృత భాషా బహుళముగా రచింపఁబడు కవిత్వము మార్గము. దేశీయ వృత్తముతో దేశీయచ్ఛందములో దేశభాషా బహుళముగా రచింపఁబడునది దేశికవిత్వము.

శ్రవ్యకావ్యములు–పద్యకావ్యము : శ్రవ్య కావ్యములు–పద్యకావ్యము, గద్యకావ్యము, చంపూకావ్యము అని మూఁడు విధములని పైని పేర్కొనఁబడినది. అందు పద్యకావ్యము–మహాకావ్యము ఉపకావ్యము (క్షుద్రకావ్యము) అని రెండు విధములు. అష్టాదశ విశిష్ట వర్ణనములతోఁ గూడినది మహాకావ్యము. ఈ వర్ణనల సంఖ్య విషయమున నభిప్రాయ

భేదములున్నవి. నగరము, సముద్రము, శైలము, ఋతువులు, చంద్రోదయము, సూర్యోదయము, ఉద్యానము, జలక్రీడ, మధుపానము, రతోత్సవము, విప్రలంభము, వివాహము, కుమారోదయము, మంత్రము, ద్యూతము, ప్రయాణము, యుద్ధము, నాయకాభ్యుదయము అను పదునెనిమిదియు వర్ణ్యములైన యంశములని ప్రతాప రుద్రీయము చెప్పుచున్నది. నరసభూపాలీయమున ద్యూతమునకు బదులు దౌత్యమును మధుపానమునకు బదులు మధువును జెప్పఁబడినవి. మధు వనఁగా వసంతము. ఇది ఋతువులలోనిదే కావున దీనిని మరల చెప్పవలసిన యవసరములేదు. సాహిత్యదర్పణమున సంధ్య, సూర్యుఁడు, చంద్రుఁడు, రాత్రి, ప్రదోషము, చీఁకటి, దినము, ఉదయము, మధ్యాహ్నము, మృగయ, శైలము, ఋతువు, వనము, సాగరము, సంభోగము, విప్రలంభము, ముని, స్వర్గపురము, అధ్వరము,రణము, ప్రయాణము, వివాహము, మంత్రము, పుత్రోదయము అనునవి వర్ణ్యాంశములని తెల్పి, సంధ్యనుండి సాగరము వరకుఁ గల వానిని యధాయోగముగను సంభోగమునుండి పుత్రోదయము వఱకుఁగల పదింటిని సాంగోపాంగముగను వర్ణింపవలెనని సూచించెను. అప్పకవి ప్రతాప రుద్రీయమునందలి పదునెనిమిదింటికి వేఁట, మౌనీంద్ర పుణ్యాశ్రమము, కన్యాంగ సౌందర్యము, దౌహృదము అను నాల్గింటిని జేర్చి వర్ణ్యాంశము లిరువది రెండని చెప్పెను. అలంకారశేఖరకారుఁడు ముప్పది రెండు వర్ణనీయములను దెల్పెను. పలువు రష్టాదశ సంఖ్యనే యంగీకరించిరి. ఈ విధముగా వారు వర్ణనీయాంశములను నిర్దేశించియు, అందుఁగొన్నింటిని విడిచినను మహాకావ్యత్వమునకు భంగము లేదని తెల్పియుండిరి.

ఇతిహాసము : ఇతి +హ+ఆస (ఇట్లుండెను) అని దీనికి వ్యుత్పత్తి, ధర్మార్థ కామమోక్షముల యుపదేశముతోఁ గూడి కథాయుక్తమైన పూర్వవృత్త మితిహాసమని చెప్పఁబడును. ఇందు పూర్వరాజాదుల కథ లుండును. మహాభారత మిందు కుదాహరణము.

పురాణము : పురా నవం పురాణమని దీని నిర్వచనము. ఇందు పంచ లక్షణములుండును. సర్గము, ప్రతిసర్గము (బ్రహ్మాదుల సృష్టి) వంశము (దేవాసురాది విభేదోత్పత్తి), మన్వంతరము, వంశానుచరితము, అనునవాపంచ లక్షణములు. కాలక్రమమున నితిహాసములందు వలె నిందును బెక్కు కథలు ప్రవేశించినవి. అందుచే పురాణేతిహాసములు రెండును గొంచె మించు మించుగా సమానములగుట సంభవించినది.

ఉప కావ్యములు : సర్గ బంధము లేని కావ్యము లుపకావ్యములు. వీనికి క్షుద్ర కావ్యములని మరొక పేరు. ఇచ్చట క్షుద్ర శబ్దము పరిమాణ సంబంధియే కాని స్వభావ సంబంధి కాదు. క్షుద్ర కావ్యమనఁగా జిన్న కావ్యమని యర్థము. క్షుద్ర కావ్యములలో ముఖ్యములైనవి మాత్రమే యిట పేర్కొనఁబడును.

ఉదాహరణము : ఆంధ్ర వాఙ్మయమునకుఁ బ్రత్యేకమైన ప్రక్రియలలోనిది యొకటి. సంస్కృతమున రెండు మూఁడుదాహరణములు మాత్రమే యున్నవి. తెలుఁగున పాల్కురికి సోమనాథుని కాలమునుండి నేఁటి వఱకును ఉదాహరణములు రచింపబడుచున్నవి. సంస్కృతాంధ్రములు రెండింట మొదటి యుదాహరణమును వెలయించిన వాఁడు పాల్కురికి సోమనాథుఁడే. ఉదాహరణము పద పద్యోభయ లక్షణములు గల ప్రక్రియ. ఆశు, మధుర, చిత్ర, విస్తరములను కవితా భేదములలోనిది మధుర జాతికిఁ జెందినది.

ఉదాహరణము స్తోత్రరూపమైన చిన్న కావ్యము. మొదట దేవతల స్తోత్రమునకే యిది రచింపఁబడు చుండినను తరువాత మానవ దేశనాయక స్తోత్ర పరముగాఁగూడ వ్రాయఁ బడుచు వచ్చినది. ఇందు మొత్త మిరువది యాఱు పద్య గేయ భాగములుండును. సప్త విభక్తులు సంబోధన విభక్తి అను నెనిమిది విభక్తులలో నొక్కొక్క విభక్తి కొక్కొక్కవృత్తము, ఒక్కొక్క కళిక, ఒక్కొక్క ఉత్కళిక వ్రాయఁబడుచుండును. పిమ్మట సార్వవిభక్తిక పద్య మొక్కటియు నంకితాంక పద్యమొకటియు నుండును. వృత్తములలో చంప కోత్పల శార్దూల మత్తేభములను మాత్రమే వాడుదురు. కళికోత్కళికలు తాళాంగ ప్రధానములైన రగడ భేదములు. సంగీత శాస్త్రమునకు సంబంధించిన త్రిశ్ర, చతురశ్ర, ఖండ, మిశ్ర సంకీర్ణగతులు క్రమముగా మూఁడు, నాలుగు, ఐదు,ఏడు, ఎనిమిది మాత్రలు కలిగి యుండును. వీనిలో దేనియందైనఁ గల మాత్రలను రెండుచేఁ గాని నాలుగుచేఁగాని యెనిమిదిచేఁగాని హెచ్చించి యా మాత్రల సంఖ్యతోఁ గూడిన యొక్కొక్క పాదము చివరఁ దత్తద్విభక్తి ప్రత్యయములు చేర్చుచునట్టి పాదము లెనిమిది రచించిన నొక కళిక యగును. ఉత్కళిక యనఁగా నర్ధ కళిక. అనఁగా కళిక పాదములలో పదునాఱేసి మాత్ర లుండిన నుత్కళిక పాదములలో నెనిమిదేసి మాత్రలే యుండును. కళికవలె నిదియు నష్టపదియే. ఇందు కళికలోవలెఁ బ్రతి పాదము చివర విభక్తి ప్రత్యయము లుండ నవసరములేదు (ప్రతాపరుద్రీయమున నిందు ప్రతి పాదాంతము నందు విభక్త్యాభాసములు), ఎనిమిదవ పాదము చివరమాత్రము విభక్తి ప్రత్యయముండవలెను. అప్పకవి

యుత్కళిక యందలి యెనిమిది పాదములు నొకటే సమాసముగా నుండవలెనని చెప్పియున్నాఁడు. కాని పెక్కు లక్ష్యములలో నీలక్షణము కనిపింపదు. లక్షణము విధింపక పోయినను ఉత్కళిక పాదములలోఁ బెక్కింట నంత్యప్రాస నియమము గోచరించుచున్నది. కళికోత్కళికలు రెండింట రెండేసి పాదముల కొక ప్రాసముండును. యతి నియమము కళిక పాదములలోనే కాని యుత్కళిక పాదములలోఁగానరాదు.

ఉదాహరణములందు ప్రథమా విభక్తికి డు,ము,వు,లలో నొకటియు, ద్వితీయా విభక్తికిని, ను, ల కూర్చి అనువానిలో నొకటియు తృతీయా విభక్తికి చేతయు, చతుర్థీ విభక్తికి కై యు, పంచమీ విభక్తికి వలనయు, షష్ఠీవిభక్తికి కి, కులలో నొకటియు, సప్తమీ విభక్తికి అందు అనునదియు వాడఁబడును. ఇతర ప్రత్యయములు కానరావు. ఉదాహరణ మందలి పద్యము లందును, కళికోత్కళికలందును విభక్తి ప్రత్యయములు వాడఁబడును గాన అవి తెలుఁగునందలి విభక్తి ప్రత్యయముల చరిత్ర నెఱుఁగుటకుఁ జాలతోడ్పడును.

సార్వ విభక్తిక మనఁగా నన్ని విభక్తులతోఁ గూడిన పద్యము. ఇందు ప్రథమాది క్రమమున నెనిమిది విభక్తులు వాడఁబడును. ఇది సాధారణముగా శార్దూల వృత్తమున నుండును. అంకితాంక పద్యమున కవిపేరు, కృతి పేరు, రచించిన సంవత్సరము చెప్పబడును. కొన్ని యుదాహరణములలో నీయిరువదియాఱవ పద్యము లేకపోవుటయుఁ గలదు.

ప్రతాపరుద్రీయమున ఉదాహరణము 'జయతి' శబ్దముతో నారంభ మగు మాలిన్యాది వృత్తములలో నొకదానితో మొదలిడ వలెననియు, తరువాత అపిచ అనుదానితో నారంభించి ప్రాసతాళములతోఁ గూడిన యెనిమిది వాక్యములు ప్రతి విభక్తికి రచింపవలెననియు, పిమ్మట విభక్త్యాభాసము లుండ వలెననియుఁ జెప్పబడియున్నది. ఈ లక్షణము సంస్కృతో దాహరణములకే యన్వయించును. తెలుఁగున 'జయతి' అను పదముతోఁగాని తత్సదృశ్య పదముతోఁగానియారంభించు నుదాహరణ మొక్కటియులేదు. "అపిచ" అనుటకు బదులు కళికలకు మొదట తెలుఁగున మఱియు ననుమాట వాడఁబడియున్నది.

అప్పకవి సద్ధలి, బద్ధలి, విద్ధలి, ఉత్ఫుల్లకము అని యుదాహరణములను నాలుగు తెగలుగా విభజించినాఁడు. అందు సంబుద్ధి విడిచి మిగిలిన యేడువిభక్తులు మాత్రమే చెప్పిన నది సద్ధలి. సంబుద్ధితోఁ గలిపి యెనిమిది విభక్తులు చెప్పిన నది బద్ధలి, సంబుద్ధితో విషమ

(1,3,5,7) విభక్తులను మాత్రమే చెప్పిన నది విద్ధలి. కేవల కళికోత్కళికలు మాత్రము చెప్పిన నది ఉత్ఫుల్లకము. విన్నకోట పెద్దన్న ఉత్ఫుల్లకమును విడిచి మిగిలిన మూఁడు మాత్రమే చెప్పినాఁడు. అప్పకవి "సంబుద్ధితోఁగూడ సప్త విభక్తులు పలుక నొప్పారు బద్ధలి యనంగ" నని చెప్ప నతఁడు "సరి విభక్తులు సంబుద్ధి సహితగాఁగఁ జెప్ప నొప్పారు బద్ధళి సిద్ధమగుచు" నని నిర్వచించినాఁడు. అట్లే అప్పకవి "సంబుద్ధితోడ విషమ విభక్తుల తోడఁబలికిన కృతి" విద్ధలి యనఁగా నతఁడు "ముక్తసంబుద్ధి విషమవిభక్తి కలితమైన కృతి" విద్ధళి యని చెప్పినాడు. ఇవి యుదాహరణముల పూర్వరూపములనియు క్రమముగా నివే యుదాహరణములుగాఁ బరిణమించినవనియు శ్రీ నిడుదవోలు వేంకటరావు గారు సూచించి యున్నారు.

యక్షగానము : ఇదియు మధుర కవితా జాతికిఁ జెందినదే. ఇది నృత్య సంగీత ప్రధానమైన దేశ రూపకము. ఇందు పాత్ర పోషణమునకే కాని కథా కల్పనమున కంతగాఁ బ్రాధాన్యముండదు. జక్కులు లేక యక్షులు, అనువారీ దేశి రూపకములను జేపట్టిన కతమున వానికి జక్కుల పాటలు లేక యక్షగానములు అనుపేరు కలిగెనని విమర్శకుల యభిప్రాయము. ఇవి సుమారు క్రీ.శ. 12వ శతాబ్దినుండియు నుండెననుట కాధారములున్నను అప్పకవికి ముందున్న లాక్షణికు లెవ్వరును వీని లక్షణమును జెప్పి యుండలేదు. అతఁడు నవ విధ రగడలలోఁ గొన్ని మార్పులు సూచించి వాని త్రిపుట, జంపె మున్నగు తాళముల కనుగుణముగాఁ జేసి యక్షగానములలోఁ బాడుదురని చెప్పియుండెను. ఈ రగడ భేదములే కాక యక్షగానములలో ఏలలు,జోలలు, సువ్వాలలు, ధవళములు, వెన్నల పదములు, తుమ్మెదపదములు, అల్లోనేరేళ్ళు, త్రిభంగులు, జక్కులరేకులు, ద్విపద త్రిపదాదులు, మంజరులు, చందమామ సుద్దులు మున్నగు నితర దేశీరచనలుకూడా చేరినవి. ఇందు సూత్రధారుఁడు రంగమున నిల్చి కథా వృత్తమును నడుపుచుండ తదుక్తులననుసరించి పాత్రలు ప్రవేశించి యాయా భావములను వ్యక్తము చేయుచుండును. ఈ యక్షగానములే క్రమముగా హరికథా రూపమునఁ బరిణామము చెందినవని కొందఱు విమర్శకుల అభిప్రాయము.

చక్రవాళము: ఇందు మొదట నొక పద్యమును పిమ్మట నెనిమిది దళములు గల కళికయునుండును. ఈ రెండును ముక్తపద గ్రస్తములును, సంబోధ నాంతములునై యుండవలయును.

మంజరి : తరుణీమణి శృంగారము, విరహము, వసంత మన్మథ విజృంభణము, వనజల క్రీడలు మున్నగునవి గల కావ్యము మంజరీ కావ్యము.

తారావళి : ఒకొక్క పద్యమున నొక్కొక్క నక్షత్రము (అశ్విన్యాది) పేరువచ్చునట్లుగా నిరువదేడు పద్యములు వ్రాసిన నది తారావళి యనఁబడును. లక్షణ మిట్లున్నను గొందఱు రచించు తారావళులలోఁ బద్య సంఖ్యయే కాని నక్షత్ర నామములు కానరావు. తొమ్మిది పద్యముల కావ్యమునకు రత్నావళియనియు, నైదు పద్యముల కావ్యమునకు పంచాననావళి యనియు పేర్లు. వీనినే క్రమముగా నవరత్నములు, పంచరత్నములు అని పిల్చుచుందురు.

అప్పకవి ముక్తకము (ఒక్క పద్యము), ద్వికము (రెండు పద్యములు కావ్యము),త్రికము (మూఁడు పద్యముల కావ్యము), వారణమాల (ఎనిమిది పద్యముల కావ్యము), భాస్కర మాలిక(పెంద్రెండు పద్యముల కావ్యము), శశికళ (పదియాఱు పద్యముల కావ్యము), త్రిశంత్తు (ముప్పది పద్యముల కావ్యము), పంచాశత్తు (ఏఁబది పద్యముల కావ్యము), శతకము (నూఱు పద్యముల కావ్యము). అష్టోత్తర శతకము (నూటెనిమిది పద్యముల కావ్యము), పంచశతి (ఐదువందల పద్యములు గల కావ్యము), సప్తశతి (ఏడువందల పద్యములు గల కావ్యము) మున్నగు వానిని గూడ సూచించి యుండెను.

ఖండ కావ్యము : మహా కావ్య లక్షణములలో నేకదేశమును మాత్రము గ్రహించి రచించిన కావ్యము ఖండ కావ్యము. ఉదా: మేఘ సందేశము. ఆధునిక యుగమున నాంధ్రమందుఁ బలువురు ఖండకావ్యములను రచించి యున్నారు.

యుగ్మకము, సందానితకము, కలాపకము,కులకము అనునవి క్రమముగా, నొకే క్రియతో నన్వయము గల రెండు మూఁడు నాలుగైదు పద్యముల సమూహములకు పేర్లు.

కోశము : అన్యోన్యానపేక్షకములైన శ్లోకముల సమూహమునకు కోశమని పేరు.

వాకో వాక్యము : ఉక్తి ప్రత్యుక్తిరూపములైన వాక్యోపవాక్యములతోఁ గూడి యుండినది వాకోవాక్యము. ఇందుకై ప్రత్యుక్తు లిరువురికే కాని పలుమందికిఁ కాని కూర్ప వచ్చును. కవి స్వయముగాఁ జూచి చెప్పిన కథ ఆఖ్యాన మనియు నితరుల వలన విని చెప్పిన దాని కుపాఖ్యాన మనియు నామములు.

గాథ : జననీ జనకులు, పితృదేవతలు, భూదేవి మున్నగు వారిని గూర్చి చేయు స్తోత్రమునకు గాథ యని పేరు. ఇది దాతలయు వీరపురుషులయునుదార కృత్యములను గూడ స్తుతింప వచ్చును. దీనికి నారాశంసి యని నామాంతరము.

దండకము : ఇది స్తోత్ర రూపమైన కావ్యము. ఇది సాధారణముగా భక్తి రసమయమై యుండును. ఇందు త,న,స,హ గణములలో నొకదానిని మొదట నిడి తరువాత పెక్కు తగణములను గూర్చి చివర నొక గురువు నుంచవలయును. ఇందు యతి ప్రాసల నియమము లేదు.

చంపూకావ్యములు : గద్యపద్యోభయమైన కావ్యమునకు చంపువని పేరు. సంస్కృతమున భారత చంపువు, రామాయణ చంపువు మున్నగు చంపూ కావ్యములున్నవి. అందు రఘువంశాది కావ్యములు కేవల పద్య కావ్యములే, తెలుఁగున నిర్వచనోత్తర రామాయణమును ద్విపద కావ్యములును దప్ప మిగిలిన పూర్వ కావ్యము లన్నియుఁ జంపూ కావ్యములే. సంస్కృతమున కావ్య ప్రబంధ శబ్దములు రెండును సమానములే. అందు గద్య ప్రబంధము, పద్య ప్రబంధము, దృశ్య ప్రబంధము అను మాటలు వినవచ్చును. వ్యుత్పత్తిని బట్టి ప్రకృష్టమైన బంధము గల యే కావ్యము నైనను బ్రబంధ మనవచ్చును. తెలుఁగున తిక్కన తన భారతమును ప్రబంధ మండలి యని పేర్కొనెను. ఎఱ్ఱనకుఁ బ్రబంధ పరమేశ్వరుఁ డను బిరుదమున్నది. నన్నెచోడుని కుమార సంభవము, శ్రీనాథుని నైషధము, పిన వీరభద్రుని శృంగార శాకుంతలము నిజముగా ప్రబంధములే. కాని యీ ప్రబంధ పదము తెలుఁగున పెద్ద నాదులు రచించిన మను చరిత్రాదులకే రూఢముగ వాడఁబడుచున్నది. వానిని బట్టి ప్రఖ్యాత వృత్తము, ధీరోదాత్త నాయకము, శృంగార రస ప్రధానము, అష్టాదశ వర్ణన శోభితము, ఆలంకారిక రచనా మయము, పంచాశ్వాస పరిమితమునైన కావ్యము ప్రబంధమని నిర్వచింపవచ్చును. ఇందు సంస్కృత మందలి దృశ్య శ్రవ్య కావ్య లక్షణములు మిళితములై యున్నట్లు కానిపించును. ఇందెడనెడ శబ్దార్థాలంకార మయములైన దీర్ఘ వచనములు కూడ నుండును. కావున నివి చంపూ కావ్యములే కాని కేవల పద్య కావ్యములు కావు.

గద్య కావ్యము : సంస్కృతమున గద్య పద్యములకు సమాన గౌరవమున్నది. కాదంబర్యాదులు రఘువంశాదుల వలెనేయందు గొప్ప కావ్యములుగాఁ బరిగణింపఁబడును. మఱియు సంస్కృతమున గల " గద్యం కవీనాం నికషం వదంతి" అను నభియుక్తోక్తి గద్య

గౌరవమునకుఁ దార్కాణము. ముక్తకము, వృత్తగంధి, ఉత్కలికా ప్రాయము, చూర్ణము లేక చూర్ణకము అని గద్యము నాలుగు విధములు. సమాస రహితమైన గద్యము ముక్తకము. వృత్త భాగవంతమైన గద్యము వృత్త గంధి. దీర్ఘ సమాన భూయిష్ఠమైన గద్య ముత్కలికా ప్రాయము. అల్ప సమాస సహితమైన గద్యము చూర్ణకము. ఇది ముక్తకమువలె నసలు సమాసములు లేనిది కాదు; ఉత్కలికా ప్రాయమువలె దీర్ఘ సమాస బహుళము కాదు. రెండింటికి నడిమి స్థితి కలది.

ఆఖ్యాయిక : ఇందుచ్ఛ్వాసాది విభాగములును మధ్య మధ్య నితరుల పద్యములు నుండును.

కథ : అవాంతర విభాగములుకాని పద్యములు కాని లేక యుండు గద్య ప్రబంధము కథ. దీనికిని ఆఖ్యాయికకును భేదము లేదని దండి చెప్పి యుండెను. ఆనందవర్ధనుఁడు మాత్రము వానికి పై భేదమును సూచించెను. శివతత్త్వరత్నాకరము సత్యవృత్తాంతము కలది ఆఖ్యాయిక యనియు, కల్పిత వృత్తాంతము కథ యనియు ఆ భేదమును చక్కగా సూచించెను. నాయకుఁడు తన చేష్టాదికమును స్వయముగాఁ జెప్పునది ఆఖ్యాయికయని వేఱొక లక్షణము కలదు. దీనిని బట్టి ఆఖ్యాయికను స్వీయ చరిత్ర లేక ఆత్మకథ అని చెప్పవచ్చును.

ఖండ కథ : ఇది యేకదశ వర్ణనము గల గద్య ప్రబంధము.

పరికథ : చతుర్విధ పురుషార్థములలో నొక్క దానిని గ్రహించి చిత్ర విచిత్రముగా వర్ణించు గద్య ప్రబంధము పరికథ.

పర్యాయబంధము : వసంతాది ఋతువులను గాని మహారాజులు మున్నగు వారి విజయ యాత్రాదులను గాని వర్ణించు గద్య ప్రబంధము పర్యాయ బంధము.

సకల కథ : ధర్మార్థ కామ మోక్షము లంతమునఁగల యితి వృత్తముతోఁ గూడిన గద్య కావ్యము సకలకథ.

ఉపకథ : పెద్ద కథలో నడుమవచ్చు చిన్న కథ. ఇది పురాణేతిహాసములందలి ఉపాఖ్యానము వంటిది.

ఆంగ్ల భాషా పరిచయ మలవడిన పిమ్మట ప్రతిభావంతులైన యువతీ యువకులు

తెలుఁగున పలువిధములైన గద్య రచనలు కావించుచున్నారు. అందు నవల, కథానిక, వ్యాసము, విమర్శ,జీవిత చరిత్ర, ఆత్మకథ మున్నగునవి ముఖ్యములైనవి.

దృశ్యకావ్యములు : దృశ్య కావ్యములు రంగము మీఁద బ్రదర్శితములగుచుండఁగా జూచుటకు యోగ్యములైనవి. వీనికి రూపకములని సాధారణ నామము. రూపకములు ప్రధానముగాఁ బది విధములు.

1. నాటకము: ఇది ప్రఖ్యాత వస్తుకము అనఁగా రామాయణ భారతాదులనుండి గ్రహించిన వస్తువు కలది. మూలకథయందు రసమునకుఁగాని నాయకునకుఁగాని విరుద్ధములగు వర్ణానాదులను నాటక కర్త విడువవలయును లేదా వానిని యథోచితముగా మార్చవలయును. ఇందలి నాయకుఁడు ధీరోదాత్తుఁడు. అంగి రసము శృంగార వీరములలో నొకటి. మిగిలిన వంగరసములుగానుండ వచ్చును. ఇందు పంచ సంధులను జక్కగాఁ గూర్పవలయును. నిర్వహణసంధిలో నద్భుత రసమును వర్ణింప వలయును. ఇందైదు మొదలు పది యంకముల వఱకు నుండ వచ్చును. నాయక వధము సర్వదా పరిత్యాజ్యము. ఒకవేళ నాయకుఁడు మరణించుచో వానినిఁ బునరుజ్జీవితు నొనరింపవలయును. ఇందునీరసములు, అనుచితములు, ఉద్వేగకములునైన సన్ని వేశములను దృశ్యములగాఁ జేయక విష్కంభాదులచే సూచ్యక మాత్రములను గావింపవలెను. ఇది నాందీ ప్రస్తావనలతో మొదలిడి భరత వాక్యముతో ముగియును.

2. ప్రకరణము : ఇది కల్పిత వస్తుకము అనఁగా నిందలి కథ లోక సంబంధియు కవి కల్పితమునై యుండును. ఇందలి రసము శృంగారము, నాయకుఁడు ధీరశాంతుఁడు. అతఁడమాత్య విప్ర వణిజులలో నెవ్వఁడైనఁగావచ్చును అతఁడు ధర్మార్థ తత్పరుఁడును అపాయాంతరిత కార్య సిద్ధియుగాఁదగును. ఇందు కులజ కాని, వేశ్య కాని,కులజా వేశ్య లిరువురును గాని నాయికలుగా నుండవచ్చును. ఇందు పది యంకములుండును. మిగిలిన లక్షణము లందు దీనికిని నాటకమునకు భేదములేదు.

3. భాణము : ఇందు కవి కల్పితమైన ధూర్తవృత్త మితివృత్తము. సమర్థుఁడు విద్యావంతుఁడునగు విటుఁడను నొక పాత్రచేఁ బ్రయోగింపఁబడు నిందు సంబోధ నోక్తి ప్రత్యుక్తు లాకాశభాషితముల మూలమున జరుగుచుండును. భారతీ వృత్తిని, సాంగములైన

ముఖ నిర్వహణ సంధులను, గేయాది దశ లాస్యాంగములను ఇందుపయోగింప దగును. శౌర్య వర్ణనచే వీర రసము కాని సౌభాగ్య వర్ణనచే శృంగార రసము కాని యిందు సూచింపఁ బడును.

4. ప్రహసనము : ఇది హాస్య రస ప్రధానమైన రూపకము. వస్తువు, సంధులు, లాస్యాంగములు మున్నగువాని విషయమున నిది భాణముతో సమానము. ఇది శుద్ధ వికృత సంకీర్ణ భేదములచే త్రివిధము. అందు పాషండ, శ్రోత్రియ బ్రాహ్మణబ్రువ, భిక్ష్వాదుల హాస్యమయవచనములతోఁ గూడినదియు చేట చేటీ విటాది ప్రయుక్తమగునదియు వేష భాషా చేష్టాదులచే నవ్వు పుట్టించు నదియునగు నట్టిది శుద్ధము. "కంచుకి షండ తాపస వృద్ధాదులు విట చార భటాదుల వేష భాషలు కలవారుగా వర్ణింపఁబడుటచే విపరీత ధర్మము కలది వికృతము". "ముఖనిర్వహణ లాస్యాంగములే కాక ఉద్ఘాత్యకాదులగు వీథ్యంగములు కూడ నధికముగాఁ జూపఁదగి, చోరకితవాది ధూర్తులతోఁ గూడి సంకరమైయుండునది సంకీర్ణము"

5. డిమము : ఇది ప్రఖ్యాత వస్తుకము. ఇందు పదునార్గురు ధీరోద్ధత నాయకులుందురు. వారు దేవ కిన్నర గంధర్వ యక్ష రాక్షస భుజగ భూత ప్రేత పిశాచాదులలోని వారై యుందురు. ఇందవమర్శ సంధి కాక మిగిలిన నాలుగు సంధులను, కైశికి వృత్తికాక మిగిలిన మూఁడు వృత్తులను ప్రయోగింప వలయును. ఇందు రౌద్ర మంగి రసము. హాస్య శృంగారములు కాక మిగిలినవి యంగ రసములు. మాయ, ఇంద్రజాలము, క్రోధము, అద్భుతము, సూర్య చంద్రగ్రహణములు, ఉల్కాపాతము మున్నగు వాని నిందు వర్ణింప వలయును. ఇందు నాలుగంకము లుండును. ప్రస్తావన, పాత్ర ప్రవేశము మున్నగు వాని విషయమున నిది నాటక సదృశము.

6. వ్యాయోగము : ఇది ప్రఖ్యాత వస్తుకము, ఏకాంకము. ధీరోద్ధతులు పలువు రిందు నాయకులుగా నుందురు. ముఖ ప్రతిముఖ నిర్వహణసంధులు మూఁడే యిందుండును. ఇందు స్త్రీ నిమిత్తము కాని యుద్ధమును జూప్పించ వలయును. హాస్య శృంగార శాంతములు కాక మిగిలిన యాఱు రసములు నిందుండును. కైశికి వృత్తి కాక మిగిలిన మూఁడు వృత్తులను ఇందు వర్ణింప వచ్చును. ప్రస్తావనాది నాట్య ధర్మములం దిది నాటక సదృశము.

7. సమవాకారము : ఇది మూఁడంకములతోఁ గూడి ప్రఖ్యాత వస్తుకమై యుండును. ఇందు వీర రస మంగి. మిగిలినవి అంగ రసములు. వృత్తులు నాలుగును వర్ణితము లగును.

ఇందు ప్రసిద్ధులైన దేవదానవులు పంద్రెండుగురు నాయకులుగా నుందురు. అవమర్శ సంధి కాక మిగిలిన నాలుగు సంధులు నిందుగూర్పఁదగును. అంకములన్నింటి యందు కపట శృంగారోపద్రవములు మూఁడును వర్ణితములు కావలయును. 36 గడియల కాల మిందు ప్రమాణము. వీథ్యంగముల నిందు యథోచితముగా రచింపఁదగును.

8. వీథి : ఇది కల్పితేతివృత్తము, ఏకాంకము. సాంగములగు ముఖనిర్వహణ సంధులను, లాస్యాంగములను, ఉద్ఘాత్యకాదులగు 13 వీథ్యంగములను ఇందు ప్రయోగింపఁ దగును. కైశికీవృత్తితోఁగూడిన శృంగార మిందు ప్రధాన రసము. ఇతర రసముల నిందంగములుగా వర్ణింప వచ్చును. ఇందొకటి రెండు పాత్ర లుండును. వీథి వలె నంగములకు మార్గ మగుటచే దీనికీ పేరు కల్గినది.

9. అంకము : దీని కుత్సృష్టి కాంకమని నామాంతరము. ఇందు వస్తువు ప్రఖ్యాతమో కవి కల్పితమో యైయుండును. ఇందు కరుణము ప్రధాన రసము. వీరాదులంగములు. ప్రాకృత మనుష్యులిందు నాయకులు. "ఇందు స్త్రీ విచార మధికముగా నుండును. జయాపజయాదులు దిఙ్మాత్రముగా సూచింపఁబడును." సంధులు, వృత్తులు మున్నగు వాని విషయమున నిది భాణముతో సమానము.

10. ఈహామృగము : మృగమువలె అలభ్యయగు నాయికను నాయకుఁడిందుఁ గోరును గావున దీనికీ పేరు కల్గినది. ఇది మిశ్ర వస్తుకము. అనఁగా ప్రఖ్యాతమును కల్పితమునైన వస్తువు కలది. ఇందు నాలుగంకము లుండును. ముఖ ప్రతిముఖ నిర్వహణ సంధులు మూఁడింటి నిందుఁ గూర్ప వచ్చును. ధీరోద్ధతులైన నర దివ్యులలో నొకరు నాయకులుగాను వేఱొకరు ప్రతి నాయకులుగాను ఇందు వర్ణింపఁదగుదురు. అనురక్త కాని దివ్య స్త్రీని బలాత్కరించుట యనున దిందు ముఖ్యము. అందుచే శృంగార రసాభాస మిందు గోచరించును. కారణాంతరములచేఁ గాక నాయికా నిమిత్తముననే నాయక ప్రతినాయకుల కిందు వైరము వర్ణింప వలయును. అయుక్తకారియగు ప్రతి నాయకుఁడు చేఁజిక్కినను అతనిని వధింపరాదు. ప్రతి నాయక కారణమున నిందు వీరాది రసములు కూడ ప్రధానములు కాఁ దగునని భరతుని మతము. మిగిలిన లక్షణములలో దీనికిని వ్యాయోగమునకును భేదములేదు.

పైని పేర్కొనబడిన దశ రూపకములు కాక కొన్ని ఉపరూపకములు కూడఁగలవు. సాహిత్యదర్పణ కారాదులు 18 ఉప రూపకములను శారదా తనయుఁడు 2 ఉప రూపకములను

బేర్కొనిరి. భరతుండు దశ రూపకములను నాటికను మాత్రము చెప్పి యుండెను. అతఁ డుపరూపకములను చెప్పి యుండలేదు. భోజుఁడు ప్రకరణి నాటిక అనువానిని గూడ రూపకములలోనే చేర్చి రూపకముల సంఖ్య పండ్రెండు గావించెను. లక్షణ గ్రంథములలో మొత్తము 36 ఉపరూపకముల నామములు కనఁబడుచున్నవి. వానిలో నాటిక, తోటకము, నాట్యరాసకము అనునవి ముఖ్యములైనవి.

నాటిక : ఇది కల్పిత వస్తుకము. చతురంకము. శృంగార రస ప్రధానము. ధీరలలితుఁ డిందు నాయకుఁడు. అతఁడాభిజాత్య సంపన్నయు ప్రగల్భయునగు జ్యేష్ఠ భార్యయుండఁగనే ముగ్ధయగు మఱొక నాయికను ప్రేమించి అనురాగము ప్రదర్శింప వచ్చును. ఆ నాయిక దేవి కాసన్న వర్తినియు సంగీత వ్యాపృతయు నైయుండవలయును. దేవి నాయికా నాయకుల ప్రణయమున కెడనెడ భంగము కలిగింప యత్నించుచున్నను తుదకుఁదానే వారికి సమాగమము చేకూర్చును. ఇందు పురుష పాత్రలకంటె స్త్రీ పాత్రల సంఖ్య యధికముగా నుండును. సంధి ప్రవేశక ప్రస్తావనాదుల విషయమున నిది ప్రకరణ సదృశము. నాటకప్రకరణ లక్షణముల సంకర మిందుండుటచే నిది సంకీర్ణ మని చెప్పఁబడును (ఉదా. రత్నావళి నాటిక).

తోటకము : ఇది చాల వఱకు నాటక తుల్యము. నాటకమునకు తోటకమునకు స్వల్పభేదములు మాత్రము కలవు. ఇందైదుకాని ఏడుకాని యెనిమిదికాని తొమ్మిదికాని యంకము లుండవచ్చును. అంకము లన్నింట విదూషకుఁ డుండవలెనని కొందఱి మతము. అంగిరసము శృంగారము వీరహాస్యాదు లంగములు. దివ్యమానుష సంయోగ మిందలి ముఖ్య లక్షణము. (ఉదా. విక్రమోర్వశీయము)

నాట్యరాసకము : ఇది కల్పిత వస్తుకము. ఏకాంకము. ఇందు నాయకుఁడు ధీరోదాత్తుఁ డు. నాయిక వాసకసజ్జిక. పీఠమర్దుఁడు నాయక సహాయుఁడు. శృంగార మంగి రసము, హాస్య మంగ రసము. సంధి ప్రస్తావనాదులందిగి భాణ సదృశము.

ఆంగ్లేయుల శ్రవ్యకావ్యములు పరాశ్రయములు (objective) ఆత్మా శ్రయములు అని ముఖ్యముగా రెండురకములు. పరాశ్రయ కావ్యములలో పురాణము (Epic), వీర కావ్యము (Ballad), కథా కావ్యము (Narrative), ఉపదేశ కావ్యము. (Didactic poem), వర్ణన కావ్యము (Descriptive poem), లఘుకావ్యము ముఖ్యములైనవి. ఆత్మాశ్రయములలో గేయ కావ్యము (Lyric), మర్మకావ్యము (Mystic poem),మృతి విషయ కావ్యము

(Elegy),అధిక్షేప కావ్యము (Satire) లేఖా కావ్యము (Epistle), ఖండ కావ్యము (Sonnet), ఉదాత్తగేయము (ode), అనునవి ప్రధానములైనవి.

ఆంగ్లమునందలి దృశ్యకావ్యములలో మోదాంతనాటకము (Comedy), విషాదాంతనాటకము (Tragedy), ప్రహసనము (Farce) మూకాభినయ రూపకము (Pantomime), గేయరూపకము (Melo drama), నృత్యరూపకము (Ballet), సంగీత రూపకము (Opera) అనునవి ముఖ్యములైనవి.

ఆధునిక కాలమున ప్రపంచమందలి ప్రధాన భాష లన్నింట ఏకాంకికలు,(One-act Plays), విరివిగా వ్రాయబడుచు ప్రచారము నందుచున్నవి.

3. రససోపానము

1. రస స్వరూపము :

"వాక్యం రసాత్మకం కావ్య" మని విశ్వనాథుఁడు కావ్య శబ్దమున కిచ్చిన నిర్వచనము. రసాత్మకమైన వాక్యమే కావ్యమని దీని యర్థము. రసహీనమైన గ్రంథము కావ్యము కాఁజాలదు. ఏలయన నది యితర ప్రయోజనముల నెన్నిటిని సమకూర్చినను గావ్యమునకుఁ బరమ ప్రయోజనమైన రసానందము నొసంగఁజాలదు. కావ్యమునకు రసమాత్మ,తజ్జన్యమైన యానందము పరమ ప్రయోజనము. రస మనగాఁనేమి?

రస పదము ఋగ్వేదమున సోమరసము, జలము, పాలు, సారము అను నర్థములందు వాడఁబడినది. అథర్వవేదములో నది రుచి యను నర్థమునఁగాన వచ్చుచున్నది. ఉపనిషత్కాలమున దానికి సార మను నర్థ మేర్పడినది. జగత్తునకుఁ బ్రధాన సారభూత మైనదియు శాశ్వతానంద సంధాయకమును నగు పరమాత్మ రసపదమున కర్థము. అందుచేతనే రసానందము బ్రహ్మానంద సహోదరమని చెప్పఁబడుచున్నది.

విభావానుభావములచేతను, సాత్త్విక వ్యభిచారి భావములచేతను స్వాదుత్వమును బొందింపఁబడు స్థాయి భావమే రసము. స్థాయి యనఁగా స్థిరముగా నుండునది. సజాతీయ విజాతీయ భావములచేఁ దిరస్కరింపబడక రస స్ఫూర్తి యగు పర్యంతము సహృదయ హృదయముల నిల్చి యుండును కావున దానికి స్థాయిభావమను పేరేర్పడినది. ఇది సహృదయుల హృదయమున వాసనా రూపమున నున్నప్పుడు కేవల జలమువలె నా స్వాద్యమానముకాఁజాలదు. పులకందముల కలయికచే జలము రసాయనమై యాస్వాద్యమాన మగువిధమున విభావానుభావ సంచారి భావములచేఁ బరిపుష్టమైన స్థాయిభావము మిక్కిలి యాస్వాద్యమానము కాఁజాలును. శృంగార హాస్య కరుణ వీర భయానక బీభత్స రౌద్రాద్భుత శాంతములను తొమ్మిది రసములకును గ్రమముగా రతి, హాస,శోకోత్సాహ, భయ జుగుప్సా, క్రోధ , విస్మయ, శమములు స్థాయి భావములు.

సామాజిక హృదయములు వాసనా రూపమున బీజ ప్రాయముగా నున్నరత్యాది స్థాయిభావముల నంకుర రూపమున నాస్వాద్యమానముగా నొనర్చునవి విభావములు. లోక వ్యవహారమున రత్యాదుల యుత్పత్తికి హేతువులైన నాయకాదులే కావ్యములందు విభావములని చెప్పఁబడునని సాహిత్యదర్పణము. విభావము ఆలంబన విభావము, ఉద్దీపన విభావముఅని రెండు విధములు. "ఆలంబనం నాయకాదిస్త మాలంబ్య రసోద్గమాత్", ఆలంబన మనఁగా నవలంబము. నాయికా నాయకు లాలంబన విభావము, వారి నవలంబించియే రసోదయ మగును. రసము నుద్దీపింపజేయునది ఉద్దీపనవిభావము. ఇది సహజము, తటస్థము అని ద్వివిధము. శృంగారమున యౌవన, భూషణ, చేష్టాదులు సహజోద్దీపన విభావములు. మలయానిల చంద్రాదులు తటస్థోద్దీపన విభావములు. కొందఱు చంద్రాదులకు మదనుని గూడఁజేర్చిరి. అందుచేతనే కవులు విరహ వర్ణన సందర్భము లందుఁ జంద్రమలయానిల దూషణముతో పాటు మన్మథోపాలంభనమును గూడఁ గావింతురు.

తమ తమ కారణములచే నాయికా నాయకులం దుద్బుద్ధములైన స్థాయి భావములను బైకిఁ బ్రకటనము చేయు క్రియావిశేషములు కావ్య నాట్యాదులలో సమభావము లనఁబడును. రత్యాది స్థాయి భావములను సహృదయులచే ననుభవింపఁజేయును గావున వీని కనుభావములను నామ మేర్పడినది. విభావములు కారణ రూపములు. అనుభావములు కార్య రూపములు మనోభవములైన హావ భావాదులును, అయత్నజములైన శోభాకాంతి దీప్త్యాదులును, స్వభావజములైన లీలా విలాసాదులును, సాత్త్విక భావములును, ఇంకను సంభావ్యమానములగు నితర చేష్టలును శృంగార రసమున అనుభావము లగును. ఈ యనుభావములు మనోభవములు, వాగ్భవములు, కాయజములు, బుద్ధిజములు అని నాలుగు విధములుగా నుండునని కొందఱి మతము. "విభావ మనుభావమును, అనుభావము విభావమును, ఆ రెండును సంచారులును, సంచారులు విభావాను భావములును అగు"నని భావ ప్రకాశము చెప్పుచున్నది.

సత్త్వ సంజాతములైన భావములు సాత్త్విక భావములు, సత్త్వమనఁగానేమి యను విషయమున భిన్నాభిప్రాయములున్నవి. అభినయాది ముఖమునఁ బరగత సుఖదుఃఖముల యెడ నంతఃకరణము సుముఖ మగుట సత్త్వమని కొందఱును, రజస్తమములచే నస్పృష్టమైన మనస్సు సత్త్వమని కొందఱును, స్వాత్మ విశ్రాంతములైన రత్యాదులను బ్రకాశింపఁ జేయునాంతర ధర్మము సత్త్వమనికొందఱును, భావాంతరముల సంబంధము లేకుండ రసమును

ప్రత్యక్ష మొనర్చు బల విశేషము సత్త్వమని కొందఱును జెప్పుచున్నారు. స్తంభము, ప్రళయము, అశ్రువు, స్వేదము,వైశ్వర్యము, రోమాంచము, కంపము, వైవర్ణ్యము అను నెనిమిదియు సాత్త్వికభావములు. రసతరంగిణి కర్త జృంభ మను నవమ సాత్త్విక భావమును గూడ బేర్కొని యున్నాడు. స్థాయి వ్యభిచారు లాభ్యంతర భావములు. సాత్త్విక భావములు బాహ్యములు.

రసవ్యక్తికిఁ దోడ్పడు భావములు సంచారి భావములు. వీనికే వ్యభి చారులని నామాంతరము. విభావానుభావ సాత్త్విక భావముల కన్న నతిశయించి రసానుగుణముగా వర్తించును. కావున వీనికి వ్యభిచారులను పేరేర్పడినది. ఇవి స్థాయి భావములను లెస్సగాఁ బోషించి రస్యమానములఁగావించును. సముద్రమునఁ దరంగముల వలెనివియుస్థాయి భావమున మజ్జనోన్మజ్జనములు కావించుచుఁ దిరోభా వావిర్భావములను బొందుచుండును. నిర్వేద శ్రమ దైన్యజాడ్యాదులివి ముప్పది మూఁడు. ఆలంకారికులలోఁ గొందఱీ సంఖ్యను దగ్గించిరి. కొందఱు మఱికొన్ని భావములను గలిపి హెచ్చించిరి.

మన యాలంకారికులలోఁ బ్రప్రథమమున రస చర్చ గావించిన వాఁడు భరతాచార్యుఁడు. అతఁడు ప్రధానముగా రూపక రసమును గూర్చియే జెప్పియుండెను. తరువాత ఆనందవర్ధనుఁడు శ్రవ్యకావ్యములకుఁ గూడ దానిని సమన్వయించెను. శ్రవ్య కావ్యములలో దృశ్య కావ్యములందు వలె నాయకాదులు ప్రత్యక్షముఁగాఁ గానఁబడనప్పుడు సామాజికులు నాయకాభేదమును బొంది రసాస్వాదనము నెట్లు చేయజాలుదు రను శంకకు వాక్యపదీయ కారుఁడైన భర్తృ హరి శ్రవ్య కావ్యములందు నాయకులు తత్తద్వర్ణన విశేషములచే రూపమును బొంది హృదయ ఫలకమునఁ బ్రత్యక్షముగా గోచరింతురనియు, నప్పుడు సామాజికుఁడు తదభేదము నొంది రసాస్వాదనము చేయఁజాలునని యు సమాధానము చెప్పి యున్నాఁడు.

రసము ననుభవించు వారెవ్వరను విషయమున భిన్నాభిప్రాయములున్నవి. “విభావానుభావ సాత్త్విక వ్యభిచారి సంయోగాద్రసనిష్పత్తిః” అను భరతుని రస సూత్రము నందలి సంయోగ నిష్పత్తి పదములను భట్ట లోల్లటుఁడు, శ్రీశంకుకుఁడు, భట్టనాయకుఁడు, అభినవగుప్తుఁడు ననువారు వేర్వేఱు విధమున వివరించి యుండిరి.

లోకమునందలి హర్ష శోకాదుల వలనఁ జూచు వారికి హర్ష శోకములే కలుగును. కావ్యములం దట్లుగాక యన్నిటి వలనను ఆనందమే కలుగును. ఈ యానంద మలౌకికము.

కావ్య శిల్ప మలౌకిక మగుటయుఁ గావ్యగత నాయకాదులలౌకికు లగుటయు నిందుకుఁ గారణములు, లోకమున శోక హర్షాదులకుఁ గారణములైన భావములే కావ్యములం దలౌకిక విభావములనుపేర వ్యవహృతములై హర్షమునే కలిగించును.కావ్యము లందలి నాయకాదులు లౌకిక నాయకాదుల కను కర్తలు. అనుకరణ మానందావహము. ఈ యనుకరణ విశేషము చేతనే కళలెల్ల నానందమును జేకూర్చుచున్నవి.

కావ్య వర్ణితములైన విభావాదుల వర్ణనలచే సహృదయులందలి సత్త్వగుణముద్రిక్త మగును. ఈ యుద్రేకము వలన వారి హృదయములలో వాసనా రూపముగా నున్న రత్యాదు లుద్బుద్ధములగును. మరల మరల భావించు కొనుటచే విభావాదులు సాధారణము లగును. అప్పుడు సహృదయుని పరిమితత్వ మడఁగును. అతఁడు తన్ను, ప్రపంచమును విస్మరించి యనిర్వచనీయమైన యానందమును బొందును. అతఁడు విభావాదుల ననుసంధించు కొని చర్వణము చేయుచున్నంత కాలము ఆనందము ననుభవించుచునే యుండును. ఆ చర్వణ మాగిపోయినంతనే ఆనందము ముగియును. ఈ యానందమే రసానంద మని చెప్పబడును. బ్రహ్మానందము కేవలానందము, రసానందము విభావాదియుక్తము. అందుచేతనే యది బ్రహ్మానంద సహోదరమని చెప్పబడినది. తైత్తిరీయోపనిషత్తు నందలి ఆనందవల్లిలో బ్రహ్మానంద స్వరూపము వ్యక్తము చేయఁబడినది. యువకుఁడు సాధువు బలిష్ఠుఁడునగు మహారాజు పొందు నానందము మానుషానందము బ్రహ్మానందముతో నించుమించుగాఁ దుల్యమైనది.

2. రసములు, స్థాయి భావాదులు :

విభావానుభావ సాత్త్విక వ్యభిచారిభావ సముల్లాసితమైన స్థాయి భావమే రసము. శృంగారము, హాస్యము, కరుణము, వీరము, భయానకము, బీభత్సము, రౌద్రము, అద్భుతము, శాంతము అనునవి తొమ్మిదియు రసములు. శృంగారము నుండి హాస్యమును, రౌద్రమునుండి కరుణమును, వీరమునుండి అద్భుతమును, బీభత్సమునుండి భయానకమును బుట్టినవని శృంగార తిలకమునఁ జెప్పఁబడినది. వీనిలో మహాకావ్యమున శృంగార వీరరసములలో నొకటి ప్రాధాన్యము వహింప వలెననియు మిగిలిన వంగరసములుగా నుండవలెననియు పలువురు లాక్షణికులు తెల్పియుండిరి. సాహిత్య దర్పణకర్త శాంతమునకుఁ గూడఁ బ్రాధాన్య మంగీకరించెను. ధర్మానుబంధియగు శృంగారమును ధర్మ రక్షణదక్షమగు వీరమును లోకకల్యాణ హేతువులగుటయే కావ్యము లందు వానికిఁ బ్రాధాన్య మీయఁబడుటకు గారణము.

శృంగారమునకు రతియు, హాస్యమునకు హాసమును, కరుణమునకు శోకమును, వీరమున కుత్సాహమును, భయానకమునకు భయమును, బీభత్సమునకు జుగుప్సయు, రౌద్రమునకుఁ గ్రోధమును, అద్భుతమునకు విస్మయమును, శాంతమునకు శమమును స్థాయిభావములు. ఇవి వాసనా రూపమున సామాజికుల హృదయములందుండి విభావానుభావాదులచేఁ బోషింపఁబడి రసత్వమును బొందును. ఇవి సజాతీయ విజాతీయ భావములచేఁ దిరస్కరింపఁ బడని రూపము గలవై రసస్ఫూర్తి పర్యంతము సామాజిక హృదయము లందు వర్తించుచుండును.

రతి : నాయికా నాయకుల హృదయములఁ బుట్టు సంభోగ విషయమగు నభిలాషకు (లేక కామమునకు) రతియని పేరు. స్త్రీ పురుషుల అన్యోన్యాలంబనము గల ప్రేమాఖ్య మగు చిత్తవృత్తి విశేషము రతియని రస గంగాధరము. ఈ రతి అంకుర పల్లవ కలికా ప్రసూన ఫల భోగావస్థలందుఁ గ్రమముగా ప్రేమ, మాన, ప్రణయ, స్నేహ, రాగానురాగములను పేర్లతో పేర్కొనఁబడుచుండును. ఈ యారవస్థలలో మొదటి యైదును పూర్వరాగమందును ఆఱవదైన భోగము సంభోగమందును కలుగుచుండును. రతి మొదట నాయికకే కలిగినట్లును, ఆమె యింగితములచేఁ దరువాత నాయకుఁడనురక్తుఁడైనట్లును, బిమ్మట సంభోగము వర్తిల్లునట్లును వర్ణించుట సహజ సుందరముగా నుండునని రుద్రటుఁడు చెప్పి యున్నాఁడు.

హాసము : అతి వికృతములైన నటాదుల యాకారాలాప చేష్టితాదులను గనుఁగొనునప్పుడు కలుగు మనో వికాసము హాస మనఁబడును. వాగంగాది వికారములను దర్శించుట వలనఁ గలుగు వికాసాఖ్యమను చిత్తవృత్తి విశేషము హాసమని రస గంగాధరము.

శోకము : ఇష్టజన విరహాదులచే హృదయమునఁ గల్గు దుఃఖము శోక మనఁబడును. ఆది శబ్దముచే వినాశము, శాపము, క్లేశము, బంధనము, వ్యసనము మున్నగు వానిని గ్రహింపవలయును. పుత్రుఁడు మున్నగు వారి వియోగ మరణాదుల వలనఁగలుగు వైక్లబ్యాఖ్యమగు చిత్తవృత్తి విశేషము శోకమని రస గంగాధరము.

ఉత్సాహము : లోకోత్తర కృత్యములు చేయగోరి యొనర్చు గాటమైన ప్రయత్నమున కుత్సాహమని పేరు. పరపరాక్రమ క్షైణ్యాదులను స్మరించుట వలనఁ గల్గు ఔన్నత్యాఖ్యమగు చిత్తవృత్తి విశేష ముత్సాహమని రస గంగాధరము.

భయము : క్రూరాకారాదులను జూచునప్పుడు ప్రాణుల హృదయ మునఁగల్గు ననర్థ శంక భయమనఁబడును. వ్యాఘ్ర దర్శనాదులచే జనించు పరమార్థ విషయకమైన వైక్లబ్యాఖ్యమగు చిత్తవృత్తి విశేషము భయమని రసగంగాధరము. భయమును త్రాసమును సమానార్థకములుగానే కనిపించినను వానివలనఁగల్గు ననర్థశంకలో భేదమున్నది. మరణాది రూపమగు ననర్థశంక భయము. మరణ భిన్నమగు ననర్థ శంక త్రాసము. మొదటిది స్థాయిభావము. రెండవది సంచారిభావము.

జుగుప్స : వస్తువులందలి దోషదర్శ నాదులచేఁగల్గు రోఁత జుగుప్స యనఁబడును. రోఁత కలిగించు పురీషాది వస్తువులను జూచుటవలనఁ గలుగు విచికిత్సాఖ్యమగు చిత్తవృత్తి విశేషము జుగుప్సయని రసగంగాధరము.

క్రోధము : శత్రుకృతాపరాధము చేఁగల్గు మనః ప్రజ్వలనము క్రోధ మనఁబడును. గురు బంధు వధాదులగు మహాపరాధములచేఁ బుట్టు ప్రజ్వల నాఖ్యమగు చిత్తవృత్తి విశేషము క్రోధమని రసగంగాధరము. ఈ ప్రజ్వలనము మహాపరాధ జన్యమగుచో పరవినాశాది హేతువగును. క్షుద్రాపరాధ జన్యమగుచో పరుష వాక్కులు, అసంభాషణము మున్నగు వానిని మాత్రమే కలిగించును. క్రోధమన్నను అమర్ష మన్నను గొంచె మించు మించుగా సమానమే.

విస్మయము : అపూర్వ వస్తు దర్శనముచేఁగల్గు చిత్త విస్తారమునకు విస్మయమని పేరు. అలౌకిక వస్తు దర్శనాదులచేఁ గలుగు ఆశ్చర్యాఖ్యమగు చిత్తవృత్తి విశేషము విస్మయమని రస గంగాధరము.

స్థాయి భావ మనగా స్థిరమైన భావమని యర్థము. నదులెన్ని వచ్చి కలసినను దన క్షారత్వమును నిల్పుకొను సముద్రమువలె విరుద్ధా విరుద్ధములైన సంచారి భావము లెన్ని తనలోఁ గలసినను మార్పుచెందక స్థిరముగా నుండునది స్థాయి భావము. నరులలో నృపతివలె, శిష్యులలో గురువువలె సర్వభావములలో స్థాయి మహత్తరమై యొప్పారును.

సాత్త్విక భావము : సత్త్వమున లేక సత్త్వదశ యందు పుట్టు భావములకు సాత్త్విక భావములని పేరు. సత్త్వమునకు పలువురు లాక్షణికులు పలు విధములైన నిర్వచనము లొసంగి యుండిరి. "అభినయాదుల ద్వారా పరగత సుఖదుఃఖాది భావనయం దంతఃకరణ మనుకూల మగుట సత్త్వము" "పరగత సుఖదుఃఖాదుల నరయఁగ భావించి యట్లయలరుట సత్త్వము".

"రజస్తమో గుణములచే స్పృశింపఁబడని మనస్సుసత్త్వము" "స్వాత్మ విశ్రాంతములైన రత్యాదులను బ్రకాశింపఁజేయు కొండొక అంతర ధర్మము సత్త్వము" "భావాంతర నిరపేక్షముగా రసమును బ్రత్యక్షీకరించు లక్షణముగల బల విశేషము సత్త్వము" అనునవి ఆ నిర్వచనములలోఁ గొన్ని. ఇవియును అనుభావముల వలెఁగార్య రూపములే అయ్యును సత్త్విక మూలములగుటచే సాత్త్విక భావములని వేఱు చేయఁబడినవి. అనుభావములు దేహజములు, ఇచ్ఛాధీనములు. సాత్త్విక భావములు రసానుకూలముగ ఇచ్ఛ లేకుండనే స్వతంత్రముగా నుత్పన్నములగు వికారములు. నాయికా నాయకులిరువురకు నవి యుదయించును. ఇవి యెనిమిది:

1. **స్తంభము**----భయ హర్షామయాదులచేఁ గలుగు చేష్టా విఘాతము స్తంభము.

2. **ప్రళయము**---- సుఖదుఃఖాతిరేకములచేఁ గలుగు చేష్టాజ్ఞాన రాహిత్యము ప్రళయము.

3. **అశ్రువు**---- క్రోధ దుఃఖ ప్రహర్షములచేఁ నేత్రము లందుఁబుట్టు నీరశ్రువు

4. **స్వేదము**---- రతి ఘర్మ శ్రమాదులచే దేహమునఁగల్గు జలోద్గమము స్వేదము (చెమట).

5. **గాద్గద్యము**---- మద సమ్మద పీడాదులచేఁగల్గు డగ్గుత్తిక (వైస్వర్యము) గాద్గద్యము.

6. **రోమాంచము**---- హర్షాద్భుత భయాదులచేఁ గలుగు రోమ విక్రియ రోమాంచము (పులకలు).

7. **కంపము**---- రాగ ద్వేష శ్రమాదులచే శరీరమునఁ గగ్గురుపాటు కంపము.

8. **వైవర్ణ్యము**---- విషాద మద రోషాదులచే శరీరమునఁ గల్గు వర్ణాన్యత్వము వైవర్ణ్యము.

భానుదత్తుఁడు రసతరంగిణిలో జృంభ (ఆవులింత) తొమ్మిదవ సాత్త్విక భావ మని చెప్పెను.

దశావస్థలు---- విప్రలంభ శృంగారము, నాలుగు రకములని చెప్పబడినది. అందభిలాష విప్రలంభమునకు పూర్వరాగ విప్రలంభమని నామాంతరము. ఇది నాయికా నాయకుల సమాగమునకుఁ బూర్వము పొందఁబడును. ఈ పూర్వరాగ విప్రలంభమునకు స్థాయియైన రతి వలననే దశావస్థలును గలుగును. విరహ విప్రలంభమునఁ (సంభోగానంతర విప్రలంభమున) గూడ నిందుఁ గొన్ని గలుగవచ్చును.

1. చక్షుః ప్రీతి (నాయిక నాయకు నాదరముతోఁ జూచుట) 2. మనస్సంగము (మనస్సు నాయకునందుఁదగుల్కొనుట) 3. సంకల్పము (సంగమ చింత) 4. జాగరము (నిద్రలేక మేల్కొని యుండుట) 5. కృశత (చిక్కిపోవుట) 6. అరతి (విషయములందాసక్తి లేకుండుట) 7. హ్రీత్యాగము (సిగ్గువిడుచుట) 8. ఉన్మాదము (పిచ్చితనము) 9. మూర్ఛ (సొమ్మసిల్లుట) 10. అంతము (మరణ ప్రయత్నము) అనునవి పదియును, దశావస్థలు-భావ ప్రకాశమున ఇచ్ఛ, ఉత్కంఠ, అభిలాష,చింత, స్మృతి, గుణస్తుతి, ఉద్వేగము, ప్రలాపము, ఉన్మాదము, వ్యాధి, జాడ్యము, మరణము అను పంద్రెం డవస్థలు చెప్పబడినవి. ప్రతాపరుద్రీయమున పై దశావస్థలకు ప్రలాపము, సంజ్వరము అనునవి చేర్చఁబడినవి. ప్రలాపమే ఆంధ్ర ప్రబంధములందు చంద్రమన్మథాద్యుపాలంభ రూపమున గనవచ్చును. సంజ్వరమన్నను సంతాప మన్నను నొక్కటే. నరస భూపాలీయమున చూచుట, చింతించుట, తలంచుట, గుణవినుతి, యరతి, తాపము, లజ్జాస్థలనము, గమనము, మూర్ఛ, ధన్యత అను పది యవస్థలు పేర్కొనఁబడినవి. ఇందలి గమనము, ధన్యత అను వాని నితరాలంకారికు లెవ్వరును జెప్పి యుండలేదు. ధన్యత సంభోగరూపమైనది. ఇది దశా వస్థల యనంతరము చేకూరును గాని విరహమునఁజేకూరదు.

3. శృంగార వీర భేదములు :

శృంగార రసము సంభోగ శృంగారము, విప్రలంభ శృంగారము అని ప్రధానముగా రెండు విధములు. అందు సంభోగ శృంగారము సురత రూపముననే కాక పరస్పర దర్శ నాలింగన చుంబన వనజల విహారా ద్యనంత రూపముల నుండును. ఆ యనంత రూపములు గణనాతీతములగుట నిర్వచింప శక్యములు గాకపోవుటచే లాక్షణికులు సంభోగ శృంగార మేకైక విధ మనియే చెప్పి యుండిరి.

విప్రలంభమనఁగా వియోగము వియోగ మందలి నాయికా నాయకుల శృంగారము విప్రలంభ శృంగార మనఁబడును. వియోగము కలుగు కారణములను బట్టి యీ శృంగారము నాలుగు విధములు.

1. అభిలాష విప్రలంభము : దీనికే అయోగ విప్రలంభము. పూర్వ రాగ విప్రలంభము అని నామాంతరములు. సంభోగమునకుఁ బూర్వము కలుగు నను రాగమున కభిలాషయని

పేరు. సాహిత్యదర్పణమున పూర్వ రాగము-నీలి రాగము, కుసుంభరాగము, మాంజిష్ఠా రాగము అని మూఁడు విధములని చెప్పబడినది. సీతారాముల ప్రేమ నీలి రాగము. ఇది పైకంతగా వెల్లడికాక పోయినను తొలఁగక సుస్థిరముగా నుండును. దేవహూతీ కర్దముల ప్రేమ కుసుంభరాగము ఇది పైకి వెల్లడియయ్యు కొంత కాలమైన పిమ్మట తొలఁగిపోవును. ఇందుమతీ రఘునందనుల (అజుఁడు) ప్రేమ మాంజిష్ఠారాగము. ఇది పైకి వెల్లడి యగును. ఎన్నఁటికిని దొలఁగక స్థిరముగా నుండును.

2. మాన విప్రలంభము : దీని కీర్ష్యా విప్రలంభ మనియుఁబేరు. మానమనఁగాఁ గోపము. ఇది ప్రణయ మానము, ఈర్ష్యా మానము అని రెండు విధములు. కారణము లేకుండగనే నాయికా నాయకులకుఁ గలుగుఁ కోపము ప్రణయ మానము. నాయకుఁ డన్యాసక్తుఁడై యుండుట గాంచి నాయిక పొందు మాన మీర్ష్యామానము. నాయిక నాయకుఁ డన్యాసక్తుఁడగుట స్వయముగాఁ జూచినను, విన్నను, సురతశ్రమ సంజాతమైన గాఢ నిద్రచేఁ గాని నఖ దంత క్షతాది భోగ చిహ్నములచేఁ గాని గోత్ర స్ఖలనములచేఁ గాని యనుమానించి నను ఈర్ష్య వహించును. ఇట్టి నాయిక కోపమును నాయకుఁడు దండము తక్క మిగిలిన మూఁడుపాయములజేతను, నమస్కారము చేతను, ఉపేక్ష వహించుటచేతను, హాస్యభయానకాది రసాంతరముల చేతను దగ్గించి యామెను బ్రసన్న చిత్తను జేసికోవలయును.

3. విరహ విప్రలంభము : సంయోగము పొందిన నాయికా నాయకుల కేదైనఁ గారణముచేఁ గలుగు నెడబాటు విరహ విప్రలంభ మనఁబడును. సాహిత్య దర్పణము దీనిని ప్రవాస విప్రలంభము నందే చేర్చి యుండెను.

4. ప్రవాస విప్రలంభము : ప్రవాసమునఁగలుగు నెడబాటుకు ప్రవాస విప్రలంభమని పేరు. నాయికా నాయకులు దేశాంతర వర్తులగుటకు బ్రవాసమని పేరు. ఈ దేశాంతరము దూరస్థమైనను సమీపస్థమైనను సమాగమమున కవరోధము కల్గించునదై యుండుట ముఖ్యము. ప్రవాసము కార్యవశమునఁ గాని, శాపముచేఁగాని, సంభ్రమముచేఁగాని కలుగవచ్చును. కార్యవశమునఁ గలుగు ప్రవాస విప్రలంభము భావి, భవత్, భూత విప్రలంభములని మూఁడు విధములు. సంభ్రమ మనఁగా నలజడి. ఇది దివ్య నాభస మానుషములైన మూఁడు రకముల యుత్పాతములచే గలుగ వచ్చును. ప్రవాస విప్రలంభమున నాయిక మలిన గాత్ర వసనయు, ఏకవేణీ ధారిణియు, నిశ్వా సోచ్ఛ్వాస రుదిత భూమిపతనములు

కలదియుఁగా వర్ణింప బడును. విప్రలంభము లేనిదే శృంగార రసము పుష్టి నందదని జెప్పుదురు.

సాహిత్య దర్పణకారుఁడు విరహ విప్రలంభమును, ప్రవాస విప్రలంభమందే చేర్చి కరుణ విప్రలంభమను నాలుగవ విప్రలంభ భేదమును బేర్కొనెను. నాయికా నాయకులలో నొకరు లోకాంతరమున కరిగి మరల బ్రదుకు సందర్భమున రెండవవారంత వఱకును బొందు నెడఁబాటు కరుణ విప్రలంభమని యాతడు నిర్వచించెను. కాదంబరియందు పుండరీకుఁడు విరహోద్రేకమువ మృతి చెంది మరల నాశరీరముతోనే వచ్చి మహాశ్వేతతో సుఖించెను. అతఁడు తిరిగి వచ్చువఱకు మహాశ్వేత పొందిన విరహము కరుణ విప్రలంభము. కుమార సంభవమున మన్మథుఁడు భస్మసాత్కృతుడైన పిమ్మట రతి పొందిన వియోగము కూడ కరుణ విప్రలంభమే. ఈ రెండు సందర్భము లందును ఆకాశవాణి పలుకు లాలించిన పిమ్మటనే నాయికలకు నాయక సమాగమ ప్రత్యాశ కలిగెను. అంతకు పూర్వమువారు పొందినది కేవల కరుణమే. తదుపరి కరుణ విప్రలంభము. ధ్వన్యాలోకమున నీకరుణ విప్రలంభ భేదము చెప్పఁ బడి యుండలేదు. లోచన మందలి "కరుణ విప్రలంభాది" పదమును కరుణ+విప్రలంభ+ ఆది అని వేఱు పదములుగాఁ గాక యేక పదముగా గ్రహించుటచేఁ గలిగిన భ్రాంతియే కరుణ విప్రలంభ భేదమునకు దారి చూపెననియు నిజమునకు కరుణమో విప్రలంభమో కాని కరుణ విప్రలంభ మనునది యుండనేయుండదనియు శ్రీ సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రులవారు తెల్పియున్నారు.

వీర రసము : వీర రసమున కుత్సాహము స్థాయిభావము. ఇది యుత్తమ నాయకమై యుండును. ఇది దాన ధర్మ యుద్ధ దయా వీరములని నాలుగు విధములు. నాయకుఁడు దేనియం దుత్సాహము చూపునో దానిని బట్టి వీరమునకు పేరేర్పడును. రాముఁడు ధర్మవీరుఁ డు, శిబి దానవీరుఁడు, అర్జునాదులు యుద్ధవీరులు. జీమూతవాహనుఁడు దయావీరుఁడు. **పండిత** రాయలు రసగంగాధరమున సత్యవీరమును గూడఁ బేర్కొనెను. హరిశ్చంద్రాదు లిందు కుదాహరణములు. ఇట్లు బలక్షమా పాండిత్య వీర్యములను గూడఁ జెప్పవచ్చును. ఇవన్నియు ప్రధానములైన దానధర్మ దయాదులచే యంతర్భవించునని కొందఱి మతము.

4. రసము యన్నిష్ఠము :

సంస్కృత లాక్షణికులలోఁ దొలుదొల్త రస విషయకమైన చర్చ కావించినవాఁడు భరతముని. అతఁడు నాట్యశాస్త్రములో "విభావానుభావ వ్యభిచారి సంయోగా ద్రసనిష్పత్తిః" అని యొక సూత్రము గావించెను. ఇందు రసమునకు బూర్వరూపమైన స్థాయిభావము ప్రసక్తియేలేదు. పైగా సంయోగ నిష్పత్తి పదములస్పష్టార్థములుగా నున్నవి. ఈ సూత్రము నాధారముగా గ్రహించి పలువురు లాక్షణికులు రస పరిణామ ప్రకారమును వివరింప యత్నించిరి. వారిలో భట్ట లోల్లట, శ్రీ శంకుక, భట్టనాయక, అభినవగుప్తులు నలువురును నాలుగు భిన్న వాదముల నావిష్కరించి యుండిరి. వానికిఁ గ్రమముగా నుత్పత్తి, అనుమితి, భుక్తి, అభివ్యక్తి వాదములని పేరు.

భట్టలోల్లటుని మతమున రస మనుకార్యనిష్ఠమైనది. అనుకార్యులనఁగా నాయా కావ్యములందు నాయకులైన రామాదులు. ఆలంబన విభావములైన సీతాదుల చేతను ఉద్దీపన విభావములైన యారామాదుల చేతను నాయకులైన రామాదులందు రత్యాదులగు స్థాయి భావములుదయించి, కటాక్ష భ్రూవిక్షేపాదులగు ననుభావములచే స్పష్టత్వము నొంది,నిర్వేద గ్లాన్యాదులగు వ్యభిచారి భావములచేఁ బరిపుష్టములై శృంగారాది రసములుగాఁ బరిణమించును. నాటక కర్త రామాది నాయకుల ప్రేమను లలితోచితములైన శబ్దములతో వర్ణించును. నటుఁడు వారి భావములను వ్యాపారములను గడుంగడు మెలకువతో నభినయించును. అభినయ సందర్భమున నటులు ప్రదర్శించు నైపుణ్యమునే సామాజికులు రామాదులగు ననుకార్యులమానసిక ప్రవృత్తులే వారియందు నున్నట్లు భ్రమింతురు. అనఁగా వారు నటులందు రామత్వాదు లారోపించి వారే రామాదులని భ్రాంతి నొందుదురు. అప్పుడు నిజమునకు రామాద్యనుకార్యులయందే యుండు రసము వారి భూమికలు ధరించి నటించు నటులయందు లేకున్నను ఉన్నట్లే భాసించును. అట్టి నటుల దర్శించుటవలన రామాది నిష్ఠమగు రసము స్ఫురించుటయుఁ దజ్జన్యమగు చమత్కార వశమున సామాజికు లానందించుటయు సంభవించును. నటునియందుఁ గలుగు ననుకార్య భ్రాంతి సామాజికుని కానందము కలిగించుటకు రజ్జువునుజూచి సర్పమని భ్రమించి భీతినొందు మానవుల వ్యాపారము దృష్టాంతముగాఁ జూపఁబడినది. ఈ వాదము ననుసరించి రసము రామాదులయందుత్పన్నమగు చుండుటచే దీనికుత్పత్తి వాదమని పేరు గల్గినది.

ఈ వాదమున కార్య కారణములకు సామానాధికరణ్యము లేకపోవుట ప్రధాన దోషము. రామాద్యనుకార్యగతమైన రసము వారి కానందము కల్గించును. కాని సంబంధములేని సామాజికుల కెట్లానందము కలిగింపఁ జాలునో యందు స్పష్టముగా వివరింపఁబడలేదు. సీతాదులురామాదులకే విభావములుకాని సామాజికులకుఁ గాదుగదా! రామాదుల యానందమును జూచి యానందమునొందు సామాజికులు వారు దుఃఖము నొందునప్పుడు దుఃఖమును గూడఁబొందుదు రనియు నందుచేఁగరుణ రసప్రధానములైన నాటకాదులు సామాజికుల కానందప్రదములు కాఁజాల వనియు జెప్పవలసి వచ్చును. ఇచ్చట దృష్టాంతముగాఁ జూపబడిన రజ్జు సర్ప భ్రాంతికిని నట నాయక భ్రాంతికిని, బోలికలేదు. మొదటి దాని యందు భ్రాంతి కారణము, భయము కార్యము. రెండవ దానియందు స్థాయి భావము కారణము ఆనందము కార్యము. కారణము అనుకార్యుని యందుండ కారణము సామాజికుని యందుండుటలో సామంజస్యములేదు. ఈ వాదమున సామాజికుఁ డనుభవించునది చమత్కార జనితమైన యానందమేకాని రసముకాదు.

శ్రీ శంకుకుని మతమున రస మనుమితి విషయమైనది. నటులభినయ నైపుణ్యముచే నాయకాదుల వ్యాపారములను జక్కగా నభినయింతురు. అప్పుడు సామాజికులా యనుకరణమునుజూచి నటులే యనుకార్యులని (నటులు నాయకాదుల కంటె భిన్నులుకారని) తలంతురు. నటు లభినయించు విభావానుభావవ్యభిచారుల సంయోగము వలనఁ దార్కిక వ్యాప్తి ననుసరించి సామాజికులు నటులయందుఁగూడ రత్యాదుల ననుమానింతురు. ధూమముండు చోట నగ్నియుండుననియు, ధూమము లేనిచో నగ్ని లేదనియు ననుకొనుటకుఁ దార్కిక వ్యవహారమున వ్యాప్తియని పేరు. ఈ వ్యాప్తి ననుసరించి సామాజికులు నాయ కాభిన్నులుగా గ్రహింపఁబడిన నటులయందు రత్యాదులుండుటచే రసము కూడ నున్నదని యనుమానింతురు. తరువాత నటులందలి రత్యాది స్థాయి భావములనే వారనుభవించి యానందింతురు. ఈ మతమున నటు లొనరించు నిపుణమైన యనుకరణముచే సామాజికులు చిత్ర తురగ న్యాయము ననుసరించి నటులే నాయకాదులని విశ్వసించుచు నాయకులందలి రసమును కూడ నట నిష్ఠమై యున్నట్లనుమానింతురు. అందుచేతనే దీని కనుమితివాదమను పేరు కలిగినది.

భట్టలోల్లటుని మతమునవలెనే యిందుఁగూడ కార్యకారణములకు సామానాధికరణ్యము కానఁబడదు. నాయకాదు లందుండి నటులం దనుమానింపఁబడిన రసము సామాజికుల కెట్లానందము కలిగించునో యిట వివరింపఁబడలేదు. చిత్రతురగన్యాయ మిచ్చట సరిపడదు. చిత్రమునందలి తురగ మెంత నిపుణముగాఁ జిత్రింపఁబడినను దురంగమువలె నుండును కాని నిజముగాఁదురగము మాత్రము కాఁజాలదు. మఱియుఁ బ్రత్యక్షజ్ఞానము చమత్కారమును గలిగించునట్లు అనుమాన జ్ఞానము కలిగింప నేరదు. రసమును బ్రత్యక్షముగా ననుభవించు చున్నానను మాట లోకమున నుండఁగా సామాజికుఁ డనుమానజ్ఞానముచే రసము ననుభవించు చున్నాఁడనుట స్వభావ విరుద్ధము. తామెన్నడును జూడని నాయకాదుల వ్యాపారములను నటులనుకరించుటయు వానిని జూచి సామాజికులు నటులే నాయకాదులని యనుమానించుటయు విశ్వసనీయ విషయములు కావు. ప్రఖ్యాత నాయకుల వ్యాపారములను గ్రంథస్థితి వర్ణనాదుల ననుసరించి నటులనుకరింపఁ జాలినను గల్పిత నాయకాదుల వ్యాపారములను గూడ వారనుకరింపరనుట హాస్యాస్పదముగా నుండును.

భట్టనాయకుని మతమున రసము ప్రతీయ మానముకాని,ఉత్పాద్య మానము కాని, అభివ్యజ్యమానము కాని కాదు. కావ్య నాటకములం దభిధా శక్తి కంటె భిన్నమును విభావాది సాధారణాత్మకము నగు భావకత్వ వ్యాపారముచే భావ్యమానమై స్థాయిభావము సత్త్వోద్రేక ప్రకాశానందమయ సంవిద్వి శ్రాంతి సతత్త్వమగు భోగముచే భుజ్యమాన మగుచున్నదని భట్టనాయకు నభిప్రాయమైనట్లు కావ్య ప్రకాశము నుడువుచున్నది. రసాస్వాదము పరబ్రహ్మ సాక్షాత్కార తుల్యమైనదనియుఁ, బరబ్రహ్మ వలెనే రసముకూడ నానంద మయమైనదనియు భట్టనాయకుఁడు తలంచెను. ఈతని మతమున శబ్దమున కభిధాశక్తిగాక భావనా భోగకృతులను మఱి రెండు వ్యాపారములుకూడ నుండును. వీనికే భావకత్వవ్యాపారము, భోగకృత్త్వ వ్యాపారమునని నామాంతరములు. అభిధావ్యాపారమలంకార శాస్త్ర నిర్దిష్టమైనట్టిదే.ఇది శబ్దము యొక్క వాచ్యార్థమును బోధించును. ఇది ముగిసి పోవఁగానే భావకత్వవ్యాపార మారంభమగును. ఇది శబ్దము యొక్క రసాదులను బోధించును. (శృంగార రస సందర్భమునఁ బరుష పద ప్రయోగ ముచితము కాదనుట యీ వ్యాపారము చేతనే.పరుష శబ్దమునకైనను,లలిత శబ్దమునకైనను, వాచ్యార్థ మాత్ర బోధకమైన యభిధా వ్యాపారము సమానమే) ఈ వ్యాపారముచే సీతా రామాదులగు విభావములు తమ ప్రత్యేకతను గోల్పోయి సామాజికునికి సామాన్యముగా

గోచరించును. అనఁగా సీతాదులు సాధారణ స్త్రీత్వముతోడను రామాదులు సాధారణ పురుషత్వము తోడను గోచరింతురు. ఇట్లు భావములు సాధారణముగాఁ చేయఁబడుటకే సాధారణీకరణ మని పేరు. దీని వలన సామాజికునకు నాయకాదులతో నభేదత్వ మావహిల్లును. ఇంతటితో భావకత్వ వ్యాపార మవసిత మగును. అంత మూఁడవదియైన భోగకృత్త్వ (భోజకత్వ) వ్యాపారము పనిచేయ మొదలిడును. దీనిచే సాధారణీకృతములైన రత్యాది స్థాయి భావములు సామాజికులచే ననుభవింపఁబడును. అప్పుడు వారానందమయమైన యొకానొక స్థితిని బొందుదురు. ఇది సాధారణములైన యనుభవముల కంటెను, స్మృతుల కంటెను, విలక్షణమై పరబ్రహ్మాస్వాదతుల్యమై, స్వసంవేద్యముగా నుండును. ఈ స్థితిలోఁ జిత్తమునకు ద్రుతి, విస్తారము, వికాసము అను ధర్మము లేర్పడును.

భోగకృత్త్వ వ్యాపారముచే సామాజికులందలి రజస్తమో గుణము లడంగి వారి హృదయముల సత్త్వోద్రేకమతిశయించును. అప్పుడు వారానందమగ్నులై పరిసరములనే కాక తమ్ముఁగూడ మఱచి వినుచున్న లేక చూచుచున్న వస్తు దృశ్యములతో నేకీభావము నొందుదురు. ఈ మతమున విభావాదులు భోజకములును, రసము భోజ్యము నగుటచే దీనికి భుక్తివాదమను పేరు గలిగినది.

భట్ట నాయకుఁడు తన మతమునఁ గార్య కారణములకు సామానాధి కరణ్యము లేకపోవుటయను దోషమును బరిహరింపఁ బ్రయత్నించెను. కాని భావకత్వ వ్యాపారముచే విభావములును రత్యాదులును సాధారణీకృతము లైనను సామాజికులు మొట్టమొదటఁ దమ యందు బీజ రూపముగానైన లేనట్టి స్థాయి భావముల ననుభవించుటయు నాయకాద్యభేదము నొందుటయు నించుక యసంగతములుగా నున్నవి. అదిగాక భట్టనాయకుఁడు శబ్దమున కుండునని చెప్పిన యభిధా భిన్నములైన భావకత్వ భోగకృత్త్వ వ్యాపారములు కేవలము కల్పితములైన వగుటచేఁ బ్రామాణిక సమ్మతములు గాకున్నవి. వ్యంజనమే భావకత్వ వ్యాపారమును నిర్వహించుచుండ దానికై యొక క్రొత్త వ్యాపారమును గల్పించుట యనవసరము. అభినవగుప్తుఁడీ వ్యాపారము విభావాదులదే యని చెప్పెను. "తా ఏవ పరిహృత విశేషా రస హేతవః" అని భరతముని చెప్పిన వాక్యము కూడ నీ విషయమునే బోధించుచున్నది. విశ్వనాథుఁడు విభావాదులకు సాధారణీకృతి యను పేరుగల యొక్క వ్యాపార మున్నదని స్పష్టముగాఁ జెప్పియుండెను. (వ్యాపారోఽస్తి విభావాదే ర్నామ్నా సాధారణీ కృతిః).

భట్టనాయకుఁడు రసమును సామాజిక నిష్ఠ మనియే చెప్పెను. కాని, దానికి బీజములు స్వల్పముగానైన సామాజికులం దుండునని యంగీకరింప లేదు. అభినవగుప్తుని మతమున రసమభివ్యక్తము. సహృదయుల హృదయములందు రత్యాదులు వాసనా రూపమున నడఁగి యుండుననియు, నవి విభావానుభావాదులచే సముల్లసితములై రసములుగాఁ బరిణమించు ననియు నాతని వాదము. ఈతని మతమున నీ వాసన లేనిచో రసాస్వాదము గలుగదు. అందుచేతనే వైయాకరణులకును మీమాంసకులకును రసాస్వాదము గలుగదని ధ్వనికారుఁడు చెప్పియుండెను. వాసనా రహితులైన సామాజికులకు రసాస్వాదము మృగ్య మనియు, నట్టివారు రంగాంతః స్థిత కాష్ఠ కుడ్యాశ్మ సన్నిభులనియు ధర్మదత్తుఁడు వివరించి యుండెను.

"సవాసనానాం సభ్యానాం రస స్యాస్వాదనం భవేత్
నిర్వాసనాస్తు రంగాంతః కాష్ఠ కుడ్యాశ్మ సన్నిభాః"

వ్యంజనా శక్తి ప్రభావముచే రస మభివ్యక్త మగుననియు, రసాస్వాదనమును వివరించి వర్ణింప వచ్చుననియు నభినవగుప్తుఁడు నుడివి యుండెను. అతఁడు భట్ట నాయకుని భావకత్వ వ్యాపారమును బూర్తిగా నుజ్జగించెను. రస భోగమని చెప్పక యాతఁడు రస ప్రతీతి యనియు, రసచర్వణ మనియు నుడువు చుండును. ఈతని వాదము ననుసరించి వాసనా రూపమున నున్న స్థాయిభావములనే విభావాదులు వ్యక్తము చేయుననియు నా వ్యక్తములైన స్థాయీ భావములే రసము లనియు స్పష్టమగుచున్నది. అందుచేతనే దీని కభివ్యక్తి వాదమను పేరు వచ్చినది. అభివ్యక్తి యనఁగా నున్న దానిని వ్యక్తము చేయుట. భట్టనాయకుని మతమున నీ వాసనా ప్రసక్తియే లేదు. భుక్త్యభివ్యక్తి వాదములందలి ముఖ్య భేదములలో నిదియొకటి.

అభినవగుప్తుని మతమున భరత సూత్రము నందలి సంయోగ పదమునకు వ్యంగ్య వ్యంజక భావ మర్థము. నిష్పత్తి యనఁగా నభివ్యక్తి. రత్యాదులగు స్థాయి భావములు వ్యంజకములగు విభావానుభావాదిభావములచే వ్యంగ్యములై రసములగును.

భరతుఁడు ముఖ్యముగా దృశ్య కావ్యములను మనమున నుంచుకొని రస సూత్రమును వివరించెను. లోల్లటాదులును నా దృష్టితోనే దానిని వ్యాఖ్యానము కావించిరి. ధ్వనికారుఁడైన యానందవర్ధనుఁడు రస సిద్ధాంతమును శ్రవ్యకావ్యముల విషయమునఁగూడ సమన్వయించెను. దృశ్యకావ్యములందు నటుల మూలమున విభావాదులు ప్రత్యక్ష మగుచుండును. కావున

సామాజికులు నాయకా భేదమును బొంది యానందము ననుభవింతురు. శ్రవ్య కావ్యములలో నాయకాదులు ప్రత్యక్షము కాదు కావున సామాజిక స్థానీయులైన పాఠకులు నాయకాభేదము నొంది రసానందము నెట్లనుభవింతురని సందేహము కలుగవచ్చును. వాక్య పదీయకారుఁ డైన భర్తృహరి "పాఠకులు శబ్దోపహిత రూపములు గల్గి బుద్ధి విషయత్వము నొందిన కంసాదులను బ్రత్యక్షములైన వారిని వలె సాధనములుగా గ్రహింతు" రని తెల్పి యా సందేహమును నివారించినాఁడు.

"శబ్దోపహిత రూపాం స్తాన్ బుద్ధే ర్విషయతాం గతాన్
ప్రత్యక్షానివ కంసాదీన్ సాధనత్వేన మన్యతే"

అనఁగా శ్రవ్య కావ్యములందుఁ గవులు వాడు శబ్దములచేతను, జేయు వర్ణనాదులచేతను నాయకాదులు రూపమును బొంది, పాఠక హృదయములు చొచ్చి ప్రత్యక్షముగా గోచరింతురు. వారు రంగమునఁ జర్మ చక్షువులతోఁ జూచు నాయకాదులనే శ్రవ్య కావ్యములు విను సందర్భమున హృదయరంగమున మనోనేత్రములతోఁ దిలకించి తదభేదము రసానందము ననుభవింతురు.

ఆత్మ యానందమయ మైనట్టిది. దాని నావరించి యుండు నజ్ఞానము తొలఁగఁ గనే యా యానందము స్వస్వరూపముతో విలసిల్లును. కావ్య పఠనావసరములందు విభావాదులచే నీ యజ్ఞానావరణము తొలఁగింపఁబడు చుండును. అప్పుడు తన్ను బరివేష్టించియుండు రత్యాదిక వాసనలతోఁగూడి యాత్మానందము ప్రకాశించును. తదానంద సంవలితమైన రత్యాదులకే రసములని పేరు. రసానందము విచిత్రమైనది. తదనుభవము సహృదయ హృదయైక వేద్య మైనట్టిది.

లోకమున శోకకారణములైన పరిస్థితులవలన శోకమే కలుగు చుండఁగా గావ్యములందవి యానందము నెట్లుత్పాదింపఁ జాలునను శంక కలుగ వచ్చును. లోక గత నాయకాదులకును గావ్యస్థితి నాయకాదులకును గల లౌకికాలౌకికత్వభేదమే యీ వ్యత్యాసమునకుఁ గారణము. కావ్య శిల్ప మలౌకికమైనది. అట్లే కావ్యగత నాయకాదులను లౌకిక నాయకాదులుగాక తదనుకర్తలగుటచే నలౌకికులే యగుచున్నారు. లోకమున శోక హర్షాదులకుఁ గారణములైనవి కావ్యమునఁ గారణ శబ్ద వాచ్యతను వీడి విభావ శబ్ద వాచ్యత

నొందుచున్నవి. కావ్యగతములైన యీ విభావము లన్నిటి వలనను బాఠక సామాజికుల కానందమే యావహిలు చుండును. సామాన్య సమయముల వేదనాకరములగు నఖదంతక్షతాదులు సురత వేళాదత్తము లైనచో సుఖసంధాయకము లగుచుండుట యనుభవసిద్ధ విషయమే కదా! "తేభ్యస్సురతే దంత ఘాతాదిభ్య ఇవ సుఖమేవ జాయతే."

కరుణాది రసము లానంద ప్రదము లెట్లగునని యాశంకించి సాహిత్య దర్పణకారుఁడు పై విషయమునే యిట్లు చెప్పియున్నాడు.

"హేతుత్వం శోకహర్షాదేః గతేభ్యో లోక సంశ్రయాత్
శోక హర్షాదయో లోకే జాయన్తాం నామ లౌకికాః
అలౌకిక విభావత్వం ప్రాప్యేభ్యః కావ్యసంశ్రయాత్
సుఖం సంజాయతే తేభ్యః సర్వేభ్యోఽపీతి కాక్షతిః"

లోకమున శోక హర్షాదులకు హేతువులైన వానివలన లౌకికములైన శోకహర్షములే గలుగు ననియుఁ గావ్యా శ్రయముచే నలౌకిక విభావత్వమును పొందిన వాని యన్నింటి వలనను సుఖమే సంజాత మగుననుటలో విప్రతిపత్తి లేదనియు నాతని భావము. అట్లుగాక కరుణాది రసములు దుఃఖ హేతువులే యైనచోఁ దత్ప్రధానములైన కావ్యముల యెడ నెవ్వ రున్ముఖులగుదురని యాతని ప్రశ్న. ("కించ తేషు యదా దుఃఖం నకోపి స్యాత్తదున్ముఖః") రామాయణాది కావ్యములు కరుణరస ప్రధానములయ్యుఁ బెక్కుసారులు పాఠకజనుల నాకర్షించు చుండుట కవి యానంద ప్రదములగుటయే కారణమని వేఱు చెప్పనక్కఱలేదు గదా!

హరిశ్చంద్ర నాటకము, రామాయణ నాటకము మున్నగు నాటకములను దర్శించు నప్పుడందలి కరుణ రస నిర్భరములైన ఘట్టములఁగాంచి సామాజికులలోఁ గొందఱు కంటఁ దడి పెట్టుచుండుట మనము కాంచుచుందుము. నాటక ప్రయోగ మేరసముతోఁగూడిన దైనను ఆనంద ప్రదమగు చుండగాఁ వారట్లు కన్నీరు కార్చుటకు హేతువేమి? ఆ యశ్రువులు హృదయమునకు సహజమైన దయా సానుభూతులచేఁ గలుగునట్టివేగాని దుఃఖ బాష్పములు కావు. "అశ్రుపాతా దయస్స్వదర్ద్రు తత్వాచేతసో మతాః " అని సాహిత్య దర్పణము నుడువుచున్నది. అనఁగా నట్టి సమయముల వారి హృదయము ద్రవించి కనుల వెంట నీరైవచ్చును. ఆ కన్నీరు ఆనంద సూచక మైనట్టిదేగాని దుఃఖ సూచకము కాదు.

పాశ్చాత్యులు మోదాంత నాటకములకన్న విషాదాంత నాటకములనే యుదాత్తములుగాఁ బరిగణింతురు. దానికిఁ దజ్జన్యమగు నానందము విశిష్టమై యుండుటయే కారణమని చెప్పవలెను. గ్రీకుతత్త్వ వేత్తలలో నగ్రగణ్యుఁడును బాశ్చాత్య లాక్షణికుల కాదర్శ ప్రాయుఁడునగు నరిష్టాటిలు లలితకళలన్నియు ననుకరణాత్మకములని యభిప్రాయపడి యుండెను. లలితకళలననుభవించువారు దత్కళాజనితానందమును సమగ్రముగాఁ బొందవలెనన నవి యనుకరణములను సంగతి విస్మరింపరాదు. అదిగాక యథార్థములేయని భావించుచో వారి కానందమునకు బదులు భయ జుగుప్సా కోపాదులగు నితర భావము లుప్పతిల్లును. అనుభవమును బట్టి చూచిన నీ విషయము తేట తెల్లమగును. ఇరువురు యోధులు నిశిత కరవాలములు దాల్చి యొండొరులఁ జంప నుంకించుచు యుద్ధ మొనరించు దృశ్యమును జూచునప్పుడు మనకు భయకంపాదులేగాని యానందము కలుగదు. అట్టి దృశ్యమును జూడలేక భయాక్రాంతులమై మనము దవ్వుగాఁబోనెంతుము. అట్లుగాక ప్రతిభాశాలియైన మహాకవి యిరువురు యోధులు గావించు పోరాటమును సవిస్తరముగా వర్ణించుచుఁ బద్యములు వ్రాసినచో నా పద్యములను జదువునపుడు మన మానందము నొందుటే కాక వానిని మాటిమాటికిఁ జదువ నిచ్చగింతుము. ప్రకృతిలో దుఃఖమును గలిగించు నభిమన్యువధాది ఘట్టములను మనము పునః చదువ నువ్విళ్ళూరుటకును, బంది, గాడిద మున్నగు నసహ్యములగు జంతువుల చిత్రములనైనఁ బదింబదిగా నవలోకింపఁ దివురుటకును నదియే కారణము. దీనినే పండితరాయలు “అయంహి లోకోత్తరస్య కావ్య వ్యాపారస్య మహిమా యత్ప్రయోజ్య రమణీయా శ్శోకాదయః పదార్థా ఆహ్లాద మలౌకికం జనయన్తి విలక్షణోహికమనీయః కావ్య వ్యాపారజ ఆస్వాదః” అని రసగంగాధరమున నుడివి యుండెను. ఈ విషయ మొక్క కావ్యముననేకాక యితర లలితకళలకును నన్వయించును. ప్రకృతిలో భయ చింతా జుగుప్సాదులను గలిగించు దృశ్యములే కళారూపము నొందినప్పుడు మన కానందజనకము లగుటకు అవి యనుకరణములే కాని యథార్థములు కావని మన భావముల జ్ఞానము స్థిరముగా నుండుటయే కారణము. మనము దారిన బోవునపుడొక కుక్క మొఱిగినచో భయపడి పాఱిపోవుదుము. హాస్యకారుడుకుక్క కూతఁననుకరించినచో మన మచ్చెరుపడి నిల్చి యానందింతుము. హాస్యకారుఁడు మనకుఁ గనఁబడకుండ మఱుగున నున్నచో మనమా కూఁతనే విని యిది నిజమైన కుక్కకూతయని యెంచి దానిని గూర్చి యిసుమంతయైన నాలోచింపక మన దారిన బోవుదుము. అందుచేఁ గళలవలనఁ బుట్టు నానందము ననుభవించుటకు అవి యనుకరణములను జ్ఞానము తప్పక

యుండవలెను. ఈ యనుకరణజ్ఞానమే యానందజనకమను (Imitation gets Plea-sure) నాంగ్లేయ వాక్యము సూచించుచున్నది. కావ్యగత నాయకాదులనుకర్తలే కాని యథార్థ రూపులు గాకపోవుటచేఁ గావ్యరసమేది యైనను అది పాఠక జనుల కానంద సంధాయక మగుట సంభవించుచున్నది. దీనివలన శృంగారాదు లెట్లో కరుణాదులు గూడ నట్లే యానంద జనకములని నిర్ణయింప వచ్చును.

5. రస సమీకరణము

రసముల సంఖ్యను సూచించుచు నాట్య శాస్త్రమున భరతముని చెప్పిన శ్లోకమునకుఁ బాఠాంతర మేర్పడుటచే రసము లెనిమిదియా తొమ్మిదియాయను విషయము వివాదాస్పదమైనది. ప్రాచీనాలంకారికులలోఁ గొందఱెనిమిదియను పక్షమును మఱికొందఱు తొమ్మిదియను పక్షమును నవలంబించి వాదించిరి. శృంగారాది రసములలో శాంతమును జేర్చుటయా చేర్చక పోవుటయా యనునదే యీ యభిప్రాయ భేదమునకుఁ గారణము. ఈ భేదమిట్లుండ నర్వాచీనులైన కొందఱాలంకారికులు శాంతరసముతోఁ గూడిన నవ రసములకు మఱికొన్ని క్రొత్త రసములు చేర్చి రససంఖ్యను బదుమూఁడింటి వఱకు బెంచి యుండిరి. ఇట్లు వివిధ రస భావములకుఁ గల సూక్ష్మాతి సూక్ష్మ భేదములను గుర్తించి రసముల సంఖ్యను బెంప యత్నించు వారికిఁ బ్రకృతి రసమొక్కటే యనియు మిగిలిన వన్నియు దాని వికృతులనియుఁ జెప్పి రసముల కైక్యము కల్పించిన వారు కూడఁ గొందఱు కలరు. వీనిలో సైత మందఱు నేక కంఠముగా నొకే రసమునకుఁ బ్రకృతిత్వ మాపాదించిన వారు కారు. ఒకొక్క రొక్కొక్క రసము నారాధించి, దానికి బ్రాధాన్యము నిరూపించి యుండిరి. ఇట్టివారిలో నాలంకారికులే కాక కవులు కూడఁ బలువురు కలరు.

భవభూతి మహాకవి కరుణ రసమునకుఁ బ్రకృతిత్వము నొసంగుచు

"ఏకో రసంః కరుణ ఏవ నిమిత్త భేదా
ద్భిన్నః పృథక్పృథగి వాశ్రయతే వివర్తాన్
ఆవర్త బుద్బుద తరంగమయాన్ వికారా
నంభో యథా సలిల మేవ హి తత్సమస్తమ్"

అని యుత్తర రామచరిత నాటకమున ఘోషించి యుండెను. వాసంతీ సీతారామ

ప్రభృతులయందు కరుణరసమొక్కటే వివిధ రూపములతోఁ బరస్పర విలక్షణావస్థా విశేషములను భజించుచున్నదని తమస సూచించుట నాటక కథాసందర్భమునఁ బైశ్లోకముయొక్క పూర్వార్థమునకు బ్రయోజనము. కాని భవభూతి యందు రస విషయమునఁ దనకుఁ గల యభిప్రాయమును గూడఁ బరోక్షముగ వ్యక్తము చేయుచున్నాడు. ఒక్క నీరేయావర్త బుద్బుద తరంగమయములైన వివిధ వికారములను బొందునట్లు కరుణరస మొక్కటే నిమిత్తభేదము వలన శృంగా రాద్యన్యరూపములను బొందుచున్నదని యాతని యభిప్రాయము. కరుణరసము ప్రకృతి యనియు, శృంగారాదులు దాని వికృతులనియు నిందలిభావము. దీనినే వ్యాఖ్యాన కర్తయైన వీర రాఘవుఁడు "ఇదమత్ర కవేర్మతమ్, యద్యపి శృంగార ఏక ఏవరస ఇతి శృంగార ప్రకాశకారాదిమతం తథాపి ప్రాచుర్యాత్ రాగి విరాగి సాధారణ్యాత్ కరుణ ఏక ఏవ రసః అన్యేతు తద్వికృతయః" అని స్పష్టీకరించెను. ఈ వివరణమున నతఁడు లోకమున నితర రసములకన్నఁ గరుణ రసము ప్రచురతరముగా గోచరించు చుండుటయు, నది రక్తచిత్తులైన లౌకికులకును విరక్తచిత్తులైన యోగులకునుగూడ సాధారణమై యుండుటయు, భవభూతి యా రసమునకుఁ బ్రకృతిత్వము కల్పించుటకు హేతువులుగా నుగ్గడించెను. కావ్య నాటకాదులు కలిగించు చిత్తసంవాదము కరుణరసము విషయమున సమగ్రస్ఫూర్తి వహించుట యనుభవ సిద్ధమే. రసములన్నియు, సహృదయ హృదయావర్జ కత్వమున సమానశక్తికములే యయ్యుఁగరుణ రస మా విషయమున నించుక శక్తి మత్తరముగా గోచరించును. అదిగాక కరుణ రసమయములైన కావ్యములే యధిక మాధుర్యోదంచితములై యుండునని యనుభవజ్ఞులు నుడువుదురు. కరుణ రసోద్రేకమే సంస్కృతమునందలి యాదికావ్య మావిర్భ వించుటకుఁ గారణము. మఱియు "రసేషు కరుణోరస" యను నానుడి చిరకాలమునుండి యను శ్రుతముగా వచ్చుచున్నది. ఆనందవర్ధనుఁడు హృదయార్ద్రతా వహమైన మాధుర్య గుణము కరుణ రసమున నతిశయించి యుండునని ధ్వన్యాలోకమున నుడివి యున్నాఁడు. (మాధుర్య మార్ద్రతాం యాతి యత స్తత్రాధికం మనః) ఆ రసమునకు భవభూతి ప్రాధాన్య మొసంగుట కదియే కారణమైయుండును. కాని యాతనివలెఁ గరుణ రస ప్రకృతిత్వ ముపపాదింప యత్నించిన వారాలంకారికులలో నెవ్వరునుగానరారు.

సరస్వతీ కంఠాభరణ, శృంగార ప్రకాశాది గ్రంథకర్తయైన భోజుఁడు తాను గల్పించిన "శృంగారముననే " సర్వరస భావములును లీనములై యుండునని వచించెను. ఆత్మగుణమును,

బూర్వజన్మకృత సుకృతములకు ఫలముగాఁ గలుగునట్టిదియు నగు నలంకారమే సర్వభావములకును మూల బీజమని యాతని యభిప్రాయము. ఇది సాధారణముగా మనము గర్వమను నర్థమున వాడు నహంకారము కాదు. దీనికే శృంగారము, యభిమానము అని మాఱు పేర్లు. తన యందును నితరులందును నితర పదార్థము లందును మానవుఁడు ప్రీతిగలిగి వర్తించుట కిదియే కారణము. ఈ యర్థమున నిది 'యాత్మరతి' యనఁబడును. నిజమున కిది యొక్కటే రసము. రతిహాసాదులు దీని నుండియే జనించును. ప్రకర్ష ప్రాప్తములైన వీనిచే నర్చిశ్చయములచే నగ్ని వలెఁ బ్రకాశించుచు నిది 'శృంగారవంతులకే' రుచించుచుండును. (తతఏతే రత్యాదయో జాయన్తేత్తై శ్చాయం ప్రకర్ష ప్రాప్తైః సప్తార్చిరర్చిర్భియైరివ ప్రకాశ మానః శృంగారిణామేవ స్వదత ఇతి) దీనిని బట్టి రతిస్థాయికమై భరతాదులచే రస సమూహమున నాద్యముగాఁ బేర్కొనఁ బడిన శృంగార రసమునకును దీనికిని సంబంధమే లేదని తెలియవచ్చును. భోజుని మతము ననుసరించియే రసభావము లనుభవించుటకైన నాతని యహంకార శృంగార మావశ్యకమై యుండును. శాంతము కూడా నీ యహంకారమునకు లోఁబడినదేయని యాతని యూహ. రతివలెనే శమము కూడ నహంకార జన్యమైనట్టిదే.

రస మనునది యనిర్వచనీయమైన యానందానుభవము. "ఇది శోకము ఇదిరతి, ఇది హాసము." అను స్థితిజ్ఞానము కలిగియుండు నంతవఱకు సామాజికులు భావనావస్థలో మాత్రమే యున్నారని చెప్పవలయును. రస మీ యవస్థ కతీతమై యుండును, దీనినే భోజుఁడు-

"అభావ నోదయ మనన్య ధియా జనేన
యో భావ్యతే మనసి భావనయా సభావః
యో భావనా పథ మతీత్య వివర్తమానః
సాహంకృతౌ హృది పరం సద్వతే రసోఽసౌ"

అని చెప్పి యుండెను. శృంగార వీరహాస్యాదులు నిజమునకుఁ గేవలము భావావస్థలే యనియు, రస మనున దేకైక మనియు, రసమనుట తక్క దాని నింకొక విధమునఁ బేర్కొన రాదనియు భోజుని యభిప్రాయము.

అహంకార శృంగార రసైకత్వమును ప్రతిపాదించుచునే భోజుఁడు ప్రేమ రస

ప్రకృతిత్వము గూడ నిరూపించియుండెను. ఈ రెండింటికిని సన్నిహితమైన సంబంధమున్నది. రతి స్నేహభక్తి ప్రముఖములైన భావముల కెల్ల నహంకారము వలెనే ప్రేమయు మూల ప్రభావమై యుండుననియుఁ, దమ హృదయములం దణఁగి యున్న యొకానొక ప్రీతిని దృప్తిపరచుటకే మానవులే కార్యములైన నాచరింతురనియు భోజుని యభిప్రాయము. ఎవరైన నవ్వినచో వారికి నవ్వుట యందును, యుద్ధ మొనరించినచో నా యుద్ధ మొనరించుట యందును వారికిఁ బ్రీతి యున్నదని మన మూహింప వలయును. ఆ ప్రీతి లేకున్నచో వారా కార్యముల నొనరింపనే యొనరింపరు. భోజుఁడు ప్రతిపాదించిన యీ ప్రేమ రసమునఁ బూర్వకోటి, మధ్యమావస్థ, ఉత్తరయని మూఁడవస్థలున్నవి. మొదటి స్థితిలోనిది యొక్క యహంకారమే; రెండవదాన నా యహంకార మేకోన పంచాశద్భావములుగా మాఱుటయునవి విభా వానుభావాదులచేఁ బరిపుష్టి నొందుటయు సంభవించును. తృతీయావస్థలో నీ భావము లన్నియుఁ బ్రేమగాఁ బరిణమించి మఱలఁ బ్రథమావస్థను అనఁగా నేకైకమైన యహంకార రసమును అనుభూతికిఁ దెచ్చును. అలంకార కౌస్తుభమునఁ గవికర్ణపూరుఁడు కూడఁ బ్రేమరస ప్రకృతిత్వమునే ప్రతిపాదించెను.

“ఉన్మజ్జన్తి నిమజ్జన్తి ప్రేమ్ణ్యు ఖండ రసత్వతః
సర్వేరసాశ్చ భావాశ్చ తరంగా ఇవ వారిధౌ”

అనియు “ప్రేమరసే సర్వే రసా అంతర్భవన్తి” యనియు నందాతఁడు వివరించి యుండెను.

అగ్ని పురాణమున సైతము బోధ ప్రతిపాదితమైన యలంకారము ప్రస్తావింపఁబడినది. కాని తత్కర్త యభిప్రాయము ననుసరించి యహంకారము నుండి యభిమానమును, దానినుండి మొదట రతియును జనించును. ఈ రతియే పరిపోషమునొంది వ్యభిచార్యాది సామాన్యమువలన శృంగారమని చెప్పఁబడుచున్నది. హాస్యాద్యన్య రసము లన్నియుఁ దద్భేదములే (అభిమానాద్రతి స్సాచక పరిపోషముపేయుషీ. వ్యభిచార్యాది సామాన్యాత్ శృంగార ఇతిగీయతే. తద్భేదాః కామమితరే, హాస్యాద్యా అప్యనేకశః). భోజుఁడిట్లు కాక రత్యాదిభావములన్నియు నహంకార జన్యములేయని యభిప్రాయపడి యుండెను. పరబ్రహ్మమున కానందము సహజమైన దనియు, నది యొక్కొక్కప్పుడు వ్యక్తమగుచుండు ననియు, చైతన్యము లేక చమత్కారము, లేక రసము అనునదియే దాని వ్యక్తరూప మనియు, నాద్యమైన దాని వికారమే యహంకారమనియు నగ్ని పురాణ మహంకార స్వరూపమును వివరించి యున్నది. స్వల్ప భేదమున్నను భోజుని

యహంకార శృంగారమునకును, నగ్ని పురాణ ప్రతిపాదితమైన రతి శృంగారమునకును దగ్గర సంబంధ మున్నది.

అభినవగుప్తుఁడభినవ భారతిలో శాంత రస ప్రాధాన్యమును బ్రతిపాదించెను. అలంకారికులలో నేదో యొక రసమునకుఁ బ్రకృతిత్వమును మిగిలిన వానికిఁ దదంతర్భూతత్వమును సూచించిన ప్రథమాచార్యుఁడితడే. శాంతము పురుషార్థములలో నత్యుత్తమమైన తురీయ పురుషార్థమునకు సంబంధించి యుండుటయుఁ గావ్యజనితమైన రసానంద మైహికానంద భిన్నమును, నతిలోకమును, ననంతమునునై యొప్పారుచు శాంతము తోడి సంపర్కమును సూచించుచుండుటయు, నాతఁడా రసమునకుఁ బ్రాధాన్యము కల్పించుటకు హేతువు. అదిగాక, శాంతమునకు స్థాయియైన యాత్మ సర్వ మానవ వ్యాపారములకును మూల భూతమై, శృంగారాది వృత్తిరూపముల వహించు చిత్తమునకు వికాసము చేకూర్చుచుండును. అందుచేతనే యిది స్థాయితమ మనియు దీని పరిణామమైన శాంతము ప్రకృతి రసమనియుఁ జెప్పఁబడుచున్నది.

ఇప్పుడు లభించుచున్న నాట్యశాస్త్ర ప్రతులలో శృంగార రసము మొదటి రసముగాఁ బేర్కొనబడుటచే దానిని గూర్చిన చర్చయే మొదటఁ గానవచ్చుచున్నది.కాని యభినవ గుప్తుఁడు చూచిన చిరంతన ప్రతులు కొన్నిటిలో శాంత రస వివరణమే ముందొసఁగఁ బడినదట! భరతుఁడు శాంతము నట్లు ముందు వివరించుట దాని ప్రధానత్వము నూహించియేయని తలంప వలయును. దీని కుపబలముగా శాంతమును నవమ రసముగా ప్రతిపాదించు శ్లోకములు గల పాఠములో* "రత్యాదులగు భావములు, వికారములు. శాంతము ప్రకృతి యైనట్టిది. వికారములు ప్రకృతియందే పుట్టి యందేలయమొందుచున్న" వని స్పష్టముగాఁ జెప్పఁబడియున్నది.

విశ్వనాథుఁడు సాహిత్య దర్పణమున నారాయణోపజ్ఞముగా నద్భుతరస ప్రాధాన్య సిద్ధాంతమును బేర్కొనెను. ఆ సందర్భమున నతఁడుదహరించిన ధర్మదత్తుని శ్లోకము "రసమున

---

*భావా వికారా రత్యాద్యా శ్శాంతస్తు ప్రకృతిర్మతః
వికారః ప్రకృతేర్జాతః పునస్తత్రైవ లీయతే.

సారమైన చమత్కారము సర్వత్ర అనుభవింపఁబడుచున్నది. చమత్కారసారవత్వము వలన నద్భుత రసమెల్లెడను గలదని చెప్ప వచ్చును. అందుచే నారాయణుఁ డద్భుతమే రసమనినుడివియుండె" నని తెల్పుచున్నది. రసాస్వాద రూపమని చెప్పఁబడు చమత్కార మద్భుత రస మయమైనట్టిదే. మఱియుక రసాస్వాదనము నందలి లోకోత్తరత్వ మద్భుత రస ప్రాధాన్యమును సూచించుచున్నది. శృంగారాది రసములందన్నింట నద్భుత మంగముగా గోచరించుననియు, నదియే యంగిగా నున్నప్పు డద్భుత రసమని చెప్పఁబడుచున్నదనియు రసతరంగిణిలో భానుదత్తుఁడు వివరించియున్నాఁడు.

కావ్యములందు రస వస్త్వలంకారములు మూఁడింట నద్భుత రసము వ్యాపించియే యుండును. రస ప్రతీత పరాకాష్ఠ నొందునపుడన్ని రసము లందు నద్భుతము గోచరించుట యనుభవసిద్ధమే. అద్భుతము కొన్ని ఇతర రసములకుఁ బుష్టి చేకూర్చుననుట సత్యదూరము కాదు. శృంగార రస పోషణమున కద్భుత మెక్కువగాఁదోడ్పడును. వీర రసమున నద్భుతమున కెక్కువ ప్రసక్తి యుండుట చేతనే భరతుఁడు దానిని వీర రస జన్యమని పేర్కొనెను. ఇంక హాస్యమునకును నద్భుతమునకును గల సంబంధము వేఱే చెప్పనక్కరలేదు. నాటక ప్రయో సందర్భమున సామాజికుల హృదయములకు విస్మయ మావహిల్లునట్లుగా వస్తువ ననుసంధింపవలెనని చెప్పియుండెను. వస్తు సంవిధానమున సంధ్యంగములకుఁగల యొక ప్రయోజన మద్భుతమును జేకూర్చుటయే. మఱియుఁగథ నుచితరీతిఁ గ్లిష్టముగా నొనరించి యంతమున నందలి గ్రంధుల నన్నింటి విడఁదీసి సామాజికుల కద్భుతము కలిగించవలసిన యక్కఱ కలదని భరతుఁడు సూచించెను. అందుచేతనే యతఁడు నాటక కార్యము గోపుచ్ఛా గ్రాకారమై యుండవలె ననియు, గోపుచ్ఛమునకుఁ జివర వాలగుచ్ఛముండునట్లు కథాంతమున నద్భుత సన్ని వేశముల సమాహారము కానరావలె ననియు వచించి యుండెను. నిర్వహణ మద్భుత రసమయమై యుండవలెననుట కిదియే యర్థము. ఇంక నలంకార విషయమున దండిభామహు లతిశయోక్తిని బ్రధానముగాఁ బేర్కొని యలంకారాంతరములు దాని వివిధ రూపములని చెప్పుట యద్భుత రస ప్రాధాన్యమును సూచించుచునే యున్నది. అతిశయోక్తికిని నద్భుతమునకును గల సంబంధమే యిందుకుఁ గారణము. ఆనందవర్ధనుఁడును నభినవగుప్తుఁ డును గూడఁ గావ్యములం దతిశయోక్త్యద్భుతములకుఁ గల ప్రాముఖ్య పాటవములన వివరించియున్నారు.

శక్తి భద్ర విరచితమైన యాశ్చర్య చూడామణి యద్భుత రస ప్రధానమై యారసము యొక్క ప్రాముఖ్యమును బలువిధములఁ బ్రకటించుచున్నది. కృత్యారావణ మను నాటకము కూడ నాశ్చర్యచూడామణి వలెనే యద్భుత రస ప్రాధాన్యమును బ్రకటించు నట్టిదే యఁట! మహాదేవ విరచితమైన యద్భుతదర్పణమున రాముఁ "దద్భుతైక రసావృత్తి రంత ర్మీలయతీవమా" యని వల్కుటయు నాకవి కద్భుత రస ప్రాధాన్యమునఁగల ప్రత్యయమును జాటుచున్నది.

రసప్రదీప కారుఁడైన ప్రభాకరుఁడద్భుత రస ప్రాధాన్య వాదమును ఖండించుచు "నారాయణుఁడద్భుత మొక్కటే రసమని వాకొనెను. ధర్మ దత్తాదు లాతని ననుసరించిరి. కాని యది యుక్తముకాదు. అనుభవమున నది విలక్షణముగా నుండుటయే యిందుకు హేతువు. వ్యభిచారులందు స్థాయివలె రత్యాదు లందు విస్మయమున కనుగమము లేదు. శోకాదులిందు కుదాహరణము"లని పలికెను. అతఁడలంకార రహస్యమను గ్రంథమును రచించె ననియు నందద్భుత రసము సర్వాన్యరసాంతర్భూతమై యుండునను సిద్ధాంతమును బూర్తిగా ఖండించెననియుఁ దెలియుచున్నది. కాని యా గ్రంథ మిప్పుడుపలభ్యమానము కాదు.

శృంగారాదులగు కొన్ని యితర రసములలోఁ గూడ నద్భుతాంశము గోచరించుచున్న మాట సత్యమే యైనను బ్రభాకరుఁడు వచించినట్లు కరుణమున దానికి స్థానమే లేదు. రసాస్వాదము చిత్త సంవాదమే యైనను ఆ చిత్త సంవాదమన్ని రసముల సందర్భమునను విస్తారరూపమునే వహించుచుండును. కరుణ శృంగారముల విషయముచే నది ద్రుతిరూపమును బీభత్సము విషయమున సంక్షోభ రూపమును వహించుట యిందుకు దృష్టాంతము. మఱియు శృంగార కరుణము లందలి ద్రుతి బీభత్స భయానక రౌద్రాద్భుతములందించుకయుఁ గానిపింపనే కానిపింపదు. దీనిని బురస్కరించుకొని చూచినచో నొక రసముననే యితర రసములన్నియు నంతర్భూతములై యుండునను సమీకరణ వాదము లోప భూయిష్ఠముగా గోచరించును. శాంత శృంగార సమీకరణ వాదములే యితరములైనవాని కంటెఁ గొంత మెఱుగు.

ఏకైక రస ప్రకృతిత్వము నీ విధముగా నంగీకరించుట కష్టమే యైనను అనిర్వాచ్యానంద రూపమైన రస మొక్కటే యని చెప్పుటకు సందేహింపఁబనిలేదు. అలంకారికులు పలువురు దీని నంగీకరించి యుండిరి. దానికి రసమని యొక్కటే పేరు.

బ్రహ్మము వలె నది యేకైకము, అద్వితీయము. అందుచే శృంగార వీరాద్భుతాది నామములను వాని వైవిధ్యమును యథార్థములు కావు. అవి యేకమైన యంగిరసము యొక్క వివిధ భాగములు. అందుచేతనే భరతుఁడు "నహి రసాదృతేకశ్చి దర్థః ప్రవర్తతే" యను సూత్రమున రసశబ్దము నేకవచనముగా నుపయోగించెనని యభినవగుప్తుఁడు చెప్పుచున్నాడు. "ఏక ఏవ తావత్పర మార్థతో రసః సూత్ర స్థానత్వేన రూపకే ప్రతిభాతి తస్యైవ పునర్భాగదృశా విభాగః" అనుభవమునఁ గూడఁ జిత్త విశ్రాంతి రూపమును ననిర్వచనీయమును నగు రసాస్వాద మన్నిరసముల విషయముననను సమానముగానే గోచరించుచున్నది. భోజుని సరస్వతీ కంఠాభరణమునకు వ్యాఖ్యానము చేయుచు భట్ట నరసింహుఁడు సర్వరసములకును గూటస్థమైన స్వాదాత్మ యొక్కటే యనియు, రసము లన్నియు దద్విశేషములనియు నుడివి యుండెను. ఈ సిద్ధాంతము నభినవ గుప్తుఁడు సూచింపకపోయినను ఇది యాతనికి విరుద్ధము మాత్రము కాదు.

కవికర్ణపూర గోస్వామి యలంకార కౌస్తుభమున నీ విషయమునే చక్కగా నిరూపించియుండెను. "రజస్తమో హీనమై శుద్ధ సత్త్వస్వరూపమగు మనస్సున కాస్వాదాంకుర కందము కలదు. ఆ యానందమే యేకైకమగు రసమునకు స్థాయి యని విజ్ఞులు చెప్పుదురు. అదియే విభావ వైవిధ్యమువలనఁ బృథగ్విధత్వమును బొందుచున్న దని నుడివి యుండెను. స్థాయి రూపమైన యా ధర్మమొక్కటే యైనచో నొకటే స్థాయికి వీర రసమున నుత్సాహత్వమును గరుణ రసమున శోకత్వమును, నద్భుత రసమున విస్మయత్వమును నెట్లు కలుగఁ జాలునను ప్రశ్నమునకు వ్యాఖ్యానమున నిట్లు సమాధాన మొసంగఁ బడినది: "ఆ ధర్మ మొక్కటే యైనను వివిధమైన విభావము యొక్క భేదములచే భిన్నమై కానవచ్చుచున్నది. ఒకే స్ఫటికము జపాకుసుమాది నానా పదార్థముల సంగము వలన నొకప్పుడు రక్తముగను నొకప్పుడుఁ బీతముగను నొకప్పుడు శ్యామమున్నునై వివిధాకారముల నొందునట్లే స్థాయి రూపమైన యొకే ధర్మము వీర రసాది పోషకములైన నానా విధభావముల సంగము వలన నొకప్పు డుత్సాహ రూపము నొకప్పుడు విస్మయ రూపమును నొకప్పుడు శోక రూపమును బొందుచున్నది."

శృంగారాది రసములు నామ భేదముచే వేర్వేఱుగాఁ గనఁబడినను వాని వలన మానవులు పొందు నానంద మేక విధమైనట్టిదే. రసము కూడ నొక్కటే. దానికి స్థాయి యానందము. రత్యాదులైన యుపాధుల భేదముచే దానికి నానాత్వము కలుగుచున్నది.

పలువిధములైన పాత్రలయందుండు జలమున భేద మున్నను వాని యందుఁ బ్రతిఫలించు సూర్యుని ప్రతిబింబ మొక్కటే. అట్లే రత్యాదులందుఁ దారతమ్య మున్నను ఆనంద మొక్కటే. భేదము కేవల ముపాధిగతమైనదే.

6. రసాభాసాదులు :

రసాభాసము : అనౌచిత్యము ప్రవర్తిల్లినచో రసభావముల కాభాసత్వము కలుగునని చెప్పుదురు. లోక మర్యాద నతిక్రమించి వర్తించుటయే అనౌచిత్యము. జగన్నాథుఁడనుచితమైన విభావమునాలంబనముగాఁ గలిగియుండుట రసాభాసమని నుడివియుండెను. అనఁగా ననుచితమైన విభావములందు రత్యాదులు కలుగుట రసాభాస మని యతని యభిప్రాయము.

శృంగార రసాభాసము : అనురాగము నాయకా నాయికలలో నొకరికే యుండుట. అది (తిర్యక్) పశుపక్షి మ్లేచ్ఛగతమై యుండుట. స్త్రీకిఁ బలువురు నాయకులందాసక్తి యుండుట – అని శృంగార రసాభాసము మూఁడు రకములుగా నుండునని ప్రతాపరుద్రీయమునఁ జెప్పఁబడినది సాహిత్యదర్పణకారుఁడుప నాయక సంస్థమును, ముని గురుపత్నీ గతమును బహునాయక విషయమును, అనుభయ నిష్ఠమును, ప్రతినాయక నిష్ఠమును, అధమ పాత్ర తిర్యగాది గతమును నైన శృంగార మనౌచిత్యవంత మగుటచే నాభాస మగునని చెప్పియున్నాఁడు. మ్లేచ్ఛాదులుత్తమ ప్రకృతులు కాకపోవుటచేఁ దద్గతమైన శృంగారము ధర్మ విరుద్ధమౌట కవకాశము కలదు. అందుచే నిదియు రసాభాసముగా నెన్నఁబడినను గొంద ఱాలంకారికులును మహాకవులును దాని నంగీకరించి యుండిరి. విద్యాధరుఁడు ఏకావళి యందు పాత్రలకు విభావాది జ్ఞానము కాని కళాకౌశలము కాని యక్కఱ లేదనియు తద్రాహిత్యముచే తిర్య గ్గతిని రసాభాసముగా గణించుట యుక్తము కాదని వచించి యది రసమేయని సిద్ధాంతీకరించెను. మనుచరిత్ర యందలి వరూధినీ ప్రవరుల శృంగార మనుభయ నిష్ఠ మగుటచేతను, తారాశశాంకము నందలి శృంగారము గురుపత్నీ గత మగుటచేతను, అహల్యా సంక్రందనము నందలి శృంగారము మునిపత్నీ గత మగుటచేతను రసాభాసత్వమును బొందుచున్నవి. ఇట్లే వేశ్యాకులటల శృంగారము బహునాయక విషయమై యుండును గావున రసాభాస మగును.

ద్రౌపదికి పాండవులైదుగురి యందుఁగల యనురాగము బహునాయక గతమని

7

చెప్పుటకు వీలున్నది. అయ్యు వారైదుగురు నామెను బెండ్లి యాడినవారే కాని యుప పతులు కారు. మఱియు నామె వారిలో నొక్కొక్క రితో నొక్కొక్క యేఁడు కాపురము చేసెను గాని యేక కాలముననే వారందఱితోఁ గాపురము చేసి యుండలేదు. అందుచే నామె రతి రసమే కాని రసాభాసము కాదు. ఒక్కొక్కప్పుడు నాయికా నాయకులలో నొకరు మఱియొకరి గుణరూపాదులను జూచియో వినియో రతి వహింతురు. తరువాతఁ గొంత కాలమునకుఁ గాని యారతి యుభయ నిష్ఠము కాక పోవచ్చును. అట్టియెడ నది యేకతర నిష్ఠమై యుండునంత దనుక రసాభాసమే యనియు నుభయనిష్ఠమైన పిమ్మట రసమగుననియు లోచనకారుని మతమని సాహిత్యదర్పణము చెప్పుచున్నది.

"తిర్యగాది" పదము నందలి ఆది పదముచే తాపసాదులు సూచింపఁ బడుచున్నారు. పూజ్యులైన తాపసులయు నుత్తమ దేవతలయు మాతాపితరులయు రతిని వర్ణించుట యత్యంతా నౌచిత్యమున కాకర మగుటచే రసాభాసమేయని మమ్మటుని యభిప్రాయము.

స్త్రీకి బహునాయక రతి యుండుట వలెనే పురుషునికి బహునాయికా రతి యుండుటయు రసాభాసమే యని కొందఱి మతము. దీనిని బట్టి దక్షిణ నాయకానురాగము రసాభాసమే యని చెప్పవలసి వచ్చును. అది సరికాదనియు "తుల్యోఽనేకత్ర దక్షిణ" అను లక్షణ మందలి తుల్యత్వ మను వృత్తియందే కాని యనురాగమందుఁగాదనియు కుమారస్వామి సోమయాజి చెప్పుచున్నాఁడు. అందుచే శ్రీకృష్ణాది దక్షిణ నాయకుల యనురాగము బహునాయికా గతమయ్యు రసమే కాని రసాభాసము కాదు. స్త్రీకి బహునాయకులందుఁ గల్గు రతియే రసాభాసము.

శృంగారము సంభోగ విప్రలంభ భేదములచే రెండు విధములు. ఈ రెండు విధములందు నాభాస ముండవచ్చును. నాయకుఁడు పరకీయను గలయుట సంభోగాభాసము, అనురాగ మేకత్ర నిష్ఠమై యున్నప్పుడు నాయకుఁడుగాని నాయిక కాని పొందు విప్రలంభము విప్రలంభాభాసము

భావాభాసము : అనౌచిత్యమునఁ బ్రవర్తిల్లు రసము రసాభాసమైనట్లే భావము భావాభాస మగును. నాయకుఁడు పరకీయా విషయమునను, నాయిక యుపపతి విషయమునను, నాయికా నాయకులలో నొకరు తన్నుప్రేమింపని మఱొకరి విషయమునను పొందు సంచారీభావము లెల్ల భావాభాసములే.

హాస్యాభాసము : మునులు, గురువులు, తల్లిదండ్రులు మున్నగువారు పరమపూజ్యులు. హాసమట్టి వారి నాలంబనముగాఁ జేసికొని ప్రవర్తిల్లుచో ననౌచిత్యమున కాకరమై హాస్యాభాస మగును.

కరుణాభాసము : ధీరోద్ధత నాయకులు పరిస్థితుల ననుసరించి తమ శత్రువుల సంహరింతురు. అట్లు సంహరింపఁబడిన వారిని గూర్చి వారు శోకించుటలో నౌచిత్యము లేదు. ఆ శోకము కరుణ రసాభాస మనఁబడును.

రౌద్రాభాసము : లోకమునఁ గోపమునకు విషయములు కాఁదగిన వారు కొందఱుందురు. అట్టి వారిపైఁ గోపము ప్రదర్శించుట సహజమే. అట్లుకాక పూజ్యులైన గురు పిత్రాచార్యాదులపై బ్రదర్శింపఁబడు కోప మనౌచిత్య హేతువగుటచే రౌద్రాభాస మనఁబడును.

వీరాభాసము : సద సద్వ్యాపారములు రెండింటి యందును మానవులుత్సాహము ప్రదర్శింప వచ్చును. లోక రక్షణాదు లందుఁ జూపఁబడు నుత్సాహ మౌచిత్యవంతమై వీర రస మగును. అట్లు గాక బ్రహ్మహత్యాదు లందుఁజూపఁబడు నుత్సాహమును, అథమ పాత్ర నిష్ఠమైన యుత్సాహమును వీరాభాసము లగును.

భయానకాభాసము : ఉత్తమ పాత్ర లెప్పుడును భయమును బ్రదర్శింపరు. దానికి స్త్రీలును నీచ పాత్రలును ఆలంబనములుకాఁదగుదురు. అట్లుగాక భయ ముత్తమ పాత్ర గతమై వర్తిల్లిచో భయాన కాభాస మగును.

బీభత్సాభాసము : బీభత్సమునకు స్థాయి భావము జుగుప్స, హేయ వస్తువులను జూచునప్పుడది కలుగుట సహజము. అట్లుకాక సుందర వస్తువుల యెడఁ గూడ జుగుప్స వర్తిల్లుచో నది బీభత్సాభాస మగును.

అద్భుతాభాసము : లోకోత్తర వస్తు సన్నివేశములను జూచినప్పుడు కాక సర్వ సామాన్యములైన వానిని జూచు నప్పుడు కల్గు విస్మయ మద్భుతాభాసమగును.

శాంతాభాసము : శాంత ముత్తము నాయక నిష్ఠము కాక హీన నిష్ఠ మగుచో శాంతాభాసమగును.

భావోదయము : భావోదయ మనఁగ భావము యొక్క పుట్టుక. నిర్వికారమైన చిత్తమునఁగలుగు ప్రథమ వికారము భావము. నాయికా నాయకులకు వివిధ పరిస్థితులలో వివిధ భావములుదయించును. ఆ భావముల ఉత్పత్తియే భావోదయము.

భావ శాంతి : పుట్టిన భావము లడంగుటకు భావశాంతి యని పేరు. మానము, ఈర్ష్య, సుప్తి, ఆలస్యము, మోహము, ఔత్సుక్యము, త్రాసము, ధృతి మున్నగు భావములు నాయికా నాయకుల మనస్సు లందుఁ గలిగియుఁ దరువాత శాంతి పొందుట భావశాంతి యనఁబడును. నాయికకుఁ బ్రణయ వ్యాపారమున నొకప్పుడు కోపము గలుగ వచ్చును. నాయక ప్రార్థనచేఁగాని నాయక ప్రోషిత దూతీ ప్రార్థనలచేఁ గాని యది యడంగుట భావశాంతి కుదాహరణలు.

భావ సంధి : రెండు భావముల కలయికకు భావసంధి యని పేరు. ఈ రెండును ఉప మర్ద్యోపమర్దక భావముతో నుండి యొకరికే కలుగ వలయును. ఇవి పరస్పర విరుద్ధము లైనప్పుడే ఉప మర్ద్యోప మర్దక భావము కలిగి యుండును. ఉదా : నరకాసురునితో యుద్ధము చేయునప్పుడు సత్యభామకు గృష్ణునిఁ జూచు నప్పుడు హర్షమును నరకాసురునిఁ జూచు నప్పుడు కోపమును గలుగుచుండెను. ఇట హర్ష కోపములకు సంధి. ఈ రెండు బరస్పర విరుద్ధములు. హర్షము కోపముచే నుపమర్ద్య మగుచున్నది.

భావ శబలత : భావ శబలత యనఁగా భావవైవిధ్యము. ఒకరి హృదయముననే వివిధ భావము లుదయించుటకు భావశబలత యని పేరు. ఇచ్చట నీ భావముల కుపమర్ద్యోపమర్దక భావము నియమితముగా నుండ నవసరము లేదు. నరసభూపాలీయమున నీ క్రింది పద్యము భావశబలత కుదాహరణముగా నొసంగఁ బడినది :

చెలు లేమందురొ భావవీథి, నకటా! శ్రీ నారసింహేంద్రు కౌఁ
గిలి నాకెన్నఁడు కల్గునో, నృపతితోఁ గ్రీడింపఁగా బోవు చం
చలపుం జిత్తము నేమి సేయుదు, గురున్ సద్భక్తిఁ బ్రార్థింతునో
యల ప్రాణేశ్వరుఁ జూడకున్నఁ బరితాపాటోపముల్ మానునే.

ఇందు నాయిక హృదయమున శంక, ఉత్కంఠ, దైన్యము, మతి వితర్కము అను పలు భావముల శబలత (వైవిధ్యము, మేళనము) కానవచ్చుచున్నది.

రసభావ రసాభాస భావరసాదులు ప్రధానములుగాక యంగములుగా వర్ణింపఁబడుచో రసవదా ద్యలంకారము లగును. భావమునకుఁ గాని రసమునకుఁ గాని మఱొక రసమంగ మగుచో రస వదలంకారము. మఱొక భావమంగమగుచో ప్రేయోఽలంకారము. ఒక భావమునకు రసాభాసము కాని భావాభాసము కాని యంగము లగుచో ఊర్జస్వ దలంకారము. రసమునకు భావశాంతి యంగముగా నుండుచో సమాహితాలంకారము. ఈ రసవదా ద్యలంకారములు గుణీభూత వ్యంగ్య భేదమగు నపరాంగములోఁ జేరును.

రససంకరము : రస సంకర మనఁగా బలు రసముల కలయిక. పలు రసముల కూడిక యొక్కచో వర్ణింపఁ బడుచో నది రస సంకర మనఁ బడును.

7. రసములెన్ని (శాంతము రసమగునా?) :

భరతుని నాట్యశాస్త్రమున రసములను స్థాయి భావములను బేర్కొను శ్లోకములు రెండున్నవి. అవి యన్ని ప్రతులలో సమానముగా నుండక రెండు విధములైన పాఠభేదములతోఁ గనవచ్చుచున్నవి. అందొక పాఠమిట్లున్నది:

శృంగార హాస్య కరుణ రౌద్ర వీర భయానకాః
బీభ త్సాద్భుత సంజ్ఞాచే త్యష్టౌ నాట్యే రసాః స్మృతాః
రతి ర్హాసశ్చ క్రోధోత్సాహౌ భయం తథా
జుగుప్సా విస్మయశ్చేతిః స్థాయిభావాః ప్రకీర్తితా

ఈ శ్లోకములలో నెనిమిది రసములును ఎనిమిది స్థాయిభావములును బేర్కొనఁ బడినవి. ఈ క్రిందిది రెండవ పాఠము:

శృంగార హాస్య కరుణ రౌద్ర వీర భయానకాః
బీభత్సాద్భుత శాంతాశ్చ నవ నాట్యే రసాః స్మృతాః
రతి ర్హాసశ్చ క్రోధోత్సాహౌ భయం తథా
జుగుప్సా విస్మయ శమాః స్థాయి భావాః ప్రకీర్తితాః

ఇందు తొమ్మిది రసములును తొమ్మిదిస్థాయి భావములును జెప్పఁబడినవి. మొదటి పాఠమున లేని శాంత రసమును శమ స్థాయిభావమును రెండవ పాఠమున నుండుటయే

యీ రెండు పాఠములకు గల భేదము. దీని వలన రసము లెనిమిదియా తొమ్మిదియా, శాంతము రసమగునా కాదా యను ప్రశ్నలుదయించినవి.

వాసుకి యను నతఁడు శాంత రసమును స్థాపించెనని కొందరును కోహలుఁడు దానిని స్థిరపఱిచెనని కొందరును చెప్పుచున్నారు. కాని వారి ప్రమాణవాక్యములిప్పుడు పలభ్యమానము లగుటలేదు. కాఁగా రసములలో శాంతమును గూడఁ గలిపి నవరస సిద్ధాంతమును మొదట వెల్వరించిన వాఁడుద్భటుఁడని చెప్పవచ్చును. (1) ఇతఁడు తన కావ్యాలంకార సార సంగ్రహమున తొమ్మిది రసములను బేర్కొని తదనుగుణముగాఁ దొమ్మిది స్థాయిభావములను సూచించి యుండెను. ఇతఁడు భరతుని నాట్యశాస్త్రమున కొక వ్యాఖ్యానము రచించి నట్లును, తొమ్మిది రసములను తొమ్మిదిస్థాయి భావములను బేర్కొను శ్లోకముల నితఁడే నాట్యశాస్త్రమునఁ జొప్పించినట్లును జెప్పుదురు. ఇతఁడు రచించిన నాట్యశాస్త్ర వ్యాఖ్యాన మిప్పుడు లభించుటలేదు.

శాంతము రసము కాదను వారిట్లు వాదింతురు. భరతుఁడు శాంతమును రసములలోఁ జేర్పక "అష్టౌ నాట్యే రసాః స్మృతా" అని చెప్పి యుండెను. మఱియు నితఁడు స్వరలయ గుణాలంకార వృత్తి వృత్తముల నెనిమిది రసములకే నిరూపించెను గాని శాంతమునకు నిరూపించి యుండలేదు. (2) ఆనందవర్ధనుఁడు ధ్వన్యాలోకమున శాంతరస చర్చ కావించుచు స్వోపజ్ఞములైన యుక్తులనే ప్రకటించెను గాని తన వాదమునకుఁ బోషకముగా భరతుని ప్రమాణము నుద్ధరించి యుండలేదు. నిజముగా భరతుఁడు శాంతమును గూడ రసములలోఁ చేర్చి యుండినచో నాతఁడు తద్వాక్యములను బ్రమాణముగా నేల యుద్ధరింపకుండును? (3)దశరూపక కర్తయైన ధనంజయుఁడు "శాంతమును రసముగా గొందరు పేర్కొనిరి. కాని దానికి నాట్యములందుఁ బుష్టిలే"దని జెప్పియుండెను. శ్రవ్య కావ్యములలో దానిని బోషింప వచ్చునా అను విషయమున నాతఁడేమియుఁ జెప్పియుండలేదు. (4) దశ రూపకమునకు వ్యాఖ్యానము రచించిన ధనికుఁడు "అనాది కాల ప్రవాహాయాతములైన రాగద్వేషములను భేదించుట శక్యము కాకపోవుటచే శాంతరస మనునది లే" దను పరమతమును సూచించెను. (5) రస మనుకర్తయైన నటుఁడే అనుభవించు నని భావించువారు "శాంతము శమ సాధ్యమగుట చేతను, నటుని యందది అసంభవ మగుట చేతను నాట్యమున రసము లెనిమిదే, అందు శాంతము యుక్తముకా'దని చెప్పియుండిరి. (6) ఇప్పటి కొన్ని నాట్యశాస్త్ర ప్రతులందు వలెనే

అభినవ గుప్తుని నాఁటి ప్రతులందును శాంతరస ప్రసక్తి లేదని అతని వాక్యముల వలనఁ దెలియుచున్నది. (7)కొందఱు శాంతము ప్రత్యేక రసము కాదనియు నది దయా వీరమునందో బీభత్సాదులయందో అంతర్భవించు ననియు నభిప్రాయ పడి యున్నారు. పై వాదమును బట్టి శాంతము రసము కాదనియు నెనిమిదే రసములనియు దేలుచున్నది.

ఆనందవర్ధనుఁడు అభినవగుప్తుఁడు మున్నగు వారు పై హేతువులను ఖండించి శాంతముకూడ రసమేయని నిరూపించి సిద్ధాంతమును స్థాపించి యున్నారు. (1) భరతుఁడు నాట్యశాస్త్రమున శాంతముకూడ రసమేయని ప్రత్యక్షముగాఁజెప్పియుండక పోయినను పరోక్షముగా నాయా సందర్భము లందు దానిని గూడ సమ్మతించియే యున్నాడు. "నాట్యము దుఃఖార్తులకు, శ్రమార్తులకు, శోకార్తులకు, తపస్వులకు క్రమముగా ధర్మమును వినోదమును అర్థమును శమమును గలిగించుచు వినోదమును జేకూర్చుననియు, *యువకులు కామమందును, అర్థపరు లర్థమందును, విరాగులు మోక్షమందును తుష్టి నొందుదు రనియు, నానావస్థాం తరాత్మకమును లోకవృత్తానుకరణమును అగునట్లుగా తనచే సంతరించఁబడిన నాట్యమున సప్తద్వీపానుకరణము ప్రతిష్ఠింపఁబడిన దనియు, నాట్యమునఁగానఁ బడని జ్ఞానము కాని శిల్పము కాని విద్య కాని కళ కాని యోగము కాని కర్మకానిలే" దనియు నాతఁడెడ నెడ నాట్య శాస్త్రమునఁ జెప్పిన వాక్యము లిందుకుఁ దార్కాణములు. విరాగులు మోక్షమునఁదుష్టి నొందుదు రనగా శాంత రసా స్వాదముచే సంతసింతురని యర్థము. శాంతరసము గూడఁ బోషింపనిచో నాట్యము నానా భావోపసంపన్నమును త్రైలోక్యానుకరణమును ఎట్లు కాఁజాలును? నాట్యమునందులేని దేదియులేదన్నప్పుడందు శాంతము మాత్రమేల లేకుండును? మఱియు 'క్వచిచ్ఛమః' అని చెప్పుటచే భరతముని శాంతమును గూడ నంగీకరించియే యున్నాఁడు. అందుచే భరతుఁడు నాట్యశాస్త్రమున రస సంఖ్యానము చేయు సందర్భమందు శాంతమును జెప్పియుండలేదను వాదము యుక్తియుక్తము కాదు. మఱియు భరతుఁడు నాట్యశాస్త్రమున వికృతి రసములనే పేర్కొనదలచెననియు సర్వో త్కృష్టమును బ్రకృతిరసమునునైన శాంతము నుక్తప్రాయముగా భావించి వేఱుగాఁ జెప్పఁడయ్యెననియుఁ గొందఱు భావింతురు. అదిగాక

---

* క్వచిద్ధర్మః క్వచిత్క్రీడా క్వచి దర్థః క్వచిచ్ఛమః దుఃఖార్తానాం శ్రమార్తానాం శోకార్తానాం తపస్వినామ్ విశ్రాంతి జననం కాలే నాట్య మేత ద్భవిష్యతి.

అభినవ గుప్తుఁడు ప్రాక్తనములైన నాట్య శాస్త్ర గ్రంథములందు మొట్టమొదట శాంత రస ప్రసంగము కావించిన పిమ్మటనే భరతముని శృంగారాద్యన్య రస ప్రసంగము కావించినట్లు కనఁబడుచున్నదని స్పష్టముగాఁ జెప్పియున్నాడు. *(2) ఆనందవర్ధనుఁడు శాంతరస స్థాపన సందర్భమున భరతముని వాక్యముల నుద్ధరింపక పోయినను అతనిననుసరించియే ఆ రసము స్థితిని నిరూపించి యుండెను. అతఁడు భరతుని శ్లోకముల నుద్ధరింపనంత మాత్రమున భరతుఁడు శాంతరసము నంగీకరింపలేదని నిశ్చయింపరాదు. ధనంజయుఁడు దశరూపకమున నాట్యములందు శాంతమునకుఁ బుష్టి లేదని చెప్పిన సందర్భమున వ్యాఖ్యాత "శాంత మనభినేయ మగుటచే దానికి నాట్యమునఁబ్రకాశము లేకపోయినను సర్వసూక్ష్మాతీత వస్తువులను శబ్దముచేఁ బ్రతిపాదింప నవకాశమున్నది కావున దానికిఁ గావ్య విషయత్వము నివారింపఁ బడుటలే"దని చెప్పి శ్రవ్యకావ్యములలో శాంతమును బోషించ వచ్చునని యంగీకరించెను. అతఁడు ద్వంద్వాతీతమైన దశయే శాంతమనియు అదిమోక్షావస్థ యందే కలుగుననియు, దానిని నిర్వచించుట అసాధ్యమనియు, దానికి సంచార్యాదులు లేవనియు, ననిర్వచనీయమైన దాని ననుభవించు సహృదయు లుండరనియు భావించినప్పటికిని అది సంతుష్టి దయా మైత్రీ రూపమున నెల్లరచే నాస్వాదింపబఁడుననియుఁ దదాస్వాద సమయముననితర రసముల నాస్వాదించునప్పుడు వలెనే చిత్తద్రుతి వికాస విస్తారములు కలుగు ననియుఁ జెప్పియుండెను. సాహిత్యదర్పణమున విశ్వనాథుఁడు యుక్తవియుక్త దశావస్థితమైన శమము రసత్వమును బొందుననియు, దానికి సంచార్యాదు లుండుటలో విప్రతిపత్తి లేదనియుఁదెల్పి శాంతమును దృశ్య శ్రవ్యకావ్యములు రెండింటఁబోషింపవచ్చునని నిరూపించెను (4) అనాది కాలమునుండి వచ్చుచున్న రాగ ద్వేషముల నుచ్ఛేదించుట అశక్య మగుటచే శాంత రసము లేనే లేదని ధనికుఁడు సూచించిన పరమతమును బరిశీలించి ఆనందవర్ధనుఁడు "కామాదులందు సముచితములైన రత్యాది చిత్తవృత్తులు కవి నట వ్యాపారముచే సహృదయులైన సమాజికులందు శృంగారాది రసములుగా నాస్వాద్య మానము లగునట్లే మోక్ష పురుషార్థోచితమైన చిత్తవృత్తి సైత మర్హులైన సహృదయులందు రసత్వము నేల పొందరా"దని తెల్పి రాగద్వేషాది ద్వంద్వ రహితులైన వీతరాగులు కొందఱుందురనియు, స్వల్ప సంఖ్యాకులైనను అట్టివారు శాంత రసము

---

* తథాన చిరంతన పుస్త కేషు స్థాయి భావాన్ రసత్వ ముపనేష్యామః
ఇత్య నంతరం శాంతోనామ శమస్థాయి భావాత్మకః ఇతి లక్షణం పఠ్యతే

నాస్వాదింపఁజాలుదురనియు నిరూపించెను. (5) శమము నటులం దసంభవమగుటచే శాంత రసమునకుఁ దావులేదను వాదము సమంజసము కాదు. ఏలయన రసము నటనిష్ఠము కానేకాదు. అది సామాజిక నిష్ఠము. సహృదయులైన సామాజికులలో శాంతచిత్తులైనవారు కొందఱైన నుందురు. కావున వారు శాంతరసము ననుభవింతురనుటలో నాక్షేపము లేదు. రసము నాస్వాదించువాఁడు నటుఁడు కాదు. కావున నాట్యమున నెనిమిదే రసములను వాద మసంగతమని సంగీత రత్నాకరముకూడఁ జెప్పుచున్నది. (6) దయా వీరము వీర రస భేదములలో నొకటి, దీనికి స్థాయిభావముత్సాహము. శాంతమునకు స్థాయి భావము శమము. ఉత్సాహ మహంకార రూపము, శమ మహంకార ప్రశమన రూపము. అందుచే శమస్థాయికమైన శాంత ముత్సాహ స్థాయికమైన వీరము నంతర్భవించుట కవకాశములేదు. అహంకార రహితములు కాఁగల్గుచో దయావీరాదులే యొకప్పుడు శాంతమున నంతర్భవింపవచ్చును. శాంతము వీర బీభత్సాదులం దుద్భవించుననికొందఱుచెప్పుచున్నట్లు దశరూప కావలోకము పేర్కొనుచున్నది. ఇదియు సంతగము కాదు. ఏలయన, బీభత్సమునకు స్థాయిభావమైన జుగుప్స రౌద్ర కరుణ వీర భయానకా ద్భుతముల కౌగ్ర్య నిర్వేదధృతిత్రాస హర్షాదులవలె శాంతమునకు వ్యభిచారి భావము కాఁగల్గునే కాని స్థాయి భావము కాఁజాలదు. అందుచే జుగుప్స శాంతమునకుస్థాయియనియు, శుద్ధ బీభత్సము మోక్ష సాధనమనిచెప్పుటయు సమంజసము కాదు. ఈ విధముగా ఆనందవర్ధనాభినవగుప్తాదు లష్ట రసవాదమును ఖండించిరసములు తొమ్మిది యని నిరూపించిరి.

కొందఱు శాంతమును నవమ రసముగా నంగీకరించియు దానిని పాక్షికముగా మాత్రమే గ్రహించిరి. ధనికుఁడు శాంతమును శ్రవ్య కావ్యములలోమాత్రము పోషింపవచ్చునని భావించెను. ధ్వన్యాలోక వ్యాఖ్యానములలో నొకటగు చంద్రికలోఁదత్కర్త శాంతమును కావ్యములలో నంగి రసముగాఁగాక అంగ రసముగా మాత్రమే పోషింపవలెనని సిద్ధాంతీకరించినాగానందమున శాంతమంగరసముగానే నిర్వహింపఁబడినదని తెల్పెను. సంగీత సుధాకరకర్త అగు హరిపాలుఁడు శాంతమును శాంతరసము బ్రహ్మ రసము అని రెండుగా విభజించి యా రెండింటికి క్రమముగా నిర్వేదానందములు స్థాయి భావములని తెల్పెను. శాంత రసమనిత్యమనియు మోక్షము నొసంగఁజాలదనియు నతఁడభిప్రాయపడెను. ఈ విధముగా వీరు శాంతమును పాక్షికముగా గ్రహించినవారైనను నవరస సిద్ధాంతము

నంగీకరించినవారే. బౌద్ధ జైన కవులు క్రీ.శ ౪,౫ శతాబ్దులకుఁ బూర్వమే శాంతరస ప్రధానములైన కావ్యములు రచించి యుండిరి.

శాంతరసమునకు స్థాయి యేదను విషయమునఁగూడ నభిప్రాయభేదము లున్నవి. కొందఱు శాంతమునకుస్థాయి భావము శమమనియుఁ గొందఱు సర్వచిత్తవృత్తి ప్రశమన మనియు, గొందఱు జుగుప్స యనియు, గొంద రాత్మరతి యనియు నుడివియుండిరి. రుద్రటుఁడు శాంతమునకు సమ్యక్జ్ఞానము స్థాయి యనెను. ఆనందవర్ధనుఁడు దానికితృష్ణాక్షయ సుఖముస్థాయియని నుడివెను. భోజుఁడు ధృతి (నిత్యసంతుష్టి) యని సూచించెను. కొందఱు శాంతమునకు రత్యాదులలో నేదో యొకటి కాని రత్యాదులన్నియుఁ గలసి కాని స్థాయి భావము కావచ్చునని అభిప్రాయపడిరి. అభినవగుప్తుఁడీ అభిప్రాయమును ఖండించి శాంతమునకు తత్త్వజ్ఞానము (ఆత్మజ్ఞానము) స్థాయియని నిర్ణయించి అది వట్టిస్థాయి కాక తక్కిన స్థాయిభావము లన్నింటికి మూలభూత మగుటచేస్థాయి తమమని సూచించెను. కాని చిరంతన నాట్యశాస్త్ర గ్రంథములలో శాంతము శమ స్థాయి భావాత్మక మని యున్నదని యాతఁడు చెప్పియుండుటచే శమమును గూడ స్థాయిగా నంగీకరించెననియే చెప్పవచ్చును. ఆత్మజ్ఞానమున శమ మంతర్గతమై యుండుటచే నిట్లు చెప్పుటలో విప్రతిపత్తిలేదు. పలువురు లాక్షణికులు శాంతమునకు శమమే స్థాయిభావముగా నిర్ణయించియున్నారు.

రస సంఖ్యను తొమ్మిది కధికముగా నిర్ణయించినవారును గలరు. రుద్రటుఁడు స్నేహ స్థాయికమైన ప్రేమరసమును పదవ రసముగాఁ బేర్కొనుటయేకాక నిర్వేదాదులు కూడ విభావాది సంయోగమున సమ్యక్పరిపుష్టములై రసత్వమును బొందునని అభిప్రాయపడెను. లోకరూఢి ననుసరించి భరతాదులు తొమ్మిది రసములనే పేర్కొన్నను నిజమునకు రసము లనంతములని చెప్పిన భట్టలోల్లటుని మతమే రుద్రటుని యభిప్రాయమునకు మూలము. ఈ యభిప్రాయ మభినవగుప్తునకు సమ్మతము కాదు.

ఆయా రసములందు వర్ణముల నెట్లుచ్చరింప వలయునో చెప్పు సందర్భమున భరతుఁడు వాత్సల్యమును గూడ నొక్కచోఁబేర్కొని యుండుటచే విశ్వనాథుఁడు దానిని గూడ రసాంతరముగాఁబేర్కొని ప్రేమయుక్తమగు రతి దానికి స్థాయి భావమని తెల్పెను. జగన్నాథుఁడు వాత్సల్యము భావమే కాని రసము కాదని నిర్ణయించెను. కొందఱు మృగయ, దూత్యము, శ్రద్ధ, ప్రీతి, స్నేహము, దుఃఖము, సుఖము, ఉద్ధతము, కార్పణ్యము మున్నగు వానిని గూడ

రసములుగాఁ బరిగణించిరి. అభినవగుప్తుఁడుఁ ఇవి భావములే కాని రసములు కాదని అభిప్రాయపడెను.

ఉజ్జ్వలనీలమణికర్తయగు రూపగోస్వామియు భక్తిరసాయనకారుఁడగు మధుసూదన సరస్వతియు భక్తిని కూడ రసముగాఁ బేర్కొనిరి. రూప గోస్వామి చిత్తద్రవమును, మధుసూదన సరస్వతి భగవదాకార చిత్తవృత్తియు దానికి స్థాయి భావములని నుడివిరి. ధనంజయుఁడు మమ్మటుఁడు జగన్నాథుఁడు మున్నగువారు భక్తిభావమే కాని రసము కాదని తలంచిరి. రసములకును రంజన విషయమున భేదమున్నది. రత్యాదులగు స్థాయి భావములు విభావానుభావ సాత్త్విక వ్యభిచారి భావ సంసర్గముచే బరిపుష్టములై రసత్వము నొందును. నిర్వేదాదులగు భావములట్లు రసత్వమును బొందఁ జాలవు. అందుచేతనే భరతుఁ డెనిమిదో తొమ్మిదో మాత్రము రసములని తెల్పి యుండెను. రుద్రటుఁడు నిర్వేదాదులు కూడ నాస్వాద్యములగుటచే రసములేయని భావించెను. కాని అన్యులాభావములను అంగీకరింపలేదు.

భానుదత్తుఁడు రసతరంగిణిలో మాయారసమును వేఱుగాఁ బేర్కొని దానికి మిథ్యాజ్ఞానము స్థాయిభావమని తెలిపెను. మందార మరంద చంపువు ఈ అభిప్రాయమును ఖలపరిచెను. కావ్య విలాసకర్త మిథ్యాజ్ఞానము మాయకుఁగారణ మనుట శాస్త్ర విరుద్ధమనియు నశ్వరము తుచ్ఛము నగు మాయ నిత్యము బ్రహ్మానంద స్వరూపము నగురసముకాఁ జాలదనియు మాయకు రసత్వము నిరాకరించెను.

ఈ విధముగా రసము లెనిమిది యని కొందఱు తొమ్మిది యని కొందఱు పదియని కొందఱు అనంతములని కొందఱు అభిప్రాయపడి యుండిరి. రస మొక్కటే యని చెప్పినవారు కూడఁ గొందఱు గలరు. రస సమీకరణ మను వ్యాసమున ఈ విషయము చర్చింపబడినది. ఈ విధముగా రసములెన్ని యను విషయమున భిన్నమతము లున్నను నవరస సిద్ధాంతము నకే లోకమున నెక్కువ ప్రాచుర్య మున్నది.

4. ధ్వని సోపానము

వృత్తులు : వాచ్య లక్ష్య వ్యంగ్యార్థములు :

నామ విభక్తులతోఁ గాని క్రియా విభక్తులతోఁ కాని కూడి అర్థవంతమై యుండు నక్షర సమూహమునకు పదమని పేరు. పదములకును వాని యర్థములకును గల సంబంధము శక్తియని నైయాయికులు నిర్వచించి యుండిరి (పద పదార్థ సంబంధ శ్శక్తిః). ఈ శక్తినే కొందఱు వృత్తియనియుఁ గొందరు వ్యాపారమనియుఁ బేర్కొని యుండిరి. వృత్తులు శబ్దమును అర్థమును ఆశ్రయించి రెండు విధములుగా నుండును. వానికి క్రమముగా శబ్ద వృత్తులు అర్థవృత్తులు అని పేర్లు. ఇట నర్థమనగా రసమని యర్థము.

శబ్ద వృత్తులు : అభిధ, లక్షణ, వ్యంజన అని శబ్దవృత్తులు మూఁడు విధములు. అభిధావృత్తిచే బోధింపఁబడు నర్థమునకు వాచ్యము, అభిధేయము లేక శక్యము అనియు, లక్షణావృత్తిచే బోధింపఁబడు నర్థమునకు లక్ష్యమనియు, వ్యంజనా వృత్తిచే బోధింపబడు నర్థమునకు వ్యంగ్యమనియుఁ బేర్లు. వాచ్యార్థమును బోధించు శబ్దము వాచకము లేక శక్తము. లక్ష్యార్థమును బోధించునది లక్షకము. వ్యంగ్యార్థమును బోధించునది వ్యంజకము. పైని పేర్కొనఁబడిన శబ్ద శక్తులు మూఁడేకాక తాత్పర్య శక్తియను వాక్య శక్తి మఱొకటి కలదని మీమాంస కులలో నొకతెగ వారగు అభిహితాన్వయ వాదులు చెప్పుదురు. శబ్దశక్తులు పదముల యొక్క అర్థములను మాత్రమే బోధించుననియు వాక్యమునందలి పదముల కన్నింటికి నన్వయము కలిపి దాని సంపూర్ణార్థమును బోధించుటకు వేఱొక శక్తి ఆవశ్యకమనియు, అదియే తాత్పర్య శక్తి యనియు వీరి అభిప్రాయము. వీరి మతము ననుసరించి పదముల అర్థము బోధపడిన తరువాత వాక్యార్థ మవగత మగును. మీమాంసలో అన్వితాభిధాన వాదులను వేఱొక తెగవారు తాత్పర్య శక్తి అను నాలుగవ శక్తి నంగీకరింపలేదు. వీరి మతమున వాక్యార్థమవగతమైన పిమ్మటనే పదముల అర్థము బోధపడును. అందుచే తాత్పర్య శక్తిని

వేఱే చెప్ప నవసరము లేదని వీరి అభిప్రాయము. విద్యానాథుండు ప్రతారుద్రీయమున "తాత్పర్యార్థము వ్యంగ్యార్థమే అది వేఱు కాదు" అని చెప్పి యుండెను. తత్ అనగా రసాది. తత్పరము లనంగా రసాద్యాసక్తములగు విషయములు వాని భావము తాత్పర్యము. మహాకవులు తమ కావ్యములలో కేవల పదార్థ తదన్వయములను మాత్రమే కాక వాక్యార్థమును అంతకంటే రమణీయతరమగు వ్యంగ్యార్థమును గూడఁ బ్రకటింతురు. దీనికే తాత్పర్యార్థమని పేరు. ఇదియును వ్యంగ్యార్థమును అభిన్నములు. భావ ప్రకాశకారుండు కూడా తాత్పర్యరూపముగా గమ్యమాన మగునదే ధ్వన్యర్థమని తెల్పియుండెను.

అభిధావృత్తి : శబ్దార్థములకుఁ గల పరస్పర సంబంధమును నిర్ణయించుటకు సంకేతమనిపేరు. ఈ శబ్దమున కీయర్థ ముండవలె నను ఈశ్వరేచ్ఛయే సంకేతమని పూర్వులును లోకేచ్ఛయే సంకేతమని నవ్యులును అభిప్రాయపడి యుండిరి. అట్లు సంకేతితమైన శబ్దార్థమును తెల్పు శక్తి అభిధ యనఁబడును. సంకేతికార్థమనంగా వాచక శబ్దమునకుఁ గల ముఖ్యార్థము. దీనినే వాచ్యార్థ మందురు. ఇది వ్యాకరణము, ఉపమానము, ఆప్తవాక్యము, వ్యవహారము, వివరణము, అన్యపద సాన్నిధ్యము అను వానిచే నిర్ణయింపఁబడును.

సంకేతము యొక్క స్వరూప స్వభావములను బట్టి వాచక శబ్దము నాల్గు విధములు. 1. జాతి వాచకము, ఉదా. గోవు; 2. గుణవాచకము, ఉదా: శుక్లము, నీలము; 3. క్రియావాచకము, ఉదా: చదువుచున్నాఁడు, వండునది; 4. ద్రవ్య వాచకము, ఇచ్చట ద్రవ్యమనఁ గా పేరు, ఉదా: కృష్ణుఁడు, రుక్మిణి. మనము నిఘంటువును జూచినచో కొన్ని శబ్దములకు పెక్కర్థములున్నట్లు తెలియవచ్చును. అప్పుడు శబ్దమునకు పెక్కర్థములను బోధించుటకు పెక్కు అభిధాశక్తులుండునా అను సందేహము కలుగును. అభిధాశక్తులు పెక్కుండవు. ఒక్కటే అభిధాశక్తి యుండును. అది ఒక్కొక్క సందర్భమున ఒక్కొక్క అర్థమునే బోధించుచుండును. సంయోగము, విప్రయోగము, సాహచర్యము విరోధిత, అర్థము, ప్రకరణము, లింగము (గుర్తు), అన్య శబ్ద సాన్నిధ్యము, సామర్థ్యము, ఔచితి, దేశము, కాలము, వ్యక్తి (స్త్రీ పుం నపుంసక లింగములు) స్వరము, అభినయము మున్నగునవి అభిధాశక్తిని నియమించి అర్థమును నిర్ణయించుటకు సహకారులగుచుండును. ఉదాహరణమునకు రామకృష్ణులను సమాసమును పరిశీలింపుఁడు. రాముఁడనగఁ దశరథరాముఁడు, బలరాముఁడు, పరశురాముఁడు అను నర్థములున్నవి. కాని యిచ్చట కృష్ణ శబ్ద సాహచర్యముచే రాముఁడనంగా బలరాముఁడను

నర్థమే స్ఫురించును. అట్లే రామలక్ష్మణులనునప్పుడు రామ శబ్దమునకు లక్ష్మణ శబ్ద సాహచర్యముచే దాశరథి అను నర్థమే స్ఫురించును. ఈ విధముగనే సంయోగ విప్రయోగాదులన బట్టి గూడ శబ్దముల అర్థమును నిర్ణయము చేయవచ్చును.

స్వరూప స్వభావములను బట్టి వలెనే అర్థబోధక స్వభావమునుబట్టి కూడా వాచ శబ్దము. 1.యౌగికము, 2. రూఢము, 3. యోగరూఢము, 4. యౌగికరూఢము. అ నాలుగు విధములు. వ్యుత్పత్త్యర్థమును మాత్రమే తెల్పు శబ్దము యౌగికము. ఉదా. (కవయతీ కవిః) వర్ణించువాఁడు కవి. వ్యుత్పత్త్యర్థముతో సంబంధము లేకుండ సముదాయార్థము బోధించు శబ్దము రూఢము. ఉదా. మేఘము, చెట్టు. వ్యుత్పత్త్యర్థము కంటే సముదాయార్థమున యెక్కువ ప్రాధాన్య మొసంగు శబ్దము యోగరూఢము. దీనికి యౌగికార్థము రూఢార్థమ రెండును ఉండును. కాని రూఢార్థమునకే ప్రాధాన్యము. ఉదా. వారిజము అనుదానికి నీ యందుఁ బుట్టినది అను వ్యుత్పత్త్యర్థమున్నను అది పద్మమను నర్థముందే రూఢమై యున్నది యౌగిక రూఢార్థములను, రెండింటిని సమానముగా బోధించునది యౌగిక రూఢము. ఉదా ఉద్భిదము. దీనికి భూమి నుద్భేదించునది అను వ్యుత్పత్తిని బట్టి తరుగుల్మాది యనియు రూఢ్యర్థమును బట్టి యజ్ఞ విశేషమనియు నర్థములు గలవు.

లక్షణావృత్తి : ముఖ్యార్థమున కనుపపత్తి కలుగునప్పుడు ప్రయోజనమును బట్టి కాని లోకమునందలి రూఢినిబట్టి కాని ముఖ్యార్థముతో సంబంధము గల వేఱొక అర్థమున బోధించు శబ్ద శక్తికి లక్షణ యని పేరు. ఇది బోధించు నర్థము లక్ష్యార్థము. ఇది వాచ్యార్థముత సంబంధము గలిగి యుండునే కాని దానికిఁ గేవలము భిన్నముగా నుండదు. ఇచ్చట ముఖ్యా బాధ,ముఖ్యార్థ సంబంధము, ప్రయోజనము గాని రూఢి కాని యుండుట అను మూఁడ విషయములను గమనింపవలయును.

"గంగాయాం ఘోషః" అనఁగా గంగయందు గొల్లపల్లెయని వాచ్యార్థము. గంగయంద గొల్లపల్లె యుండుట అసంభవము. ఇట వాచ్యార్థమున కనుపపత్తి కలిగినది. అందుచే దానిత సంబంధము గల యింకొక యర్థమును గ్రహింపవలెను. దీనిని బట్టి గంగా తీరమందు గొల్లపల్లె అనునర్థము గ్రహింపవచ్చును. ఇట్లు గ్రహించుటకు రూఢి కాని ప్రయోజనము కాని కారణములై యుండవలయును. "గంగాయామ్" అను మాటకు గంగా తీరమందను లోకరూఢి లేదు. కాని ప్రయోజనమున్నది. అట్లు చెప్పుటవలన గంగ యందలి శీతత్వ పావనత్వాదుల

ఘోష మందును గలవని స్ఫురించుటయే ఆ ప్రయోజనము "గంగాతీరమందు గొల్లపల్లె" యని వివరించి చెప్పుట వలన నా ప్రయోజనము స్ఫురింపదు. ప్రయోజనమును బట్టి యిచ్చట "గంగాయాం ఘోషః" అను దానికి గంగాతీరమందు ఘోష మని వాచ్యార్థసంబంధముగల మఱొక యర్థము చెప్పుకొనుచున్నాము. ఈ యర్థమును స్ఫురింపఁజేయు శబ్దశక్తికే లక్షణయని పేరు.

లక్షణ-సంబంధ నిబంధనా లక్షణ, సామ్యనిబంధనా లక్షణయని ప్రధానముగా రెండు విధములు. ఇవి మరల ప్రయోజనమును బట్టియు రూఢిని బట్టియు నొకొక్కటి రెండేసి విధములు. సంబంధ నిబంధనా ప్రయోజన లక్షణ, సంబంధ నిబంధనా రూఢి లక్షణ, సామ్య నిబంధనా ప్రయోజన లక్షణ, సామ్య నిబంధనా రూఢి లక్షణ అని వానికి పేర్లు. గంగాయాం ఘోషః అను దానికి గంగాతీరమందు ఘోషమని పైని చెప్పఁబడిన యర్థము సంబంధ నిబంధనా ప్రయోజన లక్షణ కుదాహరణము. మనము కుశల శబ్దమును 'నేర్పుగల' అనునర్థమున వాడుచుందుము. 'వాఁడు కార్యమునఁ గుశలుఁడనఁగా పనియందు నేర్పుగలవాఁడని యర్థము'. కుశల శబ్దమునకు (కుశాన్‌లాతి = కుశలను గ్రహించువాఁడు) అనునది వ్యుత్పత్త్యర్థము. వాఁడు కార్యమున కుశలుఁడను నప్పుడీ వాచ్యార్థమునకు అనుపపత్తి సంభవించును. అనఁగా వాచ్యార్థము కుదరదు. అప్పుడు దానితో సంబంధము గల మఱొక అర్థమును గ్రహింపవలయును. అట్లర్థాంతరమును గ్రహించుటకు ప్రయోజనము కాని లోకరూఢి కాని యుండవలయును. ఇచ్చట ప్రయోజనములేదు. కుశల శబ్దమునకు నేర్పరియను రూఢి యున్నది. కుశలు వాడియైన యంచులు కలిగి యుండును. అశ్రద్ధగా వానిని గ్రహించినచో వ్రేళ్ళు తెగిపోవును. అట్టి క్లేశము లేకుండ మెలకువతో కుశలను గ్రహించువాఁడు కుశలుఁడు. అందుచే కుశల శబ్దమునకు నేర్పరియను రూఢి యేర్పడినది. దీనిని బట్టి వాఁడు కార్యమున కుశలుఁడను వాక్యమునకు వాఁడు పనిలో నేర్పరి అను లక్ష్యార్థము చెప్పుకొనుచున్నాము. ఇది సంబంధ నిబంధనారూఢి లక్షణ కుదాహరణము. మనమందమైన యువకునిఁ గూర్చి చెప్పునప్పుడు అతడు మన్మథుఁడని చెప్పుచుందుము. నిజమున కతఁడు మన్మథుఁడు కాదు. అందుచే నీ వాక్యమున వాచ్యార్థమునకు అనుపపత్తి కల్గినది. అప్పుడు దానితో సంబంధము గల వేఱొక యర్థము చెప్పుకొనవలెను. మన్మథునందుఁగల సౌందర్యము అతనియందుఁ గూడ నుండుటచే ఆ సామ్యమువలన అతఁడు మన్మథ సదృశుఁడను అర్థము చెప్పుకొందుము. ఈ అర్థాంతరము గ్రహించుటకు సౌందర్యము ప్రయోజనము, సామ్య ప్రయోజనములను

బట్టి యేర్పడిన యర్థాంతరము కావున నిది సామ్య నిబంధనా ప్రయోజన లక్షణ కుదాహరణము. తైల మనఁగా తిలలనుండి తీయఁబడిన నూనె (నువ్వుల నూనె) అని వ్యుత్పత్త్యర్థము. కొబ్బరి నూనెను సంస్కృతమున నారికేళతైలమందురు. ఇచ్చట తైలశబ్దమునకు వాచ్యార్థము పొసఁగదు. అప్పుడు తత్సా దృశ్యమును బట్టి కొబ్బరినూనె అనునర్థమును చెప్పుకుందుము. ఈ విధముగా తైల శబ్దమునకు నూనె అను రూఢి యేర్పడినది. ఇది సామ్య నిబంధనా లక్షణా రూఢి కుదాహరణము. (నిబంధన మనఁగా మూల మని యర్థము.)

సంబంధ నిబంధనా లక్షణ జహదభిధేయ, అజహదభిధేయ అని రెండు విధములు. జహత్ అనఁగా విడుచుచున్న అని అర్థము. అభిధేయ మనఁగా వాచ్యార్థము. విడుచుచున్న వాచ్యార్థము కలది జహదభిధేయ. విడువని అజహత్ వాచ్యార్థము కలది అజహదభిధేయ. మంచాః క్రోశన్తి అనఁగా మంచెలు మ్రోయుచున్నవని అర్థము. మంచెలు జడ పదార్థములు. అవి మ్రోయుట అసంభవము. అందుచే నిచ్చటమంచెలనఁగా మంచెలపై నున్నవారను అర్థాంతరమును గ్రహింపవలెను. గంగాయామ్ అనఁగా గంగా తీరమునందని వలెనే మంచాః అనఁగా మంచగతులని లక్ష్యార్థము. దీనికే జహద్వాచ్య, జహల్లక్షణ అని నామాంతరములు. గొడుగులు వేసికొని పలువురు వచ్చుచున్నప్పుడా దృశ్యముచూచి మనము అవిగో, గొడుగులు వచ్చుచున్నవని చెప్పుదుము. గొడుగు లచేతనములు అవి వచ్చుట అసంభవము. వాచ్యార్థమున కిచ్చట అనుపపత్తి కల్గుటచే ఆ వాక్యమునకు గొడుగులు ధరించిన మనుష్యులని లక్షణార్థము చెప్పుకొందుము. నిజమున కిచ్చట ఛత్రధారులతో పాటు ఛత్రములు కూడ వచ్చుచున్నవి. అందుచే తాత్పర్యమున వాచ్యార్థమునకు కూడ ప్రవేశమున్నది. ఇది విడువని వాచ్యార్థము కలది. కావున అజహదభిధేయ. దీనికి అజహద్వాచ్య, అజహల్లక్షణ అని నామాంతరము.

సామ్య నిబంధనా లక్షణ సారోప, సాధ్యవసాయ అని రెండు విధములు. అవనిపాలుఁడు సింహ మను వాక్యమును వినఁగానే రాజు సింహమెట్లగునను సందేహము పుట్టును; ఇది బ్రాహ్మణుఁ డగ్ని, అతఁడు మన్మథుఁడు అను వాక్యముల వంటిది. ఇచ్చట శౌర్యాది గుణ సామ్యముచే రాజు సింహసదృశుఁడను నర్థము చేసికొందుము. రాజుపమేయము. సింహముపమానము. ఈ రెండును ఈ వాక్యమున వేఱుగా నున్నవి. ఉపమేయమునందుపమాన గుణము లారోపింపఁబడుచున్నవి. అందుచే నిది సారోప (స+ఆరోప) ఇట్లుపమనానోపమేయములను రెండిటిని భిన్నముగాఁ జెప్పక ఉపమానమును మాత్రవే

చెప్పుటయు గలదు. శౌర్యధైర్యసమగ్రుడైన యోధుఁడొకఁడు వచ్చుచుండగా అదిగో ! సింహము వచ్చుచున్నదని మనము చెప్పుదుము. ఇచ్చట నుపమాన పదమే కాని ఉపమేయము వాడఁబడి యుండలేదు. అందుచే నిది సాధ్యవసాయ (స+అధ్యవసాయ) అధ్యవసాయ మనగా అభేద ప్రతిపత్తి.

పైని పేర్కొనఁబడిన లక్షణా భేదములే కాక లక్షిత లక్షణ, విపరీత లక్షణ అను మఱి రెండు భేదములు కూడ నున్నవి. వాచ్యార్థముతో సాక్షాత్సంబంధము కాక పరంపరా సంబంధముగల లక్షణ లక్షితలక్షణ ఉదా. ద్విరేఫము. దీనికి రెండు రేఫములు కలదని యర్థము. నిజమునకు రెండు రేఫములు కల యే పదమైనను ద్విరేఫము కావచ్చును. లోకమున ద్విరేఫ మనఁగా భ్రమరము (తుమ్మెద) అను రూఢ్యర్థమున్నది. పదము తుమ్మెద యెట్లగును? అందుచే నిచ్చట వాచ్యార్థమున కనుపపత్తియు పిమ్మట రూఢిని బట్టి భ్రమరమను లక్ష్యార్థమును ఏర్పడినవి. భ్రమర పదము తరువాత తుమ్మెద అను నర్థమును బోధించుచున్నది. ఈ విధముగా వాచ్యార్థముతో పరంపరా సంబంధము గల ఈ లక్షణ లక్షితలక్షణ. రోదర శబ్దము కూడ నిట్టిదే. రేఫముదరమందుఁ గలది రోదరము. అనఁగా చక్రము, అనఁగా చక్రవాకము. ఇచ్చటఁ గూడ వాచ్యార్థముతో పరంపరా సంబంధము గల చక్రవాక మనునర్థము స్ఫురించుచున్నది. కాని లోక రూఢి లేనిచోట వర్ణముల సాయము నిట్టి శబ్దములను కల్పించకూడదు. అట్లు కల్పితములగు శబ్దము లీప్సి తార్థమును బోధింపఁజాలవు.

వాచ్యార్థమునకు విరుద్ధమైన అర్థమును బోధించు లక్షణ విపరీత లక్షణ. వీఁడు బృహస్పతి అను వాక్యము వినఁగానే మనకు సామ్య ప్రయోజనముల బట్టి వీఁడు బృహస్పతి సదృశుఁడు; మహా బుద్ధిశాలి అను లక్ష్యార్థము స్ఫురించును. ఇది సామ్య నిబంధనా ప్రయోజన లక్షణ. కాని ఆ వాక్యము నేమియు చదువెఱుంగని పామరుని గూర్చి వాడినచో వీఁడు వట్టి మూర్ఖుఁడు అని విపరీతార్థము స్ఫురించును. ఇచ్చట వాచ్యార్థమున కనుపపత్తియు పిమ్మట తద్విరుద్ధమైన మూర్ఖుఁడను లక్షణార్థమును దోఁచుచుండుటచే నిది విపరీత లక్షణ.

ప్రతాపరుద్రీయమున గౌణవృత్తి కూడ లక్షణాభేదమే అని చెప్పఁబడినది. లక్షణావృత్తియందు వలెనే గౌణవృత్తిలోఁగూడ ముఖ్యార్థమున కనుపపత్తికలుగును. "అగ్ని ర్మాణవకః" అనుచో "గంగాయాం ఘోషః" అనువాక్యమునందు వలెనే ముఖ్యార్థమునకు బాధ యేర్పడుచున్నది. అగ్ని సదృశ మానవుఁడను లక్షణార్థము స్ఫురించుచున్నది. కాని కొందరు

మీమాంసకులు లక్షణాగౌణ వృత్తులు రెండును భిన్నములని చెప్పుదురు. ఏలయన "అగ్ని ర్మాణవకః" అనునప్పుడు అగ్ని యందలి శుచిత్వాదులు మాణవకు నందు వాచ్యమును దిరస్కరించి వ్యంగ్యముగా భాసిల్లుచున్న వని వారి యభిప్రాయము.

వ్యంజనావృత్తి : శబ్దములకు వాచ్యార్థము పొసఁగిన పిమ్మట దానికి శోభా హేతువగు నర్థాంతరమును దోఁపించుశక్తికి వ్యంజనయని పేరు. యభిధాశక్తి ప్రాకరణికమైన వాచ్యార్థమును మాత్రమే తెలుపును. లక్షణా శక్తి వాచ్యార్థమున కనుపపత్తి కలిగినప్పుడు దానితో సంబంధముగల మఱొక యర్థమును బోధించును. వ్యంజనాశక్తి ప్రకృతార్థమును అంతకంటే సుందరతరమైన అప్రకృతార్థమును గూడ స్ఫురింపఁజేయును. ఇది బోధించు నర్థమునకు వ్యంగ్యమని పేరు. వ్యంజనాశక్తిని సాహిత్యరంగమున సుప్రతిష్ఠితము కావించిన వారానందవర్ధనాచార్యులవారు. అంతకు ముందున్న పండితులు శబ్దమునకుఁగల అర్థబోధక శక్తిని బరిశీలించి అభిధాలక్షణా శక్తులు రెండింటినే అంగీకరించిరి. వారిలో వ్యంజనాశక్తి విషయ మస్ఫుట స్ఫురితముగా నుండెను. అట్టి తఱి పాండిత్య పాథోనిధులైన ఆనందవర్ధనా చార్యులవారు ప్రతిభా మహితముగను హేతువాద పురస్సరముగను దానిని నిరూపించి విద్వదానంద వర్ధనులై విరాజిల్లిరి.

వ్యంజనాశక్తి శబ్దశక్తి మూలవ్యంజన, అర్థశక్తి మూలవ్యంజన, ఉభయశక్తి మూలవ్యంజన అని మూఁడు విధములు. శబ్దము లనేకార్థములను బోధించుశక్తి కల్గియుండును. దీనికి అర్థశక్తి అని పేరు. ఇది మూలముగాఁగల వ్యంజన శబ్దశక్తి మూలవ్యంజన. ఇచ్చటి వ్యంజన శబ్దములు పరివృత్తిని సహింపవు. అనఁగా ఇచ్చటి శబ్దములను దొలగించి వాని స్థానమున పర్యాయపదముల నుంచినచో వ్యంగ్యార్థము పొసఁగదు. ఉదా: నరసింహుని కరమున నొప్పు నసి నిజధారా నిమజ్జన తత్పరులగునరులకు ననిమిషత్వము చేకూర్చును. నరసభూపాలుని చేతియందలి కత్తి తన ధారాజలముల మునుఁగు శత్రువులకు తెప్పపాటు లేమిని (నిశ్చేష్టతను) గలిగించునని యిందలి వాచ్యార్థము. ఇది ప్రకృతార్థము. నృసింహమూర్తి చేతి కత్తి తన ధారాజలముల మునుఁగఁగోరు నరులకు (మానవులకు) దేవత్వము నొసంగునని యిందలి వ్యంజనార్థము. ఇది అప్రకృతార్థము. ప్రకరణముచే వాచ్యార్థము నియమితమై ముగిసిన పిమ్మట నరసింహదేవుని సంబంధించిన వ్యంగ్యార్థము ప్రకటితమగుచున్నది. ఇచ్చట నృసింహుని, నరులకు అనిషత్వము అనునని వ్యంజకములైన

పదములు. వీనికి బదులుగా నరసభూపాలుని శత్రువులకు తెప్పపాటులేమి అను పదములను వాడినచో వ్యంగ్యార్థము స్ఫురింపదు. శబ్దశక్తి కారణముగాఁగల వ్యంజన కావున నిది శబ్దశక్తి మూలవ్యంజన.

అర్థశక్తి కారణముగాఁగల వ్యంజన అర్థశక్తి మూలవ్యంజన. ఇందు శబ్దములు పరివృత్తి సహించును. అనఁగా వ్యంజనములైన శబ్దములకు బదులు పర్యాయ పదములను వాడినను వ్యంగ్యార్థమునకు భంగము రాదు. ఉదా. నరసభూపాల ! నీ విరోధిభార్య పర్వతముల నివసించుచు నచ్చటి భిల్ల కాంతలతో "మాయూరి చంద్రుఁడు చల్లనివాఁడు. మాయూరి మలయ మారుతము చల్లనిది" అని పల్కు చుండును. ఇచ్చట నరసరాజు విరోధి భార్య ముగ్ధయనియు భర్తృ విరహముచేఁగ్రాగు చుండెననియు నరస భూపాలుఁడెల్ల రాజులను జయించెననియు వ్యంగ్యార్థము స్ఫురించుచున్నది. ఇందలి పదము లన్నియుఁ బరివృత్తి సహించునట్టివే. అందుచే నిది అర్థశక్తి మూలవ్యంజన.

వ్యంజనములైన శబ్దములు కొన్ని పరివృత్తిని సహించియుఁ గొన్ని సహింపకయు నున్నచో నది ఉభయశక్తి మూలవ్యంజన. ఇందు శబ్దశక్తి అర్థశక్తి మూలవ్యంజనలు రెండును గలసి యుండును. ఉదా: నరసింహుఁడరిదర కరుఁడై సుమనోవరభరణ ధురీణుఁడై లక్ష్మీ స్థిరావాస భాసురుఁడై ప్రకాశించుచున్నాడు. నరసభూపాలుఁడు అరి=శత్రువులకు; దర=భయమును, కరుఁడైఁ = చేయువాఁడై; మనోవర = పండిత శ్రేష్ఠులను; భరణ=పోషించుట యందు, ధురీణుఁడై=సమర్థుడై, (భారము వహించు వాఁడై): రాజ్యలక్ష్మీ యొక్క స్థిరనివాసముచేఁ బ్రకాశించువాఁడై యొప్పు చున్నాఁడనునది యిందలి వాచ్యార్థము. నరసింహ దేవుఁడు అరి, దర కరుఁడై =చక్రమును శంఖమును జేతఁ గలవాఁడై; సుమనోవర, భరణ ధురీణుఁడై= దేవేంద్రుని భరించుటయందు సమర్థుఁడై, ఇందిరా దేవియొక్క స్థిరమైన వాసముచేఁ బ్రకాశించువాఁడై యొప్పుచున్నాఁడనునది వ్యంగ్యార్థము. ఇచ్చట అరిదరకరుఁ డు, సుమనోవర భరణ ధురీణుఁడు, నృసింహుఁడు అనునవి పరివృత్తి సహింపవు. లక్ష్మీస్థిరవాస భాసురుఁడు, ప్రకాశించుచున్నాఁడు అనునవి పరివృత్తి సహించును. కొన్ని శబ్దములు పరివృత్తిని సహించియు, కొన్ని సహింపకయు నుండుటచే నిందలి వ్యంజన ఉభయ శక్తి మూల వ్యంజన.

వ్యంజనకు ధ్వని, ధ్వననము, గమనము ద్యోతనము, ప్రత్యాయనము అనునవి పర్యాయ పదములు.

2. ధ్వని యనగా నేమి? ధ్వని భేదములు :

ధ్వని యనగా నేమి : అభినవగుప్తుఁడు ధ్వని శబ్దమునకు ధ్వని కావ్యము వ్యంగ్యార్థము, వ్యంజనాశక్తి అను మూఁడు విధములైన యర్థములను దెల్పియుండెను. ఎచ్చట అర్థమును శబ్దమును తన్నుతన యర్థమును అప్రధానము కావించి యర్థాంతరమును వ్యక్తము చేయునో యట్టి కావ్య విశేషమునకు ధ్వని యని పేరు.* ఇది కావ్యపరమైన యర్థము. శబ్దములకు వాచ్యము వ్యంగ్యము అను రెండు విధములైన అర్థములుండును. అందుకు వాచ్యార్థమును నిఘంటు వ్యాకరణాదుల సహాయమున నెఱుంగవచ్చును. దీనికే ముఖ్యార్థము, సంకేతితార్థము అని నామాంతరములు. ఒక్కొక్కప్పుడు వాచ్యార్థము బోధపడియు పిమ్మట అసూర్యంపశ్యలగు స్త్రీల యవయవములందుఁ దద్భిన్నముగా లావణ్యము ప్రకాశించు విధమున మహాకవుల కావ్యములందు వాచ్యార్థముకన్న భిన్నమును సుందర తరములైన యర్థాంతరము ప్రకాశించుచుండును. ఇది వస్తురూపమునఁ గాని అలంకార రూపమునగానిఁ రస రూపమునఁ గాని యుండును. దీనికే వ్యంగ్యార్థమని పేరు. ఇది వాచ్యార్థసామర్థ్యము చేతనే ఆక్షిప్త మగుచుండును. అనఁగా ముందు వాచ్యార్థము స్ఫురించిన పిమ్మట దాని సాహాయ్యము చేతనే అంతకన్న రమ్యతరమైన ఈ వ్యంగ్యార్థము తోఁచుచుండును. ఈ క్రమము వస్త్వలంకార వ్యంగ్యములందు స్పష్టముగా గోచరించును గాని రసవ్యంగ్యమందు గోచరింపదు. వ్యంజనా శక్తిని గూర్చి యిదివఱకుఁ జెప్పబడినది. పదార్థము లాకాంక్షాదివశమున పరస్పర సంబద్ధములు కాఁగా కలిగిన వాక్యార్థమునకు శోభాహేతువైన అర్థాంతరమును స్ఫురింపఁజేయు శబ్దశక్తికి వ్యంజనయని పేరు. ప్రకృతార్థమును మాత్రమే బోధించు నభిధాశక్తి కంటెను ప్రకృతార్థము నకనుపపత్తి కలిగినపుడు వాచ్యార్థ సంబంధములుగ వేఱొక యర్థమును బోధించు లక్షణాశక్తి కంటెను ముందు ప్రకృతార్థమును తరువాత నంత కంటె రమణీయమైన అప్రకృతార్థమును గూడ బోధించు వ్యంజనాశక్తి విలక్షణ మైనట్టిది.

ధ్వని భేదములు : పై మూడర్థములలో కావ్యమున కాత్మ ధ్వని యనునప్పుడు ధ్వని శబ్దమునకు వ్యంగ్యార్థమను నర్థమునే గ్రహింపవలయును. ఈ ధ్వని అభిధామూలధ్వని,

---

* యత్రార్థః శబ్దోవా తమర్థ ముప ర్జనీకృత స్వార్థౌవ్యక్తః
కావ్యవిశేషః స ధ్వనిరితి సూరిభిః కథితః

లక్షణా మూల ధ్వని అని రెండు విధములు. అభిధామూల ధ్వనికి వివక్షితాన్య పరవాచ్య మనియు లక్షణా మూలధ్వనికి, అవివక్షిత వాచ్య మనియు నామాంతరములు. వివక్షితాన్య పరవాచ్యమనఁగా అన్య(ధ్వని) పరముగా వివక్షింపఁబడిన వాచ్యము గలదని యర్థము. యిందు వాచ్యార్థము పొసఁగినను ధ్వని పరముగా వివక్షింపఁబడును. అవివక్షిత వాచ్యమనఁ గా వివక్షింపఁబడని వాచ్యము గలది. ఇందు వాచ్యార్థము పొసఁగనే పొసఁగదు.

అభిధా మూలమైన వివక్షితాన్య పరవాచ్యము లక్ష్యక్రమ వ్యంగ్యము అసంలక్ష్య క్రమ వ్యంగ్యము అని రెండు విధములు. మొదటి దానియందు వాచ్యవ్యంగ్యార్థముల క్రమముస్ఫుటముగ గోచరించును. అనఁగా ముందు వాచ్యార్థము గోచరించి తరువాత వ్యంగ్యార్థము స్ఫురించును. అందుచే దీని కనురణన మనగా ప్రతి ధ్వని. ధ్వని శ్రుతమైన పిమ్మటఁ గదా ప్రతిధ్వని శ్రుతమగుచుండెను. రెండవ దానియం దత్యంత సూక్ష్మమగుటచే వాచ్య వ్యంగ్యముల క్రమము గోచరింపదు. శతపత్రము నూఱు రేకుల నొకదానిపై నొకటిగా నమర్చి సూదితో గ్రుచ్చినచో ఆ సూది నిజముగా నొక్కొక్క రేకును గ్రుచ్చుచు పోయినను మనకా క్రమము గోచరింపక అది అన్ని రేకుల నొక్క మాటే గ్రుచ్చినట్లు గోచరించును. అట్లే అసంలక్ష్య క్రమమున గూడ అర్థము వాచ్యమునుండియే వ్యంగ్యమునకు తరలినను ఆ క్రమము గోచరింపదు. అందుచే దాని కసంలక్ష్య క్రమమను పేరు కల్గినది.

లక్ష్యక్రమ వ్యంగ్యము శబ్దశక్తి మూలము, అర్థశక్తి మూలము, ఉభయ శక్తి మూలము అని మూఁడు విధములు. ఇందు శబ్దశక్తి మూలము వస్త్వలంకార రూపములని రెండువిధములు. ఇవి యొక్కొక్కటి పదవాక్య భేదములచే రెండేసి విధములు. ఈ విధముగా శబ్దశక్తి మూల (లక్ష్యక్రమ) వ్యంగ్యము మొత్తము నాలుగు విధములు.

అర్థశక్తి మూల (లక్ష్యక్రమ) ధ్వని స్వతస్సిద్ధము, కవి ప్రౌఢోక్తి సిద్ధము, కవి నిబద్ధ వక్తృ ప్రౌఢి సిద్ధము అని మూఁడు విధములు. అది యొక్కొక్కటి వస్తు రూపము, అలంకారరూపము, వస్తుకృతాలం కార రూపము, అలంకార కృతాలంకార రూపము అని నాలుగు విధములు. ఈ విధముగా నిది పంద్రెండు విధములగును. ఈ పంద్రెండు పదగత, వాక్యగత ప్రబంధగత భేదములచే ముప్పదియాఱు విధములగును.

ఉభయశక్తిమూల (లక్ష్యక్రమ) వ్యంగ్యము కావ్యగతమై ఏకైక విధముగా నుండును.

ఇట్లు శబ్దశక్తి మూలము నందలి నాలుగు విధములు, అర్థశక్తి మూలమునందలి ముప్పదియాఱు విధములు, ఉభయశక్తి మూలము యొక్క విధము కలసి లక్ష్యక్రమ వ్యంగ్యము మొత్తము నలువది యొక్క విధములు.

అసంలక్ష్యక్రమ వ్యంగ్యము పదగతము, వాక్య గతము, వర్ణనగతము, రచనా గతము, పదైక దేశ గతము, ప్రబంధ గతము అని ఆఱు విధములు. ఈ విధముగా అభిధా మూలమైన వివక్షితాన్య పరవాచ్యము (41+6) మొత్తము నలువది యేడు విధములు.

లక్షణా మూలమైన అవివక్షిత వాచ్యధ్వని అర్థాంతర సంక్రమిత వాచ్యము, అత్యంత తిరస్కృత వాచ్యము అని రెండు విధములు. ఇవి రెండును పదవాక్యగత భేదములచే మొత్తము నాలుగు విధములు.

ఈ విధముగా అభిధా మూలమగు వివక్షితాన్య పర వాచ్యము నందలి నలువదియేడు విధములును, లక్షణామూలమైన అవివక్షిత ధ్వని యందలి నాలుగు విధములును గలసి శుద్ధధ్వని ఏఁబదియొక్క రకములు.

ఈ ధ్వను లేఁబది యొక్కటియు నొండొంటితోఁ గలసి సంకీర్ణములై 1326 విధము లగును. ఇవి మఃగల త్రివిధ సంకరములచేతను ఏకవిధ సంసృష్టి చేతను మొత్తము నాలుగు రెట్లగుటచే 5304 భేదము లేర్పడును.

పై ధ్వని భేదములలో ముఖ్యములైన వానికి క్రింద లక్ష్యములను వానికి లక్షణముతో సమన్వయమును చూపఁబడుచున్నవి.

1. కాంతారవాస సంతప్తులైన ఓ నృపతులారా! నేను చెప్పు ఈ హితము నాలకింపుఁ డు. మీ రిప్పుడు రాజుపాద సేవ కావింపుఁడు. "ఓనృపతులారా! మీరు కాంతారవాసముచే సంతాపము నొందుచున్నారు. కావున చంద్రకిరణ సేవ కావింపుఁడు, మీ సంతాపము చల్లారును" అని వాచ్యార్థము, "మీరు ప్రతాపరుద్ర మహారాజు పాదసేవ కావింపుఁడు, ఇట్లరణ్యమున వసించుచు నేల సంతాపము నొందెద"రని వ్యంగ్యార్థము. రాజపాద సేవ అనుట యందలి శబ్దశక్తిచే వ్యంగ్యార్థ స్ఫూర్తి కలుగుచున్నది. ఇది వస్తురూపమున నున్నది. "రాజు పాద సేవ" అను పదమును దొలఁగించి దాని స్థానమున పర్యాయ పదముల నుంచినచో నిట వ్యంగ్యార్థము పొసఁగదు. అవి పరివృత్తి సహింపవు. మరియు నిందు చంద్రకిరణ

సేవ అను వాచ్యార్థమునుండి ప్రతాపరుద్ర మహారాజ పాద సేవ అను వ్యంగ్యార్థమే పొసంగిన క్రమము గోచరించుచున్నది. అందుచే ఇది శబ్ద శక్తిమూల లక్ష్య క్రమ వస్తుధ్వని.

2. ఓ రాజా! ఈ తరుణి పద్మిని, నీ వెప్పుడు నెల్లరను బ్రోచు నినుఁడవు. నీ కర స్పర్శ లేనిచో నీమె యెట్లు బ్రదుకును? "పద్మిని, ఇనుఁడు, కరస్పర్శ" అను వాని యందలి శబ్దశక్తిచే " ఈమె పద్మలత, నీవు సూర్యుఁడవు, నీకిరణముల స్పర్శలేనిచో నీమె యెట్లు జీవించును?" అను వ్యంగ్యము స్ఫురించుచున్నది. ఈ శబ్దములు పరివృత్తిని సహింపవు. సూర్యకిరణ స్పర్శ లేనిచో పద్మలత జీవింపనట్లు ప్రభువైన నీ హస్తస్పర్శ లేనిచో పద్మినీ జాతికిఁ జెందిన యీ తరుణి జీవింప"దని యిందుపమాలంకారము ధ్వనిత మగుచున్నది. వాచ్య వ్యంగ్యముల క్రమముకూడ స్ఫుటముగా గోచరించుచున్నది. అందుచే నిది శబ్దశక్తి మూల లక్ష్యక్రమాలంకార ధ్వని.

3. ప్రతాపరుద్రుని శత్రువుల భార్యలు ఋతువులులేని సంవత్సరములను శుక్లపక్షములులేని మాసములను రాత్రులు లేని దివసములను గోరుచున్నారు. ప్రతాపరుద్రుని శత్రువుల భార్యలు ఋతు శుక్ల పక్ష రాత్రులు కామోద్దీపకము లగుటచే నవిలేని వర్షమాస దివసమును గోరుచున్నారనియు, వారు భర్తృ వియోగము ననుభవించుచున్నా రనియు, ప్రతాపరుద్రుడు శత్రువుల నందఱిని సంహరించె ననియు వస్తురూపమైన వ్యంగ్యము స్ఫురించుచున్నది. ఇందలి పదములు పరివృత్తిని సహించునట్టివి. అందుచే నిది అర్థశక్తి మూలము వాచ్య వ్యంగ్యముల పౌర్వాపర్యక్రమ మిందు కనవచ్చుచున్నది. అందుచే నిది అర్థశక్తి మూల వస్తుకృతవస్తు లక్ష్యక్రమ వ్యంగ్యము.

4. ప్రతాపరుద్రుని జగద్వ్యాప్తమైన కీర్తిని గాంచి శివుఁడందు వసించుటకును, విష్ణువందు శయనించుటకును, దివ్యముని గణ మందు స్నానము చేయుటకును, సముద్రము లుప్పొంగుటకును, ఆదేనుఁగు సవిలాసముగా స్పృశించుటకును, గోరుచున్నవి. ప్రతాపరుద్రుని కీర్తిని గాంచి శివుఁడు కైలాసమనియు విష్ణువు దుగ్ధాబ్ధి యనియు, మునులు సుర నదియనియు, సముద్రములు చంద్రకాంతి యనియు, ఆదేనుఁ గైరావత మనియు భ్రమించిరని వ్యంగ్యము. ఇందలి పదములు పరివృత్తి సహములు. అందుచే నిది అర్థశక్తి మూలము. ఇచ్చట వస్తువు భ్రాంతి మదలంకారమును ధ్వనింపఁజేయుచున్నది. అందుచే నిది అర్థశక్తి మూలవస్తు కృతాలంకార లక్ష్యక్రమ వ్యంగ్యము.

5. ఇతఁడు భుజస్తంభ జృంభణాద్భుతాయుధుఁడైన జిష్ణుఁడు. ఓ భూభృత్తులారా ! మీరింక నిజపక్ష విజృంభితమును విడువుడు. "ఇతఁడు భుజములందు ప్రకాశించు నద్భుతమైన యాయుధముగల జయశీలుఁడు. ఓ రాజులారా: మీరిక సేనాబలము గలదను గర్వము నుజ్జగింపుఁడు" అనునది ప్రకృతార్థము. "ఇతఁడు భుజములందుఁ బ్రకాశించు నద్భుతాయుధము (వజ్రాయుధము) గల ఇంద్రుఁడు. ఓ పర్వతములారా! మీరింక ఱెక్కలు గలవను గర్వము నుజ్జగింపుఁ"డని అప్రకృతార్థము. ఇందు జిష్ణుఁడు నిజపక్ష విజృంభితము అనునవి పరివృత్తి సహింపవు. భుజ స్తంభజృంభమా ణాద్భు తాయుధుఁ డనునది పరివృత్తి సహించును. అందుచే నిది శబ్దార్థోభయ శక్తి మూలము. ఇందు వాచ్య వ్యంగ్యముల క్రమము గోచరించుచున్నది. వజ్రాయుధ ధారియైన యింద్రుని ముందు పర్వతముల ఱెక్కల గర్వము వలెనే అద్భుతాయుధ హస్తుఁడైన ప్రతాపరుద్ర దేవుని ముందు రాజుల సేనాగర్వము వ్యర్థమను నుపమాలంకారము ధ్వనించుచున్నది. అందుచే నిది ఉభయ శక్తి మూల లక్ష్యక్రమ వ్యంగ్యము.

6. శూన్యమైన వాసగృహమును జూచి మెల్లగా శయనమునుండి లేచి నిద్రా వ్యాజమును బొందిన ప్రియుని ముఖమును దిలకించి సవిస్రంభముగా ముద్దాడి, గండస్థలము జాతపులక మగుట నారసి, సిగ్గుచే మొగము వాచియున్న యొక తరుణి నవ్వుచున్న ప్రియునిచే గాఢముగా చిరకాలము కౌగలించుకొనఁబడినది. ఇందు విభావాను భావసంచారి భావములచే శృంగార రసము వ్యక్తము చేయఁబడు చున్నది. *ఇందు వాచ్య వ్యంగ్యముల పౌర్వాపర్యము కానవచ్చుటలేదు. వాచ్యము తోడనే వ్యంగ్యమైన సంభోగ శృంగారము కూడ స్ఫురించుచున్నది. అందుచే నిది అసంలక్ష్య క్రమ (వివక్షితాన్య పరవాచ్య) వ్యంగ్యము.

8. " ఓ శిరములారా ! మీ రస్మాకముల,ఔన్నత్యమేల కోరుదురు" అని ప్రతాపరుద్రుని శత్రువులతనికి నతులగుచున్నారు. ఇచట అస్మాకము లనఁగా కేవలము అస్మత్సంబంధులను నర్థమేకాక సర్వదైన్యములకును నిలయములైన మాకు సంబంధించినవారను అర్థాంతరమును

---

* శూన్యం వాసగృహం విలోక్య శయనా దుత్థాయ కించిచ్ఛనై
ర్నిద్రా వ్యాజము పాగతస్య సుచిరం నిర్వర్ణ్య పత్యుర్ముఖం
విస్రబ్ధం పరిచుంబ్య జాతపులకామాలోక్య గండస్థలీం
లజ్జానమ్రముఖీ ప్రియేణ హసతా బాలాచిరం చుంబితా.

స్ఫురించుచున్నది. ఇచ్చట వాచ్యార్థము వివక్షిత మగుటలేదు. అందుచే నిది అర్థాంతర సంక్రమితా వివక్షిత వాచ్యధ్వని.

9. ప్రతాపరుద్రుని తెల్లని కీర్తులెల్ల దిక్కులకును వెల్లవేసి స్వేచ్ఛగా విహరించుచున్నవి. దిక్కులు రూపము కలవి కావు. అందుచే వానికి వెల్ల వేయుట అనునది ఉపపన్నముకాదు. ఇచ్చట సున్నము పూయుట అను వాచ్యార్థము తిరస్కృతమై తెల్లని కాంతికలవిగాఁ జేయుచున్నవను వ్యంగ్యార్థము మాత్రమే స్ఫురించుచున్నది. అందుచే నిది అత్యంత తిరస్కృత అవివక్షిత వాచ్యధ్వని. విస్తర భీతిచే మిగిలిన ధ్వని భేదములకు లక్ష్యముల నొసంగుటలేదు. ఈ విధముగనే వాని నూహించి కొనవలయును.

"ఈ ధ్వని సిద్ధాంతమును నీవు క్రొత్తగఁగల్పించితివి. ఇది ప్రామాణికము కాదు" అని ఆనంద వర్ధనాచార్యుల నితర పండితు లాక్షేపింపఁగా నతఁడు తాను దానిని వైయాకరణుల నుండి గ్రహించితి ననియు, నది అప్రామాణికము కాదనియు వారికి జవాబు చెప్పియుండెను. వర్ణములు రెండు క్షణములు మాత్రమే యుండి మూఁడవ క్షణమున నశించునని నైయాయికుల సిద్ధాంతము. శ్రీ అనుశబ్దము నందు శ్, ర్, ఈ అను మూఁడు వర్ణములున్నవి. అందు మూఁడవ వర్ణమైన ఈ అనుదాని నుచ్చరించు నప్పటికి మొదటి వర్ణమైన శ్ నశించును. అప్పుడు రీ అనునది మాత్రమే మిగులును. ఇందు వర్ణ సముదాయము సమగ్రముగా లేని కతమున అర్థస్ఫూర్తి కలుగదు. అట్టియెడ నర్థమును బోధించునదేది అను విచారము చేసి వైయాకరణులు నిత్యమైనస్ఫోటము వలన అర్థబోధమగునని సిద్ధాంతము కావించిరి. వర్ణానురిక్తమై, వర్ణాభి వ్యంగ్యమై, అర్థమును స్ఫురింపఁజేయు నిత్యమైన శబ్దము స్ఫోటము * ఇది ఆకసమున నిండియుండును. మూఁడవ వర్ణము నుచ్చరించునపుడు మొదటి వర్ణము నశించుచున్నను దాని సంస్కారము చిత్తమున నిల్చియే యుండును. కావున ఆ సంస్కారముతోఁగూడిన అంత్య వర్ణాను భవముచే స్ఫోట మభివ్యక్తమై అర్థమును బోధించునని వారి అభిప్రాయము. స్ఫోట మనఁగా అర్థమును స్ఫుటము జేయునది అని అర్థము. ఈ స్ఫోట సిద్ధాంతము ననుసరించియే ఆనంద వర్ధనుఁడు ధ్వని సిద్ధాంతమును వ్యక్తీకరించెను. పూర్వ వర్ణముల సంస్కారముతోఁ గూడిన అంత్య వర్ణానుభవమును స్ఫోటము వ్యక్తము చేయునట్లు ప్రకరణాదుల సాహాయ్యమున శబ్దము రమణీయమైన అర్థాంతరమును (వ్యంగ్యమును) వ్యక్తము చేయును.


* పరాతిరిక్తః పరాభివ్యంగ్యః అర్థ చిత్ర్యాయకోనిత్యః శబ్దః స్ఫోటం

1. ధ్వని

- వివక్షి తాన్య పరవాచ్యము (అభిధామూలము)(47)
- అవివక్షిత వాచ్యము (లక్షణామూలము)(4)
  - అత్యంత తిరస్కృత వాచ్యము
    - వాక్యగతము
    - పదగతము
  - అర్థాంతర సంక్రమిత వాచ్యము
    - వాక్యగతము
    - పదగతము

2. వివక్షితాన్య పరవాచ్యము (అభిధామూలము) (47)

- లక్ష్య క్రమ వ్యంగ్యము (41)
- అసంలక్ష్య క్రమవ్యంగ్యము (6)
  - పదగతము
  - వాక్యగతము
  - వర్ణగతము
  - రచనాగతము
  - పదైకదేశ గతము
  - కావ్యగతము


3. లక్ష్య క్రమ వ్యంగ్యము (41)
శబ్ద శక్తి మూలము (4)
అర్థశక్తి మూలము (36)
ఉభయ శక్తి మూలము(1)
వస్తు రూపము
అలంకార రూపము
పదగతము
వాక్యగతము
పదగతము
వాక్యగతము
స్వతస్సిద్ధము
కవిప్రౌఢోక్తిసిద్ధము
కవినిబద్ధ వక్తృప్రౌఢోక్తి సిద్ధము
వస్తువు
అలంకారము
వస్తు కృతాలంకారము
అలంకార కృతాలంకారము
పద గతము
వాక్య గతము
ప్రబంధ గతము

వైయాకరణుల మతమున వ్యంగ్యము స్ఫోటము; ఆనంద వర్ధనుని మతమున అర్థాంతరము. స్ఫోట వ్యంజకమైన వర్ణధ్వని యందలి ధ్వనినే ఆనందవర్ధనుఁడు వ్యంగ్యశబ్ద సామ్యముచే అర్థాంతర వ్యంజకమైన ధ్వనిగా గ్రహించెను.

3. ధ్వన్యభావవాదములు – తత్ఖండనము :

ధ్వన్యాలోకము మొదట ఆనందవర్ధనుఁడు (కారికా కర్తయగు ధ్వని కర్తయు వృత్తికర్తయగు ఆలోకకర్తయుభిన్నులని కొందఱి అభిప్రాయము) "కావ్యమున కాత్మ ధ్వనియని యేది పూర్వము పండితులచేఁ జెప్పఁబడినదో దానికి కొందఱు భావము పలికిరి. అన్యులది భాక్తమని (లక్షణాంతర్గతమని) చెప్పిరి. కొందఱు దాని తత్త్వము వాక్కుల కగోచరమని తెల్పిరి. అందుచే సహృదయ మనః ప్రీతికై దాని స్వరూపము వివరింతుము" అని చెప్పి యుండెను. దీనిని బట్టి ఆనందవర్ధనునికి ముందే ధ్వని సిద్ధాంతముండెననియు దాని యునికిని గూర్చి పండితులలో వాగ్వాదములు జరుగుచుండె ననియుఁదెలియు చున్నది. ధ్వని సిద్ధాంతము నంగీకరింపని వారిని ఆనంద వర్ధనుఁడు మూఁడు తెఱఁగులుగా విభజించెను. మొదటి తెగవారు ధ్వనియనునదసలు లేనే లేదనువారు (ధ్వన్య భావవాదులు). రెండవ తెగవారిది లక్షణాంతర్గతమేకాని తద్భిన్నము కాదని చెప్పువారు (భాక్త వాదులు), మూఁడవ తెగవారదియున్నను దాని తత్త్వము వాచామగోచరమని నుడువువారు (అలక్షణీయతా వాదులు). మొత్తము మీద ఈ మూడు తెఱఁగులకుఁ జెందినవారును ధ్వనికి వ్యతిరేకులే.

అభావ వాదము : "తస్యాభావం జగదురపరే" అని ధ్వనిక ర్తచెప్పిన మొదటి తెగకుఁ జెందిన అభావవాదులు వృత్తిలో మూఁడు విధములుగా వివరింపఁబడి యున్నారు. వారు ధ్వని యనునది లేనే లేదని చెప్పుచు నిట్లు వాదింతురు: "శబ్దార్థములు కావ్యమునకు శరీరము, శబ్దార్థాలంకారములు" శబ్దార్థగుణములు అను నాలుగే కావ్యమునకు సౌందర్య హేతువులు. ధ్వని కూడ కావ్య సౌందర్య హేతు వగునెడల అదియు గుణమో అలంకారమో కావలయును గాని వేఱు గాదు. రీతి వృత్తులు కూడా గుణాలంకారములకంటే భిన్నములుకావు. అందుచే గుణాలంకారములకంటే వేఱగు కావ్య సౌందర్య హేతువు మఱొకటి యుండదు. కావ్యార్థముగాఁ జెప్పఁదగిన ధ్వని యనునది యొకవేళ ఉన్నను అది నృత్తగీత నేత్ర సంజ్ఞాదుల వంటిదే కాని కావ్య సౌందర్య హేతువును కావ్య సంబంధియు కానేరదు. కొందఱిని సహృదయులుగా నేర్పఱిచి వారి కభిమతమగు కావ్యతత్త్వము ధ్వనియే యని యొక దానిని కల్పించినంత

మాత్రమున నది విద్వాంసుల కంగీకార్యము కాఁజాలదు. గుణాలంకారములలోనే ఒక దానికి ధ్వని అను క్రొత్తపేరు పెట్టి, లేని సహృదయత్వమును భావించుకొని, ధ్వని వాదులు కనులు మూసికొని 'ధ్వని ధ్వని' అని నృత్యము చేయుచున్నారు. అందుచే ధ్వని అనునది ప్రవాద మాత్రమే కాని నిజముగా నున్నది కాదు."

ఆనందవర్ధనుఁడు ధ్వన్యభావవాదుల అభిప్రాయముల నీవిధముగా ఖండించెను. "ధ్వన్యభావవాదు లందఱును కావ్యమునకు శబ్దార్థములు శరీరమని చెప్పుచున్నారు. ఈ శరీరముకంటె భిన్నమైన దాని నుజ్జీవింపఁజేయు ఆత్మ యొకటుండవలెను. ఇది అందఱికిని సులభముగా నవగతము కాదు. ఇది వాచ్యార్థము కాక వాచ్యార్థ సామర్థ్యముచే ఆకర్షింపబడి స్ఫురించు ప్రతీయమానార్థము. వాచకమును వాచ్యమును అగు శబ్దార్థములు కావ్య శరీరము కాని కావ్యాత్మ కాఁజాలవు. కాంత శరీరమున అవయవముల కంటెను వాని నలంకరించు నలంకారముల కంటెను భిన్నమై ప్రకాశించు లావణ్యమువలె కావ్యమునఁ దచ్ఛరీరమై శబ్దార్థములకంటెను వాని నలంకరించు గుణాలంకారములకంటెను భిన్నమైన ప్రకాశించు ఆత్మ వాచ్యమగు ధ్వన్యర్థముండును. గుణాలంకారములు శబ్దార్థములకంటె భిన్నములే యైనను వాని నాశ్రయించుకొని యుండునట్టి విశేషములే శబ్దార్థ గుణాలంకారములచేఁ నాకర్షింపఁ బడి వ్యంజనచే స్ఫురింపఁజేయఁబడు ధ్వన్యర్థము స్పష్టముగాఁ దోచుఁ చుండగా నది గుణాలంకారములకంటె వేఱు కాదనుట సమంజసముకాదు. ఆ ధ్వని వస్త్వలంకార రసరూపమై మూఁడు విధములుగా నుండును. ఈ మూఁడు భేదములందును అది వాచ్యము కంటే భిన్నమే. అది మహాకవుల వాక్యములందు ప్రసిద్ధమై యుండును. కొందఱప్రసిద్ధమని, త్రోసిపుచ్చినంతమాత్రమున అది లేకుండపోదు. రామాయణ మహాభారతాదులను బరిశీలించిన నదియే సారభూతమై సహృదయ హృ్దయ రంజకమగు కావ్యతత్త్వముగా గోచరించును. ఆత్మలేని శరీరము వలె ధ్వనిలేని కావ్య మలంకార యుక్తమయ్యును శోభిల్లదు. అది కావ్య సంబంధులు కాని నృత్తగీతాదుల వంటిది కాదు. శరీరమున కాత్మవలె నది కావ్య శరీరమున సన్నిహిత సంబంధము కల్గి ప్రకాశించును. వాచ్యార్థము తెలిసికొనఁగల్గు వారందఱికిని వ్యంగ్యార్థము తెలియకపోవుట అనుభవసిద్ధ మగుటచేతను వాచ్యార్థము తెలియఁబడిన పిమ్మటనే అంతకంటె సుందరతరమగు వ్యంగ్యార్థ స్ఫూర్తి కలుగుచుండుటచేత వాచ్యార్థము కంటే వ్యంగ్యార్థము భిన్నమని స్పష్టపడుచున్నది. గుణాలంకారములభిధ చేతనే తెలుపబడుటవలన

వాచ్యములే ఁగును. వాచ్యసామర్థ్యమున వ్యంజనచే స్ఫురింపఁ జేయఁబడు వ్యంగ్యార్థము నావాచ్యములం దంతర్భవింపజేయుట తగదు. ధ్వని అంగి, అలంకారాదు లంగములు, వస్త్వలంకారము లొకప్పుడు వాచ్యములగుట సంభవించినను రసాదు లెప్పుడును వాచ్యములు కావు. అవి విభావాది వాచ్య సామర్థ్యమున ఆక్షేపింపఁబడి ప్రతీయమానములే అగుచుండును. వాచ్యము కంటె ప్రతీయమానము వేఱని ప్రత్యేకముగాఁ జెప్పనక్కరలేదు. సమాసోక్తి, ఆక్షేపము మున్నగు నలంకారములందుఁ గూడ వ్యంగ్యమున్నను అచ్చట దానికి ప్రాధాన్యముండదు. వాచ్యమునకే ప్రాధాన్యముండును. అందుచే నవిగుణీభూత వ్యంగ్యములగును. వానియందు ధ్వనిని అంతర్భవింపఁజేయుటకు వీలులేదు. వానినే ధ్వనియందంతర్భవింపఁ జేయవలయును. ఏదో అలంకారమునకు ధ్వనియని పేరు కల్పింపఁబడినదని భావించుట పొరపాటు. అలంకారము లేని చోట కూడ కొన్ని చోట్ల ధ్వని స్పష్టముగా గోచరించు చుండును. అది అలంకారము కాదు; అలంకార్యము. రీతివృత్తి గుణాలంకారము లంగి యగు ధ్వని కంగములు, అంగాంగుల కభేదము చెప్పరాదు. అలంకారము ధ్వనింపఁ జేయఁబడి అంగి అగునపుడు కూడ ధ్వని ప్రభేదమగునే కాని అది ధ్వని కాదు. ఏలయన ధ్వని వస్తు రసాది రూపమునఁ గూడ నుండుట కవకాశమున్నది. అందుచే అలంకార ధ్వనియందుఁ గూడ ధ్వని నంతర్భవింపఁ జేయుట తగదు. వైయాకరణుల శబ్ద ధ్వని (స్ఫోటము) తోడి సామ్యమును బట్టి వాచ్య సాహాయ్యము చేతనే ఆక్షిప్తమయ్యు దాని కంటె సుందరతరమై భాసించు అర్థాంతరమునకు మేము ధ్వనియను పేరొసంగి యున్నాము. దాని భావించుకొని ధ్వనివాదు లానంద పారవశ్యము నందుటలో నసందర్భము కాని అనౌచిత్యము కాని లేదు."

అంతర్భావ వాదము : కొందరు పైని పేర్కొనఁ బడిన అభావ వాదులవలె ధ్వని యసలు లేనే లేదని చెప్పక అది అభిధ యందో లక్షణయందో, తాత్పర్యమునందో, అనుమేయము నందో అంతర్భవించునని చెప్పుదురు. అభిధాంతర్భావు లిట్లు వాదింతురు. "వాచ్యార్థము తోచిన పిమ్మట నర్థాంతరమును స్ఫురింపజేయుటకు వ్యంజనాశక్తియను క్రొత్త శక్తి యవసరము లేదు. దానిని అభిధాశక్తియే వ్యక్తము చేయును. ఏలయన, నేర్పరియైన విలుకాఁడు విసరు బాణము మొదట కవచమును పిమ్మట శరీరమును తరువాత ప్రాణమును గ్రమముగఁ దాఁకునట్లే ప్రతిభావంతుఁడైన కవి ప్రయోగించు శబ్దమున కభిధాశక్తి కూడ మొదట సంకేతితార్థమును పిమ్మట తాత్పర్యార్థమును తరువాత వ్యంగ్యార్థమును బోధింపఁ జాలును."

"అభిధాశక్తి సంకేతితార్థము నొకదానికే కాని వ్యంగ్యములగు వస్త్వలంకార రసాదులను బోధింపఁజాలదని ప్రాచీన సంప్రదాయము. నేర్పరియగు విలుకాఁడు విసరిన బాణమునకు వలె నభిధాశక్తికిని దీర్ఘ దీర్ఘతర వ్యాపార మున్నదనుటకు ప్రమాణము లేదు. అట్టి వ్యాపారమే దాని కున్నచో వ్యంజనా శక్తికే కాక లక్షణాశక్తికిని అవశ్యకముండదు. ఏలయన, అదియే ఆ రెండింటి వ్యాపారమును నిర్వహించును. అభిధాశక్తిచే బోధింపఁబడు వాచ్యార్థమునకును వ్యంజనాశక్తిచే స్ఫురింపఁజేయఁబడు వ్యంగ్యార్థమునకును జాల భేదమున్నది. వాచ్యార్థమందఱికిని ఒక్క విధముగనే తోఁచుచుండును. వ్యంగ్యార్థ మట్లుగాక వక్త, ప్రకరణము, బోద్ధవ్యము, దేశము, కాలము మున్నగువాని ననుసరించి పలువిధముల భాసించు చుండును. వాచ్యార్థము విధి రూపమున నుండ వ్యంగ్యార్థ మొక్కొక్కప్పుడు నిషేధ రూపమున నుండును. అట్లే అది నిషేధ రూపమున నుండనిది విధి రూపమున నుండును. అది విధి నిషేధ రూపముల నుండ నిది యనుభయ రూపమున (అనగా విధి రూపమునఁ గాని నిషేధ రూపమునఁ గాని యుండక) యుండును. ఒక్కొక్కప్పుడు వ్యంగ్యార్థము వాచ్యార్థము కంటె నత్యంత భిన్నముగా నుండును. వాచ్యార్థము శబ్దమును మాత్ర మాశ్రయించి యుండ వ్యంగ్యార్థము శబ్దము, శబ్దైక దేశము, అర్థము, వర్ణములు, రీతి అనువాని నాశ్రయించి యుండును. వాచ్యార్థమును నిఘంటు వ్యాకరణాదుల సాయమున నెఱుంగవచ్చును. వ్యంగ్యార్థము ప్రకరణాదులను బట్టి ప్రతిభావంతులు మాత్రమే తెలిసికొనఁదగి యుండును. వాచ్యార్థము పదార్థజ్ఞానమును మాత్రమే కలగింప వ్యంగ్యార్థము రమణీయమై చమత్కారము ద్వారా ఆనందము కలిగించును. ఈ విధముగా నన్యోన్యభిన్నములైన వాచ్య వ్యంగ్యార్థములు రెండింటిని అభిధాశక్తియే బోధించుననుట సమంజసముకా"దని ఆనందవర్ధనుఁ డభిధాంతర్భావుల వాదమును ఖండించెను.

తాత్పర్యాంతర్భావులు వ్యంజనావృత్తి తాత్పర్యవృత్తి యందే యంతర్భవించును గావున దానిని వేఱుగాఁ జెప్ప నవసరము లేదని వాదింతురు. అలంకారికుల మతమున తాత్పార్యార్థమును వ్యంగ్యార్థమును నొక్కటే. (తాత్పర్యార్థము కూడా వ్యంగ్యార్థమే కాని పృథగ్భూతము కాదని ప్రతాప రుద్రీయము). మీమాంసకులలో నొకతెగ వారైన అభిహితాన్వయవాదులు వాక్యము నందలిపదముల కన్వయము కలిపి యఖండార్థమును బోధించు శక్తినే తాత్పర్యశక్తియని పేర్కొనిరి. ఇది పద సమన్వయమును మాత్రమే బోధించును

గాని తదనంతరము ప్రకరణాదుల వలనఁ దోఁచు నర్థాంతరమును బోధింపఁజాలదు. అందుచే దీనియందు వ్యంగ్యార్థ మంతర్భవించునని చెప్పుటకు వీలులేదు.

భాక్తతావాదము : ధ్వన్యాలోక కర్తలక్షణాశక్తిని భక్తి యనియు లక్ష్యార్థమును భాక్త మనియు పేర్కొని యుండెను. అందుచే భాక్తతావాదమును లక్షణాంతర్భావుల వాదమును ఒక్కటే. వారిట్లు చెప్పుదురు : "లక్ష్యార్థ వ్యంగ్యార్థములు రెండును సమానములే. లక్షణాశక్తి శబ్దమునకు ముఖ్యార్థ బాధ కలిగినప్పుడు తొలుత దానితో సంబంధము గల యర్థమును బోధించి పిమ్మట ప్రయోజన సహితమైన యర్థమును గూడ లక్ష్యార్థముగనే బోధించును. శబ్దమునకు వ్యంగ్యార్థము బహువిధముగా నుండునట్లె లక్ష్యార్థము కూడ శబ్దార్థాధీనమును ప్రకరణ సాపేక్షమునై నానావిధములుగా నుండును. అందుచే వ్యంజనావృత్తి లక్షణావృత్తి యందే యంతర్భవించును. గావున దానిని వేఱుగాఁ జెప్పనవసరము లేదు".

ఆనందవర్ధనుఁడీ వాదము నిట్లు ఖండించెను. "లక్షణా వ్యంజనా వ్యాపారములు భిన్నములైనవి. శబ్దమునకు వాచ్యార్థము పొసఁగ నపుడు లక్షణ దానిని విడిచి దానితో సంబంధముగల వేఱొక యర్థమును బోధించును. (గంగాయాం అనగా గంగా తీరమునందు అని చెప్పుట యిందుకు దృష్టాంతము). అనఁగా లక్ష్యార్థము వాచ్యార్థ సంబంధము గలిగియే యున్నను, అందు కొంతభాగమును విడిచివేయును. వ్యంగ్యార్థ మట్లుగాక వాచ్యార్థము కంటె భిన్నముగా నుండియు దానిచే నాకర్షింపబడియే ప్రకాశించుచుండును. అభిధ సంకేతార్థమునే కాని ప్రయోజనమును బోధింపఁ జాలదు. ప్రయోజన సహితమైన లక్షణయు నుండదు. శబ్దమునకు ముఖ్యార్థ బాధ కలుగు నప్పుడది ప్రయోజనమును బట్టి కాని రూఢినిబట్టి కాని యర్థాంతరమును బోధించును. దీనికే లక్ష్యార్థమని పేరు. లక్ష్యార్థ ప్రయోజనములు భిన్నములు అవి రెండు నెప్పుడు నేకకాలమున గోచరింపవు. ప్రయోజనమును బోధించుటకు వ్యంజన తప్పక యుండవలయును. లక్షణ మొదట నొక లక్ష్యార్థమును బోధించి మరల నింకొక లక్ష్యార్థమును బోధింపఁ జాలు ననుట పొరపాటు. గంగాయాం ఘోషః అను నప్పుడు గంగాయాం అనగా గంగాతీర మందని లక్ష్యార్థము. గంగాతీరే ఘోషః అను నప్పుడు ముఖ్యార్థమునకు అనుపపత్తి లేనేలేదు. గంగాతీరమందనునది వాచ్యార్థమే. శీతత్వ పావన త్వాదులు గంగలో సంబంధించినవే కాని గంగాతీరమునకు సంబంధించినవి కావు. అందుచే గంగాయాం అనునప్పుడు వలె గంగాతీరే అనునప్పుడు శీతత్వ పావన త్వాదులను ప్రయోజనము

భాసింపదు. వానినే లక్ష్యార్థముగాఁ జెప్పినచో నింక నచ్చట ప్రయోజనాంతరముండనే యుండదు. ప్రయోజనము లేనిచోటఁ గూడ కొన్ని యెడల లక్షణ యుండవచ్చును కాని ప్రయోజన మున్నచోట మాత్రమే వ్యంగ్యముండును. అట్టి చోటఁ గూడ లక్షణకు విషయ మగు నర్థము లక్ష్యార్థమే కాని ప్రయోజన రూపమగు వ్యంగ్యార్థము కాదు. అందుచే లక్షణా వ్యంజనలు భిన్నములనక తప్పదు.

భక్తి (లక్షణ) ధ్వనికి లక్షణ మనుటలో అతివ్యాప్త వ్యాప్త దోషములు కానవచ్చును. దానిని బట్టి భక్తి యున్నచోట్ల నెల్ల ధ్వని యున్నట్లు చెప్పవలయును. కాని ప్రయోజన రూఢి హేతుక లక్షణ లుండు చోట్ల గూడ నొక్కొక్కప్పుడు ధ్వని యుండదు. అందుచే పై వాక్యమున కతివ్యాప్తి కలిగినది. అట్లే ధ్వని యున్నచోట్ల నెల్ల (భక్తి) లక్షణ యుండకపోయినచో నవ్యాప్తి దోషము కల్గును. అభిధామూల ధ్వని (వివక్షితాన్య పరవాచ్యధ్వని) భేదములైన సంలక్ష్య క్రమ వ్యంగ్యము అసంలక్ష్య క్రమ వ్యంగ్యము అను వానిలో భక్తి యుండదు. అందుచే పై లక్షణమున కవ్యాప్తి కలుగుచున్నది. దీనిని బట్టి భక్తి ధ్వనికి లక్షణము కాదు. ఆ రెండును భిన్నములు. వ్యంగ్యార్థమును వలె నొకప్పుడు లక్ష్యార్థమును నానా విధములుగా నుండినను పెక్కర్థములు గల శబ్దమునకు సంయోగాదుల వలన నొకటే యర్థము నియమిత మైనట్లు లక్షణచే లక్ష్యార్థము కూడా నియమింపఁబడుచుండును. లక్షణ వాచ్యార్థ సంబంధము గల యర్థమున కాని తత్సంబంధము లేని యర్థము నెప్పుడును బోధింపక పోవుటయే యందలి నియమము. అందుచేతనే దానికి అభిధా పుచ్ఛమను పేరు కలిగినది. వ్యంగ్యార్థ మిట్లుగాక నియత సంబంధము కలిగియు, అనియత సంబంధము కలిగియు, సంబద్ధ సంబంధము కలిగియు, పలు విధముల నొప్పారుచుండును. మఱియు లక్షణాశక్తి శబ్ద మాత్రము నాశ్రయించి యుండ వ్యంజనాశక్తి శబ్ద శబ్దైక దేశ వర్ణ రీత్యాదుల నాశ్రయించి యుండును. అందుచే నా శక్తులు రెండును బృథగ్భూతములే” అని ఆనందవర్ధనుఁడు లక్షణాంతర్భావుల మతమును ఖండించెను.

కొందఱు పండితులు వ్యంగ్యమనుమాన ప్రమాణ గమ్యమని అనుమేయములోనే అంతర్భవించునని చెప్పి వ్యంజనా వృత్తి యనవసర మని వాదింతురు. పొగ గోచరించుట వలన పర్వతమున నిప్పున్నదని మన మూహింతుము. ఇట పొగ లింగ మనియు, నిప్పు లింగి యనియుఁ జెప్పఁబడును. ఈ లింగి లింగములకు నియత సంబంధ ముండును.

అట్లే శబ్దము లింగము. వ్యంగ్యార్థము లింగి లేక అనుమేయము. లింగముచే లింగి యూహింపఁబడును. అందుచే వ్యంజనా వృత్తి వేఱుగా నుండ నవసరము లేదని వారి యభిప్రాయము. కాని అనుమేయమును వ్యంగ్యార్థమును అభిన్నములు గావు. శబ్దోచ్చారణానంతరము తోఁచు నర్థము అనుమేయము, ప్రతిపాద్యము అని రెండు విధములు. ఆ అనుమేయము మరల శబ్దస్వరూప ప్రయోగేచ్ఛ అర్థ ప్రతిపాద నేచ్ఛ అని రెండు విధములు. ఈ రెండు విధములైన ఇచ్ఛలే అనుమేయములు (లింగి), శబ్దము లింగము. ప్రతిపాద్యార్థము ప్రతిపాద్యము, వ్యంగ్యము అని రెండు విధములు. ఇవి అనుమేయములు కావు. శబ్దము లింగ మనియు, వ్యంగ్యము లింగి యనియు భావింపరాదు. ఏలయన, లింగ లింగి సంబంధము వలె శబ్ద వ్యంగ్యార్థ సంబంధము నియమితమైనది కాదు. ఈ శబ్ద మీ వ్యంగ్యమునే బోధింప వలెనను నియమము లేదు. అనుమాన ప్రమాణము వ్యంగ్యార్థమును బోధింపజాలదు. దానిని బోధించుటకు వ్యంజనా శక్తి తప్పక యుండ వలయును అందుచే అనుమేయముననే వ్యంగ్య మంతర్భవించునని భావించుట సమంజసము కాదు.

అలక్షణీయతా వాదము : ధ్వని వాదము నంగీకరింపని మూఁడవ తెగ వారు ధ్వని కుచితమైన లక్షణము చెప్పఁజాలక అది వాక్కుల కగోచర మనియు సహృదయ హృదయైక వేద్య మనియు చెప్పుదురు. ధ్వని అనిర్వచనీయ (అలక్షణీయ) మని వారి అభిప్రాయము. కాని ఈ అభిప్రాయము సమంజసము కాదు. ప్రతిభావంతులైన పండితులు ధ్వని లక్షణమును అందలి పెక్కవాంతర భేదములను వివరించియున్నారు. ఇట్లు చెప్పఁబడిన పిమ్మటఁ గూడ నది అలక్షణీయమే యగు నెడల జగత్తు నందలి సర్వ వస్తువులును అలక్షణీయములే కావలసి వచ్చును. లోకమున శబ్దార్థములకు గోచరము కాని వస్తు వుండదు. ఈ ధ్వని యనునది "వాచామగోచర"మని చెప్పుట కూడ నొక విధముగా దానిని వివరించుటే అగుచున్నది. ఇది యతిశయోక్తితోఁ గూడి యున్నను ధ్వనితత్త్వము సారవత్తర మని చక్కగా వ్యక్తము చేయుచునే యున్నది. అందుచే అలక్షణీయతా వాదమంగీకరింపఁ దగినది కాదు.

ఈ విధముగా నానందవర్ధనుఁడు ధ్వన్యభావవాదుల వాదములను ఖండించి లక్షణా తాత్ప ర్యానుమేయముల కంటె వేఱై వ్యంజనా వ్యాపారమొకటి యున్నదనియు దానిచే ధ్వన్యర్థము స్ఫురింపఁ జేయఁబడు ననియు నిరూపించి, పండితుల కానంద సంధాయకుఁడయ్యెను. ఈ సందర్భమున నతఁడు చూపిన యుక్తిచాతుర్యమునకును ప్రతిభా పాండిత్య విశేషములకును

మేరలు లేవు. అందుచేతనే...

ధ్వని నాతిగభీరేణ కావ్యతత్త్వ నివేశినా
ఆనందవర్ధనః కస్య దాసీ దానందవర్ధనః

అని అతఁడు ప్రశంసింపబడి యున్నాఁడు.

4. గుణీభూత వ్యంగ్యము - అందలి భేదములు :

గుణీభూత మనఁగా అప్రధానమని యర్థము. అప్రధానమైన వ్యంగ్యము కలది (కావ్యము) గుణీభూత వ్యంగ్యము. ఇందు వ్యంగ్యార్థ మప్రధానమును వాచ్యార్థము ప్రధానమునునై యుండును. అందుచేతనే యిది మధ్యమ కావ్యముగాఁ బరిగణింపఁ బడుచున్నది. ఇది యెనిమిది విధములు :

1. అగూఢము : గూఢము కాని దగూఢము. కామినీ కుచకలశముల వలె గూఢముగా నున్నప్పుడే వ్యంగ్యము చమత్కార కారియై భాసిల్లును. అది అగూఢముగా (సువ్యక్తముగా) నుండుచో నందలి రామణీయకము తగ్గును. అందుచేతనే అది మధ్యమ కావ్య మగును. ఉ॥ "గుణరత్న రోహణ గిరివైన యో ప్రతాపరుద్ర ప్రభూ! నీ యౌన్నత్యమును వర్ణింతునేని నీచైః కృతములైన పర్వతములు నాపైఁ గోపించును. నీ గాంభీర్యమును గీర్తింతునేని సముద్రములు గాధీకృతములై క్షోభిల్లును. అందుచే నిన్ను వర్ణించుటకు భయపడుచున్నాను. లేదు లేదు నీ పార్శ్వమం దున్నవాఁడనై నేనగ స్త్యుఁడ నైతిని" ఇచ్చట నీపార్శ్వము నందున్న వాఁడనై నే అగస్త్యుఁడనైతి ననుటచే సముద్ర పర్వతముల వలన భయపడుట లేదను వ్యంగ్య మగూఢముగా గోచరించుచున్నది. ఏలయన అగస్త్యుఁడు వింధ్య పర్వత గర్వము నడగించుటయు సముద్రోదకముల నొక గ్రుక్కతోఁ గ్రోలివేయుటయు ప్రసిద్ధములు.

2. అపరాంగము : మఱొకటి అంగముగాఁ గలది అపరాంగము. రసభావాదులకు రసభావాదు లంగములుగా వర్ణింపఁబడుచో నది అపరాంగమగును. ఇచ్చట నాది శబ్దముచే భావ, రసాభాస, భావాభాస, భావశాంతి, భావోదయ, భావ శబలతలు సూచింపఁబడుచున్నవి. ఈ విధముగా అపరాంతముననేక భేదము లుండవచ్చును. కాని యిచ్చట రసమునకు రసమంగముగా నున్న యుదాహరణమే యొసఁగబడుచున్నది. ఉదా॥ "ప్రతాప రుద్ర భూపాలా! నీవను మదనునిచే నుద్వేజితులైన శత్రురాజులు సిగ్గు విడిచి మౌనము నుజ్జగించి గాద్గద్యము

తోఁప స్వేద ముప్పతిల్ల గాత్రములు కంపింప మూర్ఛ యావరింప కన్నీరోడ్చుచు భీతి సమాలింగితులై శైలగుహలందుఁ గూడ విజన స్థలమునకుఁ బోవుచున్నారు" ఇచ్చట ప్రతాపరుద్రుని శౌర్యవర్ణనము ప్రకృతము. శత్రురాజు లతని శౌర్యముచే భీతిల్లి సిగ్గు విడిచి యాక్రోశించుచు నంగములు కంపింప మూర్ఛాక్రాంతులై కన్నీరోడ్చుచు శైలగుహలం దేకాంత ప్రదేశమున దాగుచున్నారని యర్థము. ఇందు భయానకరస మంగి భీతి శబ్దము సంస్కృతమున స్త్రీలింగ మగుటచేతను, స్వేదకంపాదులు సాత్త్విక భావము లగుటచేతను నాయికాలింగితుఁ డగు నాయకుని రహస్య ప్రదేశ గమన మను నప్రస్తుతాంశము ద్యోతిత మగుట నిచ్చట సమాసోక్త్యలంకారము తోఁచు చున్నది. ఈ అప్రస్తుతార్థమున రసము శృంగారము ఇది అంగము. పై యుదాహరణమున ప్రధానమగు భయానక రసమునకు శృంగార రస మంగముగా నున్నది. అందుచే నిది అపరాంగ మగుచున్నది.

3. వాచ్య సిద్ధ్యంగము : వాచ్యార్థసిద్ధికి అంగమైనది వాచ్యసిద్ధ్యంగము. వాచ్యార్థము కుదురనపుడు వ్యంగ్యార్థము వలన అర్థము కుదురుచోనది వాచ్య సిద్ధ్యంగ మగును. ఉదా॥ "కాకతీంద్రుని కరాలమైన కరవాలనవాంబుదము తన ధారచే శత్రువుల యుగ్రమైన ప్రతాపజ్వలనమును శమింపఁ జేయుచున్నది" ఇచ్చట ప్రతాపరుద్రుని కరవాల వర్ణనము ప్రధానమైనది. అందుచే ధార యనఁగా కత్తివాదర యనియే ముఖ్యార్థము కాని యీ యర్థమును గ్రహించినచో కరవాల నవాంబుదము (కత్తియను తొలుకారు మబ్బు) అను రూపకము కుదురదు. రూపక ముత్తర పదార్థ ప్రధానము కావున మేఘము వాదరచే ప్రతాపాగ్ని శమింపఁ జేయుచున్నదని చెప్పవలసి వచ్చును. ఇది అసందర్భము. అందుచే ధారా పదమునకు జలధార యను నర్థాంతరమును గ్రహింపవలెను. ఇదే వ్యంగ్యార్థము. ఇట్లు గ్రహించినచో వ్యాచ్యార్థము పొసఁగును. ఈ విధముగా నిట వ్యంగ్యార్థము వాచ్యార్థసిద్ధి కంగమైనది కావున నిది వాచ్య సిద్ధ్యంగము.

4. అస్ఫుటము : స్పష్టము కాని దస్ఫుటము, అనఁగా నది గూఢముగా నుండునది. ఉదా॥ "ప్రతాపరుద్ర భూపాలుని ఖడ్గము మహిమ నిరంకుశమైనది. ఏలయన నది శత్రురక్తనదిని ద్రావి కీర్తిగంగను ప్రసరింపఁ జేయుచున్నది." పూర్వము జహ్ను మౌని తాను మొదటఁ ద్రావిన గంగనే తిరిగి లోకమునఁ బ్రవహింపఁజేసెను. అందు విశేష మేమియు లేదు. మఱి ప్రతాపరుద్రుని ఖడ్గమో ఎఱ్ఱని శత్రు రక్తనదిని ద్రావి తెల్లని కీర్తి గంగను

బ్రసరింప జేయుచున్నది. ఇచ్చట ఖడ్గ ముపమేయము జహ్నుమౌని యుపమానము. ఉపమానముకంటె నుపమేయమే గుణాధిక్యము కలదిగా వర్ణింపఁబడుటచే వ్యతిరేకా లంకారము స్ఫురించుచున్నది. కాని యీ స్ఫూర్తి ఆలస్యముగను అస్ఫుటముగను జరుగుచుండుటచే నిది అస్ఫుట మగుచున్నది.

5. సందిగ్ధము : సందేహముతోఁ గూడినది సందిగ్ధము. రెండు వ్యంగ్యార్థములు స్ఫురించునప్పు డందేది యుద్దిష్టమైన దను సందేహము కలిగినచో సందిగ్ధమని కొందఱును, వాచ్యార్థ వ్యంగ్యార్థములలోనేది ప్రధానమను సందేహము కలిగినచో సందిగ్ధమని కొందఱు చెప్పుదురు. ఇందు రెండవదే సరియైనది ఉదా॥ "కాకతి భూపాలుని దృష్టి అనురాగ తరంగితమై కల్హారమాలవలె చెలువ యున్నత స్తన ద్వయమున లగ్న మైనది." ఇచ్చట ప్రతాపరుద్రుఁడు చెలువ కుచ ద్వయమును జూడఁ గోరుట వాచ్యార్థము. ఆమెను గౌగలింపఁ గోరుట వ్యంగ్యార్థము. ఈ వాచ్య వ్యంగ్యములలో నేది ప్రధానమను సందేహము కలుగుచుండుటచే నిది సందిగ్ధము.

"నరసభూపాలుని సంగరమున నెదిరించు శత్రువులు ముందరగా నరుగుదురు. అయిత పడుదురు. అత్యంత సంభ్రమమున శరములు విడుతురు" అనునది నరసభూపాలీయ మందొసగ బడిన యుదాహరణము. ఇచ్చట శత్రువులు "సిద్ధపడుచున్నారు. శరములు విడుచున్నారు" అను నప్పుడు బాణములు వేయుచు యుద్ధమునకు సిద్ధపడుచున్నారా, బాణములు విడిచివైచి పాఱిపోయి అడవుల కరుగ సిద్ధపడుచున్నారా, అను రెండర్థములలో నేది యుద్దేశింపఁ బడినదో సందిగ్ధముగా నుండుటచే నిది సందిగ్ధమగుచున్నది.

6. తుల్య ప్రాధాన్యము : సమానమైన ప్రాధాన్యము గలది తుల్య ప్రాధాన్యము. ఇచట తుల్యత వాచ్య వ్యంగ్యార్థములు రెండింటికి ఉదా॥"రాజులారా! మీరు ప్రతాపరుద్ర దేవుని పాదపద్మములు సేవింపుఁడు. లేనిచో బ్రసన్నమగు నాతని మనము కలుషాయిత మగును" ఇచ్చట పాదపద్మములు సేవింపనిచో ప్రతాపరుద్రుఁడు కోపించు ననునది వాచ్యార్థము రాజులకు వారి వారి రాజ్యములు నిలువ వనియు వారికి నగరములందు వాసము దుర్లభమనియు వ్యంగ్యార్థము. ఇచ్చట నీ రెండర్థములును తుల్య ప్రాధాన్యములు.

వాచ్య వ్యంగ్యార్థములలో నొకటి ప్రధానము. మఱొకటి అప్రధానము నగునపుడే యేకవాక్యత కుదురుననియు, నారెండింటికిని సమ ప్రాధాన్య ముండుచో వాక్యభేద మేర్పడు

ననియు, నందుచే రెండును ప్రధానముగా నుండరాదనియుఁ గొందరి మతము. వారి మతము ననుసరించి తుల్య ప్రాధాన్య మను గుణీభూత వ్యంగ్యభేద ముండదు.

7. అసుందరము : సుందరము కాని దసుందరము. వ్యంగ్యార్థము కంటె వాచ్యార్థమే సుందరమై భాసించినచో నప్పుడది అసుందర మగును. ఉదా॥ ఏకశిలానగర మందలి స్త్రీలకు నరేంద్ర దర్శనామోదము కలుగు చున్నదని వినఁగనే గురుజనాధీనమైన వధువు ముఖము నల్లపడినది". ఇట నరేంద్ర దర్శన నిమిత్తమైన హర్షమును భావించుచున్న వధువు ముఖము నల్లపడె ననునది వాచ్యార్థము. గురుజనాధీన నగుటచే నరేంద్ర దర్శనమునకే నరుగఁ జాలనైతి ననునది వ్యంగ్యార్థము. ఇచ్చట వ్యంగ్యము కంటె వాచ్యమే సుందర తరముగా నుండుటచే నిది యసుందరము.

8. కాక్వాక్షిప్తము : కాకుస్వరముచే నాక్షిప్తమైనది కాక్వాక్షిప్తము. క్రోధ శోక విస్మయాదులచేఁ గలుగు భిన్న కంఠ ధ్వనికిఁ గాకువని పేరు. సాధారణముగా వ్యంగ్య కావ్యమున మొదట వ్యాచ్యార్థమును తరువాత వాచ్య సహాయమున వ్యంగ్యార్థమును స్ఫురించుచుండును. కాకు వున్నచోట వ్యంగ్యము వాచ్యార్థానంతరము కాక వాచ్యార్థము తోడనే స్ఫురించుచుండును. అనఁగా నచ్చట వ్యంగ్యార్థముచే నాక్షిప్తము కాదు. కాక్వాక్షిప్తమై వాచ్యార్థముతో సమముగా తోఁచును అప్పుడది కాక్వాక్షిప్తమగును. ఉదా॥ "చెలి చెప్పుము. భూలక్ష్మి సరస్వతులు నాకంటె నధికలా? గుణవిశేషజ్ఞుఁడైన నరపతి వారిని బహుమానించుచున్నాఁడు" ఇచ్చట అధికలా అనుపదము నందలి కాకుస్వరము అధికలు కారను వ్యంగ్యము స్ఫురించుచున్నది. ఇచ్చట వ్యంగ్యము కాకుస్వరాక్షిప్తమై వాచ్యార్థ నిషేధము తోడనే భాసించుచున్నది. కాకు వున్న చోటఁ గూడా వాచ్యార్థము తరువాతనే వ్యంగ్యార్థము స్ఫురించుచో నది ధ్వనియే కాని గుణీభూత వ్యంగ్యము కాదు.

సమాసోక్తి, ఆక్షేపము, అప్రస్తుత ప్రశంస మున్నగు నలంకారము లందు వస్తు వ్యంగ్యమును, రూపక తుల్య యోగితా దీపక నిదర్శనాదులం దలంకార వ్యంగ్యమును గోచరించుచుండుట నిజమే. అయ్యును అందు వ్యంగ్యములైన వస్త్వలంకారములచేఁ గాక వాచ్యములైన వానిచేతనే సౌందర్యాతిశయము కలుగుచుండుటచే నవి ధ్వనికిఁగాక గుణీభూతవ్యంగ్యమునకే లక్ష్యములగును. వస్త్వలంకారములును రసభావ రసాభాస భావా భాసాదులును అంగాంగి భావముచే నొండొంటిని వ్యంజితము లొనర్చునప్పుడొక సందర్భమున

ధ్వనియు నింకొక సందర్భమున గుణీభూత వ్యంగ్యమును తోఁచుట కవకాశముండును. అప్పుడు నిర్ణయము చేయు టెట్లని శంక కలుగవచ్చును. అవన్నియు నపరాంగములే యయ్యును అచ్చట వ్యంగ్యములైన వస్త్వలంకార రసభావాదుల చేతనే చమత్కారము కలుగుచుండుటచే నివి యుత్తమకావ్యములే యగునని జగన్నాథుఁడభిప్రాయపడియుండెను.

5. ధ్వని - శ్లేష :

శ్లేష యలంకారములలో నొకటి. శబ్దమునకు నానార్థ సంశ్రయత యున్నచో ననఁగా శబ్ద మనేకార్థముల నొసఁగుచో శ్లేషాలంకార మగును. ధ్వని యున్నచోటఁ గూడ మొదట వాచ్యార్థము పొసంగిన పిమ్మట నంతకంటె రమణీయతర మగు నర్థాంతరము స్ఫురించును. ఇది వాచ్య సామర్థ్యము చేతనే ఆక్షిప్తమగుచుండును. అయ్యును అర్థాంతర స్ఫూర్తి యుండును గావున శ్లేషకును దీనికిని భేద మేమను శంక కల్గును ఆ భేదము నిట్లు సూచించ వచ్చును.

శ్లేష ప్రకృతము, అప్రకృతము, ప్రకృతాప్రకృతము అని మూఁడు విధములు. ప్రకృత శ్లేషమున రెండర్థములును ప్రకృతములేయై యుండును. ఉదా॥ "ఓ నరస భూపాలా! నీ ధర్మములు పరిణత గుణభరితములును, నిరుపమ తరశాస్త్రకలన నిర్నిద్రములునై యొప్పారు చున్నవి." నీ ధర్మములు (ధనుస్సులు - రాజ్య ధర్మములు) పరిణత గుణ భరితములును (మిక్కిలి వంగి అల్లె త్రాళ్ళతోఁ గూడినవియు - పరిపక్వములైన సంధి విగ్రహాది గుణములతోఁ గూడినవియు) నై ప్రకాశించుచున్నవి అని అర్థము. ఇందొక యర్థము నరస భూపాలుని ధనుస్సులను రెండవది అతని రాజధర్మములను వర్ణించు చున్నది. రెండు నరస భూపాలునికి సంబంధించినవే కావున రెండును ప్రకృతములే. ఇచ్చట ధర్మములను విశేష్యమును పరిణత గుణాది విశేషణములును గూడ శ్లేషించుచున్నవి.

అప్రకృత శ్లేషముల రెండర్థములును అప్రకృతములుగనే యుండును. ఉదా॥ "ఈ ప్రతాపరుద్రుఁడు శిరోగృహీత సన్మార్గ స్ఫురత్కటక సంపత్కులైన మహాకుల మహీభృత్తులతో సమానుఁడు." శిరోగృహీత - తలయందు గ్రహింపఁబడిన సాధుమార్గము కలవారును (శిఖములచే గ్రహింపఁబడిన నక్షత్ర మార్గము కలవియును) ప్రకాశింప నలంకారముల సంపదగలవారును (ప్రకాశించు చరియల సంపద కలవియును) అగు మహాకుల- ఉన్నతకులము గల (హరిశ్చంద్రాది) రాజులలో (ఎత్తైన కులపర్వతములతో) సమానుఁడని యిందలి అర్థములు. శిరోగృహీత.... అను విశేషణ మందలి రెండర్థములలో నొకటి

హరిశ్చంద్రాది రాజులకును, మఱొకటి కులపర్వతములకును సంబంధించి యున్నవి. ఈ రెండు అప్రకృతములే (రాజపర్వతములు) యయి యుండుటచే అప్రకృతశ్లేష. ఇచ్చట కూడ విశేష్య (రాజకుల పర్వతములు) విశేషణములు (శిరోగృహీత) రెండును శ్లేషించుచున్నవి. ఇచ్చట విశేష్యములు శ్లేషించుట యైచ్ఛికమని పండిత రాయల అభిప్రాయము.

ప్రకృతా ప్రకృత శేషలో శ్లిష్ట పదము లందలి యర్థములలో నొకటి ప్రకృతమునకును రెండవది అప్రకృతమునకు సంబంధించి యుండును. ఉదా॥ అరిదర కరుఁడును సుమనోవర భరణ ధురీణుఁడును లక్ష్మీస్థిరవాస భాసురుఁడునునై నరసభూపాలుఁ డాది నరసింహుఁ డనఁబ్రకాశించు చున్నాడు. నరస భూపాలుఁడు శత్రువులకు భయము కలిగించు వాఁ డును, పండిత శ్రేష్ఠులను భరించుటయందు సమర్థుఁడును, రాజ్యలక్ష్మికి స్థిరమైన నివాసమునునై ప్రకాశించుచున్నాడు. ఇది ప్రకృతార్థము. నరసింహమూర్తి చక్రము శంఖము కరము లందుఁ గలవాడును, దేవతల ప్రభువైన యింద్రుని రక్షించుట యందు సమర్థుఁడును, లక్ష్మీదేవి స్థిరమైన నివాసమునునై ప్రకాశించు చున్నాఁడు. ఇది అప్రకృతార్థము. ఇట నర్థములు ప్రకృతా ప్రకృతములు రెండింటికి సంబంధించిన వగుటచే నిది ప్రకృతా ప్రకృత శ్లేష. ఇందు విశేషములే కాని విశేష్యములు (నరసింహుడు ఆదినరసింహుఁడు) శ్లేషించి యుండలేదు.

"ప్రతాపరుద్రుని క్షోణీపాణీగ్రహోత్సవమును విని రాజులంగుష్ఠముతోఁ బాదపీఠిని గీరుచు నతానను లైరి" అను దానియం దర్థశక్తి మూలమైన ధ్వని యున్నది. ప్రతాపరుద్రుఁ డు రాజ్యాభిషిక్తుఁడు కాఁగానే యితర రాజులు భయ విషాదాదులను బొందిరను వస్తువిచ్చట వ్యంగ్యమగుచున్నది. ఇచ్చట శబ్దముల కనేకార్థత్వము లేదు. అనగా, శ్లేషించుట లేదు. అయ్యునురమ్య తరమైన అర్థాంతరము స్ఫురించుచున్నది. దీనిని ప్రతిభచే గ్రహింప వలయునే కాని నిఘంట్వాదుల సాహాయ్యముచే గ్రహింప వీలులేదు. శ్లేషయున్నచోట నిఘంట్వాదుల సహాయమున రెండర్థముల నెవ్వరైన గ్రహింపవచ్చును. అందుచే నర్థశక్తి మూలధ్వనిశ్లేష యని భ్రమించుట కవకాశము లేదు.

శబ్దశక్తి మూల ధ్వనిలో నట్టి అవకాశమున్నది. "జగత్పతియు రాజ మౌళియు నగు రుద్రదేవుఁడు విజితారి పురుఁడును మూర్తి విలస త్సర్వమం గళుఁడునై ప్రకాశించుచున్నాడు." ఇందు శబ్దశక్తి మూలధ్వనియున్నది. జగత్పతియు రాజశ్రేష్ఠుఁడునగు ప్రతాపరుద్రుఁడు జయింపబడిన శత్రువుల పురములు గలవాఁడును, మూర్తియం దొప్పారు సకల శుభములు

గలవాఁడునై జయింపఁబడిన త్రిపురములు గలవాఁడును మూర్తియం దొప్పారు పార్వతి గల వాఁడునునై జగన్నాయకుఁడును చంద్రశేఖరుఁడునగు రుద్రునివలెఁ ప్రకాశించుచున్నాఁడని యిందుపమాలంకారము ధ్వనించుచున్నది. ఇందన్ని శబ్దములకును రెండర్థములున్నవి. విశేషణములు రెండును శ్లేషించుచున్నవి. దీనిని "విజితారి పురుఁడును. మూర్తి విలసత్సర్వమంగళుఁడును, రాజమౌళియునగు ప్రతాపరుద్రుఁడు రుద్రునివలెఁ బ్రకాశించు చున్నాఁ"డని చెప్పినచో శ్లేషాలంకార మగును. ఇచ్చట విశేషణములే కాని విశేష్యములు శ్లేషించుట లేదు. మఱియు రుద్రునివలె అని యుపమాలంకారము వాచ్యము చేయబడినది. ప్రకృతా ప్రకృత శ్లేషలోని విశేషణములు మాత్రమే శ్లిష్టములై యుండ నర్థశక్తి మూలధ్వనిలో విశేషణ విశేష్యములు రెండును శ్లిష్టములై యుండును. శ్లేషలో నలంకారముగాని వస్తువుగాని వాచ్యమై యుండ నర్థశక్తి మూలధ్వనిలో నవి వాచ్యములు కాక వ్యంగ్యములై యొప్పారును.

ప్రకృత శ్లేషయందును, అప్రకృత శ్లేషయందును రెండర్థములును ప్రకృతములే యగుటచే వానిని అభిధాశక్తియే బోధించును. అచ్చట ప్రకరణ నియమముండదు. ప్రకరణాదులచే నెచ్చట నొక యర్థము ప్రకృతముగను మఱొక యర్థ మప్రకృతముగను దోఁ చునో అట్టిచోట శబ్దశక్తి మూలధ్వని యగును. ఉదాహరణమునకు రాఘవ పాండవీయమును తీసికొందము. ఇందు ప్రతి పద్యమునకు రెండర్థములుండును. ఒకటి భారతపరమైనది; వేఱొకటి రామాయణ పరమైనట్టిది. భారతార్థమును గ్రహించునప్పుడు రామాయణార్థముతోఁ బ్రసక్తియే లేదు. అట్లే రామయణార్థమును గ్రహించునప్పుడు భారతార్థముతోఁ బ్రసక్తి యుండదు. దేనిని గ్రహించునప్పుడా యర్థము నభిధాశక్తియే బోధించును. అచ్చట శబ్దమాత్ర సామ్యమే గోచరించును. అందుచే నచ్చట శ్లేషయేకాని ధ్వని కాదు. వసుచరిత్రమునందుఁ గూడఁ బెక్కుపద్యములకు రెండర్థములు స్ఫురించును. అందొకటి ప్రకృతార్థమును బోధించును. ఆ ప్రకృతార్థ బోధనకొఱకు వ్యంజనాశక్తి తప్పని సరియగును. ఏలయన వాచక శబ్దమునకు సంయోగాదులచే నొక్క యర్థమే నియమితమైయుండును. ఈ విషయమున మమ్మటుఁడు "అనేకార్థకమైన శబ్దమునకు సంయోగాదులచే వాచకత్వము నియంత్రితమై యుండ నర్థాంతరమును (అవాచ్యార్థమును) వ్యంజనయే బోధించు"నని చెప్పియున్నాఁడు.* అందుచే

* అనేకార్థస్య శబ్దస్య వాచకత్వేనియంత్రితే
సంయోగాద్యై రవాచ్యార్థ ధీకృద్వ్యాపృతిరంజనమ్.

నట్టియెడ ప్రకృతా ప్రకృత శ్లేష కాక అర్థశక్తి మూలధ్వనియే యని చెప్పవలయును. ధ్వన్యాలోకము ననుసరించి అప్రకృతార్థమును గూడ నభిధయే బోధించును. ఆ మతమున శబ్దశక్తి మూలాలంకార ధ్వనియే కాని శబ్ద శక్తి మూలవస్తు ధ్వని లేదు. అందుచే వసు చరిత్ర యందున్నది శ్లేషయే కాని ధ్వని కాదు. కాని అట్టియెడ విశేష్యశ్లిష్టత్వాశ్లిష్టత్వములను బట్టి అది శ్లేషయో ధ్వనియో నిర్ణయింపవచ్చును.

శ్లేషయందు రెండర్థములును ప్రకృతములును వాచ్యములును అగుటచే అందవి విధి రూపములో నిషేధ రూపములో అయి యుండును. ధ్వనియందు వాచ్యము విధిరూపమున నుండ వ్యంగ్యము నిషేధ రూపమున నుండవచ్చును. అది నిషేధరూపమున నుండ నిది విధి రూపమున నుండవచ్చును.

రసధ్వనిలో శ్లేషకు ప్రసక్తియే లేదు. రసమెప్పుడును వ్యంగ్యముగనే యుండును గాని వాచ్యముగా నుండదు. విభా వానుభావాదుల సమ్యగ్వర్ణనముచే రసము ప్రతీయ మానమగును. అందు శబ్దమునకు రెండర్థములను గల్పింపవలసిన పని లేదు.

శ్లేషయం దర్థక్లేశమే కాని చమత్కార ముండదు. వ్యంగ్యము నందుఁ గూడఁ గ్లేశ మున్నను చమత్కారము పుష్కలముగా నుండును. ఒకటి అంగము, రెండవదంగి. ఒకటి అలంకారము. రెండవ దలంకార్యము. రెండును భిన్నములు.

5. గుణరీతి వృత్త్యాది సోపానము

1. గుణములు :

కావ్యమునకు శబ్దార్థములు శరీరము. రసమాత్మ. గుణాలంకారములు వరుసగా నంతర్బహి స్సౌందర్య సంవర్ధకములు. శౌర్య ధైర్యాది గుణములాత్మ ధర్మములైనట్లే మాధుర్యాది గుణములు రసధర్మములు. రసములకును గుణములకును అవినాభావము. అనఁగా రస మున్నచోట గుణములును గుణములున్నచోట రసములును ఉండును. గుణముల స్వరూప స్వభావములను నిర్వచించు విషయమునను సంఖ్యను నిర్ణయించు విషయమునను మత భేదములున్నవి. భరతుఁడు నాట్య శాస్త్రమున తొలుత దోషములను వివరించి వానికి విపరీతములే గుణములని చెప్పెను. అగ్ని పురాణము కావ్యమున కధిక శోభ కలిగించునవి గుణములని నిర్వచించి శబ్దమునకు శోభ గూర్చునవి శబ్ద గుణములనియు, శబ్ద ప్రతిపాదితమైన వస్తువునకు శోభ గూర్చునవి అర్థగుణములనియు, శబ్దార్థములు రెండింటికి శోభగూర్చునవి ఉభయగుణములనియు తెల్పియుండెను. దండి విశిష్ట రచన గల పదావళికి గుణములు ప్రాణముల వంటివని తెల్పి యందుఁగొన్నిటిచే వైదర్భీరీతియు కొన్నిటిచే గౌడి రీతియు నేర్పడునని వ్యక్తము చేసెను. వామనుఁడు కావ్య శోభాకరములైన ధర్మములు గుణము లనియుఁ దదతిశయహేతువు లలంకారము లనియు నందు గుణములు నిత్యము లనియు నలంకారము లనిత్యము లనియు వెల్లడించెను. మమ్మటుఁడు శౌర్యాదు లాత్మకువలె రసమున కుత్కర్షా పాదకములై స్థిరముగా నుండు ధర్మములు గుణములని విశదీకరించెను. లోకమున ఈ రచన మధురము, ఈ రచన ప్రసన్నము అను వ్యవహారముండుటచే మాధుర్యాది గుణములు రచనా ధర్మములని భావింపనక్కరలేదు. అవి రసధర్మములే. రసధర్మము రచన యందారోపింపఁబడుటచే నట్టి వ్యవహార మేర్పడినది.

గుణము లెన్నియను విషయమునఁ గూడ మత భేదములున్నవి. భరతుఁడు నాట్యశాస్త్రమున పదిగుణములను బేర్కొని వానికి లక్షణము లొసంగెను. భామహుఁడు

దశగుణములను బేర్కొన్నను అందు మాధుర్యము, ఓజస్సు, ప్రసాదము అను మూఁడే ముఖ్యములని తెల్పెను. దండి పది గుణములను గ్రహించి వానిలోఁ గొన్నింటితో వైదర్భీ రీతియుఁ గొన్నింటితో గౌడీ రీతియు నేర్పడునని వ్యక్త పఱిచెను. వామనుఁడు కూడ దండి గ్రహించిన పది గుణములను గ్రహించి శబ్దార్థ భేదములచే వాని నిరువది గావించెను. ఇతఁడును గుణముల చేతనే రీతులేర్పడునని యభిప్రాయపడెను. అగ్ని పురాణము శబ్ద గతములు అర్థగతములు ఉభయ గతములు అని గుణములను వివరించి శ్లేషాదులతో మఱికొన్నిటిని గలిపి మొత్తము పందొమ్మిదింటిని పేర్కొనెను. ఆనందవర్ధనుఁడు భామహునివలె మాధుర్యౌజః ప్రసాదములను మూఁడు గుణములనే గ్రహించి అవి రస ధర్మములని నిర్ణయించెను. మమ్మటుఁడు కూడ పై మూఁడే గుణములనియు, నితర గుణములు కొన్ని వానిలోనే అంతర్భవించుననియు, కొన్ని దోష త్యాగము వలననే సరిపడుననియు, కొన్ని దోషత్వమునే భజించుననియుఁ దెల్పెను. విద్యానాథుడు అర్థగుణములుండవని తెల్పి భోజుఁడు చెప్పిన యిరువది నాలుగు శబ్దగుణములను మాత్రమే గ్రహించెను. పీయూషవర్షుఁడు గుణము లెనిమిదేయని తెల్పెను. అతఁడు కాంతిని శృంగార మందును, అర్థవ్యక్తిని ప్రసాదమునందును అంతర్భవింప జేసెను. జగన్నాథుఁడు మాధుర్యౌజః ప్రసాద గుణములు మూఁడింటినే గ్రహించి సామాజికుని చిత్తమందుఁ గలుగు ద్రుత, దీప్తి, వికాసము అను చిత్తవృత్తులే క్రమముగా నా గుణములగు ననియు ఆయా గుణములతోఁగూడిన రసము జర్వణము చేయుటవలన నా చిత్తవృత్తులేర్పడుననియుఁ దెలిపెను. భట్టుమూర్తి నరస భూపాలీయమున సర్వ విషయములందు ప్రతాపరుద్రీయమునే అనుసరించినను గుణముల విషయమున మాత్రము దాని ననుసరింపక వామనుఁడు చెప్పిన పది గుణములనే పేర్కొని లక్షణము లొసంగెను. అతఁడే కాదు పలువురు లాక్షణికులు వామనుఁడు చెప్పిన శబ్దార్థ గుణములు అసంకీర్ణములై లక్ష్య లక్షణ సమన్వితము లగుటచేఁ గాఁబోలు వానినే గ్రహించి అనుసరించుటయో, ఖండించుటయో కావించి యుండిరి.

గుణములు పదియని చెప్పినవారు కూడా వానిని నిర్వచించుటలో భిన్నాభిప్రాయములు ప్రదర్శించిరి. శ్లేషము, ప్రసాదము, మాధుర్యము, సౌకుమార్యము, సమత, అర్థవ్యక్తి, ఉదారత, కాంతి, ఓజస్సు, సమాధి అనునవి యా పది గుణములు.

1. శ్లేషము : సంధిని గూడి పదములొకే పదముగా నొప్పారినచో శ్లేషము. సంధిని గూడుట వలననే కాక యేకస్థానీయములగు వర్ణములధికముగా నుండుట వలన ఏకపదముగా భాసించునప్పుడు కూడా శ్లేషమే. దీనిని విద్యానాథుఁడు శ్లిష్ట పదత్వ మనియు వామనుఁడు మసృణత్వ మనియుఁ జెప్పియుండిరి.

ఉదా॥ "ఆలావణ్య మగణ్య, మాగుణగణం బవ్యాజ, మాతేజ ము
ద్వేలం, బావినయం బమేయతర, మావీర్యం బనిర్వాచ్య మా
యాలాపం బతిసత్య, మావితరణం బాశాంత విశ్రాంత, మా
శీలం బార్జవయుక్త,మెన్నఁదరమే శ్రీనారసింహాధిపున్".

2. ప్రసాదము : ప్రసిద్ధార్థములైన పదములతోఁ గూడి యుండుట ప్రసాదము. ఎచ్చట పదములు ఝటిత్యర్థ సమర్పకములై యుండునో అచ్చట ప్రసాదగుణ ముండును. వామనుఁడు బంధ శైథిల్యము ప్రసాదమని నిర్వచించి అది ఓజోగుణ మిశ్రితమై యుండవలెనని తెల్పెను.

ఉదా॥ "ముంగిట పెన్నిధాన, మిలుముందట కల్పక, మర్థికోటి ముం
గొంగుఁబసిండి, చెంగటన కూడిన బంగరు కొండ, దొడ్డిలో
నంగలకామధేను, వదనం బెరయీగలు లేని చొక్కపుం
దంగేటిజున్ను నీవితరణంబు నృసింహ నృపాల శేఖరా".

3. మాధుర్యము : వాక్యమునందలి పృథక్పదత్వము మాధుర్యము. దీర్ఘ సమాసములు లేకుండ సరసములైన పదములను గూర్చుచో మాధుర్య గుణ మొప్పారును. సరసములైన వాక్కులు గలిగియుండుట మాధుర్యమని దండి గావించిన నిర్వచనము.

ఉదా॥ "పంకజపాణి శంఖ పరిభావక కంధర తల్లి యేలొకో
సంకులు గట్టె నంచుఁ గులశైల సుతాగ్రణి ప్రాయఁద్రోచిర
త్నాంకిత హారముంప బరువానునో బిడ్డకివేల కర్కశా
లంకృతులంచు హల్లక కలాపము లుంచు నదీలలామయున్".

4. సౌకుమార్యము : సుకుమారాక్షత ప్రాయమైనది సౌకుమార్యము. సుకుమారత్వ మనఁగా సానుస్వార కోమల వర్ణత్వము. "అరయఁగ బొట్టు పిఱుందల నరుఁదగునది

సౌకుమార్యమగు" నని నరసభూపాలీయము. అనిష్ఠు రాక్షర ప్రాయమైనది మాధుర్య మని దండి నిర్వచనము. అర్థమునందపారుష్యము కూడా సౌకుమార్యమే.

ఉదా॥ "చెందొవ విందు మందువలెఁ జిందు రుచిం దగఁ జందనంబువె
చ్చందన మొందు, నిందుముఖి చందము డెందమునం దలంప నీ
యందము నందె నందనమునందు మిళిందము పొందు పొందికం
జెందె, నృసింహ! కౌఁగిటను జేర్పుము, ముందుగ మందగామినిన్"

5. సమత : నాల్గు పాదములందు లలితమగు నర్థము కాని శబ్దబంధము కాని యొకే విధముగాఁ గూర్పఁబడుచో నది సమత. వైషమ్యము లేకుండఁ జెప్పుట సమతయని ప్రతాపరుద్రీయము. మార్గాభేదము (అనఁగా మొదట నుపక్రమించిన మార్గమునే తుది దాఁక విడువకుండుట) సమత యని వామనుఁడు, అవిషమ బంధత్వము సమత యని దండి నిర్వచనము, విద్యానాథుని నిర్వచనము నిదియు నొక్కటే.

ఉదా ॥ శరవేగములు లేవె చలయంత్ర పాఠీన
పాటన క్రియకు నేర్పడవు గాక
చాతుర్యములు లేవే శారదా భండార
చోరకార శ్రీకిఁ జొరవుగాక"

6. అర్థవ్యక్తి : సంపూర్ణ వాక్యత్వ మర్థవ్యక్తి. అర్థ ప్రతిపాదనమున వాక్యము నిరాకాంక్షమై పరిపూర్ణమై యుండుట అర్థవ్యక్తి యగును. అర్థముననేయత్వ మర్థవ్యక్తి యని దండి. దీని కర్థదీపన మనియు మఱియొక పేరు.

ఉదా॥ "నరసభూపాలా! లోకమునందలి యేనుఁగుల నన్నిటిని ఐరావత సదృశముగను, గుఱ్ఱములనెల్ల నుచ్చైశ్రవ స్సదృశములుగను, చెట్ల నెల్లఁ గల్పవృక్ష సదృశములుగను, నదుల నెల్ల గంగా సదృశములుగను, జేసి స్వర్గ సృష్టికి బ్రతిసృష్టి చేయు కీర్తి కౌశిక గోత్ర పావనుఁడవైన నీకే తప్ప నన్యనృపులకుఁ దగునా?"

7. ఔదార్యము : వికటాక్షర బంధత్వ మౌదార్యము. ఇది యున్నచోట పదవిన్యాసము నర్తన బుద్ధి నుత్పాదించుచు నాయా యర్థముల స్ఫురింపఁ జేయుచుండును. ఉత్కృష్ట

గుణములతోఁ గూడిన వాక్కు గలిగి యుండుట యుదారత యని దండి కతిపయ సంయుక్తాక్షర వితత మౌదార్య మగునని నరసభూపాలీయము.

ఉదా॥ లలితంబులగు మట్టియల చప్పు డింపార
నంచకై వడి నడ నల్ల వచ్చి"

8. కాంతి : అత్యుజ్జ్వల బంధత్వము కాంతి. "విమల విచిత్రాయత వర్ణావృత్తులు గల యతిమృదు బంధంబు కాంతియగు" నని నరసభూపాలీయము. దండి దీనిని లౌకికార్థా శ్రయణత్వమని నిర్వచించెను. ఇది లేనిచోఁ గవి కావ్యము పురాతన చిత్రస్థానీయ మగును.

ఉదా॥ "ననయమ్ము వానిఁ గన్న నయమ్ము గల యింతి
ననయమ్ముఁ దాల్చు వానన్నఁ దెగడి"

"నన + అమ్ము + వానిన్ = మన్మథుని; వాని + అన్న = వానన్న, లక్ష్మీదేవిని సతతము దాల్చు కృష్ణుని యన్నయైన బలరాముఁ దిరస్కరించి" యని కీర్తుల వర్ణనము.

9. ఓజస్సు : "విలసిత సమాస భరితోజ్జ్వల బంధం బోజమయ్యె" నని నరసభూపాలీయము. సమాసభూయస్త్వ మోజమని ప్రతాపరుద్రీయము. దండికూడ దీనినిట్లే నిర్వచించెను. వర్గాక్షరమునందలి ప్రథమ తృతీయ వర్ణములు వరుసగా ద్వితీయ చతుర్థ వర్ణములతోఁ గలసినను (చ్ఛగ్ఘ మొద.) రేఫయోగము కాని తుల్యాక్షర యోగము కాని (ర్క-క్క-ర్త-త్త) టవర్గాక్షరముల కాని శష వర్ణములు కాని దీర్ఘ సమాసములు కాని యున్నను గాఢబంధమైన ఓజోగుణ మేర్పడునని మమ్మటుఁడు.

ఉదా॥ "రాజమాత్రుండె వసుధాధిరాజ్యమకుట
నికట వికట మహానిల నికర సుకర
మధుకర కరంబి తాంఘ్రి పద్మ ద్వయుండు
సరస గుణహారి యోబయనరసశౌరి"

10. సమాధి : అన్య ధర్మముల నన్యత్ర ఆరోపించుట సమాధి. "అన్యగుణంబులు వేఱొక్కటిపై నలరింప సమాధియయ్యె" నని నరస భూపాలీయము. దండి కూడా సమాధికీ నిర్వచనమే యొసగి యుండెను. వామనుఁ డారోహావరోహక్రమము సమాధియని దెల్పెను.

ఆరోహమన గుర్వక్షరములును అవరోహమన లఘ్వక్షరములును అధికముగా నుండుట.

ఉదా॥ "అలబలీంద్రుని చేత నడుగు వెట్టఁగ నేర్చి
ధారాధరము చేత నీరు మోసి
ధరణిఁ బ్రోది వహించిన దాన కన్య
సకల యాచక బాంధవుల్ సంతసిల్ల
నీకరగ్రహణావాప్తి నెరసె నౌర
వైరి గజసింహ ! యోబయ నారసింహ."

ఇట నడుగు పెట్టుట, నీరు మోయుట అనునవి క్రమముగా బలికిని మేఘమునకును సంబంధించిన ధర్మములు. ఇవి దానకన్యయం దారోపింపఁబడినవి. వామనుని లక్షణమునకీ క్రింది పద్యమును లక్ష్యముగాఁ జూపవచ్చును.

"ఆ మందిడి యతఁ డరిగిన
భూమీసురుఁడరిగెఁ దుహిన భూధర శృంగ
శ్యామల కోమల కానన
హేమాఢ్య దరీ ఝరీ నిరీ క్షాపేక్షన్"

2. రీతులు :

విశిష్టమైన పదరచనకు రీతి యని పేరు. దేశమందలి యన్ని ప్రాంతముల వారును ఒకే విధముగా పదరచన కావింపరు. అది వారి వారి అభిరుచుల నాశ్రయించి యుండును. స్థానభేదముచే రీతులు మాఱుచుండును. గావున నాయాస్థానములను లేక దేశమును బట్టి రీతులకు నామము లేర్పడినవి. భామహునికి పూర్వము వైదర్భి, గౌడి అధమమని భావింపఁ బడుచుండె ననియుఁ దెలియుచున్నది. భామహుఁ డీయుత్త మాధమ భేదము నంగీకరింపక వక్రోక్తి యున్నచో నేరీతి యైనను గ్రహింపఁదగినదే యని వాక్రుచ్చెను. దండి రీతికి బదులు మార్గము, వర్త్మము, అను శబ్దములను వాడి యుండెను. అతఁడు వైదర్భి, గౌడి అను రెండు మార్గములనే గ్రహించి అవి గుణములచే నేర్పడుననియు, నలంకారములు కావ్య సౌంధర్యమును పెంపొందించు ననియు వాక్రుచ్చెను. రుద్రటుఁడు లాటీయ యను నాల్గవ రీతిని కూడ పేర్కొనెను. భోజుఁడు సరస్వతీ కంఠాభరణమున ఆఱు రీతులను వివరించెను.

అతఁడు రుద్రటుఁడు చెప్పిన నాలుగు రీతులకు మాగధి, అవంతి అను వానిని గూడ కలిపెను. శారదాతనయుఁడు ప్రతిపురుషుని బట్టియుఁ బ్రతివచనమును బట్టియు రీతులు భేదిల్లుచుండుననియు, కొందఱవి నూటైదు విధములని తెల్పినను ప్రధానముగ నాల్గింటిని మాత్రము అంగీకరింప వచ్చుననిఁయు దెల్పెను. గ్రంథ కర్తలను బట్టి రీతులేర్పడునని అతని యభిప్రాయము. కాని అది పొరపాటు. ఏలయన రీతులు రసానుకూలముగా నుండునే కాని కర్తలను బట్టి ఏర్పడవు. విద్యానాథుఁడును నరసభూపాల కర్తయు వామనమతము ననుసరించి మూఁడు రీతులనే గ్రహించిరి.

రీతి మతమును మొదట నెల్వరించినవాఁడు దండియే యైనను హేతువాద బలముతో దానిని సిద్ధాంతీకరించినవాఁడు వామనుఁడే. అతఁడు విశిష్టమైన అనఁగా గుణసహితమైన పదరచనయే రీతి యనియు, సన్నని దారములచే రజ్జు వేర్పడునట్లు గుణముల సముదాయముచే రీతి యేర్పడు ననియు, నదే కావ్యాత్మ యనియు నభిప్రాయపడెను. అతని మతమున రసమునకుఁగాక రీతికే ప్రాధాన్యము. ఆనంద వర్ధనుఁడు రీతివాదము నంగీకరింపక కావ్యమున కాత్మ వస్త్వలంకార రసరూపమైన ధ్వనియే యనియు శౌర్య ధైర్యాదిగుణము లాత్మ ధర్మము లైనట్లు మాధుర్యాది గుణములును వానిచే నేర్పడు రీతులును గూడ రస ధర్మములే యనియు వివరించెను. అతఁడు రీతిని సంఘటన యని పేర్కొని యది సాధారణముగా రసమును బట్టియే యుండినను ఒక్కొక్కప్పుడు వక్తృ వాచ్య ప్రబంధముల యౌచిత్యమును బట్టియు ఏర్పడు చుండునని తెలిపెను. ఇచ్చట వక్తృవాచ్య ప్రబంధముల యౌచిత్యమనఁగా వాని నాశ్రయించిన రసములని భావము. వక్తయనగా నాయకుఁడు. వాచ్య మనఁగా వర్ణనీయ విషయము. ప్రబంధమనఁగా కావ్యభేదము, నాయకులను, వర్ణనీయ విషయములను, ఆయా కావ్యభేదములను ఆశ్రయించిన రసముల కనుకూలముగా సంఘటన యుండవలెనని తాత్పర్యము. పాశ్చాత్యులలో గూడ డెమిట్రియన్ ముర్రే మొదలగువారు శైలి (style) వక్తృ వాచ్యముల ననుసరించి యుండునని దెల్పియుండిరి. కేశవమిశ్రుఁడు కూడ రీతులు తత్తద్ర సోపకారములై యే యుండవలయునని సూచించెను. పింగళి సూరన్న, "రస భావములకు నర్హంబుగ వైదర్భి మొదలైన రీతు లిమ్ముగ నమర్చి" యనునప్పుడు రీతులు రసభావానుకూలములుగనే యుండవలెనని భావించెను. కాని కొందఱు ప్రబంధ కర్త లాంధ్రమున నక్తృ వాచ్య ప్రబంధౌచిత్యముల కనుగుణముగా రీతులను సంఘటించి

యుండలేదు. వారు వానితో సంబంధము లేకుండగనే యన్ని సందర్భము లందును దీర్ఘ సమాసములను వాడి యుండిరి. కొందరు రౌద్రాదుల సందర్భమునగూడ సమానమైన రీతినే ప్రదర్శించిరి. ఇట్టి రచన అలంకారిక మతమును బట్టి దోషమే యగును. అచ్చటి యాయా రీతు లాయా రసములను వ్యక్తము చేయ సమర్థములై యుండకపోవుటయే యందుకుఁ గారణము.

విద్యానాథుఁడు ప్రతాపరుద్రీయమున గుణాశ్లిష్ట పద సంఘటనయే రీతి యని చెప్పినను అది రసానుకూలమై యుండవలెనని నిర్దేశించి యుండలేదు. దండి వామనులు గుణరీతి వాదముల నంగీకరించిన వారే కాని రస ప్రాధాన్య వాదులు కామిచే గుణములను గాని వానిచే నేర్పడు రీతులను గాని రసములతో మేళవించి యుండలేదు. కాని రసధర్మములైన గుణములును వానిచే నేర్పడు రీతులును రసానుగుణములుగనే యుండుట యుక్తము.

వైదర్భి, గౌడి, పాంచాలి అని రీతి మూఁడు విధములు. బంధ పారుష్య రహితయు శబ్ద కాఠిన్య వర్జితయు. నాతిదీర్ఘ సమాసియునగు రీతి వైదర్భి, ఈ రచన యందు సమాసము లుండనే యుండవు. ఉన్నను నాతిదీర్ఘములుగా నుండును.

ఉదా॥ "ఆడుదానియెదుట – నదిగాక యేలిక
రాణియెదుట నమరవాణి తనకు
నసిగ రాని వెలితి సర్వంసహాపతి
యెదకు వాఁడికత్తి పదను కోఁత". ఆంధ్రపురాణము.

ఇందు బంధ పారుష్యముగాని, శబ్ద కాఠిన్యము కాని, దీర్ఘ సమాసములు గాని లేమిచే నిది వైదర్భీరీతి. పరుషాక్షరములతోడను దీర్ఘ సమాసములతోడను గూడిన రీతి గౌడి. ఇది ఓజః కాంతి గుణములచే నేర్పడును.

ఉదా॥ అంభోరాశి గభీర ! యోబయ నృసింహా! నిరణోదస్తదో
స్తంభోత్తంభిత జృంభితాసి లతికా సంరంభ సంభావనా
దంభానర్గళదుర్గ దుర్గమ మదోద్యద్దుష్ట ధృష్టారిరా
ట్పుంభ చ్చుంభ నిశుంభ సంభ్రమ హర స్ఫూర్తిన్ విడంబించురా"

ఇది పరుషాక్షరబంధముతోడను, దీర్ఘసమాసముల తోడను గూడి యుండుటచే గౌడి. వైదర్భీ గౌడీ రీత్యుభయ లక్షణములను అనఁగాఁ గొంత మృదు రచనయుఁ గొంత పరుష రచనయుఁ గలది పాంచాలి.

ఉదా॥ చేసెడి చేఁతలందుఁ గవిసింహుని దీవన లూఁత మీయఁగ
వ్రాసెడి వ్రాఁత లందు నృప వల్లభు నాదృతి మూదలింపఁగా
జేసెను నన్నిభట్టు రస సింధు మహేంద్ర కవిత్వ రాజ్యమున్
వ్రాసెను రాజ రాజు గుణవత్పరిపాలన కావ్యబంధమున్."

ఆంధ్రపురాణము.

ఇందు ప్రథమార్థమున మృదు బంధముతోఁ గూడిన వైదర్భియు ద్వితీయార్థమున పరుషబంధముతోఁ గూడిన గౌడియు, గలసియుండుటచే నిది పాంచాలీరీతి.

ప్రతాపరుద్రీయము శృంగార కరుణము లతిసుకుమారము లనియు, రౌద్ర బీభత్సము లత్యుద్భటములనియు, హాస్య శాంతాద్భుతములు కించిత్సుకు మారములనియు, వీరభయానకము లీషత్ప్రౌఢములనియు నాయా రసముల స్వభావములను దెలిపియుండెను. దీనిని బట్టి శృంగార కరుణములకు వైదర్భీరీతియు, రౌద్ర బీభత్సములకు గౌడీరీతియు, దక్కిన రసములకు పాంచాలీరీతియు మిక్కిలి యనుకూలములుగా నుండునని భావింప వచ్చును.

3. వృత్తులు :

వ్యవహారమే వృత్తియని అభినవగుప్తుడు నిర్వచించెను. వ్యవహార మనఁగా నాయికా నాయకాదుల వ్యాపారము. సరస్వతీ కంఠాభరణ వ్యాఖ్యలో రత్నేశ్వరుఁడు కూడ "చిత్తమునకు వికాసవిక్షేప వికాసములు కలిగించు వ్యాపారమే వృత్తి" యని నిర్వచనము కావించెను. ఈ వ్యాపారము శబ్దాశ్రితము అర్థాశ్రితము అని రెండు విధములు. శబ్దాశ్రిత వ్యాపారము శబ్దవృత్తి. అర్థాశ్రితమైన దర్థ వృత్తి. శబ్దవృత్తి – అభిధాదివృత్తులు, ఉపనాగరికాది వృత్తులు అని రెండు విధములు. వీనిలో అభిధాది వృత్తులు ధ్వని సోపానమున వివరింపఁబడినవి. ఉపనాగరికాది వృత్తు లిప్పుడు వివరింపఁబడును.

ఉద్భటునను సరించి ఉపనాగరిక, పరుష, గ్రామ్య లేక కోమల అనునవి మూఁడును ఉపనాగరికాది వృత్తులు. ఇవి మొదట అనుప్రాసము నాశ్రయించి యుండెను. ఇచ్చట

వృత్తి అనఁగా నియతములైన వర్ణములందుండు రసవిషయ వ్యాపార మని యర్థము. రుద్రటుని మతము ననుసరించి మధుర, పరుష, ప్రౌఢ, లలిత, భద్ర అని వృత్తులైదు విధములు. మమ్మటుఁడుద్భటుఁడు చెప్పిన మూఁడు నాగరికాది వృత్తులను వామనాదుల వైదర్భి గౌడీ పాంచాలీరీతులలో నంతర్భవింపఁ జేసెను. అభినవ గుప్తుఁడు రీతులు గుణములందే పర్యవసించు ననియు వృత్తిరీతులు గుణవ్యతిరిక్తములు కావనియుఁ దెలిపి ఆనందవర్ధనుఁ డంగీకరించిన మాధుర్యము ఓజస్సు ప్రసాదము అను మూఁడు గుణములలోనే రీతివృత్తు లంతర్భవించునని పలికెను. గుణములు శబ్దాశ్రితములు; రీతులు గుణసమష్టి రూపములు. రీతులవలె ఉపనాగరికాది వృత్తులును శబ్దాశ్రితములే అగుటచే నా రెండును అభిన్నములే యనుటకు సందేహింప నక్కఱలేదు. జగన్నాథుఁడు కూడ పండితులు రీతినే వృత్తియని వ్యవహరింతురనియు, వాని నిర్మాణమున కవులు మిక్కిలి శ్రద్ధ వహింపవలెననియుఁ దెలిపెను. అందుచే నాయా రసములకుఁ దగినట్లుగా కావ్యముల నిరూపింపఁబడు మాధుర్యాది గుణములందే రీతులును ఉపనాగరికాది వృత్తులును అంతర్భవించునని చెప్పవచ్చును.

అర్థవృత్తులు : ఇచ్చట నర్థమనఁగా నభిధేయము కాదు. దానికి రసమని కాని రసవంతమైన కావ్యఘట్టమని కాని యర్థము చెప్పవలయును. వృత్తియనఁగా వ్యాపారము కావున అర్థవృత్తి యనఁగా రసోచితమైన వ్యాపారమని తెల్లమగును. అభినవగుప్తుఁడు కూడ "రసోచిత ఏవ చేష్టా విశేషః వృత్తిః" అని నిర్వచించి యుండెను. కావ్యములందు నాయకాదులు రసానుకూలముగాఁ జేయు వ్యాపారమే (Action) వృత్తి. అది రీతివలె రచనాశ్రయము కాదు. నటనాశ్రయము, రీతివృత్తులకు మఱొక భేద మేమన వృత్తులు నాట్యాశ్రయము లగుటచే సాక్షా ద్రసోపస్కారకములు రచనాశ్రయములును గుణసమష్టి రూపములు నగు రీతులట్లుగాక పరంపరగా రసోపస్కారములు ఏలయన అవి వృత్తులను స్ఫుటీకరించి తద్ద్వారా రసోపస్కారము లగును. రీతులు వాచికాభినయ రూపములు; వృత్తులాంగికాభినయ రూపములు వాచికాభినయముతోఁ గూడిన ఆంగికాభినయమే అనఁగా రీతులచే స్ఫుటీకరింపఁ బడిన వృత్తులే సహృదయులకు రసస్ఫూర్తి కలిగించును. రీతివృత్తులీ విధముగా పరస్పరాశ్రయములు.

వృత్తుల సంఖ్య విషయమునఁకూడ భిన్నాభి ప్రాయములున్నవి. భరతుఁడు కైశికి, ఆరభటి, సాత్వతి, భారతి అను నాల్గు వృత్తులను బేర్కొని భారతీ వృత్తినటాశ్రయమైన వాగ్వ్యాపార

మని చెప్పియుండెను. వాగ్వ్యాపారమనఁగా శబ్దవృత్తియే కదా. దీనిని బట్టి అతఁడు భారతిని, శబ్దవృత్తిగను కైశిక్యాదులు మూఁడింటిని అర్థవృత్తులుగను భావించెనని తెల్లమగుచున్నది. సింగభూపాలుఁడు కూడ వృత్తులు నాల్గింటిలో భారతి శబ్దవృత్తి యనియు, మిగిలిన వర్థవృత్తులనియు నభిప్రాయపడెను. విద్యానాథుఁడు భారతీ వృత్తిని గూడ నర్థవృత్తిగా గ్రహించి మొత్తమర్థవృత్తులు నాలుగని చెప్పెను. సాహిత్య దర్పణకారాదులు కూడ నాల్గు వృత్తులనే గ్రహించిరి. ప్రకాశవర్షుఁడు భరతుఁడు చెప్పిన వృత్తులకును లలితయను మఱొక దానిని గూడఁజేర్చి అది సర్వార్థ విషయమును, నానామార్గ విసారిణియు, కవిచిత్త హారిణియు నని నిర్వచించెను. కొందఱి మతమున లలిత యనునది మిశ్రవృత్తి. సింగభూపాలుఁడు మిశ్రవృత్తుల నంగీకరింపలేదు. ఉద్భటుఁడు న్యాయ చేష్టావృత్తి, అద్యాయ చేష్టా వృత్తి, ఫల సంవిత్తి వృత్తి అను మూఁడును ప్రధానములనియు అవాంతర భేదములచే నవి పదునా ఱగుననియు తెల్పెను. కొందఱు మధ్యమ కైశికి, మధ్యమారభటి అను మఱి రెండు వృత్తి భేదములను సూచించిరి. ఇవి ఆరభటి కైశికీ వృత్తి భేదములేకాని ప్రత్యేక వృత్తులు కావు.

అర్థవృత్తులు మొదట దృశ్యకావ్యాశ్రయములుగనే భావింపఁబడినట్లు కానిపించును. అప్పుడది నాట్యవ్యాపారము అగును. తరువాత నాలంకారికులు వానిని శ్రవ్య కావ్యములకుఁ గూడ నన్వయించిరి. అందుచేతనే ఆనంద వర్ధనాచార్యుఁడు వృత్తులు రసాదితాత్పర్యముచే సన్నివేశములై నాట్యమునకును గావ్యమునకును అనిర్వాచ్యమైన శోభ నాపాదించునని వేఱు వేఱుగాఁ జెప్పియుండెను. విద్యానాథుఁడిత రాలంకారికులవలె వృత్తులకు ప్రయోక్తృ నైపథ్య భాషాదులు తెలిపియుండక పోవుటచే వానిని శ్రవ్య కావ్య సంబంధులుగానే భావించినట్లు కనిపించును.

“ఈషన్మృద్వర్థ సందర్భ” యని విద్యానాథుఁడు భారతి కిచ్చిన నిర్వచనము. ఇంచుక మృదువైన అర్థ సందర్భము కలది భారతియని అతని యభిప్రాయము. భరతుఁడు దీనిని వాగ్వ్యాపారమని పేర్కొనెను. రీతులు కూడా వాగ్వ్యాపారములే. అవి పదరచనాశ్రయములు. అవి వ్యక్తులను స్ఫుటీకరించును. కావున వైదర్భి, గౌడి, పాంచాలి అను మూడు రీతులకు మూఁడే వృత్తులుండునని చెప్పుట యుక్తముగా నుండుననియు, వాగ్వ్యాపారమైన భారతీ వృత్తియే మూఁడు రీతులయ్యెనని భావించుట సమంజసమనియు శ్రీసన్నిధానము సూర్యనారాయణ శాస్త్రులవారి అభిప్రాయము.

1. కైశికి : అత్యర్థ సుకుమారార్థ సందర్భము కలది కైశికి. ఇది అత్యంత సుకుమారములైన శృంగార కరుణ రసములందు ప్రయోగింపఁబడును. ఇది రుచిర వస్త్రాలంకారాది భూషితము, కామోపభోగ జన్యము, వివిధ నృత్తగీత సముపేతము, స్త్రీ పాత్రయుక్తము నైన లాస్యాంగము.

ఉదా॥ "తిన్ననిమేను, గన్నుఁ గవతేటలుఁ, దేనియ లొల్కు మాటలున్
సన్నపుఁ గౌను, గుందనపుఁ జాయలు దేఱు మెఱుంగుఁ జెక్కులున్
గ్రొన్నెలవంటి నెన్నుదురు, గుబ్బచనుంగవ తళ్కుచూపులున్
జెన్నెసలారఁ గన్య నరసింహునిఁ జూచె విలాస ధన్యయై"

2. ఆరభటి : అత్యుద్ధతార్థ సందర్భము కలది ఆరభటి. ఇది అత్యుద్ధతములైన రౌద్ర బీభత్సరసము లందు ప్రయోజ్యము, ఇది మాయా యుద్ధదంభోక్తి సంయుతమైన తాండ వాంగము.

ఉదా॥ "ప్రతిపక్ష క్ష్మాప వక్షః ఫలక విదళన ప్రౌఢగాఢ ప్రతాప
ప్రతిభా సంరంభ గుంభ ప్రబల సుబల శుంభ న్నృసింహో గ్రరంహో
యుతమై కల్పాంత దృప్యద్ద్యుమణి ధగధగ ప్రోద్యత జ్వాలజాల
ప్రతికూల ప్రక్రమంబై పరఁగు నరసభూపాలదోః ఖడ్గమాజిన్."

3. సాత్వతి : ఈషత్ప్రౌఢార్థ సందర్భము గలది సాత్వతి. ఇది ఈషత్ప్రౌఢములైన వీర భయానకములందుఁ బ్రయోగింపఁదగినది. ఇది హర్షాతిశయ విలసితము, సాత్త్వికాభినయ భూయిష్ఠమునై విలసిల్లును.

ఉదా॥ "ఉభయర గండ తావకరణోగ్ర జయానకముల్ గుభుల్ గుభుల్
గుభులని మ్రోయఁగా భవదకుంఠిత వీరభటుల్ ప్రభుల్ ప్రభుల్
ప్రభులని శత్రు భూపతులపై జొఱఁ బాఱునెడన్ విభుల్ విభుల్
విభులని సంభ్రమింపుదురు వేడ్క నఖర్వసుపర్వ భామినుల్."

4. భారతి : ఈషన్మృద్వర్థ సందర్భము గలది భారతి. భారతి హాస్య శాంతాద్భుతములందు ప్రయోజ్యము. ఇది స్త్రీ రహితము, వాచికాభినయ ప్రధానము. సంస్కృత పాఠ్య ప్రధానమునై యొప్పారును. ఇది శబ్దవృత్తి.

ఉదా॥ "సిరిమల కేగి, యీశు దరిశించి, సమంచిత భక్తిమైఁ దులా
పురుషము తూఁగి, విప్రజనముం బరితుష్ట మొనర్చి, మల్లికే
శ్వరకరుణా కటాక్షరస వాహినిఁ దోఁగిన వీరరుద్ర భూ
వరుఁడు మహేశభక్తులకు భక్తుఁడుగా నుతికెక్కె నెల్లెడన్."

ఆంధ్ర పురాణము

స్థూలముగాఁ జూచినప్పుడు వృత్తిరీతు లభిన్నములుగనే తోఁపవచ్చును. కాని వాని స్వభావమునందుఁ జాల భేదమున్నది. అర్థ భావ రసాశ్రయములై సాక్షాద్రస వ్యంజకములైనవి వృత్తులు. అర్థభావ వివేకమున్నఁగాని వీనిని నిర్ణయించుటకు వీలు లేదు. అర్థభావాపేక్ష లేకుండనే పదా శ్రమ గుణ సంకలన రూపములై పరంపరగా రసమును వ్యజింపఁ జేయునవి రీతులు. కేవల పద సంఘటనను బట్టియే వీనిని నిర్ణయింప వచ్చును.

4. శయ్యాపాకములు :

శయ్య యనఁగా పడక (సెజ్జ) అని సామాన్యార్థము. శయ్యనిమ్నోన్నతములు లేక సరిగా నున్నచో మానవ శరీరమునకు సౌఖ్య మొసంగును. అట్లే కావ్య శరీరమని చెప్పఁ దగిన శబ్దముల కూర్పు కూడ విషమముగాక సముచితముగా నుండుచో కావ్యమునకు సౌందర్యము చేకూర్చును. పదములకుఁ గల యుత్కృష్టమైన పరస్పరమైత్రి శయ్యయని విద్యానాథుఁడు శయ్యను నిర్వచించెను. (యాపదానాం వరాన్యోన్యమైత్రీ శయ్యేతి కథ్యతే). పదముల పొందికకే శయ్యయని పేరు. ఏ పదముల తరువాత నేపదములను వాడినచో శ్రవణ సుభగత్వమును అర్థవైశద్యమును కలుగునో వానిని వాడినప్పుడే సముచితమైన శయ్య యేర్పడును. అందు చేతనే భామహుఁడు "మాలాకారుఁ దేపూవు తరువాత నే పూవు గ్రుచ్చినచో సుందరముగా నుండునో లెస్సగా గ్రహించి మాలను గ్రుచ్చునట్లే కవి కావ్యమందు కూడా నవహితమతితో పదములను గూర్పవలయు" నని చెప్పి యున్నాడు.* కొన్ని శబ్దముల తరువాత కొన్ని శబ్దములను వాడినప్పుడే కూర్పు సుందరముగా నుండును. అర్థము సమానమే

---

* మాలాకారో రచయతి యథా సాధు విజ్ఞాన మాలాం
యోజ్యం కావ్యే ష్వవహితధియా తద్వదే వాభిదానమ్.

కదా యని పర్యాయ పదముల నిచ్చవచ్చినట్లు వాడినచో నా సౌందర్యమునకు భంగ మేర్పడును. నిండు మనంబు, పాదపల్లవములు, ముఖ పద్మము అను వానిని క్రమముగా పూర్ణమనంబు, పాద కిసలయములు, ముఖ నాళీకము అని చెప్పినదో నర్థమునందు మార్పులేక పోయినను కూర్పు నందలి సౌందర్యము తగ్గుచున్నది. దీనిని బట్టి పరివృత్తి సహింపని పదముల కూర్పువలన శయ్యయేర్పడునని చెప్పవచ్చును. మల్లినాథుఁ దేకావళీ వ్యాఖ్యలో పదముల పరివృత్తి వైముఖ్యమును, వినిమయా సహిష్ణుతయు శయ్య యని చెప్పఁబడునని తెల్పియుండెను.

గుణసమష్టి రూపమే రీతి యని యిదివఱకుఁ జెప్పఁబడినది. పరివృత్తి సహింపని విధమున గుణములను గూర్చుటయే శయ్య యగును. ఈ విధముగా శయ్యను రీతి ధర్మమని చెప్పవచ్చును. కాని రీతి యొక్కొక్కప్పుడు పదపరివృత్తిని సహించును. శయ్య సహింపదు. ఆ రెండింటికిని గల భేదమిదియే. శయ్యను శబ్దపాకమని చెప్పవచ్చును. "కావ్యవేత్తలు ఛాయ, ముద్ర, ఉక్తి, యుక్తి, గుంఫన మున్నగు వానిని శబ్దాలంకారము లందురు. అభిప్రాయ విశేషముచే కవిశక్తిని వివరించుచు నానందము నొసంగునది ముద్ర, మా మతమున నదే శయ్య" అని అగ్నిపురాణము చెప్పుచున్నది. నన్నయభట్టు తన కవిత్వమున నుందునని చెప్పిన అక్షర రమ్యత శయ్యకు సంబంధించినదే. పింగళి సూరన్న "పోసగ ముత్తెపు సరుల్ వోహళించిన లీలఁ దమలోన దొరయు శబ్దములు కూర్చి" అని చెప్పుట కూడ శయ్యా సౌభాగ్యము కొఱకే. ఆంగ్లేయ వివర్శకులు కూడ నీ శయ్య నంగీకరించిరి. వారు దీనిని పద ప్రయోగ సౌష్ఠవము (Felicity of expression) అందురు. వర్డ్సువర్తు సరియైన పదములను సరియైన స్థలమున వాడుటయే కవిత్వమని చెప్పియుండెను.

శయ్యను విద్యానాథుఁ డొక్కడు మాత్రమే పేర్కొని యుండెను. దండివామన మమ్మట విశ్వనాథ జగన్నాథాదులు దానిని వేఱుఁగా జెప్పియుండలేదు. విశ్వనాథుఁడు దానిని రీతులందే అంతర్భవింపజేసెను.

పాకములు : శయ్య శబ్ద ధర్మమైనట్లు పాకమర్థ ధర్మము. అర్థగంభీరిమ పాకమని విద్యానాథుని నిర్వచనము. శృంగారాదుల ఆస్వాద్యమానతావిశేషమని కుమార స్వామి సోమయాజి దీనికి వ్యాఖ్యానము చేసెను. కావ్యార్థములైన శృంగారాది రసముల ఆస్వాదము అవ్యవహితముగా జరుగవలెనన్న ఆ యర్థమును వ్యక్తము చేయు పదములు సరళసుందరములై యుండవలెను. అవి యట్లు లేనియెడల రసాస్వాదము విలంబితముగా జరుగును. రసోచిత

శబ్దార్థ నిబంధనము పాకమని ఏకావళీకారుని మతము. శ్రవణ సుధాస్యందిని యైన పదవ్యుత్పత్తి పాకమని కొందఱును, పదముల పరివృత్తి వైముఖ్యము పాకమని కొందఱును భావించుచున్న ట్లన్యమతములను గూడ నాతఁడు సూచించెను. పరివృత్త్యసహిష్ణువుగా పదములను గ్రుచ్చుటయే పాకమైనచో శయ్యకును దీనికిని భేదమే లేదని చెప్పవలసి వచ్చును. శయ్య కేవలము పదముల కూర్పునకు సంబంధించినది. పాకము పదముల కూర్పు వలన బోధపడు నర్థముల ఆస్వాదమునకు సంబంధించినది. నానా వస్తువుల కలయిక వలన పాకమునకు (వంటకు) లేక పానకరసమునకు రుచి భేదమేర్పడునట్లు గుణరీతి వృత్తుల సంయోగము వలన పాకమేర్పడును.

విద్యానాథుని మతమున ద్రాక్షాపాకము, నారికేళ పాకము అని పాకము రెండు విధములు. బహిరంతః స్ఫురద్రస మైనది ద్రాక్షాపాకము. అంతర్గూఢ రసోదయమైనది నారికేళ పాకము. ద్రాక్షాఫలము నాస్వాదించుటకు మనము ఎట్టి క్లేశమును బొందనక్కఱలేదు. ఫలము కోసి వెంటనే నోటిలో వేసికొని తద్రసము నాస్వాదింపవచ్చును. అందు పరిహరింపఁ వలసినది కూడ నేమియు నుండదు. మాధుర్యగుణ, వైదర్భీరీతి, కైశికీ వృత్తుల సంయోగముచే నిది యేర్పడును. నారికేళ ఫలము నాస్వాదించుట కొంత క్లేశకరము. చెట్టెక్కి ఫలమును గోసి పీచు తీసి కాయ పగులఁగొట్టి అందలి పదార్థమును బాగుగా నమిలినప్పుడు కాని తద్రసాస్వాదము కలుగదు. ఇందు పరిహరింపవలసిన దెక్కువగా నుండును. ఓజోగుణ గౌడీరీత్యారభటీ వృత్తుల సంయోగమున నిది యేర్పడును. విద్యానాథుఁడీ రెండు పాకములనే పేర్కొని మధుక్షీరాది పాకాంతరములను యథా సంభవముగా నూహించుకొనవలెనని చెప్పెను. కుమారస్వామి కదళీ రసాలాది పాకము లూహ్యములని చెప్పెను. పండితరాయలు పిచుమంద, బదరీ, మృద్వీకా, వార్తాక, తింత్రిణీ, సహకార, క్రముక, త్రాపుష, నారికేళ పాకములు తొమ్మిదింటిని పేర్కొనెను. ఈ విధముగా లోకమునందలి ఫలాదులను రుచి భేదములను బట్టి పాకభేదములను నిర్ణయించుచో వాని కానంత్యము కలుగును. అందుచే ద్రాక్షా, నారికేళ, కదళీ పాకములు మూఁడిటిని గ్రహించుట యుక్తము. కదళీ ఫలము నాస్వాదించుట ద్రాక్షాఫలాస్వాద మంత సుకరము కాని, నారికేళ ఫలాస్వాదన మంత క్లేశకరము కాని కాదు. ఫలము కోసి తొక్కతీసి దాని నాస్వాదింప వచ్చును. ఇందు పరిహరింప వలసినది తక్కువ. ప్రసాద గుణ, పాంచాలీ రీతి, సాత్వతీ వృత్తుల సంయోగముచే నిది యేర్పడును. మూఁడు రీతులకు, మూఁడు వృత్తులకు అనుగుణముగా మూఁడు పాకములను గ్రహింపనగును.

ద్రాక్షాపాకమునకు ఉదాహరణము :

"వాలికలై వెలిదమ్ముల
పోలికలై చందమామ పులుగులకును దా
మేలికలైన నిరీక్షణ
మాలికల నృసింహుఁ జూచె మదవతి వేడ్కన్"

పై పద్యములో వలె శబ్దాలంకారము గాని ప్రాస వైలక్షణ్యము కాని లేకపోయినను భావము సులభముగా గోచరించు నేపద్యమైనను ద్రాక్షాపాకమున కుదాహరణముగా గ్రహింపవచ్చును.

నారికేళపాకమునకు ఉదాహరణము :

"వరభూషాదులపై మనం బిడుక దృగ్వ్యాపార మెంతేఁ బర
స్పర సందర్శన నాతిభిన్నమయి చూపట్టంగఁ గార్యాంతర
స్మరణం బేమియు లేక నిశ్చలతనీ సాంగత్యముం గోరిమా
హరణీలోచన యాత్మ యందు నరసింహా నిన్నె భావించెరా."

ఇందలి భావము క్లిష్టమై విలంబితముగా బోధపడుచున్నది.

కదళీపాకమునకు ఉదాహరణము :

"ఏలా బ్రహ్మపదంబు వేదములకున్ వీక్షింపఁగా రాని ని
న్నీ లోకంబున నీ వనాంతరమందీ మందలోఁ గృష్ణ యం
చాలాపాది సమస్త భావములు నీ యందే సమర్పించు నీ
వ్రేలం దొక్కని పాదరేణువులు పై వేష్టించినం జాలదే'

భాగవతము

ఇందలి భావ మించుక క్లిష్టమై యున్నది.

5. దోషములు :

శబ్దార్థ గుణరీతి వృత్త్యలంకార రసభావాదుల నన్నింటిని కావ్య సామగ్రి యని చెప్పవచ్చును. ఇవన్నియు నిర్దోషములై యుండినప్పుడు కాని కావ్యపరమ ప్రయోజనమైన

రసానందము చేకూరఁజాలదు. దీపము ప్రక్కనే నీడ యుండునట్లు పైని పేర్కొనఁబడిన కావ్యాంశము లన్నింటిని అంటి దోషములు ప్రవర్తిల్లుచుండును. ఆ దోషములను తొలఁగించి కావ్యము ననవద్యముగా నొనరించుటకు వాని స్వరూపమును గూడ చక్కగా నెఱుఁగ వలసి యున్నది. ప్రాచీనులు కొందఱు అదోషములు, సగుణములు, సాలంకారములునైన శబ్దార్థములు కావ్యమనియు, అదోషము గుణవంతమునైనది కావ్యమనియు కావ్యమును నిర్వచించి యుండిరి. వారి యుద్దేశమున గుణ సాహిత్యము వలెనే దోషరాహిత్యమును కావ్యమునందు తప్పక యుండవలయును. దండి "కావ్యమున స్వల్పమైన దోషమునుఁ గూడ నుపేక్షింపరాదు. శరీరమెంత సుందరమైనను ఒక్క బొల్లి మచ్చ యున్నచో దుర్భరమగు" * నని పల్కి, కావ్యమున చిన్నదైన దోషముకూడా నుండరాదని సూచించెను. ఇది కొంత అతివాదము. ఏలయన, దోషము లేని కావ్యము లోకమున నుండనే యుండదు. మహాకవుల కావ్యములందుఁ గూడ నచ్చటచ్చట దోషములు గోచరించును. అంత మాత్రముననవి కావ్యములు కాకపోవు. వానియందా దోషములను మఱుఁగుపుచ్చు రసవత్త్వముండును. దీనిని బట్టి రసమునకపకర్ష కలిగింపని దోషములవలన కావ్యత్వమునకు భంగము వాటిల్లదనియు రసాపకర్షకము లగునవే నిజమైన దోషములనియుఁదెలియ వచ్చును. అందు చేతనే సాహిత్య దర్పణ కారుఁడు రసమున కపకర్ష కలిగించునవి దోషములు (రసాపకర్షకా దోషాః) అని దోషములను నిర్వచించి యుండెను.

భరతుఁడు గుణములను నిర్వచించుచు దోష విపర్యయములు గుణము లని చెప్పెను. వామనుఁడు ఆ నిర్వచనమునుతలక్రిందులు చేసి గుణ విపర్యయాత్మకములు దోషములు (గుణవిపర్య యాత్మానో దోషాః) అని వ్యక్తము చేసెను. కాని గుణ విపర్యయ రూపములే కాక కేవలము దోషములు కూడఁ గొన్నియున్నవి. అందుచే వామనుని నిర్వచనము సమగ్రమైనది కాదు. విద్యానాథుఁడు కావ్యాపకర్ష హేతువు దోషమనియు (దోషః కావ్యా పకర్ష స్య హేతుః) నది శబ్దార్థ గోచర మనియు వాక్రుచ్చెను. శబ్దార్థ గతమైన దోషమే కావ్యాపకర్ష హేతువగు నపుడు రసగతమైన దోషము కావ్యమున కపకర్ష కలిగించునని వేఱుగాఁ జెప్పనక్కఱలేదు. నిజమునకు రసాపకర్షక మైనదే దోషము అది కావ్యమున నవశ్యము పరిహరింప దగినది.

---

* తదల్ప మపి నోపేక్ష్యం కావ్యే దుష్టం కథంచన
న్యాద్వపు స్సుందర మపి శ్విత్రేణై కేన దుర్భగమ్.

శబ్ద పరివృత్తిని సహింపని దోషము శబ్ద దోషము. ఇచ్చట దోషము శబ్దమునందే యుండును. ఆ శబ్దమును దొలగించి దాని స్థానమున సమానార్థకమైన మఱొక శబ్దము నుంచినచో నా దోషము తొలఁగును. అర్థదోషము శబ్దపరి వృత్తిని సహించును. అనఁగా నొక శబ్దమును దీసివైచి వాని స్థానమున సమానార్థకమైన మఱొక శబ్దము నుంచినను ఆ దోషము తొలఁగదు.

అర్వాచీనులైన లాక్షణికులు కొందరు ముఖ్యార్థహతి దోషమని తలంచిరి. ముఖ్యార్థమనఁగా నేమి యని చర్చించి వారు కావ్యమున కాత్మ భూతమైన రసమే కాక దానికాశ్రయ మగుటచే వాచ్యార్థము ముఖ్యమేయని నిర్ణయించిరి. రసవంతమైన కావ్యము ఉద్దేశ్యము రసము. నీరసమైన కావ్యమున చమత్కారమును కలిగించు వాచ్యార్థమే ఉద్దేశ్యము. హతి యనఁగా నపకర్షము. ఉద్దేశ్యములైన రస వాచ్యార్థముల కపకర్షకలిగించునవి దోషములగుటచే పై నిర్వచనము ఉద్దేశ్య ప్రతీతి విఘాతుకము దోషమను రీతిని సవరింపఁబడినది. ఈ యపకర్షము రసవాచ్యార్థములందు వలెనే తదుపకారకములైన శబ్దము లందును రచన యందు గూడ నుండవచ్చును. అందుచేతనే సాహిత్య దర్పణమున దోషములు పదమునందు, తదంశమునందు, వాక్యమునందు, రసము నందుఁగూడఁ బ్రవర్తిల్లు చుండునని చెప్పఁబడినది.

దోషము లెన్నియను విషయమున మత భేదములున్నవి. భరతుఁడు దోష విపర్యయములు గుణములని దోష ప్రాధాన్యము నుగ్గడించుచుఁ దెల్పి శబ్దార్థగత విభాగము చేయక మొత్తము పది దోషములను బేర్కొనెను. దండి కూడనట్లే పది దోషములను జెప్పెను. కాని భరతుఁడు పేర్కొన్న దోషములకును అతని దోషములకు నామములందే కాక లక్షణ నిర్వచన మందును గొంత భేదము కనఁబడును. వామనుఁడు దోషములు కావ్య సౌందర్యాపకర్షములని సూచించి మొత్తమిరువది దోషములు నిరూపించినాఁడు. అందుపద దోషములైదు పదార్థదోషములైదు. వాక్యదోషములు మూఁడు, వాక్యార్థదోషము లేదు. భామహుఁడు భరతుఁడు చెప్పిన పది దోషములను వివరించెను. రుద్రటుని మతమున దోషములు శబ్దగతములు, అర్థగతములు. అవి ప్రధానముగా రెండు విధములు. శబ్ద దోషములలో పద గతము లాఱు. వాక్యగతములు మూఁడు. అర్థదోషములలో అర్థదోషములు తొమ్మిది, ఉపమా దోషములు నాలుగు మొత్తమిరువది రెండు.

పూర్వులు శబ్దార్థ దోషముల నలంకార దోషములతోఁ గలిపి వివరించినట్లు

కనిపించును. ధ్వని మతము ప్రచురమైన పిమ్మట గుణములు రసోత్కర్షకును దోషములు రసాపకర్షకును హేతువులను నభిప్రాయము వ్యాపించెను. అర్వాచీనులు శబ్దార్థదోషములతో పాటు రస దోషములను గూడ గుర్తించి ఈ మూఁడు విధములైన దోషములను రసంభంజకములని నుడివిరి. అందు కొందఱు మఱియు సూక్ష్మ విభాగము కావించి పద, పదాంశ, వాక్యార్థ, రస దోషములని దోషముల నైదు విధములుగా వింగడించిరి. ప్రతారుద్రీయమున మొత్త మఱువది దోషములు వివరింపఁబడినవి. అందు పదదోషములు 17, అర్థదోషములు 18, వాక్యదోషములు 24, రసదోషము (రసభావాదులకు స్వశబ్దవాచ్యత) 1, కావ్య ప్రకాశము ననుసరించి పదదోషములు 17, వాక్యదోషములు 16, అర్థదోషములు 23, రసదోషములు 10, మొత్తము దోషము లఱువది యాఱు. సాహిత్యదర్పణము ననుసరించి పద వాక్య దోషములు 16, వాక్య మాత్ర దోషములు 23, అర్థదోషములు 21, రసదోషములు 15. ఈ 75 దోషములతోపాటు కొన్ని అలంకార దోషములు గూడ నందు చెప్పఁబడినవి. ఇవి గాక వేఱుదోషములు కూడ కనఁబడినచో వానిని గూడ నెరుఁగ వలెననియు నౌచిత్యము ననుసరించి కొన్ని దోషముల కదోషత్వమును గుణత్వమును, అనుభయాత్మకత్వమును గ్రహింపఁ దగు ననియు సాహిత్య దర్పణకారుఁడు నుడివి యున్నాడు.

దోషములన్నియు నిత్యములనియు ననిత్యము లనియు రెండు విధములు. నిత్యదోషము లెప్పుడును దోషములే (చ్యుతసంస్కారాదులు) వీని నేవిధముననను సమర్థించుటకు వీలులేదు. అనిత్యదోషము లెల్లప్పుడు దోషములు కానేరవు. కొన్ని యెడల నవి గుణములే యగును. పరుషము శృంగారాదు లందు దోషమే యయ్యును రౌద్రాదులందు గుణమే. అట్లే అప్రయుక్తాదులు శ్లేషాదులందు దోషములుకావు. ఇట్టివి అనిత్య దోషములు, లాక్షణికులు చెప్పిన పెక్కు దోషములు నిత్యములే.

సాహిత్యదర్పణము పేర్కొన్న దోషములిచ్చుటఁ బేర్కొనఁబడుచున్నవి. వీని లక్షణముల నందుండియేగ్రహింపఁదగును.

పదవాక్య దోషములు 16 : 1. దుశ్శ్రవత్వము; 2. మూఁడు విధములైన అశ్లీలత; 3. అనుచితార్థము; 4. అప్రయుక్తత; 5. గ్రామ్యత; 6. అప్రతీతత్వము; 7. సందిగ్ధత; 8. నేయార్థత, 9. నిహతార్థత; 10. అవాచికత; 11. క్లిష్టత్వము; 12. విరుద్ధమతి కారిత్వము; 13. అవిమృష్ట విధేయాంశత; 14. నిరర్థకత; 15. అసమర్థత; 16. చ్యుత సంస్కారత్వము.

వాక్య మాత్ర దోషములు 23 : 1. అక్షర ప్రతికూలత్వము; 2. లుప్త విసర్గత్వము; 3. అహత విసర్గత్వము; 4. అధిక పదత్వము; 5. న్యూనపదత్వము; 6. కథిత పదత్వము; 7. అహతవృత్తత; 8. పతత్ప్రకర్షత్వము; 9. సంధి విశ్లేషత; 10. అశ్లీలత; 11. కష్టత్వము; 12. అర్థాంతరైక పదత్వము; 13. సమాప్తపునరాత్తత; 14. అభవన్మత సంబంధము; 15. అక్రమత్వము; 16. అమతపదార్థత; 17. వాచ్యానభిధానత్వము; 18. భగ్న ప్రక్రమత; 19. ప్రసిద్ధి త్యాగము; 20. అస్థానస్థ పదత్వము; 21. అస్థానస్థ సమాసత్వము; 22. సంకీర్ణత; 23. గర్భితత్వము.

అర్థదోషములు 21 : 1. అపుష్టత్వము; 2. దుష్క్రమత; 3. గ్రామ్యత; 4. వ్యాహతత్వము; 5. అశ్లీలత్వము; 6. కష్టత్వము; 7. అనవీకృతత్వము; 8. నిర్హేతుత్వము; 9. ప్రకాశిత విరుద్ధత; 10. సందిగ్ధత; 11. పునరుక్తిత్వము; 12. ప్రసిద్ధ విరుద్ధత; 13. విద్యా విరుద్ధత; 14. సాకాంక్షత; 15. సహచర భ్రష్టత; 16. అస్థానాయుక్తత; 17. అవిశేష విశేషత్వము; 18. అనియమ నియమత్వము; 19. విశేషా విశేషత్వము; 20. నియమానియమత్వము; 21. నిర్ముక్తపునరుక్తత్వము.

రసదోషములు 15 : 1. రసమును స్వశబ్ద వాచ్యము చేయుట; 2. స్థాయి భావమును స్వశబ్ద వాచ్యము చేయుట; 3. సంచారి భావమును స్వశబ్ద వాచ్యము చేయుట; 4. విరోధి రసముల కంగములగు విభావాదుల గ్రహించుట; 5. అనుభావవిభావముల ఆక్షేపము; 6. అనుభావ విభావ కష్ట కల్పనము; 7. అకాండ ప్రధనత; 8. అకాండచ్ఛేదత; 9. రసమునకు పునఃపునఃదీప్తి కల్గించుట; 10. అంగిరసమును పోషింపకుండుట; 11. అంగిరసము కాని రసమును కీర్తించుట; 12. అంగిరసమును మిగుల విస్తరించుట; 13. దివ్యా దివ్య ప్రకృతి విపర్యయము; 14. అర్థానౌచిత్యము; 15. దేశకాలాద్యనౌచిత్యము.

దోష రహితముగాఁ గావ్యములను రచించుట అసంభవము కావచ్చును. కాన యిట్టివి దోషము లనియు సాధ్యమైనంత వఱకు దోషములను బరిహరించి రసవత్కావ్యములను రచింపవలయు ననియుఁ జెప్పుటలో దోషము లేదు. దోషము లన్నియుఁ బరిహరణీయములే యైనను అన్నిటికన్న అనౌచిత్యము పెద్ద దోషము. అందుచేతనే అనౌచిత్యముకంటె రసభంగమునకు వేఱొక కారణము లేదని ఆనందవర్ధనుఁడు చెప్పియుండెను.

6. అలంకారములు :

కావ్యాంగములలో నలంకారములకు సముచిత స్థానమున్నది. భామహుఁడు స్త్రీ పురుషాదుల శరీర సౌందర్యము నలంకారములు (నగలు) పెంపొందించు విధమునఁ గావ్య శరీర సౌందర్యము నలంకారములు పెంపొందించు ననియు నవియే కావ్యమున ప్రధానములనియు నుడివెను. అతఁడు రసమును రసవదలంకారమని యొక్క యలంకారముగా పరిగణించెను. వామనుఁడు కావ్యాలంకార సూత్రవృత్తిలో రీతి కావాత్మ యనియు, నలంకారములు కావ్య సౌందర్యమును పెంపొందించు ననియు తెలిపెను. దండి కావ్యము యొక్క అంత స్సౌందర్యమును బెంచు ప్రధానాంగములు గుణములే యనియు, నలంకారములు కావ్య బాహ్య శోభా కారణము లనియుఁ జెప్పెను. ధ్వనికారుఁడు కావ్యాత్మ ధ్వనియని నిరూపించి యది వస్త్వలంకార రస రూపముగా నుండునని వ్యక్తీకరించెను. అభినవగుప్తుఁ డలంకారముల వైశిష్ట్యము నంగీకరించినను అవి రసపర్యవసాయులుగానే యుండవలెననెను. పండితరాయలు గూడ వ్యంగ్యమునకు రమణీయతా ప్రయోజకము లలంకారము లని యభిప్రాయపడెను. ఈ విధముగా భామహుని వలె నితరాలంకారికు లలంకారములకుఁ గావ్యమునఁ బ్రాధాన్యము నంగీకరింపక పోయినను అవి దానికి సౌందర్య మాపాదించు ననుటలోనేకాభిప్రాయమునే కలిగియున్నారు.

అర్థాలంకారములు లేనిచో శబ్ద సౌందర్య మాకర్ష కరముగ నుండదనియు నలంకార స్పర్శ లేకుండ నే వాక్యమైన మనోహరముగా నుండుట అరుదనియు కొందఱి అభిప్రాయము. అగ్నిపురాణ మర్థాలంకార రహితయైన సరస్వతిని విధవతోఁ బోల్చియుండెను. (అర్థాలంకార రహితా విధవేన సరస్వతీ), మమ్మటుఁడు కావ్య లక్షణమును జెప్పుచు శబ్దార్థము నొకప్పుడనలంకృతులైనను హాని లేదని చెప్పుటలో నవి స్ఫుటాలంకారములు కాకున్నను లోపముండదనియే భావము. కాని అసలలంకారము లనవసరములని యభిప్రాయము కాదు. రసధ్వనుల కుపస్కారములైన యలంకారములు కావ్యములకు శోభ నాపాదించు ననుటలో విప్రతిపత్తి లేదు.

అలంకారమునకు "సౌందర్య మలంకారః" అనునది వామనుఁడొసంగిన నిర్వచనము. అతఁడు సౌందర్య మలంకారమని నుడివి వేనివలన కావ్యమున కా సౌందర్య మావహిల్లునో యవియు నలంకారములే యని వివరించెను. దండి కావ్య శోభాకరములైన

ధర్మము లలంకారము లని పలికెను. అలంకృతియే అలంకారమనియు, *దీనిచే నలంకరింపబడును గావున నలంకార మనియు నలంకార పదమునకు వ్యుత్పత్తులు, ఇందు రెండవ వ్యుత్పత్తినే పలువు రంగీకరించిరి. దీనిని బట్టి యిది యలంకరించు నదే కాని యలంకార్యము కాదు. రసధ్వనుల లంకార్యములు. పండిత రాయలు స్వయముగా సుందరమై అన్యమున కుపస్కారమై యుండుట అలంకారత్వమని వ్రాక్రుచ్చెను. (సుందరత్వే సతి ఉపస్కారకత్వ మలంకారత్వమ్) ప్రౌఢి ప్రసిద్ధులలో నొక దాని నవలంబించి శబ్దార్థముల నుచిత రీతి మార్చినచో నలంకారమను వ్యవహారము కలుగును.

అలంకారముల సంఖ్య విషయమున భిన్నాభిప్రాయము లున్నవి. భరతుఁడొక శబ్దాలంకారమును మూఁడర్థాలంకారములను బేర్కొనెను. (యమకము – ఉపమాదీపక రూపకములు) అగ్ని పురాణమున నెనిమిదియు, విష్ణు ధర్మోత్తరమున పదునేడును అలంకారము లు చెప్పఁబడినవి. దండి భామ హోద్భటులు వరుసగా ముప్పది యైదు ముప్పదియారు ముప్పదియే దలంకారములను వ్రాక్రుచ్చిరి. మమ్మటు డఱువది యొక్కటియు విద్యానాథుఁ డఱువది యాఱును (రసవదాదులు 7=73) విశ్వనాథుఁడు డెబ్బది తొమ్మిదియు, జయదేవుఁ డు నూటొక్కటియు, అప్పయ్య దీక్షితులవారు నూటిరువది యొక్కటియు నలంకారములను బరిగణించిరి. శోభాకరమిశ్రు డలంకారముల సంఖ్య నింకను బెంచినాఁడు. భరతుఁడు పేర్కొన్న భూషణములు, లాస్యాంగములు, నాట్యాలంకారములు, కొన్ని సంధ్యంగములు కూడ అర్వాచీనులచే నలంకారములుగనే పరిగణింపఁబడినవి. ఇవన్నియు నలంకారములే యగునా లేక వీనిలోఁ గొన్నిటియందు మఱికొన్నిటి నంతర్భవింపఁ జేయవచ్చునా అను విమర్శ రసగంగాధరమునఁ గనవచ్చును.

అలంకారములు శబ్దాలంకారములు, అర్థాలంకారములు అని ప్రధానముగా రెండు విధములు. కొందఱుభయాలంకారము లని మూఁడవ విధమును గూడఁ బేర్కొనిరి. అర్థము నపేక్షింపక శబ్దమును మాత్రమాశ్రయించియుండు నలంకారములు శాబ్దికములు. అర్థమును మాత్రమాశ్రయించి యుండునని ఆర్థికములు ఉభయాశ్రయములై యుండునవి ఉభయాలంకారములు. అనుప్రాసయమకాదులు శాబ్దికములు; ఉపమారూపకాదు లార్థికములు; పునరుక్తవదాభాస లాటాను ప్రాసాదు లుభయములు. భోజుఁడు

---

* అలంకృతిరలంకారః – అలంక్రియతేనేనేత్యలంకారః

సరస్వతీకంఠాభరణమున శబ్దాలంకారములు బాహ్యములనియు నర్థాలంకారము లాభ్యంతరము లనియు పల్కి, జాతి, గతి, రీతి, వృత్తి, చ్ఛాయా, ముద్రా, శయ్యాదులు కూడా శబ్దాలంకారములే యని వ్యక్తీకరించెను. ఔచిత్యము ననుసరించి చేయబడిన శబ్దాలంకార సంఘటనము పాఠకుల కానందము చేకూర్చును. సంస్కృతి కవులు వన యుద్ధ వర్ణనాదుల సందర్భమున శబ్దాలంకారములను గూర్చినారు. ఆంధ్ర కవులు గూడ వనజలక్రీడా పుష్పాపచయాదుల వర్ణనమునందు శబ్దాలంకార ప్రీతి ప్రదర్శించినారు. అసలు ఛందోయుక్తమైన రచనయే శబ్దాలంకారమని కొందఱి అభిప్రాయము. ఇంక నర్థాలంకారముల నుచితముగఁ గూర్చిట కవుల ప్రతిభా కౌశలములను సూచించును. ఆనందజనకములైన భావరామణీయక చమత్కారములే అలంకారములకు మూలము. అలంకారములు లక్షణ సమగ్రములైనను అలంకరించు గుణమునఁ గొఱవడినచో అల్కారములు కాకపోవును. అవి అలంకార్యము నలంకరింపవలెనని అలంకారికులు శాసించినారు. కాంతాదేహము నలంకరించునప్పుడే అలంకారము లన్వర్థము లగును గాని పెట్టెలో దాచఁబడినప్పుడు అలంకారములు కాజాఁలవు. అట్టులే రసధ్వనుల కుపస్కారములై భావము నుద్దీపింపఁజేయునప్పుడే అలంకారములు అలంకార నామార్థములగును. లేనిచో నవి కేవల మర్థ చిత్రము లనదగును. కొందఱు రసము కూడ నలంకారమే యనిరి కాని యది సమంజసము కాదు. అది దేనిని అలంకరింపదు. అది అప్రధానమై యన్యము నలంకరించినప్పుడే అలంకారత్వమును బొందును. అది అలంకార్యమే కాని అలంకారము కాదు.

ప్రతాపరుద్రీయమున నర్థాలంకార విభజన మిట్లు చేయఁబడినది, రూపక పరిణామ సందేహాదులు (16) ప్రతీయమనౌపమ్యములు, ఇందౌపమ్యము వాచ్యముగాఁ గాక వ్యంగ్యముగా గోచరించును. సమాసోక్తి పర్యాయోక్త్యాక్షేప పరికరాదులు (10) ప్రతీయమాన వస్తుకములు. వీనిలో వస్తువు వ్యంగ్యముగా గోచరించును. రసవత్, ప్రేమ, ఊర్జస్వి, సమాహిత, భావోదయ, భావసంధి, భావశబలతలు (7) ప్రతీయ మానరస భావములు, వీనియందు రసభావములు వ్యంగ్యముగా గోచరించును. మిగిలిన ఉపమాదులు (40) అస్ఫుట ప్రతీయ మానౌపమ్య రసభావములు. వీటిలో వస్తు రసభావౌపమ్యాదు లస్ఫుటముగా మాత్రమే భాసిల్లును.

సాధర్మ్యనిరోధాదుల మూలమున నర్థాలంకారములు పంద్రెండు విధములుగా

విభజింపఁబడినవి. రూపక పరిణామాదులు (7) అభేద ప్రధాన సాధర్మ్యములు. దీపకతుల్య యోగితాదులు (8) భేదప్రధాన సాధర్మ్యములు ఉపమానన్వయాదులు (4) భేదా భేద ప్రధాన సాధర్మ్యములు. ఇట్లు సాధర్మ్య మూలములు మొత్తము పందొమ్మిది. ఉత్ప్రేక్షాతిశయోక్తులు (2) అధ్యవ సాయమూలములు. వీపమేయమును వాచ్యముగాఁ జెప్పక యుపమానమును మాత్రమే చెప్పుట అధ్యవసాయము. విభావనా విశేషోక్త్యాదులు (10) విరోధ మూలములు, ఇందుకారణము లేకున్నను కార్యము కలిగినట్లు చెప్పఁబడును. యధాసంఖ్య, పరి సంఖ్యాదులు (5) వాక్య న్యాయమూలములు, వాక్య న్యాయములు మీమాంసా శాస్త్రమునకు సంబంధించినవి. పరివృత్తి ప్రత్యనీకాదులు (8) లోక వ్యవహార మూలములు. కావ్యలింగానుమానార్థాంతర న్యాసములు (30 తర్కన్యాయమూలములు. కారణములై కావళీ మాలా దీపక సారములు (4) శృంఖలా వైచిత్ర్యములు (గొలుసునందలి పూసలవలెఁ బూర్వాపరపద సంబంధము గలవి). వ్యాజోక్త్యపహ్నవము లపహ్నవ మూలములు. అపహ్నవమన కప్పిపుచ్చుట. సమాసోక్తి పరికరములు (2) విశేషణ వైచిత్ర మూలములు. మిగిలిన శ్లేషాద్యలంకారములు (3) కేవలములు అనఁగా నెట్టి న్యాయమును అపేక్షింపనివి.

కొందరు శాస్త్రీయాంశముల ప్రవేశమును బట్టి అలంకారములను వ్యాకరణ మూలకములు, మీమాంసా మూలకములు, న్యాయశాస్త్ర మూలకములు, వేదాంత శాస్త్ర మూలకములు అని విభజించి యుండిరి.

ప్రాచీనాలంకారికులలోఁ గొందఱుపమకును గొందఱు వక్రోక్తికిని గొందఱు శ్లేషకును బ్రాధాన్య మొసంగి యుండిరి. ఉపమ సర్వాలంకార బీజభూతమని వామనుని మతము. అందుచేత నితఁడుపమా గర్భములైన యలంకారములనే వివరించెను. అతని తరువాత వచ్చిన యాలంకారికు లెల్లరు నాతని మతమునే యనుసరించి తమ తమ గ్రంథములలో నుపమనే యలంకార ప్రకరణమున మొట్ట మొదటఁ బేర్కొని యుండిరి. దండి పెక్కు పమాభేదములను సూచించెను. అన్ని భేదముల నితరులు చూపి యుండలేదు. అప్పయ్య దీక్షితుల వారు చిత్ర మీమాంసలో "ఉపమాలంకారమొక నటి అది చిత్రభూమికా భేదములను బొంది కావ్య రంగమున నర్తించుచుఁ దద్విదుల చిత్తముల రంజించు" నని చెప్పియుండిరి. ఇతరాలంకారములు పెక్కుదాని రూపభేదములే యని యతని యభిప్రాయము.

ఉపమైకా శైలూషీ సంప్రాప్తా చిత్రభూమికా భేదాన్
రంజయతి కావ్యరంగే నృత్యంతీ తద్విదాం చేతః

అలంకారము లన్నియు వక్రోక్తులే యని భామహుని మతము. వక్రోక్తియన స్వభావ విరుద్ధము చమత్కార శోభితము నగు వికటోక్తి. అట్లు వికటముగాఁ బల్కినప్పుడే చమత్కార ముప్పతిల్లి శ్రోతల కానందము కలిగించును. వికటోక్తి రహితమగుటచే స్వభావోక్తినాతఁ డలంకారముగాఁ బరిగణించి యుండలేదు. కుంతకుఁడు భామహుని వక్రోక్తి వాదమును బలపఱిచి వక్రోక్తియే కావ్య జీవితమని సిద్ధాంతీకరించెను. మమ్మటుఁడతి శయోక్తియే సర్వాలంకార బీజ భూతమని యభిప్రాయపడెను. ఇతని మతమున నతిశయోక్తి యన్నను వక్రోక్తియున్నను నొకటే. "వక్రోక్తియనగాఁ జారూక్తి. దీనిచే నర్థ మధికముగా భావింపఁ బడును. ఇది లేని యలంకారమే యుండదు. కవులు దీని విషయమై యధికమైన యత్న మాచరింపవలె" నని యాతఁడు జెప్పియుండెను.* అలంకారములన్నియు శ్లేష స్పర్శచే శోభాతిశయమును వహించునని కొందఱి యభిప్రాయము. "శ్లేషఃపుష్ణాతి సౌభాగ్యం ప్రాయో వక్రోక్తిషు స్థితమ్" (శ్లేష ప్రాయికముగా వక్రోక్తులయం దుండి సౌభాగ్యమును బెంపొందించును) అను వాక్యమందుకు నిదర్శనము.

అలంకారముల వలనఁ గావ్యములకు ప్రౌఢత్వమును సౌందర్యమును చేకూరును. ఉపమాద్యలంకారములు కొన్ని వర్ణ్యములం ద ప్రత్యక్షమై యుండు సౌందర్యమును బ్రత్యక్షము చేసి యనుభవమునకుఁ దెచ్చును. "అధరము పల్లవమువలె నున్న" దని వినఁగనే మన కధరము నందలి యారుణ్య మార్దవములు ప్రత్యక్షములగును. ఇట్లే అలంకారము లపరిచితములైన వర్ణ్యముల స్వరూప స్వభావములను సహృదయులకుఁ బరిచితములు గావించును. గవయమృగమును మనమెప్పుడును జూచి యుండక పోయినను అది గోవు వలె నుండునని విన్నప్పుడు దాని స్వరూప స్వభావములు విశదములగును. అలంకారములు చెప్పఁదలఁచిన భావమునకు స్పష్టత్వమును, నిరూపింపఁ దలచిన వర్ణ్యాంశమునకు వైశద్యమును జేకూర్చి సహృదయ మనోరంజన మొనఁగూర్చును. విద్యానాథుఁడు మమ్మటుని "ఉపస్కుర్వన్తీ" త్యాది శ్లోకమును* వివరించుచు కరచరణా ద్యవయవ గతములైన వలయ

---

* ఏషా సర్వైవ వక్రోక్తి రన యార్థో విభావ్యతే
యత్నోస్యాం కవినా కార్యః కోలంకా రోనయా వినా;

* ఉపస్కుర్వన్తి తం సన్తం యేంగ ద్వారేణ సంశ్రితాః
హారాదివదలంకారాస్తేను ప్రాసోప మాదయః

నూపురాదులచే నవయవి యలంకరింపఁబడునట్లు శబ్దార్థావయవగతములైన యను ప్రాసోపమాదులచే నవయవీ భూతమైన కావ్య మలంకరింపఁబడు నని చెప్పియున్నాడు.

అలంకారములు సౌందర్యావహములే యైనను వానిని గూర్చుటలో గవులు మిక్కిలి శ్రద్ధ వహింపవలయును. లేనిచో నవి గదు ప్రాయములై (కణిఁతివంటివై) వికృతి చేకూర్చును. ప్రతిభావంతులైన కవు లెన్నఁడు నలంకార యోజనకై యత్నింపరు. అవి అయత్నముగనే సిద్ధించును. కావ్య ప్రతిపాద్యమైన రసభావ సంపద కుపస్కారకములుగాఁ గూర్పబడినప్పుడవి కావ్యమున కమిత శోభ చేకూర్చును. సన్నివేశమున కనుకూలములై యలరారు నప్పుడు శబ్దాలంకారములు కూడా సౌందర్యావహములే యగును. అట్టి ఆనుకూల్యము లేనప్పుడవి పాండితీ ప్రతిభలను వెల్లడించినను ఆత్మభూతమైన ధ్వనికిఁ గొఱఁత కలిగించి కావ్యములను గృత్రిమములు కావించును. అట్టి వానినే మనము చిత్ర కావ్యములందుము.

ఆనంద వర్ధనుఁడలంకారములను బ్రయోగించు సందర్భమున నవి రసపరములుగా నుండునట్లును సముచిత సమయమున స్వీకృతము లగు నట్లును, అయత్న సిద్ధములుగా నుండునట్లును, ఆరంభమునుండి అంతము వఱకును నుండవలె నను పట్టుదలకు ఫలములు కాకుండునట్లును, అంగములుగా నుండునట్లును జూడవలె నని చెప్పియున్నాడు. ప్రతిభావంతుఁడైన కవి రచనయందయత్నముగనే యవి మహ యహమికతో వచ్చునని యతఁ డే చెప్పియున్నాడు. మనోరంజకములైన వాక్ప్రాకారము లెన్ని యుండునో యవి యన్నియు నలంకారములే. వానిని నిరూపించి నిర్ణయించుట క్లేశకరమే యైనను ప్రాచీనాలంకారికులు వాని స్వరూప లక్షణములను, వాని యందలి అవాంతర భేదములను చాల కౌశలముతో వ్యక్తము చేసియున్నారు.

అలంకారములన్నియు నభిధా రూపములని కొందఱనిరి. అవి ధ్వని కంగములై ధ్వని సంబంధము కలిగి యుండునప్పుడే మనోహరములై యలరారును. అర్థరామణీయకమున కొక్కొక్కప్పుడు వ్యంగ్యము నిదానమైనట్లే యొక్కొక్కప్పుడు వాచ్యమును నిదానమై యుండును. అందుచే రమణీయార్థ ప్రతిపాదన తత్పరుఁడగు కవి సర్వదా ధ్వని రక్తినే చూపక గుణీభూత వ్యంగ్య మార్గమును గూడ ననుసరించుచుండును. సమాసోక్తి, అప్రస్తుత ప్రశంస, దీపకము, పరికరము మున్నగు నలంకారములు గుణీభూత వ్యంగ్యములే. ధ్వని అంగి, అలంకార్యము; అలంకార మంగము. అది వ్యంగ్య ప్రధాన మగునప్పుడు ధ్వని భేదమే యగును. వ్యంగ్య

మప్రధానమగునప్పుడు గుణీభూత వ్యంగ్యమగును. కవు లలంకారములను ధ్వని పర్యవసాయములుగాఁ జేయుటకు యత్నింపవలయును.

అలంకారములు – ఉత్పత్తి : ఏ భాషయందైనను కావ్య గుణాలంకారాదుల బీజములు సహజముగా నుండును. అవియే కవివశమున కావ్యములందు విస్పష్టముగాఁ దలచూపి హృదయ రంజకము లగును. సామాన్య సంభాషణలయందుఁ గూడఁ బ్రయోక్త ప్రయత్నము లేకుండనే సహజ సిద్ధములై యలంకారములు ప్రవేశించుచుండును. "వానికి వాఁడే సాటి; అడుసు త్రొక్కనేల కాలుకడుగనేల; అది యేనుఁగు కాదు నడగొండ" మున్నగు వానిలో నలంకారములే కాక ఛందో బీజములు కూడఁ గానవచ్చుచున్నవి. సకల ప్రపంచ వాఙ్మయమునకు శ్రీకారమని చెప్పఁదగిన ఋగ్వేదమునందు వివిధములైన కావ్య గుణములే కాక ప్రసిద్ధములైన యలంకారములు కూడా గోచరించుచున్నవి. "సూర్యుఁడను వత్సను వెనుకఁ బెట్టుకొని ఉషస్సనెడి తెల్లని గోవు వచ్చుచున్నది; తల్లిజలక మార్చి యలంకరించిన యువతి వలె నీవు నీ శరీర లావణ్యము నందఱికిఁ జూపుచున్నావు" మున్నగు వాక్యములను సూర్యరుద్ర వరుణాదుల వర్ణనములును ఇందుకు నిదర్శనములు. నిరుక్తమునందు యాస్కాచార్యుడు "అథః ఉపమాః" అని పండ్రెండు విధములైన యుపమా భేదములను బేర్కొనుటను బట్టి చూడనప్పటికే యలంకార శాస్త్ర మావిర్భవించెనని చెప్పనగును. రామాయణ భారత పాణినీయాదులలో నలంకార ప్రశంస కలదు. వాత్స్యాయనుని కామసూత్రములందు చతుష్షష్టి కళలలో, జేర్పఁబడిన క్రియా కల్పమునకు వ్యాఖ్యాత "కావ్యాలంకార ఇత్యర్థ" అని వివరణము చేసియున్నాఁడు. లలిత విస్తర మందును ఈ క్రియాకల్పకళ ప్రసక్తి కలదు. క్రీస్తుశకారంభ మందలి కొన్ని సంస్కృత శాసనములలో శబ్దాలంకారములును, గుణములును ప్రస్తావింపఁబడినవి. తరువాత కావ్య నాటకాదులలో శబ్దార్థాలంకారములు విరివిగా ప్రయోగింపఁబడినవి. అలంకారికులు వాని నన్నింటిని బరిశీలించి యందలి యవాంతర భేదములను నిరూపించిరి. మూఁడు నాలుగు నుండి యలంకారముల సంఖ్య కాలక్రమమున శతాధికముగా వృద్ధి నందినది.

అలంకారము లున్నను లేకున్నను కవిచాతుర్య వశమున రసము స్ఫురింపవచ్చును. కొన్ని చోట్ల రసమున కలంకారములు పుష్టి కలిగించు మాట నిజమే. కాని అందుచే రసమే యలంకారములం దిమిడి యున్నదని చెప్పరాదు. శబ్దాలంకారము లొక్కొక్కప్పుడు రసమునకు

భంజకము లైనను గావచ్చును. అందుచే వానిని ప్రయోగించు విషయమునఁ గవు లధికమైన జాగరూకత వహింపవలయును. ముక్తాహారాదులు కంఠా ద్యంగములకు శోభ కలిగించుట ద్వారా అంగికి సౌందర్యము నావహించునట్లే అలంకారము లంగియైన రసమున్నప్పుడే దాని కంగ భూతములైన శబ్దార్థములకు వైచిత్రి కలిగించి రసమునకు శోభ కూర్చును. రసము లేనిచో నవి కేవల శబ్దార్థ వైచిత్రి జనకములు మాత్రమే యగును. ఈ విధముగా నలంకారములు గుణరీతి వృత్త్యాదులవలెఁ గావ్యమున కత్యంత ప్రధానములు కావని చెప్పుటకు వీలున్నను లాక్షణికులందఱును వాని యావశ్యకము నంగీకరించియే యుండిరి. రసాదుల కంటెను వ్యంగ్యము కంటెను వేఱై శబ్దార్థములలో నొకదాని నాశ్రయించి యుండి విషయితో సంబంధము కలదై యేది చమత్కృతిని బుట్టించు చున్నదో నదియే యలంకారము.

7. వక్రోక్తి - అనుమానము - ఔచిత్యము :

వక్రోక్తి : కొన్ని పద్య భాగములు వచన ప్రాయములుగా నున్నవనియు, కొన్ని వచన భాగములు పద్య ప్రాయములుగా నున్నవనియు విమర్శకు లనుచుండుట వినుచుందుము. దీనిని బట్టి యాపద్య భాగము లందు వానిని పద్య వాచ్యములుగాఁ జేయుగుణము లోపించిన దనియు నావచన భాగములందు వానిని బద్య వాచ్యము లొనర్చు విశిష్టమైన గుణము నిండారి యున్నదనియు స్పష్టమగుచున్నది. ఆ గుణమేది? అది భావములను వ్యక్తీకరించు సాధారణ విధానముకంటె విలక్షణమై పద్య గద్యతారతమ్యము జక్కగా ప్రకటించు నొకానొక ప్రత్యేక భావ వ్యక్తీకరణ పద్ధతి. క్రీ.శ. 1000 సంవత్సరముల ప్రాంతమున జీవించిన కుంతకుఁ డను నాలంకారికుఁడు దానిని వక్రోక్తియని పేర్కొని యదియే కావ్య జీవితమని ప్రకటించెను.

ధ్వని సిద్ధాంతము వెలువడిన పిమ్మట ప్రకటితములైన వాదములలో వక్రోక్త్యనుమా నౌచిత్య వాదములు ముఖ్యములైనవి. స్వభావవిరుద్ధము చమత్కార యుక్తమునైన ఉక్తి విశేషమునకు వక్రోక్తియని పేరు. వక్రత శ్వపుచ్ఛమువలెఁగాక చంద్రకలవలె నుండవలెనని మంఖకుఁడు శ్రీకంఠ చరిత్రమునఁ జెప్పియున్నాడు. రఘునాధభూపాలుఁడు శ్రీనాథుని కవిత్వమున "హరచూడా హరిణాంక వక్రత" గలదని వర్ణించియున్నాడు. వక్రోక్తియనఁగా వట్టి వంకర మాట మాత్రమే కాదు. అది వక్రతతోపాటు రామణీయకమును గూడ గలిగియుండ వలెను. సహృదయుల కానందము కలిగించురీతి పదభావముల సంఘటించుటయే వక్రోక్తియని వివరించి కుంతకుఁడు దానిని వైదగ్ధ్య భంగీభణితి యని పేర్కొనెను. రమణీయములైన

శబార్థములు కావ్యశరీరమనియు, నాత్మభూతమైన వక్రోక్తిలేనిచోనవి కావ్య ప్రయోజనమును నిర్వహింపఁజాలుననియు నతని అభిప్రాయము. కుంతకుని పూర్వులు కూడ కొందఱీ వక్రోక్తిని బేర్కొని యున్నారు. భోజుఁడు శృంగార ప్రకాశమున నీ క్రింది శ్లోకము నుద్ధరించి యున్నాఁడు.

"వక్రత్వమేవ కావ్యానాం పరా భూషేతి భామహః
శ్లేషః పుష్ణాతి సౌందర్యం ప్రాయో వక్రోక్తిషు స్థితమ్."

"వక్రతయే కావ్యముల కుత్కృష్టమైన భూషణమని భామహుఁడు. శ్లేష ప్రాయికముగా వక్రోక్తులయందుండి సౌందర్యమును బెంపొందించు"నని దీని యభిప్రాయము. మనోరథుఁడు "ఉత్కృష్టమైన సంఘటనయే వక్రోక్తి"యని ధ్వన్యాలోకము నిర్వచించినట్లు చెప్పియున్నాఁడు. ఇది వామనుని రీతి వాదమునకు సన్నిహితముగా నున్నది. ఏలయన నిది బాహ్యమైన పద సంఘటనమును గూర్చియే కాని అంతరఘైన ఆత్మను గూర్చి చెప్పుటలేదు. వామనుఁడు కూడ వక్రోక్తిని పేర్కొని యది సాదృశ్యలక్షణ యని నిర్వచించెను, అతడిచ్చిన

"ఉన్మిమీల కమలం సరసీనాం
కైరవంచ నిమిమీల ముహూర్తాత్."

"సరస్సులందు కమలము ఱెప్పలు తెఱిచెను కలువ వెంటనే ఱెప్పల మొగిడ్చెను."అని దీని యర్థము. తమ్మియు కలువయు జడ పదార్థములు, అవి ఱెప్పల తెఱుచుట మొగడ్చుట యనునది పొసఁగదు. అందుచే వానికి కన్నులతోఁ గల సాదృశ్యమును బట్టి కమలములు వికసించెననియు కలువలు మొగడెననియు మన మర్థము చేసికొనవలయును. ఇదే వక్రోక్తియని వామనుని అభిప్రాయము. ఇది దండి సమాధి గుణమునుబోలి ధ్వన్యర్థమును దలఁపునకుఁ దెచ్చుచున్నది.

కుంతకుఁడు వక్రోక్తి సిద్ధాంతమును నెలకొల్పినను రసధ్వనివాదములకు విరుద్ధుఁడు కాఁడు. అతడానందవర్ధనుని యెడను అతని ధ్వని సిద్ధాంతమునెడను గౌరవము ప్రకటించి రసధ్వనులకు సంబంధించిన వివిధ సూత్రములను వక్రోక్తి భేదములలో నంతర్భవింపఁజేసెను. అనుమాన వాదము నెలకొల్పిన మహిమ భట్టు ధ్వని సిద్ధాంతమును ఖండించుచు ధ్వని వక్రోక్తి సిద్ధాంతములు రెండు నభిన్నములే యని నిరూపించెను. ఆధునిక విమర్శకులు కూడ పలువు రిట్లే భావించిరి. కుంతకుఁడు వక్రోక్తి యను భావమును విశాలతరము కావించి యుత్తమ కవిత్వమున కుండవలసిన లక్షణములనన్నిటిని అందుఁ జొప్పించెను.

భామహుఁడును, మమ్మటుఁడును క్రమముగా వక్రోక్త్యతిశయోక్తులకు ప్రాధాన్య మొసంగిరి. వక్రోక్తి శూన్యము లగుటచే స్వభావోక్తి క్రమ సూక్ష్మ లేశాదులను భామహు డలంకారములుగాఁ బరిగణించి యుండలేదు. అన్ని అలంకారములందు వక్రోక్తి యుండుననియు నది లేనిచో నవి నీరసములై మనోరంజనము చేయఁజాల వనియు నతఁ డభిప్రాయపడెను. మమ్మటుఁ డలంకారములన్నియు నతిశయోక్తి మూలము లనియు నతిశయమే వక్రతను గలిగించుననియు వ్యక్తము చేసెను. "కవులు ముఖము చంద్రునివలె నున్నదందురు. ముఖము నిజముగా చంద్రునివలె నున్నదా? లేదు. అందులో గొంత అతిశయోక్తి కలదు. ఇదే అలంకార సౌందర్యమునకు మూలకారణము" అని అతని యభిప్రాయము. అతిశయము, వక్రత, చారుత్వము అనునవి అతని మతమున సమానములే.

దండి వాఙ్మయ మంతయు స్వభావోక్తి, వక్రోక్తి అని రెండు విధములని తెల్పెను. (భిన్న ద్విధా స్వభావోక్తి ర్వక్రోక్తిశ్చేతి వాఙ్మయమ్.) స్వభావోక్తి ఉన్నదాని నున్నట్లు వర్ణించును. వక్రోక్తి దానిసే వక్రముగ అనఁగా చమత్కార బంధురముగాఁ దెల్పును. కొన్ని సన్నివేశములందు స్వభావోక్తి కూడ నానందప్రదమే యయ్యును ఆనంద సంధాన సామర్థ్యమున వక్రోక్తితో సాటికాఁజాలదు.

కుంతకుఁడు షడ్విధములైన వక్రోక్తులకు వివరించెను. 1. వర్ణ విన్యాస వక్రత – ఇది శబ్దాలంకార ప్రాయమైనది. 2 పద పూర్వార్ధవక్రత – ఇది పదమున పూర్వార్ధములైన ప్రాతిపదికలతోఁగాని ధాతువులతోఁగాని సంబంధించినది. ఇందు మరల రూఢివైచిత్ర్య వక్రత, పర్యాయ వక్రత మున్నగు భేదము లనేకములున్నవి. వీనిలో ఉపచారవక్రత ముఖ్యమైనది. వీనిలో సమస్తధ్వని భేదములును గ్రహింపఁబడినవి. 3. ప్రత్యయవక్రత – ఇది కృత్తద్ధిత ప్రత్యయములతో సంబంధించినది. ఆ ప్రత్యయముల సంయోగముచే నిందధిక చారుత్వము గలుగును. 4. వాక్య వక్రత – ఇది అర్థాలంకారములచేఁ గలుగు సౌందర్యము. 5. ప్రకరణ వక్రత – ఇది రసమున కనుకూలముగా లేని కథా వస్తువును దదనుకూలముగా మార్చుటవలనఁ గలుగు చారుత్వము. అభిజ్ఞాన శాకుంతల మందలి దుర్వాసుని శాపమిందు కుదాహరణము. 6. ప్రబంధవక్రత – ఇది కథయందలి ప్రధాన రసమును మార్చి దాని నన్యరస ప్రధానముగాఁ జేయుటవలనఁ గలుగు చారుత్వము. భారత కథ శాంతరస ప్రధానమైనది. భట్ట నారాయణుఁడు భారతాంతర్గతమైన వేణీసంహార వృత్తాంతమును శాంత

ప్రధానముగాఁ గాక వీర రస ప్రధానముగా రచించుట ఇందు కుదాహరణము. పై భేదము లన్నింటియందు వక్రత యనఁగా సౌందర్యమని యర్థము. దానికొఱకై కవు లందఱును అధికముగా యత్నింపవలెనని కుంతకుని యభిప్రాయము.

అనుమానము : అభినవగుప్తుని తరువాత ధ్వని సిద్ధాంతమును ఖండించి స్వీయ వాదములను ప్రతిష్ఠింపఁ దలచిన వారిలో మహిమభట్టొకఁడు. అతఁడు సర్వధ్వనులును అనుమానమునందే అంతర్భవించునను విషయమును ప్రకటించుటకు వ్యక్తి వివేకమను గ్రంథమును రచించెను. ఆనందవర్ధనుఁడు అభిధ, లక్షణ, వ్యంజన అను మూఁడు వృత్తులను దెల్పఁగా మహిమభట్టు వ్యంజనావృత్తికల్పన మనవసర మనియు, లక్షణ కూడ అనుమానములోనే అంతర్భవించు ననియుఁ దెల్పి అతఁడు చెప్పిన ధ్వని భేదము లన్నియు అనుమానాంతర్గతములే యని సిద్ధాంతీకరించెను. అతఁడు తాను తెల్పు ననుమానము ధూమాగ్న్యనుమానమువంటిది కాదనియు నది కావ్యానుమితి యనఁబడు ననియు వివరించెను.

మహిమభట్టు ననుసరించి అర్థము వాచ్యము, అనుమేయము అని రెండు విధములు. అందు వాచ్యము శబ్దవ్యాపార విషయము. దీనికే ముఖ్యార్థమని నామాంతరము. దీనినుండి కాని లింగభూతమైన తదనుమికమునుండి కాని యనుమానింపఁబడు నర్థాంతర మనుమేయము. (పర్వతమున నిప్పు గలదు, ఏలయన పొగ యుండుటవలన అను వాక్యమున పొగ లింగము (హేతువు) నిప్పులింగి (అనుమేయము) లింగమును బట్టి లింగి యూహింపఁ బడుచున్నది. (ఈ విషయము ధ్వన్యభావవాదుల ఖండన సందర్భమున వివరింపబడినది). అనుమేయము వస్త్వలంకార రసాదు లని మూఁడు విధములు. అందు వస్తువును అలంకారమును వాచ్యములు కూడ నగును. రసాదులు మాత్రమనుమేయములే.

మహిమభట్టు వ్యంజనావృత్తి అనవసరమని చెప్పినను ధ్వని వాదమునే మిక్కిలి పెంచి అనుమాన వాదమును నెలకొల్ప యత్నించినట్లు తోఁచును. అతఁడు కావ్యమున కాత్మ రసాది రూప మనుటలో విప్రతిపత్తి లేదని చెప్పుటచే రస ప్రాధాన్యము నంగీకరించినవాఁ డేకాని తిరస్కరించినవాఁడు కాదని తెలియుచున్నది. పండితరాయలు మొదలగువారు తరువాత అనుమాన వాదమును ఖండించి వ్యంజనావృత్తి నంగీకరింపక తప్పదని నిర్ధారణ చేసిరి.

ఔచిత్యము : దండి సర్వాలంకారములును అర్థమును రసమును చిందించునని పల్కి యా భారమునంతను అగ్రామ్యతయే వహించునని వివరించెను. అగ్రామ్యత యనఁగా

ననౌచిత్యము లేకపోవుటయే. ఈ సూచన ననుసరించియే కాఁబోలు నానందవర్ధనుఁడు "అనౌచిత్యముకంటే రసభంగమునకు వేఱొండు కారణము లేదు. ప్రసిద్ధమైన యౌచిత్యము గల కావ్యము రసోపనిషత్తే"యని తెల్పియుండెను. క్షేమేంద్రుఁడీ కారికను గ్రహించి దానిని బెంపొందించి యౌచిత్య వాదమును ప్రవచించెను. ఉచితము యొక్క భావ మౌచిత్యము.

రససిద్ధమైన కావ్యమున కౌచిత్యమే స్థిరమైన జీవితమనియు, నది లేనిచో బాహ్యశోభా హేతువులైన అలంకారముల వలనను మిథ్యాగుణితములైన గుణముల వలనను బ్రయోజనము లేదనియు క్షేమేంద్రుని సిద్ధాంతము. గుణాలంకారాదు లుచిత స్థలముల నుచితముగాఁ గూర్పఁబడినపుడే శోభాకారము లగునని యతని యభిప్రాయము. అతఁడౌచిత్యము పద వాక్య ప్రబంధ గుణాలంకార రసాదులం దు..దునని తెల్పి వాని కన్నిటికి నుదాహరణము లొసంగెను. అతఁడు వేఱే యౌచిత్యవాదమును నెలకొల్పినను ధ్వని వాదమునకు విరుద్ధుఁ డు కాఁడు.

లక్షణ విభాగము సంపూర్ణము

ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచురణలు

1.	ఆంధ్ర మహాభారతోపన్యాసములు	రూ.100/-
2.	తెలుగు వాగ్గేయకారులు - అన్నమయ్య విలక్షణ వ్యక్తిత్వం	రూ. 70/-
3.	తెనుగు సాహితి	రూ. 36/-
4.	స్త్రీల రామాయణపు పాటలు	రూ. 36/-
5.	సమీక్షణం	రూ. 36/-
6.	పరిణతవాణి-1, 2, 3, 4, సంపుటాలు	రూ. 196/-
7.	ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు	రూ. 70/-
8.	ఇరివెంటి వ్యాసాలు	రూ. 30/-
9.	శాలివాహన గాథా సప్తశతీసారము	రూ. 15/-
10.	రాయప్రోలు రచనలు - తత్వవివేచన	రూ. 60/-
11.	తెలుగులో సారిత్యోద్ధారకులు	రూ. 40/-
12.	మల్లికా గుచ్ఛము	రూ. 8/-
13.	మనజాతి నిర్మాతలు	రూ. 4/-
14.	సుమతి, వేమన, కృష్ణ శతకాలు	రూ. 24/-
15.	ఆంధ్ర సారస్వత పరిషత్తు వజ్రోత్సవ సంచిక	రూ. 250/-
16.	తెలంగాణాలో జాతీయోద్యమాలు	రూ. 10/-
17.	సంస్కృత పాఠవల్లరి	రూ. 4/-
18.	నా సాహిత్యోపన్యాసములు	రూ. 5/-
19.	గౌతమబుద్ధుడు-జవహర్లాల్ నెహ్రూ	రూ. 3-60/-
20.	కర్నల్ కాలిన్ మెకంజీ	రూ. 1-50/-
21.	మనదేశం - తెలుగుసీమ	రూ. 7/-
22.	మననదులు - కృష్ణాగోదావరులు	రూ. 3/-
23.	మధురభక్తి - ముగ్ధభక్తి	రూ. 80/-
24.	ప్రాచీన కవిత	రూ. 10/-
25.	ప్రసంగ వ్యాసాలు	రూ. 5/-
26.	ఆంధ్ర సారస్వత పరిషత్తు స్వర్ణోత్సవ సంచిక	రూ. 50/-
27.	దశరూపక సారం	రూ. 5/-
28.	భారతీయ వాస్తు శిల్ప విజ్ఞానం	రూ. 2/-
29.	నా రేడియో ప్రసంగాలు	రూ. 5/-
30.	సాహిత్యానువాదం - సమాలోచనం	రు. 60/-
31.	శివరాత్రి మహాత్మ్యము	రూ. 70/-
32.	తెలుగు రచన	రూ. 7/-

అడ్వాన్సుతో పాటు ప్రతులకు వ్రాయండి :

ఆంధ్ర సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్, హైదరాబాదు - 500 001. ఫోన్ : 24753724